I am the guru , I am also the Guru ( one of the Gurus) and I am not the Guru, showing the progression of a teaching and learning interaction. It is difficult to imagine such a seemingly controversial and highly evolved and yet unassuming person in him, unless one has the internal clarity humility and intelligence to notice it.

He is intensely humane. He is deeply concerned with the huge military expenditure and he similarly , on calculation, found that out of 1/4 of the expenditure spent on space research, all the inhabitants on the earth could have had a house each. He has the vision towards a future consisting of

*"Citizen of the world "*
*and*
*"parliament of man "*

This book with extensive coverage and intensive enquiry has the ingredients of a clear guide and a prophetic vision. It is the baby outcome of cross fertilization of immaculate thinking and articulate poetry, fighting and dancing, individually and together. This stimulating book can be resource material of guiding wisdom and study-monument to the young; quite confidence to the middle aged and lovely contentment to the old.

**As a poet Dr. Acharya is a live Light House.**

✡ ✡ ✡

# విషయసూచిక


| | పేజి.నం | | పేజి.నం |
|---|---|---|---|
| తెలుగుతల్లి | 2 | ఎన్నికలు | 207 |
| విన్నపము | 4 | ప్రబోధం | 214 |
| బహిరంగస్వగతం | 12 | మానవత్వం | 238 |
| ఆలోచనము | 23 | నవనాగరికత | 241 |
| వసుధైకరాజ్యము | 58 | యోగి | 244 |
| బ్రదుకు | 62 | ఆటవేట | 247 |
| స్నేహం | 79 | దేవుడు | 248 |
| పరపరాగ సమ్మేళనం | 84 | స్త్రీ | 250 |
| దానం | 85 | మాతృభాష | 252 |
| హాస్యం | 91 | నాభార్య | 253 |
| వ్యాపారం | 101 | శృంగారము | 255 |
| ముక్తకములు | 102 | కరుణ | 256 |
| మతం | 110 | జిడ్డుకృష్ణమూర్తి | 257 |
| ప్రబోధం | 117 | సత్యం | 258 |
| మానవ సంహిత | 118 | ప్రకృతి సౌందర్యం | 260 |
| ప్రగతి | 125 | మౌనం | 262 |
| సందేశం | 132 | అన్యాపదేశము | 266 |
| రాయలసీమ | 140 | యోగవిద్య | 267 |
| ప్రేమ | 141 | అతిథిపూజ | 268 |
| అమ్మ | 148 | రైతుబిడ్డ | 269 |
| విద్య | 152 | సేవ | 270 |
| నరుడు | 164 | సంప్రదాయం | 272 |
| హేతువాదం | 171 | చెట్లు | 274 |
| కాలం | 172 | ఆట | 277 |
| వ్యవస్థలు | 178 | మంచితనము | 278 |
| సంస్కృతి | 179 | బ్రహ్మచర్యము | 279 |
| పెండ్లి | 186 | చరిత్ర | 280 |
| వైద్యం | 190 | తిండి | 281 |
| ధనం | 197 | కులము | 282 |

# విషయసూచిక


| | పేజి.నం | | పేజి.నం |
|---|---|---|---|
| తెలుగుతల్లి | 2 | ఎన్నికలు | 207 |
| విన్నపము | 4 | ప్రబోధం | 214 |
| బహిరంగస్వగతం | 12 | మానవత్వం | 238 |
| ఆలోచనము | 23 | నవనాగరికత | 241 |
| వసుధైకరాజ్యము | 58 | యోగి | 244 |
| బ్రదుకు | 62 | ఆటవేట | 247 |
| స్నేహం | 79 | దేవుడు | 248 |
| పరపరాగ సమ్మేళనం | 84 | స్త్రీ | 250 |
| దానం | 85 | మాతృభాష | 252 |
| హాస్యం | 91 | నాభార్య | 253 |
| వ్యాపారం | 101 | శృంగారము | 255 |
| ముక్తకములు | 102 | కరుణ | 256 |
| మతం | 110 | జిడ్డుకృష్ణమూర్తి | 257 |
| ప్రబోధం | 117 | సత్యం | 258 |
| మానవ సంహిత | 118 | ప్రకృతి సౌందర్యం | 260 |
| ప్రగతి | 125 | మౌనం | 262 |
| సందేశం | 132 | అన్యాపదేశము | 266 |
| రాయలసీమ | 140 | యోగవిద్య | 267 |
| ప్రేమ | 141 | అతిథిపూజ | 268 |
| అమ్మ | 148 | రైతుబిడ్డ | 269 |
| విద్య | 152 | సేవ | 270 |
| నరుడు | 164 | సంప్రదాయం | 272 |
| హేతువాదం | 171 | చెట్లు | 274 |
| కాలం | 172 | ఆట | 277 |
| వ్యవస్థలు | 178 | మంచితనము | 278 |
| సంస్కృతి | 179 | బ్రహ్మచర్యము | 279 |
| పెండ్లి | 186 | చరిత్ర | 280 |
| వైద్యం | 190 | తిండి | 281 |
| ధనం | 197 | కులము | 282 |

| | పేజి.నం | | పేజి.నం |
|---|---|---|---|
| సభలు | 283 | నీతి | 319 |
| జయం | 285 | స్త్రీ | 325 |
| కవితాపంచామృతం | 286 | జ్ఞాన విప్లవం | 328 |
| జ్ఞానం | 287 | ప్రజాస్వామ్యం | 329 |
| ప్రవర్తన | 288 | ధర్మసూక్ష్మం | 330 |
| కాలిబంతి | 289 | అభినయము | 331 |
| బ్రదుకు | 290 | ముద్దు | 332 |
| విప్లవం | 291 | పరం | 334 |
| జ్యోత్స్నాభిసారిక | 292 | కన్నుదోయి | 335 |
| మందహాసం | 293 | ఉపకారము | 336 |
| పరిపాలకుడు | 294 | అవగాహనము | 337 |
| పదవి | 296 | గురుకులం | 338 |
| ఆటవెలది | 297 | మెదడు | 346 |
| దీపావళి | 298 | నిద్ర | 350 |
| అదర్శము | 300 | లంచావతారం | 351 |
| విద్య | 301 | నగ్నదృశ్యాలు | 353 |
| ఓటు | 302 | సెలవులు | 354 |
| చిత్తశుద్ధి | 303 | పసిపాప | 355 |
| వర్తకుడు | 304 | భావాలు | 356 |
| వినయం | 305 | నాటకాలు | 357 |
| సహనము | 306 | తిమ్మరుసు స్వగతం | 359 |
| మురికివాడ | 306 | అంపశయ్య | 367 |
| స్వేచ్ఛ | 307 | నృత్యభారతి | 376 |
| కష్టాలు | 308 | SRAMA EVA JAYATE | 377 |
| అప్పు | 309 | శ్రమ ఏవజయతే | 379 |
| ప్రకృతి సౌందర్యము | 310 | శ్రమ ఏవజయతే (నృత్యనాటిక) | 381 |
| ప్రార్థన | 314 | అర్ధనారీశ్వరం | 396 |
| వ్యయం | 316 | పెండ్లి గొండ్లి | 398 |
| ఆదర్శపౌరుడు | 317 | నాగస్వర నాట్యము | 400 |
| బావ . | 318 | మరణ మంగళాశాసనము | 402 |


***

# ఆలోచనము

## స్వీయ పద్య కవితా సంకలనము

- నండూరి రామ కృష్ణమాచార్య

మేలు కొనుడు లెండు - మేధావులో వారు
ఎల్ల లెల్ల మరచి యేక మగుడు;
పోవునట్టి దేమి ? భూలోకమున మీకు;
సృష్టి కపర సృష్టి చేయ గలరు.

ప్రతిదినము దేహ పరి శు
భ్రత జలముల స్నాన మిచ్చు - బ్రదుకులలో - హృద్
గతమగు మురికిని బాపు - క
వితామృత స్నానమె - పృథివీ ప్రజకున్.

పలికెడి దాలోచన మట !
పలుకు బడులు - సకల పుష్ప పరిమళ లహరీ
జలపాత శీకరము లట !!
తలపులు - వసుధైక యోగ తరళము లగుతన్.

నండూరి రామ కృష్ణమాచార్య

# తెలుగు తల్లి

జయము జయము తెలుగు తల్లి
ప్రియతమ ధాత్రీ మతల్లి ! ॥జయము॥

అరుణోదయ కిరణోజ్జ్వల
రాగ రచిత రంగవల్లి !
పసిడి పలుకు-పాల వెల్లి !
లలిత కళా కల్పవల్లి ! .........

కడలితేడు - కడుగును నీ కాళ్లను కెరటాల నీళ్ళ;
కళ్లకద్దుకొను - నీ తల గగనము - ఉల్లాసముతో
॥జయము॥

వంశధార - నాగావళి
వసంత సౌరభములతో,
ధగధగ లాడెడు - నీ నును
సిగ - మల్లెల మాలలుగా,
గోదావరి పూదండగ
క్రాలును - నీ గళ మందున;
కృష్ణవేణి - కింకిణీక
మణి మేఖల- మార్ మ్రోగును,
చెన్నారును - స్వర్ణముఖీ పెన్నలు మంజీరములై,
॥ జయము ॥

నీలో భారత దేశపు నాలుగు దిక్కులు కలిసెను !
సమన్వయ సవిత్రి వీవు ! సహన నేత్రివీవు సదా ?

॥ జయము ॥

ప్రాజ్య మగధ రాజ్యములో ఉజ్జయినీ గగనములో,
నీ విజయ ధ్వజ మెగిరెను - నీ దుందుభి నినదించెను,
జరిపినారు - ఇక్ష్వాకులు శత సహస్ర హల దానము
మా జనయత్రివి నీవే మధుర ధరిత్రివి నీవే !
అక్షయ పాత్రవు నీవే ! అమృత చరిత్రవు నీవే !

॥ జయము ॥

పుట్టినారు - నీ కడుపున బోధిసత్వ మేధావులు
సారస్వత - సమరాంగణ సార్వభౌమ బిరుదాంకులు!
దయావీర దానవీర ధర్మవీర ధన్యాత్ములు

॥ జయము ॥

వాదాలకు వారధివై - భేదాలకు స్వస్తి చెప్పి;
కొత్త పాతలకు-కూరిమి కూడలివై - వర్ధిల్లుము
కవితా రస కళ్యాణీ! గానామృత మయ వాణీ !
సస్యశ్యామల గృహిణీ ! సర్వహితాభిలాషిణీ !

॥ జయము ॥

★★★

# విన్నపము

చూడ - సృష్టి - యెంత సువిశాల మైనదో !!
కాల మన అనంత గణిత హేల !
వెలుగు వెదుక దగును - విశ్వాసములు వీడి,
మనిషి - తెరచియుంచుకొనుత - మెదడు. 1

స్వాగతమ్ము పలికి - ఆలోచనల కెల్ల,
క్రొత్త యెల్ల లెడద కూర్చు కొనుత,
చరిత పరిధి దాటి - సమయ సీమలు దాటి
ఆత్మ యెగురు గాత - హంస యగుచు. 2

తరచి చూడ - " శక్తి " - కెరటమా ? రేణువా ?
బొమ్మ బొరుసు లుభయ భూమికలును;
అరయ - పరమ శివుడు అర్ధ నారీశుడే !
విశ్వ సృష్టి శిల్ప విలసనమున. 3

మానవుండు - కూప - మండూకమా ! కాడు
వరలు జ్ఞాన విప్ల వమ్ము - నేడు,
సహన సానుభూతి - సంస్కార చిహ్నమ్ము
ప్రగతిశీలి - విశ్వ పౌరు డగును. 4

మనుజు నేది ? సృష్టి మకుటాయమానుగా
తీర్చి ప్రగతి పథము దిద్ద గలిగె ?
అమృత తుల్య మైన దాలోచనము గదా !
సకల శాస్త్ర విద్యల కది యెజనని. 5

అన్వయించు - సూక్తి - ఆడువారికి గూడ,
తరచు చెప్పబడిన- పురుష పదము
వ్యాకరణము కంటె - అర్థమే ముఖ్యమ్ము,
ఉభయ లింగములకు ఉపకరింప. 6

సకల భువనములకు - శాంతి పాఠము పల్కి,
చేతి గంట రవళి - చిందులాడ;
అంద జేయ వయ్య - హారతి జ్యోతినే !
పాడి - గొంతు నెత్తి - స్వస్తి గీతి. 7

వ్యవధి యుండు గాత - ఆలోచనమునకై,
రెక్క లాడ నేల డొక్క నింప ?
మనిషి - పొట్ట నింపు కొను పక్షి మాత్రుడా ?
సృష్టి కపర సృష్టి చేయు వాడు ? 8

విడువ నేల ? వేడి వేడి నిట్టూర్పులే !
జీవితమున వయసు చెల్లి నపుడు,
వయసు లోన చదువ వచ్చు - ఆలోచనకే,
సులువు సుమ్ము - కార్యశూరు డగుట. 9

మేలు జగతి లోన - మేధావి ఒక డున్న;
ప్రతిభ గలిగి- ప్రగతి పథము చూప;
వాసి లోన - అతని దాసానుదాసులే !
ఉర్వి లోని - కర్మయోగు లెల్ల. 10

అరయ - మనిషి - ఘనత ఆలోచనమె గదా ,
కాని యెడల పశు సమాను డతడు;
మెదడు - దిన దినమ్ము - పది శాతమును కూడ;
తరచు వాడకుండ నరుడు - బ్రదుకు. 11

విత్తనమ్ము నౌచు - వృక్షమ్ముగా మారి
ఆవరింప దలతు ఆకసమ్ము ;
వీలు కాని యెడల - వేరు విత్తున కైన
ఎరువు నగుట కేను ఇచ్చ గింతు. 12

తెలుగు భాష దాటి - తెలుగు సీమలు దాటి,
తేరి పార జూచి - తెలుగు సుకవి,
ప్రగతి శీలి యగుచు - జగదేక పౌరుడై
తీర్చి - భావయిత్రి - దిద్దు కొనుత. 13

తరచ వలెన్ సనాతన విధానము లెల్ల - చరిత్ర దృష్టితో,
ధరణి - యుగాంతరాల వివిధ స్థల భేదముచే సదా ప్రజా
చరణము మారుచుండు - సువిశాల సమాజములో వివేకియై
నరుడు చరింపగావలె - క్షణక్షణముల్ నవధర్మ సూక్ష్మముల్.

అమ్మ నయితి నేనె- ఆలోచనల కెల్ల;
అరయ తరము గాదు - అబ్బ లెవరో !!
పూచె ఒక్క చెట్టు - పెక్కు గాలులు వీచె;
పర పరాగ వలన పండ్లు కాచె. 15

నరుడు - సంఘమందు - నమ్మకమ్ముల వీడి,
మెదడు మూయ కుండ బ్రదుకు గాత !
ప్రాణనాడి స్వేచ్ఛ కాలోచనా శక్తి
కలియ వేయి దెసల వెలుగు - మేలు 16

గాలి కలిసి - నిలిచి - ఆలోచనా శాలి
మానసిక తరంగ యాన సుషమ,
సాగి - ప్రగతి కూర్చు - సమయ సీమలు దాటి,
కలిపి ప్రజల హృదులు - మెదడు కుదిపి. 17

కోరు గాత - క్రొత్త క్రొత్త వెల్తురు గాలి,
తలుపు తెరచి యుంచ వలెను, - మెదడు,
అవని కెల్ల కూర్చు ఆలోచనము సదా
అభ్యుదయ పరంపరాభి వృద్ధి. 18

అవని, కలదు నరుల కాలోచనా శక్తి,
జంతువులకు లేదు - జగతి యందు;
చేయగలడు నరుడు సృష్టికే ప్రతిసృష్టి!
మనిషి సృష్టి శిఖర మనగ చెల్లు. 19

వాడకుండ మెదడు - వ్యవహార జగతిలో
వంద యేండ్లు గూడ - బ్రదుక వచ్చు;
పెక్కు అనుభవాల ఒక్క మాసము లోన
వత్సరాన - పొంద వచ్చు - నరుడు. 20

అనుభవాల మధ్య - ఆలోచనల తోడు,
మేటి మెదడు గలిగి మెలగె నేని !
గుండె లోన - కవిత - పండించు కొన్నచో !
అతని వాక్కు - జగతి హితము గూర్చు. 21

సహన సామరస్య సహకార తత్త్వముల్
ప్రేమ - జగతి లోన - పెరుగు నట్లు;
గుండె దున్ని - వెలుగు పండించు తలపుతో
పద్యములను కొన్ని - వ్రాసినాను. 22

విరుల యందు - తోచు- వేర్వేరు నెత్తావి;
అందచందములును - అరసి చూడ
వెల్లి విరియ వచ్చు - వేర్వేరు భావముల్,
కమ్మ కమ్మ నైన - కవిత లందు. 23

ముసలితనము వచ్చె - ముడి పదార్థము లెన్నొ
అవసరమ్ము లంచు - కవిత కొరకు;
పోగు పెట్టినాడ - పొట్ట నిండుగ నేను;
స్వాగతము ప్రజలకు - స్వాగతమ్ము 24

అపర సృష్టికర్త - ఆలోచనాశాలి!
కార్యవాది - అతని కాలి బంటు,
పడయు నతడు జయము పంచ భూతములపై,
జగతి చరిత కతడు, ప్రగతి దిద్దు. 25

నరుడు - చిక్కువడగ - స్థిర నిర్ణయాలలో,
మెదడు కలుప వలెను చదువు తోడ,
అవని శ్రేష్ఠ తముడు - ఆలోచనా శాలి;
సంస్కృతి యన బరగు - సహన గుణము. 26

అన్ని పనుల కంటె - ఆలోచనమె సుమ్ము
కష్ట తమము బ్రదుకు గడపు టందు,
తరచు తన మనస్సు - తాకట్టుగా పెట్టి,
నరుడు బ్రదుకు చుండు ధరణి మీద. 27

తన మనస్సు నెచటొ తాకట్టుగా పెట్టి,
నరుడు బ్రదుక నేల? ధరణి లోన ?
ఆంతరంగిక మగు - ఆలోచనము మేలు,
మేలు - స్వేచ్ఛ; నమ్మకాలు - వద్దు. 28

కావు - రచన మనిన - కలము కాగితములే,
కవికి - తూగు ఊపు లవసరములు ,
అవసరమ్ము సమయ మాలోచనమునకై,
వ్రాత కెంత సేపొ పట్టబోదు. 29

వేద సమ్మితమ్ము కాదు - కబ్బము - సుమ్ము,
చిగురు టాకు వోలె- ప్రగతి తెలుపు,
ఆకు - మొగ్గ - పువ్వు - లాలోచనము నందు,
కలపు - పిందె - దోరకాయ - పండ్లు. 30

నమ్మకమ్ము లేదు - నరక నాకము లన్న,
అర్థవాద రూప మందు తప్ప,
ఆస్తికుండ గాను - నాస్తికుండను గాను
అట్టి చర్చ లెల్ల - అనవసరము. 31

అవఘళించు కొనిన - ఆలోచనమె సుమ్ము
స్వేచ్ఛతోడ పనులు చేయ వచ్చు,
ప్రాణ నాడి - మనిషి కాలోచనమె గదా
రక్తి నిచ్చు - స్వేచ్ఛ - ముక్తి నొసగు. 32

అభినవ కవిత - యిది - ,ఆలోచనము, పేర,
ప్రగతి గీత, పిదప, వ్రాసినాను,
హేతు వాద నవ్య ఋగ్వేద మిది గాదు,
కదిపి కుదుప నరుల మెదడు - చాలు, 33

సృష్టి లోని - శుద్ధ జీవ చైతన్యమ్ము
మెదలు చుండు - మనిషి మెదడు నందె;
అమృతము కురియ గల దాలోచనమె - సుమ్ము;
తీర్చి దిద్దు - సృష్టి తీరు తెన్ను. 34

మీవె - నిర్ణయములు - నావి ఆలోచనల్ !
మార్చ వచ్చు - మీరు - మనసు బట్టి,
చదివి ఈ కవితలు - చైతన్యవంతులై;
మీరు - స్వేచ్ఛ మెరయ మెలగ దగును. 35

నన్ను - కవి యటంచు - మన్నించి మనసార
సత్కరించె నెవడు - చాల సార్లు ?
వైద్య వరుడు పొన్నపల్లి సుబ్రహ్మణ్య,
సన్నుతింతును నరసాపురీశ. 36

బ్రదుకు నందు - ముదురు పాత మామిడి నేను,
కాయ లిపుడు గూడ - కాయు చుంటి;
కొమ్మ లందు చేరి - కొదమ కోకిల కూయు,
కూర్చు కొనిరి - ప్రజలు - కొన్ని అంట్లు. 37

పండితోత్తములను ప్రార్థింతు కేల్ మోడ్చి,
క్రొత్త ప్రొద్దు పొడుపు కోరు వాడ;
చదువ దయ్య మొట్ట మొదట నా భావాలు
తెగడ వచ్చు పిదప పొగడ వచ్చు. 38

అవతరింప ఒక్క ఆలోచనా శాలి -
నింగి కలియ వచ్చు నేల తోడ;
పగిలి ముక్క లగును - భగవత్ కిరీటమే !
భావ భూప్రకంప భంగిమముల. 39

☆☆★

పైకి చూడ రెండు బండ రాళ్ళే గాని,
రెవ్వ వనుచుండు రాపిడులకు,
జరుగు చుండ చర్చ - సాహితీ గోష్ఠిలో
విస్ఫులింగ కాంతి వెల్లి విరియు.

## బహిరంగ స్వగతం

కవిత - అనిన - దివ్య కైవల్యమే నాకు,
వేరు స్వర్గ మేది కోరుకొనను;
నేను నిలుచు చోట - నిలుచు కైవల్యమ్ము ;
కవిత - నాదు హృదిని కలదు గాన. 1

చాల నాళ్ళ బ్రతుకు - సమకూర్చెగా నాకు,
పెక్కు అనుభవాలు - విలువ గలవి !
జగతి కిచ్చినాడ- చక్రవడ్డీ చేర్చి,
పద్య రూప మందు భద్రపరచి, 2

అనుభవాలు పెక్కు - ఆలోచనము లోన,
పద్య రూపములుగ - ప్రతిఫలించె;
మనుజ మానసాబ్ధి - మథియించి మథియించి,
రవి హృది పులకింప - వ్రాసినాను. 3

మనవి చేసినాడ -అనుభవాలోచనల్,
నరుల బ్రదుకు లోతు లరసి తరచి,
ముసలితనము రాక ముందె - పెద్దరికమ్ము
పద్యములను చదివి పడయ వచ్చు. 4

కావు - నిర్ణయములు - నావి ఆలోచనల్
కదిపి కుదుప గలవు మెదడు నెల్ల !
చేయవచ్చు కూర్పు చేర్పు మార్పులు కొన్ని
స్వానుభవము బట్టి సహృదయుండు. 5

అర్చన చేయలేను మనసారగ ఈశ్వరు విశ్వశిల్పి - ఏ
చర్చలు వేద శాస్త్రముల సారము గూర్చియు చేయలేను - నే
కూర్చితి తెల్గు నానుడుల క్రొత్త తలంపులు కొన్ని తీర్చి - నా
నేర్చిన భంగి నింగికిని నేలకు మధ్య జగద్ధితమ్ముగన్. 6

డెందము నందున - కవితా
నందన వని పెంచినాడ - నవ్యామోదా
నందముతో సహృదయ వర
బృందములు యుగాంతరములు తృప్తిం జెందన్. 7

హృదయ మందు కలదు - బృందావనము నాకు;
వెల్లి విరియు పొన్న విరుల తావి;
అమరు మానసమున - నెమలి పింఛము విచ్చి;
వినెద నేను తరచు - వేణు రవము. 8

తెలియ చెప్ప కాదు - తెలియ నట్టివి మీకు,
కొన్ని రచన లిట్లు కూర్చినాను;
జ్ఞాపకమ్ము చేయు నా పద్యముల్ మీకు -
మరువ రాని కొన్ని మంచి స్మృతులు. 9

గడియ వేయ నేర - ఎడద తల్పులు మూసి,
మతము జాతి భాష మమత లేదు;
వెలుగు వచ్చుగాక - వేయి దిక్కుల నుండి,
ఏను - జ్ఞాన యజ్ఞ ఋత్విజుండ. 10

చిరు రచనల కిది తరుణము
తిరిగెడు కాలము రయమున; తీరిక యేదీ ??
నరు లెవరు పలు పుటలు - చదు
వరు కావున ముక్తక మొక పద్యము చాలున్. 11

పెట్టినాడ - వేడి వేడి చక్కిలిగింత,
చదువరుల మెదడులు - కదిపి కుదిపి,
అవని లోన - మనిషి కాలోచనము పెంచ,
వ్రాసినాను తెలుగు పద్య కవిత. 12

యతులు ప్రాస గతులు - యమకమ్ము గమకమ్ము
అల్లిక జిగి బిగులు - వెల్లి విరియ,
జంత్ర బృంద రవము - సమకూర్చ ఛందస్సు,
దెసల మ్రోగు గాత - తెలుగు కవిత. 13

ధనము కాదు - కాదు ధైర్య శౌర్య స్ఫూర్తి
పదవి కాదు - మేటి మెదడు కాదు;
అంతరంగిక మగు అతిథి సత్కారమ్ము
గుండె పండి నట్టి గొప్ప గుర్తు. 14

అమిత భక్తి - కట్టి - అపరాధ సుంకమ్ము
శిష్యు లైరి నాకు జీవితమున,
దిగ్గజాల వంటి - ధీశాలు లెందరో,
పృథివి కవలి వెలుగు వెదకుకొనుచు. 15

సాహితీ మహత్తు - సంఖ్యా గణన కాదు
వాసి గాని - పెద్ద రాసి గాదు;
పద్య మొకటి చాలు - ప్రజల నాల్కల పైన
నిలిచి నాట్య మాడ గలిగి నపుడు. 16

అమరె - బ్రతుకు లోన - అనుకూలవతి - భార్య
తెలివి యున్న వారు కలరు సుతులు,
కొంత ధనము కూడ - కూడ బెట్టితి నేను,
ఖ్యాతి వచ్చె నాకు కవిగ - చాలు. 17

లోక మందు పలు కళాకారు లెవరైన
బ్రతుక నేర్చి నట్టి వారు - కారు;
విపణు లందు వారి వెల - తక్కువే గదా
అరుదు వారి విలువ నెరుగు వారు. 18

పోతు నెమలి కొదమ పురి వోలె నేలపై
కూడి కవన శబ్ద మాడ వచ్చు
ఇంద్ర ధనువు వోలె - ఏడు రంగులు చిమ్మ
గగన సీమ జిలుగు గ్రమ్మ వచ్చు. 19

ప్రీతి హెచ్చు - నేతి పెసరట్లపై నాకు;
తెలుగు కవిత పైన - తేనె పైన;
నెమరు వేయ దగిన స్నేహ వర్తన పైన,
మౌన గుప్త పాత్ర దాన మందు. 20

మెచ్చు కొనెద - మేటి మేధావి వాల్తేరు
వేగు చుక్క - ఫ్రెంచి విప్లవమున;
ఏను మెత్తు నైనుష్టీను - ఇంగరు సోలు;
నాకు ప్రీతి నాటి గ్రీకు చరిత. 21

దేహము దారి తప్పె - నను దివ్యునిగా తలపోసి మేటి వ్యా
మోహము కూర్మి గౌరవము ముచ్చటలన్ కురిపించినట్టి నా
స్నేహితు లెల్ల స్వర్గతులు - జీవిత మిచ్చెను పూర్ణ తృప్తి - నే
ఐహికముల్ త్యజించి కవితామృత దానమునన్ తరించెదన్. 22

తేనె టీగ - ఒకటి తిరిగె-పుట్టలు, చెట్లు
మరచిన తన పేరు - నరయ గోరి,
వ్రాలి - అడిగె పేద రాసి పెద్దమ్మనే,
అట్టి తేనె టీగ నైతి - నిపుడు. 23

నేను పదవి కోర - నేను సంపద కోర,
ఏను స్వర్గ సుఖము లేవి కోర,
బాప దలతు - పరుల దుఃఖము కొంత,
చాలు - ధన్య మగును - జన్మ నాకు. 24

అరసినాడ - అనుభవామ్రేడితము లైన
సత్యములను కొన్ని - జగతి లోన;
సూత్ర ఫణితి - ధర్మ సూక్ష్మాలు వివరించి,
వ్రాసినాడ తెలుగు పద్య కవిత. 25

పృథివి లోన - నాకు ప్రేయసీ మణి - నిద్ర;
నిద్రకంటె ఎవరు నిపుణురాలు ??
కలదు మృత్యు దేవి - కైవల్య కల్యాణి
శాశ్వత సుఖ మిచ్చి సాక గలదు. 26

నోటి పలుకు చాలు - పాటగా వినిపించు
ఆంధ్ర జాతి - మాట లాడు నపుడు,
తెలుగు - సహజ గాన మిళితమై నినదించు
సామ వేద నాద సంభృతముగ. 27

కలిగె - ఆత్మలోన - కవితామృత పిపాస
చిన్నతనము నందె - జీవితమున;
వసుధ - కానుపించు రసవిరాడ్రూపమై !
కనులు తెరువ మరియు కనులు మూయ. 28

పుట్టి పెరిగినాడ - పుడమిపై సర్వత్ర ,
వెల్లి విరియ - జ్ఞాన విప్లవమ్ము;
వచ్చె గుండె మార్పు - వైద్య రంగము లోన ;
మనిషి చేరె చంద్ర మండలమును. 29

అమ్మ వోలె - లేక - అక్క పోలిక రమ్ము
రమ్మ ! శస్త్ర వైద్యురాలు వోలె;
రమ్ము - మృత్యు దేవి - రమ్మ స్వాగత మిత్తు
గుండె నీకు గొప్ప గుడిని చేసి. 30

ఎదుటి వాని కష్ట మిసు మంతయును గూడ
ఎరుగ నట్టి వాడు గురుడె కాడు;
విమల యోగి గాని - విజ్ఞాన ఖని గాని,
అంజలింప లేను అతని కెపుడు. 31

లేశ మైన - ప్రేమ లేదు దేశము పైన,
లేదు మమత కవిత మీద నైన;
మసల దలతు నేను - వసుధైక జీవిగా
ధరణి మీద గుండె తలుపు తెరచి. 32

కాంచినాడ సృష్టి - కవితా సులోచన
ద్వయము తాల్చి - బ్రదుకు తరచినాడ,
హాలహాలము తోడ - అమృతమ్ము జన్మించు;
బ్రదుకు - వెలుగు నీడ పడుగు పేక. 33

ఆస్తికత్వ మనుభవామ్రేడితము నాకు !
నాకు లేవు ఎట్టి నమ్మకములు;
మతము కులము జాతి మమకారములు లేవు.
మానవత్వమునకె నా నమస్సు. 34

కవిత లల్లినాడ - గగనోన్నతములుగా,
కలదు - కడలి లోతు కవిత కొంత,
కడలి గగనములను - కలుపు వెన్నెల వోలె,
తరచు నా హృదయము తాండవించు. 35

నే ద్విజుడను గాను - నే సహస్రజుడనే !
 అనుభవాల లోన - మనసు నందు;
నెమరు వేయదగును - నిజమైన జ్ఞానమ్ము;
 మెతక రాదు కతికి మ్రింగరాదు. 36

జరిగె నాకు - గొప్ప శస్త్ర వైద్యము గాని,
 బ్రదికినాడ - చెక్కు చెదరకుండ;
ఏను జీవితమున - మృత్యుంజయుండనే
 ఆంధ్ర వాఙ్మయమ్ము నందు వోలె. 37

ఏను తరచు మార్చినాను - ఉద్యోగముల్
 ఊళ్ళు - ఇళ్ళు - కార్లు కళ్ళ - జోళ్ళు !
మార్చినాడ నన్ని - మా శ్రీమతిని తప్ప,
 మధుర కవిత మీది - మమత తప్ప. 38

సత్కృతులను కోర సమకాలికుల నుండి,
 యశము ధనము పైన - ఆశ లేదు.
వ్రాసినాను కొన్ని పద్యాలు - తెలుగులో,
 చాలు - మెచ్చ భావి సహృదయుండు. 39

శాంతి సమర మందు - స్వాతంత్ర్య యజ్ఞాన
 బుధులు మిత్ర పరులు బుగ్గి అయిరి;
పద్య - కవిత వ్రాయ - బ్రతికి యుంటిని నేను;
 నివురు గప్పి నట్టి నిప్పు వోలె. 40

నిజము చెప్ప - నేను - నిత్య శంకితుడనే,
నాకు లేవు గట్టి నమ్మకములు
శంక- ప్రాతిపదిక - జ్ఞాన శోధన కెల్ల,
హేతువాది గౌరవింతు నేను. 41

లొసగులు లేకుండగ ఈ
వసుమతిపై దేహి యెట్లు వర్తిల గలుగున్ ?
లొసగులవి యెన్ని యున్నను
అసూయ లేనట్టి మనుజు నభినందింతున్. 42

కడుపు నిండ తిండి - కనుల నిండుగ నిద్ర ,
జీవితమ్ము పాడు చేయ గలవు!
అవసరమ్ము కొంత - వ్యాయామ కష్టమ్ము ;
మెదడు కమర జేయు చదువు బరువు. 43

వెన్న వన్నె చిన్న వెండి అంచుల పంచె
లలిత పీత వర్ణ లాల్చి చాలు;
వ్రేలు గాక - పసుపు శాలువా భుజముపై
ముదురు రంగు లనిన బెదురు నాకు. 44

కానుపించు నెడల - కలనైన దేవుండు,
ప్రశ్న లడుగ గలను బరి తెగించి,
త్యాగరాజు వంటి యోగీశు డగుపింప,
ప్రశ్న వేయ కుండ - ప్రణతి సేతు. 45

ఏ నిచటకు వచ్చినాను తెల్పగ మీకు
అంటు కొనెను మా గృహమ్ము నేడు -
నిప్పు నరయ కుండ నిదురించుచున్నారు,
ఆదమరచి పిల్ల లందు గలరు. 46

సంస్కరణకు మధ్య - సంప్రదాయము మధ్య
సంఘ చరిత-పోరు జరుగు చుండు
సహన గుణము తప్ప - సామరస్యము తప్ప,
శాంతి నివ్వ లేవు జనుల కేవి. 47

ఈ ప్రపంచ మందు - ఏ భాషకును లేదు,
భావయిత్రి వ్యక్త పరచు శక్తి;
ఛంద మవసరమ్ము - ఛందస్సు సరిపోదు;
కూర్చవలె నటన్న - గొప్ప కవిత. 48

దాత నెంత పొగడ - తనివి తీరదు నాకు,
ధర్మవేత్త - దాత - త్యాగయోగి,
సహృదయుండు - దాత స్వారస్య విజ్ఞాత,
రసిక చక్రవర్తి - ప్రగతి శీలి. 49

కలలు గనెద నేను - కలవరించెద రేయి,
ఆ అసత్య లోక మందు - ఉందు;
కలలు నాకు తరచు కలిగించు చిరునవ్వు,
మిగులు మేటి కలయె - మేలు కొనిన 50

చేరు చుండు దరికి - మారు వేషము దాల్చి,
"వెలుగు " - అప్పుడపుడు తలుపు తట్టి
తేరి పార చూచి - తెల్ల బోయెద నేను,
మూర్ఖుడ నయి చిన్న మొగము తోడ. 51

పుడమి లోన నాకు - పుణ్య పాపాలపై;
లేదు నమ్మకమ్ము లేదు లేదు,
మంచితనము మీద మానవత్వము మీద,
కలదు - నమ్మకమ్ము - కలదు నాకు. 52

మంచివాడ ననెడి మాట - చాలును నాకు,
మరణ మందు పిదప ధరణి మీద,
మేటి కవిగ గాని - మేధావిగా గాని,
పేరు చెంద నేను కోరుకొనను. 53

కోరుకొనను ధనము - కోరనే స్వర్గమ్ము,
లేదు నాకు పదవి మీద కాంక్ష
యోగ్యులైన వారి కుపకార మొనరించి
గుప్త దాన మిచ్చు కోర్కి కలదు. 54

★★★

జగతి యెల్ల మధుర సౌందర్య మయ మంచు
కనులు మూసికలలు గాంచినాను;
కనులు విప్ప తెలసె - కర్తవ్యముల చేయ
వాసయోగ్యమగును వసుధ యెల్ల

# ఆలోచనము

విలువ గట్టరాదు - నెల జీతమును బట్టి
చదువు బట్టి - బ్రదుకు పదవి బట్టి,
ఐహిక 'తుల' యెట్టు లంతరాత్మల తూచు ?
ధరణి మీద ఏది " ధర్మకాట" ? 1

ఆస వలన - మనిషి - మోసపోవుట కద్దు
తేర లాభములను కోరవద్దు,
అడ్డ దారు లందు ఆపదల్ బహుళముల్ !
సుఖము - మంచి దైన చుట్టు దారి. 2

పెండ్లి జరుగ వచ్చు - పిల్లలం గనవచ్చు
వగల గడుప వచ్చు పగలు రేలు,
బ్రతుకులో వసంత ఋతువు రాకుండగా
చచ్చిపోవు నట్టి జనులు గలరు. 3

క్రొత్త దనము పైకి - గోచరింపగవచ్చు,
పాతదనము లోన లోతు పెరుగు,
మార్పు - సులువు గాదు - మనుజ లోకము నందు
నరుక వచ్చు కొమ్మ - పెరుగు వేళ్ళు. 4

అందు కొనుట సులువు - ఆనంద యోగమ్ము
బాల బాలికలకు బ్రతుకు నందు ;
కుత్సితమ్ము లేక - గొప్ప సంతృప్తితో,
ఆడ గలరు వారు పాడ గలరు. 5

అరసి చూడ నీవు అంజనేయుడ వయ్య,
కావు, బుడుత ఉడుత నీవు కావు
ఇసుక రాల్చరాదు - ఎత్తి కొండలు తెమ్ము!
నవ్య సేతు బంధనమ్ము సలుప. 6

విషయ సంకలనము - విజ్ఞానమా ? కాదు
ఇటుక ఆము వేరు - ఇల్లు వేరు
అస్థి పంజరమ్ము- అసలు దేహము కాదు
ప్రత్తి వేరు - నేత పంచె వేరు. 7

అతడు కలలు గనును - ప్రతిరాత్రి నిదురలో
పగలు కలలు మరచి - పనులు చేయు;
కర్మ వీరు డగును - కార్యసాధకు డౌను ;
ఉత్తమోత్తమ ప్రయోజకుండు 8

సూత్ర రచన చేయు, శుద్ధ విజ్ఞానమ్ము
అను వయిన ఉదాహరణము లిచ్చి;
అనుభవమ్ము - కొన్ని అపవాదముల నెన్ను,
బలము - సూత్రమునకు కలుగ జేసి. 9

అరుదు మంచి పనులు జరుగుటే ధరణిపై
కర్త - ప్రేరకుండు - కారయితయు
ప్రేమ చూపునట్టి ఆమోదకుడు గూడ,
నలుగురు సమభాగినులు గణింప. 10

వివిధ వస్తువులకు - వెలకట్ట గలవారు
వేలకొలది  కలరు విశ్వ మందు;
విలువ తెలియు నట్టి - విజ్ఞాను లన్నచో
వ్రేళ్ల మీద లెక్క పెట్ట వచ్చు. 11

భూమి సంచరించు కామ రూపము దాల్చి,
పసిడి లేడి - భోగ వాంఛ - యనిన;
హృదయ మందు విషము - మెదడులో ! మోసమ్ము
కంటి  చూపు  తేనె కార్చ వచ్చు. 12

తాల్చినారు - ప్రజలు - దారిద్ర్య భారమ్ము
తాల్మి గలిగి - భరత ధాత్రి మీద;
ప్రజలు ఇష్టపడరు భరియింప అవినీతి,
మనసు లోన - పెద్ద మనుషు లందు. 13

మతము లెల్ల - కుటిల మంత్ర తంత్రమ్ములే!
బూటకములు - కపట నాటకములు;
కోటి విద్య లెల్ల -కూటి కక్కూర్తులే;
మాట లాడు మనిషి - వేట కుక్క. 14

మందిరాలు కావు మజ్జీదులూ కావు,
ఇపుడు కట్ట దగిన వేవి మనకు ?
గుడిసె లనెడి పశుల కొట్టాల బదులుగా,
మనుజు లుండ దగిన మంచి ఇళ్ళు. 15

మంచి పనులు గాని - మంచి మాటలు గాని
ఎంచి చూడ వ్యర్థ మెపుడు గావు;
జనుల కెప్పు డైన - చక్రవర్తీ తోడ,
చేరి తిరిగి మేలు చేయ గలవు. 16

గగన సీమ లోని - గ్రహ తారకా గతుల్
ద్వంద్వ బద్ధ మైన - ప్రాణి కోటి;
చిత్ర చిత్ర మైన - సృష్టి సర్వస్వమ్ము;
ఆనుషంగిక మొక ఐక్య లయకు. 17

సారథి పయి గాదు - కారు పైనను గాదు,
దృష్టి మోప దగిన తీరు వేరు;
అరయ రోడ్డు మీద - ఆధారపడియుండు
పెంచ వలయు ననిన వేగ మితిని. 18

కలియ ఒకటి ఒకటి - గణిత శాస్త్రము నందు,
ఎప్పు డగును రెండు తప్పకుండ;
కలియ మనిషి మనిషి - గణిత శాస్త్రము తప్పు,
ఐక మత్య శక్తి కంతు లేదు. 19

అచ్చ మైన - మేలి ఆలోచనాశాలి
యావదుర్విమీద ఉన్న యెడల,
తన మనస్సు నెచటొ తాకట్టు పెట్టునా ??
మతము కులము భాష మమత చిక్కి. 20

దవుడ వేరు - చిలుక దంత సంప్రతి వేరు !
ఖగము తీరు తెన్ను మొగము వేరు !
విశ్వ శిల్ప మందు - వింత లందున వింత
మనుజు పలుకు చిలుక అనుకరించు 21

దొరల తోడ - మరియు దొంగ సన్యాసితో,
మసల వలయు పెద్ద మనిషి అనిన,
సానుభూతి గలిగి - సమకాలికుల తోడ,
సంచరించ వలయు సంఘ మందు . 22

ఆశ్రమాలలో - గృహస్థాశ్రమమె గొప్ప
కావి బట్ట గట్ట ఘనత కాదు ?
వెల్లి విరియ గలదు - విశ్వకళ్యాణమ్ము
కరుణ వలన - ప్రేమ - క్షమల వలన . 23

మొరుగు చుండు ఒరులు దరి చేరకుండగా,
చేరి - గడ్డివాము చెంత - కుక్క,
మేయ లేదు తాను - మేయనీయదు ఆల !
ఎండ వచ్చు - గడ్డి మండ వచ్చు 24

నడుపజాల డెవడు - నాయకత్వము పూని,
ఉద్యమమ్ము - త్యాగయోగి గాని,
కదుప లేడు ప్రజల హృదయమ్ము లెవ్వాడు,
కడుపు లోని చల్ల - కదల కుండ 25

సాధనాలు కావు సంతాన సంపదల్
    సత్క్రియాచరణము - జ్ఞాన పటిమ !
త్యాగ యోగ మొకటె - అమృతసిద్ధికి త్రోవ
    సర్వ నిగమ సార సంగ్రహమ్ము. 26

వేల్పు లెల్ల వెరచి వెనుకంజ వేయుచో
    ముందు కురుకవచ్చు మూర్ఖుడెపుడు,
సమయ సీమ లెరిగి - సాహసమ్మును చూప
    శౌర్య మనగ బరగు - జయము కలుగు. 27

పేర్మి చేర దగును -పెద్ద ఉద్యమములో,
    ఎదుగ గలదు ఎడద మెదడు కలిసి;
బ్రతుకు - చిక్కు ముడుల పడుగు పేకల నేత,
    మరువ వచ్చు చిరు సమస్య లెల్ల 28

తూర్పు ప్రొద్దు పొడుపు తొలి ఉషస్సులు గూర్చి,
    ఉపనిషత్తుల వెల్గు లుదయ మందె;
కనుల నిదుర బాపి - మనుజ లోకము నందు,
    మెదడు హృదిని గూడ మేలు కొలిపె. 29

పొగడు వారి కంటె - తెగడు వారే హెచ్చు,
    చిత్త శుద్ధి సంఘ సేవ చేయ;
దారల - వచ్చు కొన్ని పొరపాట్లు - పనులలో,
    బాధ పడదు కార్య సాధకుండు. 30

జీవితమున - నరుడు శృంగార భోగియే
లాభ లోభ భావ లాలితుండు;
కాన - పతన మందె - కమ్యూనిజము నేడు
పతన మందె బౌద్ధ మతము నాడు. 31

వేల కొలది పనులు - విద్యుత్తు జరిపించు,
ప్రగతి - గరిమ నాభి యగుచు పరగి,
విజ్ఞు లివ్వ గలరు - విద్యుదుత్పత్తికే
ప్రథమ పరిగణనము పాలనమున. 32

ముందు మానవ జగ మందనుష్ఠానమ్ము
జరిగి పోవు చుండు - చాల నాళ్ళు !
చేర్చి - సూత్ర ఫణితి - సిద్ధాంత శాస్త్రమ్ము
పండితోత్తముండు వ్రాయు - పిదప. 33

బుద్ధిమంతు డైన - సిద్ధాంతి గ్రహియించు
వసుధ మీద వాస్తవాల నెల్ల;
ఆచరణము నందు - అనువదించిన గాని
విలువ లేదు సూత్రములకు నెపుడు. 34

అంద మనిన - గొప్ప అంగాంగ నిష్పత్తి
ఎంచ ఒడలు మాత్ర మెపుడు కాదు;
మంచితనము - మాట - మర్యాద - జ్ఞానమ్ము
చురుకుదనము తెలివి చూడ దగును. 35

అతిథి రాని యెడల - అది గూడ మంచిదే,
సేవకులకు విందు చేయ వచ్చు,
రాని వారి మరచి - లేని వారికి పెట్టు;
పడయు పుణ్య లబ్ధి - పాపి యైన, 36

మెరయు నట్టి శక్తి - మిణుగు పుర్గుల కుండు
కలదు - దోమ కెగుర గలుగు ప్రజ్ఞ;
కడలి నీది, ఈది వెడలి వచ్చెడి చేప
పెట్టు గ్రుడ్లు పుట్టినట్టి చోట. 37

విమలమైన - ధర్మ విజయమే అగు గాక,
గర్వ కలుషితమ్ము కాకపోదు!
ఆంతరంగిక మగు - అధ్యాత్మ సంశుద్ధి;
అవతరింపజేయు అపజయమ్ము. 38

మంచి పనులు గాని - మంచి మాటలు గాని
నరుల లోని హృదయ మరయ దగును;
నరుడు - పెదవు లందు - చిరు నవ్వు చిందించి
గుండె నింప వచ్చు - గుప్త విషము. 39

భోగము త్యజించిరి మహా
భాగులు ఋషి సత్తము లగు పావన చరితుల్
త్యాగము పరోపకారము
యోగామృత సారము యుగ యుగముల లోనన్. 40

చిత్ర చిత్రమైన సృష్టి శోధన యందు
హేతు వాగు - దూర మేగ లేక;
అనుభవైక వేద్య మధ్యాత్మ యోగమ్ము!
జ్ఞాన భక్తి కర్మ సంగమమ్ము 41

విశ్వసృష్టి శిల్ప విద్యా రహస్యముల్
చెదరగొట్టి వేయు మెదడు నెడద,
విశ్వ మందు వెలయు వేదాంత తత్వాలు
అంధ హస్తి దర్శనార్థ కథలు 42

కొండ లెక్క గలరు - గుడి గోపురము చూడ;
గ్రుంకులాడ గలరు కొలను చేరి
ఎవరు కొలువ గలరు ఎత్తు లోతుల నెల్ల
చాలు స్థూల దృష్టి - జనుల కెపుడు. 43

కాదు - కాదు వాడు గండ భేరుండమ్ము
వాడు- ఉష్ట్రపక్షి వంటివాడు !
రెండు - డాబుసరికి రెక్కలున్నవి గాని
ఎగుర లేడు - పరుగు లెత్తు ఉరికి 44

లొంగకున్నచో ప్రలోభమ్మునకు సదా
నరుడు పొందవచ్చు - పరమ తృప్తి
అంతకంటె అధికమౌ సౌఖ్య సంతృప్తి
పొంద వచ్చు లొంగి పోయి నపుడు. 45

చేయు పనులు పగలు - రేయి గాంచును కలల్,
కార్యశూరు డతడె - కవి యతండె
చదువు - మెదడు - పెద్ద పదవి ముయ్యేల గుట్ట
త్యాగి - భోగి - కర్మయోగి అతడె. 46

శాంతి సామరస్య సౌఖ్య సంపద లందు
సంఘ మందు ఉన్న నగటు మనిషి
గౌరవమ్ము నందు వీర విప్లవ నేత
తుదకు శాంతి లేని బ్రదుకు నందు. 47

కానుపించు - సృష్టి లోన భిన్నత్వమే,
స్థూల దృష్టి తోడ - చూచునపుడు,
అనుభవించు యోగి - ఐక్య సంధానమ్ము
సూక్ష్మ దృష్టి తోడ - చూచినపుడు. 48

అన్ని సూత్రములకు అపవాదములు నుండు
గొంతు చించుకొనుట కూడని పని
విలువ నివ్వరాదు - విధి నిషేధములకే
సంచరింప వలెను సమయ మెంచి. 49

మనిషి - చదలపై విమానాల విహరించు
ఉదధి దాటుచుండు ఓడ లెక్కి
కడలి లోతు పాతు గగనాంతరాళమ్ము
యాన తత్త్వ మరయు జ్ఞాని లేడు. 50

పాడు చేయ రాదు - బ్రతుకులో సమయమ్ము
ధనము పాడుపు చేయ దగును - సతము
జయము కలుగ గలదు - శ్రమ వల్లనే సదా
కర్మయోగి యగును కష్టజీవి. 56

అర్థమైన చాలు -వ్యవహార సరళిలో
అస్తి నాస్తి చర్చ అనవసరము;
పారిభాషికములు - భావ ప్రతీకలే
నందన వని అనిన - నాక మనిన. 57

లేదు దేవు డనెడు వాడెచ్చటను లేడు!
అనుచు నొక్క పలికె నాస్తికుండు,
"లేదు - ధరణిమీద లేడుగా కంసాలి"
పసిడి ఉంగరమ్ము బదులు పలికె. 58

పాత పుస్తకాల బాట అంగడి లోన,
అసలు వెలకు మించి అమ్మబడిన,
గొప్ప, గ్రంథ మనుచు చెప్ప వచ్చును దాని
కొన్న వారు గూడ గొప్పవారె. 59

వెలుగు పరుగు - మనిషి - కొలువగల్గెనుగాని,
తలపు వేగ మింక తెలియ రాదు;
తలపు దవుడు తీయు వెలుగు వేగము మించి
మనిషి మెదడు గొప్ప మహిమ గలది. 60

ఒక ఋషి వచియంచె - " ఓ సింహ రాజమా
మాంస భక్షణమ్ము మాను మీవు,
చెప్ప లేదు బదులు - సింహమ్ము గర్జించి
చనెను - ఋషిని చంపి తినిన పిదప. 61

పాత చింతకాయ పచ్చడుల్ బ్రతుకులో
పథ్యమునకు తప్ప పనికి రావు
కోరు యువకుడైన ఆరోగ్యవంతుండు
క్రొత్త వంటకములు క్రొత్త రుచులు. 62

మోసగింపబడుట మూర్ఖత్వమా కాదు !
తరచి చూచు నెడల తప్పు కాదు !
నరుల మంచి తనము - నమ్ముటే నాకమ్ము
నమ్మకమ్ములేమి నరక సమము. 63

అధిక మైన యెడల ఆడంబరము - డాబు,
కల్గు - ఆత్మ శోభ - తగ్గిపోవు ,
ప్రతిభ - చూపరాదు - శ్రుతిమించి దర్పమ్ము
వెన్నెల సిరి కలదు వినయ మందు. 64

సంతసించు చిన్న జలపాతమును చూచి
సరకు గొనడు లోతు సరసి నరుడు,
తళుకు బెలుకు జిలుగు దర్పమ్ము జగతిలో
రక్తి కట్టు లోతు ప్రతిభ కంటె. 65

చేరి చేయ గలరు - చెప్పకుండగ పనుల్
కోరి తోడుపడుచు కొంతమంది
ప్రక్క వారు పూని పనిచేయుటను చూచి,
కొంత మంది తప్పు కొనుట కద్దు. 66

మూర్ఖ జనులు వేలు మూగవచ్చును చుట్టు
కారణాంతరముల కలియు గాన;
విలువ లెల్ల తెలిసి - విజ్ఞాని ఒక్కండు
మెచ్చు కొనిన వచ్చు - మేలు - చాలు 67

మతమును మరచుట మంచిది,
గతించిన చరిత చదువుట కాలహరము ప్ర
స్తుత జన హితమెంచుచుజీ
వితమును గడపుటయె మేలు పృథివీ స్థలిలో 68

మెరయు చుండు - ప్రతిభ మిరుమిట్లతో వెల్గి
కప్పు నింగి నేల అప్పు డపుడు
నిలిచి - ఆరకుండు వెలుగు దీపము కాదు
బద్ధకమ్ము లేని ప్రతిభ లేదు. 69

ఏ మసీదు గాని - ఏ గోపురముగాని ,
విశ్వ సృష్టి యందు వింతగావు;
మనసు కనుల తెరచి మనుజుండు చూచచో
పెద్ద దేవళమ్ము - పృథివి యెల్ల. 70

వ్రాయవచ్చు గొప్ప వ్యాఖ్యానముల్ - పెక్కు,
గణిత సూత్రములకును కావ్యములకు
బాష్ప కణము - విలువ పాండిత్య భాష్యముల్
గుర్తు పట్టలేవు - గుండె లేక. 71

అరయ - ధన కబంధ హస్తాలలో నుండి
బయటపడి బ్రతికినవాడు కలడు;
వసుధయందు లేదు పాండిత్య పైశాచి
బారి నుండి బయట పడినవాడు. 72

వేషధారి - నరుడు విశ్వ నాటక మందు
మసల వలెను వట్టి మమత లేక
రాజు పాత్ర యైన రైతు పాత్రేయైన
వేత్త మనసు లోన వేరు కాదు. 73

జగతి యందు - నరుడు - సహజ ప్రవృత్తిచే
కాదు - రక్తదాహి - కాదు కాదు
మనిషి - " మంచి " - పెంచు కొనుట కష్టము గాదు
సృష్టి కపర సృష్టి చేయ గలిగి. 74

కలిసి కడలి పాలు కారాదు - నది నీరు,
పంట చేల కొరకు వాడ దగును;
విలువ పెంచ వచ్చు - విద్యుదుత్పత్తితో;
పడవ వర్తకమ్ము నడుప వచ్చు. 75

బ్రదుకు లోన - కీర్తి - రాకుండ పోవచ్చు,
ప్రతిభ యెంత యున్న పాత్రులకును !
ప్రతిభ - తక్కు వున్న - ప్రఖ్యాతి రావచ్చు !
లౌక్య లలిత చాకచక్య మున్న. 76

అరయ - నరుని తెలివి - అత్యద్భుతము గదా !
అందె - రోదసీ గ్రహాంతరములు;
మలుపు తిరిగి - అరిగి మరి కొంత దూరమ్ము,
క్రొత్త విజయములను కూర్చు కొనుత. 77

విశ్వ మందు చూడ - వింత యైనది ఏది ?
మనిషి లోన ఉన్న - మానసమ్ము !
వెలుగు కంటె మిగుల వేగమ్ముగా ఏగు;
సృష్టి కపర సృష్టి చేయ గలదు. 78

నిండు గుండె తోడ - నిర్వ్యాజ రక్తితో,
సానుభూతి తోడ -స్వార్థ మెడలి,
మంచి వాని కెవడు కించిత్ సహాయమ్ము
చేయు - అట్టి వాడు శ్రేష్ఠ జీవి. 79

లోక మందు - మనము లాకారములు వేరు,
మనిషి బోలు నట్టి మనిషి లేడు!
మానవ స్వభావ మర్మజ్ఞ డెవ డుండు ?
భిన్నత గ్రహియించు వేత్త - చాలు. 80

వీలు కాదు - తెలియ విశ్వ వైశాల్యమ్ము !
నరుని జ్ఞాన పరిధి - పరిమితమ్ము,
జ్యోతిషమ్ము - గొప్ప శాస్త్రమే కావచ్చు !
మంచి జ్యోతిషికుడు మహిని లేడు. 81

అరయకుండ - ఒకని కపకార మొనరించి
తరచు వెదకు నతని తప్పిదములు,
వెల్లివిరియజేయు ద్వేషమ్ము నతనిపై!
చిత్ర మరయ నరుని చిత్త వృత్తి. 82

చెట్టు నుండి, పసిడి చింతకాయలు రాలు,
చచ్చి మరల బ్రదుక వచ్చు - మనిషి !
గగన మందు నగము లెగురు రెక్కలు వచ్చి !
నమ్మకమ్ము కుదుర - నరుల యందు. 83

వ్యాధి అనగవచ్చు - అప్పు చేయుట యన్న
ఎంత వడ్డి యైన ఇవ్వ జూపు;
అసలు తీర్చ దలప డాతండు - పైపైన
మత్తు గొలుపు తీపి మాటలాడు 84

జీవితమ్ము లోన - స్వీయ శక్తిని కొంత ,
అహము చాల సార్లు - వ్యయము చేయు,
మనిషి మంచితనము - వినయ విజ్ఞానమ్ము
ఎదుటి శక్తి సంగ్రహించు కొనును. 85

తనను తా క్షమించు కొనలేని మనుజుండు,
దేవు వేడ లేడు - బ్రోవు మనుచు,
నిష్కృతి యేది లేని - నేరమ్ము, సల్పుచో
గుండె - నుండి సెగల కుమిలి కుములు 86

మనుజు నందు - దేహమునకు రెక్కలు లేవు !
ఉన్నది గద రెక్క లున్న మనసు;
ఎగుర గలదు మనసు - గగనాంతరాళాల !
విశ్వ మెల్ల తిరిగి వెడలి వచ్చు. 87

ఎంత ప్రతిభ యున్న - ఎంత పాండితి యున్న
బ్రదికి యున్న కవికి - రాదు - కీర్తి,
మరణ సంఘటనము మాపు మాత్సర్యమ్ము !
బ్రదుకు తెచ్చి నట్టి స్పర్థ లెల్ల. 88

తరచు మార - వచ్చు - పసరు కోనేరుగా;
ప్రజకు దూర మైన - పండితుండు;
నవ రస రుచిర మయి - నవ నవోన్మేషమై ;
మెరయు గాత - ప్రతిభ - మించు వోలె. 89

సలుపుట శరీర వధ, మి
క్కిలిహేయమ్ము గద - పేత్త - గీర్వాణముతో
సలిపిన హేయతరముగద
తెలివిని తెగనాడు నట్టి తేజో వధయున్. 90

చెక్కబడిన జీవ శిల్పమ్ములే ! ప్రజల్ !
సమత - స్వేచ్ఛ యేది ? సంఘ మందు ?
పాపి యెవ్వ డగును ? స్వచ్ఛందముగ కోరి,
సంస్కరింపవలెను - సంఘ నీతి. 91

భక్తి కుదురు నెడల - భగవంతు ఉన్కిపై
ఆస్తికులకు ఋజువు లనవసరము ;
చూప ఋజువు లెన్ని - సుంత లాభము లేదు;
నమ్మకమ్ము లేని నాస్తికులకు. 92

జరుగుచుండు కొన్ని పొరపాట్లు పనులలో;
పూర్ణత కనబడదు - పుడమి లోన ;
సానుభూతి కలిగి - క్షమ చూప వలె - గాని,
తెలివి లేని వాని తిట్ట రాదు. 93

అగ్గి కణము లుండు - బుగ్గి బూడిద దాగి;
అతిశయింప వచ్చు - అదను దొరుక,
కానుపించ కుండ - కామ వాసన దాగు;
ముసలి గుండె లోన - మసలు చుండి. 94

చదువు వలన గాని పదవి వల్లను గాని
మెదడు వలన రాని మేలి దీప్తి;
ఆశయాల వలన ఆత్మ గౌరవ ముద్ర
అంతరంగ మందు - అవఘళించు. 95

విజయ సిద్ధి కొరకు - విజ్ఞానమే గాక
ఉండవలయు గ్రుడ్డి గుండె కూడ,
ధైర్య సాహసముల తెర వెన్క అరయగా
కొంత కలిసియుండు గుడ్డి తనము. 96

మేటి మెదడు మిన్న - కోటి చేతుల కంటె,
కార్మికుండొక ఉపకరణమె గద !
వసుధ నెల్ల - కడగి - వాస యోగ్యము చేయు
ఊహల ఖని యైన - యోజకుండు. 97

చాల నాళ్ళ పట్టు - సాధనా యత్నముల్ !
జయము నపజయములు - క్షణిక గతులు;
ఆశ - కలుగ జేయు - ఆనంద యోగమ్ము!
ఆశ - సాధనమున కంత రాత్మ 98

పెరుగగ - మనుజులు జంతులు,
సరిపడెడి వసతులు పెక్కు - సమకూర వలెన్;
పెరుగును వడ్డీ ఒకటే!
ధరణీ స్థలిలో - తనంత తా దినదినమున్. 99

యౌవనమ్ము నందు - ఆకర్షణము మెండు,
ఆడవారి యందు - అధికతరము ;
తరుగ నట్టి శక్తి - ధనము నందున ఉండు
పందె మందు రెండు పొందు జయము. 100

మనుజ సంఘ మందు - మధ్య వచ్చెడి సిరుల్,
పెను ప్రమాదములను పెంచ వచ్చు !
అపజయమ్ము కంటె - అధిక హానిని గూర్చు,
జయ మయోగ్యులకును - సంక్రమింప. 101

పుస్తకమ్ము నేడు పూర్తిగా పఠియించు
శక్తి రక్తి యున్న జనులు గలరె ?
గ్రంథమునకు - పీఠిక - లేకయున్నచో,
నేరముగనె పరిగణింప దగును. 102

యోగ దృష్టి యుండు - ఉత్తమోత్తము లందు,
గుర్తు పట్ట గలరు - గొప్ప దనము,
ప్రోత్సహించగలరు - పొంచి యోగ్యుల నెంచి,
దేశ హితము తీర్చి దిద్ద గలరు. 103

" కోను" వలన పెరుగు - కుంభసంభవ సంఖ్య
సగటు తెలివి పెరుగు జగతి యందు;
నర సమాజ జీవ పరిణామ గతిలోన
గొప్ప మార్పు వేగ గోచరించు. 104

జయము కలిగి తీరు - సంకల్ప శుద్ధితో;
చేయ వలయు రణముచివరి వరకు.
వీర మరణ మైన - విజయమ్ము తోసాటి.
పారరాదు పిరికి పంద వోలె. 105

రాతు వాదమున కతీతమౌ అనుభూతి
పడసినాడ తరచు బ్రదుకు నందు;
గ్రహాల పూజ విజ్ఞాన గతిలోన
పలక బలప మగును ప్రథమమందు 106

గుప్త జీవితమ్ము - గుడ్ల గూబా నీది !
రక్తపాన హింస - రాత్రు లందు,
కొరికె దీవు పిట్ట కొంతుకల్ రేలనే !!
పట్టు బెట్లు నిన్ను - పట్ట పగలు. 107

సలుప వచ్చు మంచి సంకల్పముల తోడ,
చేయ రాని కొన్ని చెడ్డ పనులు,
అవసరమ్ము ముందు ఆలోచనము కొంత,
వంత యేల ? పిదప వగవ నేల ? 108

యశ మటన్న - హెచ్చు ఆర్భాట దర్పమ్ము
మెరయు పూత పసిడి మిసిమి జిలుగు ;
నిర్వహించు పనులు - నేపథ్యమున నిల్చి
గొప్పవాడు - కీర్తి - కోరుకొనక. 109

శ్వేత వస్త్రధారి - చిత్త శుద్ధిని కల్గి,
మంచితనము పెంచి - మించ వచ్చు;
ఇంద్ర ధనువు విరియు హృదితోడ తిరుగాడు!
కలియు రంగు లెల్ల - తెలుపు నందు. 110

చేరు చకచక మృదు చమత్
కారము స్థిరశంప యౌచు - కాంతి చ్ఛవిమత్
చారిమ లొలుకు సమస్యా
పూరణములు తెల్గుబాన - పొంపిరి వోవన్. 111

మంచి చెడుగు మధ్య - మనిషి ఊగుట కాదు.
చెడును - అంత కంటె చెడును మధ్య;
స్వీకరించు మనిషి జీవి తమ్మున యందు
తక్కువైన చెడును - తరచి తరచు. 112

తీర్చ వచ్చు చేసి - తీర్మానములు కొన్ని
నేల మీది వాస్తవాలు మరచి.
కడిగి - పిల్లి మెడకు - గంట కట్టెడు నట్టి
ఎలుక పుడమి మీద ఎచట గలదు ? 113

మంచి తనము తెలుప- మందహాసము చాలు
వెడల వచ్చు పెదవి విప్పకుండ
పెదవి విప్ప వచ్చు వీలు చాలును బట్టి
పలువురు తన చుట్టు నిలిచి నపుడు. 114

" సౌఖ్య మివ్వ లేవు - సంపదల్ జగతిలో "
గొప్ప నీతి చాటి చెప్ప రాదు;
అయిన - పేదరికమె - ఆనంద మిచ్చునో ??
వాహనాలు లేక - వసతి లేక . 115

చేసి కొంతసేపు - సింహాలతో పోరు
చచ్చినారు బానిస లలనాడు.
సంతసించి నారు - స్వాతంత్ర్య భావుకుల్.
ప్రాజ్య రోము రాజ్య పౌర వరులు. 116

మాతృభాష భూత భేతాళ తతి కేది ?
వ్యంగ్య వక్ర పరుష వాగ్విమర్శ
వలదు ధిక్కరణము వల దధిక్షేపమ్ము,
సానుభూతి చాలు - జాలి - మేలు. 117

గొప్ప పిచ్చివాని - గుర్తింప కష్టమ్ము !
అతని తెలివి వెలుగు లద్భుతములు;
సగటు జనులు - శలభ సంతానముల వోలె
మూగు చుందు రతని ముద్ది చుట్టు 118

చెవిటి వారు చర్చ చేయ ఇర్వురు గూడి
పండిత ద్వితయ వివాద సమము;
ఎవరి మాట వారిదే యౌను - చర్చలో !
ఒకడు చెప్పు మాట ఒకడు వినడు. 119

జనులు పొందగలరు - సచ్చిదానందమ్ము,
పరుల మేలు కోరి పనులు చేయ,
తెలియ నట్టి బాధ కలుగజేయుచు నుండు.
స్వార్థ చింత - అంతరాత్మ లోన 120

అరసి తేనె చుక్క - అరచేత - మోచేతి
    వరకు నాకు నట్టివారు - కలరు,
కనుల ముందు-పచ్చ గడ్డి వ్రేలాడగా
    లేగ - దున్నపోతు - లాగు బండి. 121

మనుజుల దుర్గుణములు సత్
గుణములు కలిసి కనుపించు - కూరిమి మెరయన్
మనుజులలో నుండెడు సద్
గుణములనే గుర్తుపట్టి కొనియాడ దగున్. 122

ఎచట కరచు చెప్పు లెరుగ నేరరు పరుల్ !
    ప్రక్కవాని తెగడ రాదు - ప్రజలు,
వీలు కావు - నీతి విధి నిషేధము లెల్ల !
    సానుభూతి మేలు సహృదయులకు. 123

వెనుక కనులు లేవు - మనుజ దేహము నందు,
    ముందు చూపు - వలయు అందరకును,
బ్రదుక వలయు ప్రజలు - ప్రగతి మార్గము నందు,
    పాతదనము విడువ వలెను - వేగ 124

ఎత్తు గుట్ట మీద - ఏకాంతముగ నిల్చి,
    ఒలికె దీవు - రేల - వెలుగు జిలుగు!
ఉగ్గడింతు నిన్ను - ఓ దీప శిబిరమా !
    కడలి ఓడ-దారి -గాంచు గాత. 125

చూడ - దిన దినమ్ము - సూర్యుండు నవ్యుడే,
　　నిన్న కొలత వేరు ! నేడు వేరు !!
క్షణము క్షణము మారు - జగతి సర్వము గూడ,
　　మార్పు నడ్డ నేల మానవుండు ? 126

ఉండు - నిజము - దాగి ఒంటి స్తంభపు మేడ,
　　చేర ఏది కాలి దారి - లేదు !!
ఎగిరి- వ్రాల - మెదడు హృదిని - రెక్కలు చేసి,
　　గాలి నడుగు జాడ కానబడదు. 127

సృష్టిలోన రుచులు జిహ్వ జిహ్వకు వేరు
　　పుఱ్ఱె పుఱ్ఱె కొక్క బుద్ధి పుట్టు,
రసిక వరుడు - కోరు - ప్రామాణిక విమర్శ
　　ఐక్య సంహితా సమన్వయమ్ము. 128

ఉదయ మంది పెరుగు ఉద్దీపనము లున్న
　　నరుని గొప్ప దనము ధరణిలోన;
మఱ్ఱి బీజమైన మట్టిలో నశియించు
　　ఎరువు - నీరు -వేడి దొరక నపుడు. 129

నేత - గుర్తు పట్టు -నివురు గప్పిన నిప్పు;
　　వాడు కొనును మరుగు పడిన శక్తి;
ప్రగతి అనిన ఏమి? ప్రతిభ గుర్తించుటే!
　　సంఘమునకు తనకు జరుగు - మేలు. 130

సింహ మైన - నక్క జిత్తు లెత్తుల ముందు,
    తరచు ఓడ వచ్చు ధరణి లోన!
చావ వచ్చు - పాము - చలి చీమలకు చిక్కి
    బలమె ఎల్ల యెడల గెలువ గలదె ! 131

స్నాన మాడ లేడు - నది లోన మనుజుండు
    జగతి లోన రెండు సారు లెపుడు;
అవని లోన - సతము ప్రవహించు నది మారు:
    మారు క్షణము క్షణము మానవుండు. 132

కారు నడపు ప్రజ్ఞ - కలిగి యండుట మేలు
    ఉత్త మోత్తమ ప్రయోజకుండు,
శక్తి యుండవలెను - సర్వతో ముఖముగా;
    జయము కొరకు - నవ్య జగతి లోన. 133

వేయ నేర దెపుడు - వెనుకంజ జిజ్ఞాస ,
    అధిగమించు ఎట్టి - అడ్డులైన ;
సత్య శోధనమ్ము - మృత్యుంజయము సుమ్ము
    శాస్త్ర సాధకులకు - జయము జయము. 134

గాలి - తేలు - కొంత కాలమ్ము - నెత్తావి
    పువ్వు వాడి పోయి పుడమి బడిన;
మనుజు కీర్తి గూడ - మరణ మొందిన మీదు
    నేల - తావి వోలె - నిలువ గలదు. 135

ప్రౌఢ హేతు నిరతి -మూఢ విశ్వాసమ్ము
నలుపు పోరు - మనుజ సంఘమందు,
మెదడు గెలువ - కలుగు మేటి సంతాపమ్ము
జయము నంద - ఎడద - శాంతి గలుగు. 136

అతిథి వోలె - డాసి - అవకాశ మొకసారి
ద్వారము కడ చేరి తలుపు తట్టు !
తక్షణమ్ము వచ్చి తలుపు తీయుక యున్న
మరలి వెడలి పోవు - మరల రాదు. 137

జీవితమ్ము లోన - యావజ్జగత్తులో,
కఠిన మైన - కష్ట కార్య మేది ?
ఏమి చేయకుండ - ఇంట కూర్చుండుటే !
ఉలుకు పలుకు లేక ఊరకుంట. 138

ఉడక బెట్టు నపుడు - ఉప్పు వేసెడి వేళ ;
కంటి కొలత వలయు వంట యందు!
బాగ తోడు పడును - పసిగట్ట గల ముక్కు;
పాక మందు - చేతి తూక మందు 139

నేల నొక్క కాలు - నీటిలో ఒక కాలు,
పెట్టి ఎవ్వ డీత కొట్ట గొలడు?
నేర్వదగును ఈత - నేల పూర్తిగ వీడి,
జలము పైన - తేల గలిగి నపుడె. 140

శీల శుద్ధి లేని - చిత్త సంక్షోభమ్ము
వాని మొగము నందు కానుపించు,
నుదుల లోన రేగు సుడిగాలి వలయముల్
ఊగు చుండు గుండె ఊయెల వలె. 141

నీతి విడిచి - స్వార్థ జాతీయ తత్త్వమ్ము
సాటి ప్రజల బానిసలుగ చేసి;
జగతి నెల్ల - ఘోర సంగ్రామ కీలలో
రెండు సార్లు త్రోసె - గుండె లేక. 142

ధరణి దద్దరిల్ల - తిరిగె అబోతుగా
అతని ముట్టె పొగరు - అణగి పోయె;
గడప గడప త్రొక్కు - గంగిరెద్దుగ మారి,
కప్పు కొనుచు పాత దుప్పటులను. 143

భూమి మీద కలవు - గోముఖ వ్యాఘ్రముల్!
కుక్క మూతి గుంట నక్క లుండు,
కొంత మంది కుండు కోకిలా లాపముల్ !
గుండె లోన విసపు కుండ యుండి. 144

మెక్కవచ్చు - కూర్చ - మేలి బియ్యము వండి,
సహృదయుండు పాక సరళి మెచ్చు;
వడ్లు - మణులు కలిపి - వండి వడ్డించుచో
అవని తినెడి మనుజు లెవరు గలరు ? 145

ఎన్ని పదవు లున్న - ఎన్ని సంపద లున్న,
లేదు సుఖము తృప్తి లేని యెడల;
విద్య - యెంత యున్న - వినయమ్ము లేనిచో ;
లేదు - చిత్త శాంతి - లేదు సుఖము 146

విశ్వ శిల్పియైన ఈశ్వరుండే లేక
జగతి హితము ఎట్లు జరుగ నేర్చు ?
సృష్టి కర్త నొకని - సృజియించుటే - మేలు
నీతి కొరకు - ధర్మ నిరతి కొరకు. 147

కష్ట పడిన చోట నష్టమ్ము రావచ్చు
సహృదయు లరుదు గద జగతి యందు;
జరుగు వేరు చోట - సత్కార విభవమ్ము
ప్రతిభ గుర్తు పట్టు ప్రజల చేత. 148

అను దినమ్ము - ఎవడు - వ్యక్తిత్వమున చేర్చు
గుర్తు పట్ట రాని - క్రొత్త కొలత,
సంఘ మందు - అతడె సంస్కారి - మేధావి
ఎప్పు డతని ఎడద ఎల్ల లెదుగు. 149

అత డుగ్రవాదమున కం
కితు డయ్యెను ! దేని కొరకు ? కేవల దేశో
న్నతి కొరకా ? హింసా పూ
రిత మగు తన హృదికి ఘోర తృప్తి ఘటింపన్. 150

గొప్ప మహిమ గలవి - కోటి సంఖ్యను దాటి
నరుని మెదడులోన అరలు కలవు,
నరుని మెదడు లోని అరలలోతులు కొల్చు
పరికరాలు లేవు - ధరణి మీద. 151

కానుపించు - సృష్టి లోన భిన్నత్వమే !
స్థూల దృష్టి తోడ - చూచునపుడు;
అనుభవించు యోగి - ఐక్య సంధానమ్ము
సూక్ష్మ దృష్టి తోడ - చూచి నపుడు. 152

గొప్ప దనము వెదకి - గుర్తు పట్టెడు వాడు
గొప్ప వారి కంటె - గొప్పవాడు!
సరసత సహృదయత - సౌశీల్యములు లేక;
గుర్తు పట్ట రాదు - గొప్ప తనము . 153

ఒడలు మరచి పోయి - పడకపై పవళింప,
దట్టమైన నిదుర పట్టె నేని !
అంత కంటె హాయి - అతిలోక సౌఖ్యమ్ము
ఎవరి కైన ఇంక ఏమి కలదు ? 154

కృతక సృష్టి గాక - రేఖా గణిత మందు
అచ్చ మైన " బిందు" వెచ్చటుండు ?
సమ్మతింపవలెను - సంకేత చిహ్నాలు !
స్వస్తి చెప్పి - హేతువాదమునకు. 155

ప్రకృతి సిద్ధ మైన - ప్రత్యక్ష జగతినే
కాంచు - మనిషి తోలు కనుల తోడ,
అఖిల సృష్టి నరయ నగు - మనో నేత్రమ్ము
గ్రుడ్డి కుండ వచ్చు - గొప్ప ప్రజ్ఞ. 156

తెలివి తేట, మధ్య - దివ్య తేజము మధ్య,
గొప్ప దైన త్యాగ గుణము మధ్య,
దాగి యుండ వచ్చు - యోగీంద్రు మెదడులో,
వేప కాయ యంత వెఱ్ఱి గూడ 157

పాపహృదుల మధ్య - పనిచేయు వాడైన
కలుషితుండు గాడు కర్మయోగి,
బురద లోన పుట్టి పెరుగదా పద్మమ్ము !
చిత్త శుద్ధియున్న - చెడడు మనిషి. 158

తల్లి దండ్రి చూసి - చెల్లెండ్ర పెండిండ్లు
చేయువాడొకండు జీవితమున ,
పాటుపడు నొకండు భార్యా సుతులకునై !
ఉపకరించు నొక్క డూరి కెల్ల. 159

అతి పరిచయమ్ము - అన్ని వస్తువులపై
గొప్ప మేలి ముసుగు కప్ప గలదు !
అరయ గలడు - వచ్చి - పరదేశి యెవ్వడో !
అసలు వస్తువులను - ముసుగు తీసి. 160

ప్రగతి సౌధమునకు - ప్రథమ సోపానమ్ము
“ఎందు చేత” అనెడి ఎదురు ప్రశ్న
తుదకు ఆగ వలయు - అది నిరుత్తరముగా,
చెట్టు - విత్తు -ఏది పుట్టె మొదట ? 161

మందు లేవని జబ్బు మాన్పజాలవు సుంత,
స్వేచ్ఛ ఎవని కాట విడుపు కాదు;
లేదు కాలమునకు ఓదార్ప గల శక్తి;
మృత్యు వొకటె నరుని మిత్ర మగును. 162

ఏల లేదు ధరణి ఇక ధన స్వామ్యమ్ము;
సామ్యవాద మగు - అసహజ సరణి;
శ్రేష్ఠ మైన దేది శ్రేయః ప్రభుత్వమే ?
సానుభూతి సమత సంగమింప. 163

పురుడు వచ్చి బిడ్డ పుట్టు శీఘ్రమ్ముగా,
నెలలు కొన్ని మోయ వలయు - ముందు;
కార్య మేది యైన - కడతేరు కాలమ్ము;
అంత ముందు శ్రమను అరయ దగును. 164

కూడు లేని కుక్క - తోడేళ్ల నెదిరించి
నాడు గొఱ్ఱె మందకూడి కాచె;
నేడు - మేటి కుక్క - నిర్వీర్యమై తోచు;
గొప్పవారి ఇంటి కూడు కుడిచి. 165

మేక మంద బ్రోవ - లోక తంత్రజ్ఞుండు,
పెద్ద పులుల కాపు పెట్టు చుండు;
పెద్ద పులుల యొక్క - పేరాకలియు తీరు,
చావ నట్టి మేక - సంత సించు. 166

ప్రజల ప్రోగు చేసి - పనిచేయు ప్రజ్ఞయే;
గొప్ప యజ్ఞ మనుచు చెప్పదగును;
కర్మ యోగి యైన - కార్య శూరు డొకండె,
కలలు కనెడి కవుల కంటె - ఘనుడు. 167

చిట్టి ఎలుక సాటి - సింహమ్ము కాదయా !
వలను కొరికి వేయ వలసి నపుడు !
ప్రకృతి యందు -ప్రజ్ఞ - పలు రీతులై తోచు;
హెచ్చు తగ్గు లెల్ల - పిచ్చి భ్రమలు. 168

వివిధ వస్తువులకు - వెల కట్ట గలవారు,
వేల కొలది కలరు విశ్వమందు;
విలువ నెరుగు నట్టి -విజ్ఞాను లన్నచో ;
వ్రేళ్ళ మీద లెక్క పెట్ట వచ్చు. 169

మానవ స్వభావ మాయావరణ మందు,
కామ గుణమె - అగ్రగణ్య మగును,
అణచ కున్న యెడల - ఆ కామ కౌల్యమ్ము
మనిషి - పశువు వోలె - మారిపోవు, 170

దండయాత్ర సలుపు - దళిత సాహిత్యమ్ము
కత్తి విడిచి పెట్టి కలము పట్టి;
అంతరించు గాక - అన్యాయ మిక కొంత,
నోరు వచ్చె - మూగ వారికిపుడు. 171

కలి యుగమ్ము నందు - కష్టమ్ము బ్రదుకుటే,
పడయు టెట్లు ధనము పదవి యశము ?
మంచితనము గల్గి - మానవత్వము గల్గి,
మధ్య తరగతి ప్రజ మ్రగ్గవలయు 172

సృష్టి లోని మనుజ చిత్త ప్రవృత్తిలో,
హేతువాదమున కతీత ఘటన,
ధర్మ సూక్ష్మ సరణి - తల్లి దండ్రుల ప్రేమ
బలము లేని బిడ్డపైన - ఉండు 173

సంచరింప వచ్చు - జగతి భీతిని గొల్పి,
కానుపించ కుండ మానవుండు !
మనిషి - విడువ వచ్చు - మహి పైన తన గుర్తు;
పాము కుబుసములను వదలి నట్లు. 174

* కలవు - వివిధ ధర్మములు జీవితమ్ములో !
స్వీయ హితము మరియు విశ్వ హితము !!
విడువ - చిన్న పరిధి - పెద్ద వృత్తమునకై
పరమ ధర్మమగును - బ్రదుకు నందు.

# వసుధైక రాజ్యము

ఎందరో మహాత్మ్ము లేక మానవజాతి,
కాంక్ష చేసి - తీపి కలలు గనిరి,
సర్వ జనుల సమత - సౌభ్రాత్ర తత్త్వమ్ము
బోధ చేసి నారు - పుడమిలోన. 1

నేటి జనులు వేరు - మేటి మేధానిధుల్;
రాతి యుగము నాటి ప్రజలు వేరు ;
పృథివి యెల్ల, జ్ఞాన విప్లవమ్మున వెల్గు;
ఒక కుటుంబ మగుత - ఉర్వి యెల్ల. 2

మును ప్రపంచ యుద్ధములు రెండు జరిగెగా,
మూడవ రణ మింక - మూడె నేన,
అది - మనుజ చరిత్ర - అంతిమాహవ మౌను !
మహిని - అంతరించు మనుజ జాతి. 3

పొత్తు కుదురు ప్రజకు భూగోళ పరిధిలో,
వెల్లి విరియు ప్రగతి విద్యలందు;
వచ్చు గాత వేగ వసుధైక రాజ్యమ్ము ?
హాలహలము పెరుగు ఆలసింప. 4

తెలివి పెరుగు - వివిధ దేశాటనము వల్ల,
చదువ - సకల దేశ సాహితులను,
జ్ఞాన సామరస్య పరిధి సంధాతయై,
బ్రదుకుత వసుధైక పౌరు డెపుడు. 5

ధరణి - వెలుగు గాత - దారిద్ర్య రహితమై,
మాసి జాతి భేద మమత లెల్ల;
ధరణి జనుల కెల్ల - సరిపోవ ఉత్పత్తి,
వివిధ శాఖ లందు - పెంచ వచ్చు. 6

వచ్చు గాత - వేగ - వసుధైక రాజ్యమ్ము,
మేటి ఐక్య పార్లమెంటు తోడ;
చాటబడుత సర్వ సౌభ్రాత్ర తత్త్వమ్ము;
పండు గాత - సమత - గుండెలందు. 7

మతము కులాది వర్గములు - మాపును దృష్టిని సంఘ మందు - మం
చితనము మానవత్వము నశింపగ చేయును - సర్వదా జగ
ద్ధితమును కోరునట్టి నరుడే - నిజ మైన నరుండు - ధాత్రి - ధ
న్యత యన మానవుండు వసుధైక కుటుంబిగ నిల్వ గల్గటే. 8

కదన రంగములకు - కాలదోషము పట్టె;
పలుక దగును స్వస్తి - కలహములకు,
రాక్షసుండు కోరు - రక్తపాతము - హింస;
సర్వజనుల సుఖమె సాధు కాంక్ష. 9

సమత - స్వేచ్ఛ - సర్వ సౌభ్రాత్ర భావాలు
సాధ్య మగునె ? వివిధ జనులలోన ?
వాస్తవమ్మె అగునె - వసుధైక రాజ్యమ్ము?
ఐక్య పార్లమెంటు నందు తప్ప ? 10

జగతి యందు - వికట జాతీయ భావమ్ము,
ఘోర ఘర్షణలకు దారి తీసె:
బ్రదుకు గాత - మనిషి - వసుధైక జీవియై,
జాతి భేద మెల్ల చచ్చి పోవ. 11

జాతి - మతము - కులము - స్వస్థాన భాషాది
దురభిమానములను - త్రోసి పుచ్చు;
సజ్జనుండు - సతము - జగదేక సంసారి;
అతడు గౌరవించు ప్రతిభ - గుణము. 12

ఆట పాట లందు - పోటీలు విరివిగా,
జరుప దగును - సర్వ జనుల కొరకు,
విద్య లందు - లలిత విజిగీష మంచిదే !
సాధు శీల మున్న - స్పర్ధ - శుభము. 13

వసుధ - చోటు లేదు - వాలఖిల్యుల కింక,
వెల్లి విరిసె - జ్ఞాన - విప్లవమ్ము;
జగతి యెల్ల నొక్క - సంసారమే నేడు;
అవతరించుత - వసుధైక నీతి. 14

సజ్జనుండు - సర్వ జగదేక పౌరుడై,
వదలి పెట్ట గలడు - స్వార్థ పరత;
బహుజన హిత మెంచి - బహుజన ప్రియ మెంచి,
తీర్చి దిద్దు బ్రదుకు తీరు తెన్ను. 15

వచ్చు గాక - వేగ - వసుధైక రాజ్యమ్ము,
జాతి మమత - మతము - చచ్చు గాత !
శాంతి తోడి స్పర్థ - సహకార సంక్రాంతి,
వెల్లి విరియు గాక - విశ్వ మందు. 16

అరయ - మనుజు జన్మ - యాదృచ్ఛికము గదా,
మతము - జాతి భాష మమత లేల?
బ్రదుక దగును - నరుడు - వసుధైక పౌరుడై,
విద్య గరప వలెను - విశ్వ నీతి. 17

జనులు కోరదగును - జగదేక రాజ్యమ్ము,
మతము భాష జాతి మమత వదలి,
చాలు - దేశ భక్తి - కాలదోషము పట్టె
జగతి - యెల్ల నరుల జన్మ భూమి. 18

కలిసి వచ్చె నేడు - కాలమ్ము పక్వమై;
విశ్వ రాజ్య మింక - వెలయ వచ్చు,
సకల సీమ లందు - సర్వతో ముఖముగా,
వెల్లి విరిసె - ప్రగతి - విద్య లందు. 19

కలదు - త్యాగ బుద్ధి - కరుణ మానవులలో,
కలదు - శాంతి కాముకత్వ గుణము,
విద్య లెన్నొ పొదిగె - విజ్ఞాన శాస్త్రాలు,
విశ్వ రాజ్య మింక - వెలయు గాత .

# బ్రదుకు

మార్పు - సృష్టి లోన - మనుజ సంఘము లోన,
సహజ సిద్ధ మైన - సంఘటనయె;
బ్రదుకు - మార్పులకును - శ్రుతి చేసు కొన్నచో;
ధరణి యందు -నరుడు - ధన్య జీవి. 1

ఆడు నట్టి వారి - క్రీడ యందున మార్చ,
ఆగ కుండ - ఆట-సాగ గలదు;
వేగ - ఆట లోని - విధి నిషేధములనే,
ప్రగతి కొరకు - మార్చ దగును - పూని. 2

రస గుళికలు - జాతి రత్నాలు - భాషలో;
యతులు గలిగి - ప్రాస గతులు గలిగి,
సామెత లను పేర - జనుల నాల్కల క్రాలు;
అనుభవమ్ము - వాటి ప్రాణ నాడి. 3

బహుళ కారణాల - ప్రతిభ వల్లనె గాక
వచ్చుచుండు ఘనత - బ్రదుకు నందు;
జయము - మిశ్ర ధాతు సమ్మేళనమె సుమ్ము,
మెదడు వాడు వాడు మిడిసి పడడు. 4

మిథ్య యగును బ్రదుకు - మెదడు మాత్రమె వాడ,
మంచి చెడుగు గూడ - మాయ మగును,
తల్లి - తండ్రి - ఇల్లు - తత్కాల సత్యముల్,
మనిషి వీడ లేడు - మమత లెల్ల. 5

బ్రదు కటన్న - మనిషి బహిరంగ వృత్తియా?
వెదుక వలయు - లో ప్రవృత్తి గూడ,
అమరి యుండ వచ్చు - ఆధ్యాత్మికమ్ముగా,
గోచరింప నట్టి - గొప్పతనము. 6

కలుగ వచ్చు కోరికలు కొన్ని - ముదిమిలో,
రక్త మాంస కలన బ్రదుకు నందు?
అయిన యెడల ఇంక అవి జగద్ధితములే,
కొంత సానుభూతి కూర్చ వచ్చు. 7

యంత్ర మగును మనిషి - ఆలోచనము పెంచ,
మనిషి చంప నేల ? మమత లెల్ల;
పెంచుకొనుట మేలు - ప్రేమ ఔదార్యముల్,
మంచితనము కొరకె - మంచితనము, 8

మనిషి కోరుకొనును - మమతాను బంధమ్ము;
ఆర్ద్ర మైన ప్రేమ - ఆదరణము;
బ్రదుకు - కేవలమ్ము - వాణిజ్య కేంద్రమా ?
కాదు - వర్తకమ్ము - కాదు కాదు. 9

హేళనమును సలుపు - హేతు వాదము నేడు
దైవ భక్తి - జపము తపము గిపము;
బ్రదుకు కాదు హేతు వాదమ్ము మాత్రమే,
కలియు మమత నమ్మకములు గూడ. 10

పిదప ఎవ్వ రనెడి పేరు నార్జించుటే
చాలు - బ్రదుకు నందు - చాలు చాలు,
తాడి తన్ను వాని -- తలఁ దన్ను వాడుండు,
గొప్పదనము - ఒకరి గుత్త కాదు. 11

కలిగి యుంద్రు - ప్రేమ - కన్న బిడ్డల మీద,
తల్లి తండ్రు లెల్ల - ధరణి మీద,
పిల్ల లెల్ల - అట్టి ప్రేమ - చూపరు గదా !
తల్లి తండ్రి పైన - దయ వహించి. 12

మేలు - ఒక వినోద కాల విక్షేపమ్ము;
ధనము కొరకు చేయు - పనియె గాక,
శక్తి నిచ్చు - గొప్ప సంతోష మొనగూర్చు,
బ్రతుకు తెరువు ప్రజకు శ్రమను తెచ్చు. 13

బ్రదుకు నందు - మంచి నిదుర పట్టుట కంటె,
లే దదృష్ట యోగ మేది లేదు;
అవసరమ్ము - నిదుర ప్రాణికోటుల కెల్ల
రైతుకైన - మేటి నేతకైన. 14

సంఘ జీవితమ్ము - సహకార సంక్రాంతి,
గోచరించు - ప్రాణి కోటు లందు;
మంద యగుచు - తిరుగు - మత్తేభములు గూడ ;
చీమ గుంపు గూర్చి - చెప్ప నేల ? 15

బ్రదుకు - గడుప వచ్చు - పలు సమస్యలు తీర్చి,
మసలితనము తరచు ముప్పు గూర్చు;
మరణ మనిన నేమి ? పరిణామ సరణమే !
మనిషి - పీడ దగును - మరణ చింత. 16

వేరు వేరు - భిన్న వైరుధ్యములు చేరి,
ఉండ వచ్చు మనిషి గుండె లోన;
హేతువాదమున కతీతమే - బ్రతు కన్న,
తెలియ నట్టి వెన్నొ కలిసి యుండు. 17

బ్రదుకు నందు - " నిజము " - త్రస రేణువే యైన,
తెలుసు కొనిన యెడల తెలుప వచ్చు;
గాను గెద్దు వోలె - కనుల గంతల తోడ,
తెలియ కుండ - చుట్టు- తిరుగ నేల ? 18

ఎవడు - పుట్టగానె - అవనిలో యోగియౌ ?
పుట్టు పాపి లేడు - పుడమి మీద,
జీవితముల - తీర్చు - స్థితిగతుల్ బ్రదుకులో,
భోగి - యోగి " బొమ్మ బొరుసు" లరయ. 19

నరుడు బ్రదుక లేడు - నైరాశ్య జగతిలో;
ఆశ - మానవులకు - ప్రాణ నాడి !
కలలు - మేలు - నిదుర కలవరింతలు మేలు;
మనిషి - అపజయాలు మరువ వలెను. 20

ఎట్లు వచ్చె సృష్టి ? ఎపుడు వచ్చెనొ గాని ?
అరయ నేల ? కాల హరణ మేల ?
బ్రదుక తగును - నరుడు - పరుల కెవ్వరి కైన,
చేయ కుండ హాని - చేసి మేలు. 21

బ్రదుకు లనిన - కాదు పదవి - సంపద కాదు,
చదువు కాదు - మేటి మెదడు కాదు;
చిత్త శుద్ధి తోడి - సేవయే ధన్యమ్ము;
పండి నట్టి గొప్ప గుండె - చాలు. 22

మార వచ్చు నెవడొ మగవాడు మహిళగా !
సంచరింపవచ్చు సంఘ మందు !
జరుగ వచ్చు - గొప్ప శస్త్ర వైద్యము గూడ !
బిడ్డ లామె కుద్భవించగలరె ? 23

తరచి చూడ "బ్రదుకు" - తర్క బద్ధము కాదు;
ఎడద - ముడులు - సుడుల పడుగు పేక,
న్యాయ ధర్మ నిరతి - సాపేక్షికము సుమ్ము
నిజము వేరు - నీతి నియతి వేరు. 24

ఒక్క మనుజు నందె - ఉండవచ్చును కూడి,
పరమ యోగి - మరియు పాపి కూడ,
యోగి యగును - మనిషి - ఉత్తేజితుం డైన,
పాపి - స్థితి గతులను బట్టి యగును. 25

విశ్వ మందు పొంద విద్యార్థిగ సుఖమ్ము,
పిదప కష్టపడును బ్రదుకు నందు !
చదువు కొనెడి వేళ - శ్రమియించు మనుజుండు,
పిదప సుఖము నందు బ్రదుకు నందు. 26

బాధ - కూర్చ వచ్చు - సాధనల్ శోధనల్ ;
గొప్ప దగును - మనిషి గుండెకాయ,
మేలి వజ్ర మగును - మేటి ఒత్తిడి వల్ల,
పుడమి కడుపు లోన - బొగ్గు తునక. 27

బ్రదుకు నందు - పెక్కు బంధాలు విలసిల్లు,
శ్రేష్ఠ మైన దందు - స్నేహ నిరతి;
నిండు గుండె పండు - నిర్వ్యాజ తత్త్వమ్ము
సానుభూతి - ప్రేమ - సంగమించు. 28

అందు కొనుట సులువు - ఆనంద యోగమ్ము
బాల బాలికలకు బ్రదుకు నందు;
కుత్సితమ్ము లేక - గొప్ప సంతృప్తితో;
ఆడ గలరు వారు పాడ గలరు. 29

ఊహ లెంత గొప్ప ఉత్సాహ మిచ్చునో;
కలల తెగడ రాదు - కల్ల లనుచు;
సుంత - ఇవ్వ లేవు - శాంతి సంతోషముల్,
పచ్చి నిజము లెల్ల - బ్రతుకు లోన. 30

మూర్ఖులకును విలువ - హెచ్చు ఇచ్చుట తప్పు,
ఘనుడు కాదు - పుస్తకాల పురుగు;
బ్రదుకు నందు - పడయు - బహుముఖ ప్రాజ్ఞుండు
జయము - జనుల హృదులు చదివి చదివి. 31

కొనుట - బ్రదుకులో తరచుగా!
పెనము నుండి పొయ్యి బడుటె!!
దుంగ వదిలి, పెద్ద - దూలమ్ము నెత్తుటే !
ఉన్న కష్ట మోర్చు కొన్న మేలు. 32

కష్టము లన నేమి ? కసరత్తులే గదా
బలము కూర్చు తుదకు బ్రదుకు నందు;
సౌఖ్యము లన నేమి ? క్షయ రోగ మార్గముల్
బ్రదుకు జీవనాడి - పౌరుషమ్ము. 33

అరయ - నరుని బ్రదుకు పరిధి పెద్దది సుమ్ము;
కళల కంటె - లలిత కళల కంటె !
విఙ్ఞ వీగు నట్టి - వివిధ విద్యల కంటె,
కీడు గూర్చు మతము గితము కంటె. 34

బ్రదుకు లోన సతము - భక్తి విశ్వాసముల్
శాంతి భద్రతలకు స్థావరములు,
జ్ఞాన యోగ మెపుడు - సంశయ గ్రస్తమే,
బ్రదుకు నెల్ల కదిపి కుదిపి వేయు. 35

ఉదయ మంది పెరుగు - ఉద్దీపనము లున్న,
నరుని గొప్పదనము ధరణి లోన;
మఱ్ఱి బీజ మైన - మట్టిలో నశియించు,
ఎరువు నీరు వేడి - దొరక నపుడు. 36

సత్య మెపుడు చచ్చు - సంగ్రామ రంగాన,
మొట్ట మొదట - మధ్య - తుట్ట తుదకు!
క్రూర ఘోర నీచ కుటిల చర్యలె గదా
రణము - అప్పుడపుడు బ్రదుకు గూడ. 37

గొప్ప వారలందు - కొన్ని లోపము లుండు
కుటిలు లందు మంచి గుణము లుండు !
వెరసి - బ్రదుకు - వింత వెలుగు నీడల కూర్పు;
పొగడ వద్దెవరిని తెగడ వద్దు. 38

వింత వెలుగు జిలుగు - విస్తరిల్లగ జేయు
బ్రదుకు - పెద్ద గాజు పట్టకమ్ము;
చదువు - కూర్ప దగును సర్వతోముఖ దీప్తి,
ప్రగతి శీల మైన - పాఠశాల. 39

నలుప నేల ? - తీవ్ర శపథాలు బ్రదుకులో ??
స్వీయ హింస - ఆత్మ శిక్ష వద్దు;
హితము గూర్చు నట్టి - వ్రత భంగమే మేలు;
బ్రదుకు కవసరమ్ము - పట్టు విడుపు. 40

కష్ట సుఖము లెల్ల - కాలాను గుణములే,
మానసికములు గద - మనుజు లందు;
తెలివి తేట లున్న - దిట్టయే మనసన్న,
పొంద వచ్చు - ముక్తి - బొందె తోడ. 41

ఎప్పుడైన - తన అభీష్టానుసారమే;
నరుడు జీవితమ్ము నడుప గలడె ?
వేత్త - అనుభవించు - విధి వైపరీత్యముల్;
నీతి గలిగి - తత్త్వ నిష్ఠ గలిగి. 42

ప్రాచ్య దిశను పొడిచి - రవి - క్రుంకెడి ప్రతీచి,
తిరుగు నట్టి దెసలు - ధరణి సుమ్ము;
నిత్య మగును వమ్ము - ప్రత్యక్ష సాక్ష్యమ్ము;
బ్రదుకు చుట్టు ముట్టు - భ్రమలు పెక్కు. 43

గడచు - ఎట్టి రాత్రి గాని - జీవితములో!
ప్రొద్దు పొడుచు - గడచి పోవు పవలు;
ఇంద్ర ధనువు విరియ హృదిలోన మనుజుండు,
పట్టకమ్ము వోలె - బ్రదుక వచ్చు. 43

ధరణి - మనిషి బ్రతుకు - తర్క బద్ధము గాదు;
ప్రేమ అనిన గొప్ప పిచ్చి గుబులు,
నిక్క మైన - మైత్రి - నిర్హేతుకము గదా!
ద్వేష మర్ధ రహిత విభ్రమమ్ము. 44

విన్నది కన్నది అంతయు
తిన్నది అంతయు మనుజుల దేహమ్ములలో;
పన్నుగ మనసుల నత్యా
సన్నము చేయుచు బ్రతుకుల శైలులు కూర్చున్. 45

బ్రతుకు - వెలుగు నీడ పడుగు పేకల నేత,
నవ రస రుచిర మగు నాట్య కేళి;
మెదడు మెలితి పెట్టు - చదరంగ రంగేళి!
పూవు తేనె గాదు - తావి కాదు. 46

మనిషి - నెమరు వేసుకొను ఆట పాటలే
బాట బత్తె మగును బ్రతుకు లందు
ధనము పదవి - కొరవి దయ్యాల వేటలే!
జగతి యందు - మనిషి సంఘ జీవి. 47

మనిషి - గోళ్ళు గిల్లుకొనుచు కూర్చున్నచో!
బ్రదుకు నందు తుప్పు పట్ట వచ్చు;
మనుజ సంఘ మందు - పని చేయు వారికే
ఆయు రభ్యుదయము లమర గలవు. 48

కాదు జీవితమ్ము - గణిత శాస్త్రము కాదు,
కలియ - ఒకటి రెండు కాదు - మూడు;
ఉండు - పట్ట పగలు - ఎండ మావులు కొన్ని;
రాత్రి - తమ్మి మొగ్గరాలు కొన్ని. 49

బ్రదుకు అనిన పెక్కు - ప్రశ్నార్థకమ్ములే !
అడ్డు గీత లుండు అచ్చ టచట;
పెట్ట గలదె - వేత్త - విశ్రాంత బిందువుల్,
వ్రాయ కుండ వేరు వాక్యములను. 50

కార్య కారణములు - కాల దోషము పట్ట,
విడిచి ఉన్న చోటు వెడల వచ్చు;
క్రొత్త గమ్య మేది - గోచరింపదు గాని,
ప్రగతి కొరకు - మార్చ దగును - మనసు. 51

మనిషి బ్రదుకు - గొప్ప మల్ల యుద్ధమె గాని,
వేదిక పయి నాట్య విద్య కాదు;
శక్తి యుండ వలయు - యుక్తితో పాటుగా,
క్రింద మీద పడెడి క్రీడ - బ్రదుకు. 52

బ్రదుకు లోని గొప్ప ప్రతిభా ప్రభాసచే,
కామితార్థ సిద్ధి కలుగ బోదు;
యత్నములు ఫలించు - అవకాశములు గల్గ;
నేర్పు కంటె - మేటి ఓర్పు మేలు. 53

ఆశ లైన గాని - ఆశయమ్ములు గాని,
పాడు చేయు - హృదిని బాగు చేయు,
మనసు లోన - ఎపుడు మంచి భావము లున్న
బ్రదుకు తప్పకుండ బాగు పడును. 54

మనిషి - పూని - సర్వ మమకారముల, వీడి
మలచు కొనిన శూన్య మానసమ్ము;
బ్రదుక గల్గు నెడల వర్తమానము నందె,
బొందె తోడ - ముక్తి - పొంది నట్లె. 55

వేడి కంటి నీరు - విజ్ఞాని కార్చునా ?
పరుల దుఃఖమునకు కరగి కాని ??
వీర మరణ మైన - విజయ మైనను గాని
నిలిచి - బ్రదుకు పోరు సలుప వలెను. 56

ఉండ వచ్చు మెదడు - ఉండ వచ్చును ఆస్తి
చదువు గలిగి - మేటి పదవి గలిగి;
ప్రతిభ లెన్ని యున్న - బ్రదుకు ధన్యము గాదు
ఉండ వలెను జాలి గుండె - కూడ 57

అవతరింప వచ్చు - అవగాహనము వల్ల;
సహన శీలము - సువిశాల దృష్టి,
వ్యర్థ మగును జ్ఞాన మవగాహనము లేక,
బ్రదుకు సంకుల రణ రంగ మగును. 58

బ్రదుకు లోన - దేని పట్టించుకో నేల ?
ఉదయ మందు - రవి - ప్రతి దిన మందు ;
అస్తమించు సూర్యు డనుదినంబును గూడ,
మనిషి - బ్రదుక దగును మమత విడిచి. 59

అనుభవించు నట్టి - ఆనంద మే రీతి
ఎంచి చూడ వేగ పెంచ వచ్చు ?
పరుల తోడ గూడి - పంచుకో గల్గుచో !
సంతసమ్ము జగతి సార్థకమ్ము. 60

ఆశ లనవసరము ఆశయాలును వద్దు,
బ్రదుకు దేని కొరకు ? బ్రదుకు కొరకె;
సగటు సంతసమ్ము చాలు జీవితములో;
బ్రదుకు లోన - హాస్య రసము చాలు. 61

తెగడ కుండ - పరుల - తిండి జీర్ణము గాదు;
కలరు దుర్విమర్శ నలుపు వారు;
తెలియ లేము పరుల స్థితిగతుల్ బ్రతుకులో;
సజ్జనుండు చూపు సానుభూతి. 62

సత్య మరయ లేము - శాతాలు వల్లించి,
సాంఖ్య పరిగణనము సలిపి సలిపి;
కాన రాని లొసుగు - లోన ఎచ్చటొ ఉండు;
బ్రతుకు వేరు - గణిత గతులు వేరు. 63

జీవితమ్ము నందు - భావనా విహగమే
గగన సీమ కెగురు గాలి పటము;
దిగక తప్ప దెపుడొ - దివి నుండి భువి పైకి;
నరుడు బ్రదుక వలయు ధరణి మీద. 64

చూడ - అర్థ రాత్రి - సూర్యోదయము తోచు
దూర సీమ లందు - ధ్రువముల కడ !
గడప గలరు ప్రజలు - గడియారముల బట్టి
తెలివి గలిగి - బ్రదుకు - దిన దినమ్ము. 65

బలము కూర్చ గలవు - బ్రతుకులో కష్టాలు,
ఆటు పోటు నరుని రాటు దేల్చు,
అనుభవజ్ఞు డగును - ఆరోగ్యశాలియై,
విజయు డగును నరుడు విశ్వ మందు. 66

సామ్య వాద మందు - సాంఘిక శ్రేయస్సు
చూడ బడును " వ్యక్తి " - వీడ బడును;
బ్రదుక లేడు - నరుడు - వ్యక్తిత్వమును వీడి,
వ్యష్టి లేక - ఏ సమష్టి లేదు. 67

అణువు లోన దాగు - అత్యద్భుతము - శక్తి
చీదరింప రాదు - చిన్న దనుచు,
బ్రతుకు విలువ లందు - బాహ్య రూపము గాక,
అంతరాత్మ లోని దరయ వలెను. 68

సంఘ సేవ - కవిత - సంగీత - నృత్యముల్
పిండి వంట లందు ప్రీతి లేక,
వృత్తి కంటె - వేరు వేడంబరము లేక,
బ్రదుకు నందు సుఖము పడయ రాదు. 69

వెలుగు రవలు చిలుకు - విస్ఫులింగము వోలె,
క్షణము నరుని బ్రదుకు చాలు - మేలు!
ఎడద లేక -చిరము - పుడమిపై పడియుండు
బండ రాయి వోలె - బ్రదుక నేల ? 70

“ జగతి యెల్ల మిథ్య - స్వప్న సంకాశమ్ము;
పుడమి నరుని బ్రతుకు బుద్బుదమ్ము”
సర్దుకొనుట మేలు - సంఘర్షణలు తప్పు;
చిలిపి వ్యాఖ్య లెపుడు చేయ రాదు. 71

లోకములో ప్రతి మనుజుడు
ఏకత భిన్నతలు సంగమించిన జీవద్
వ్యాకరణము మానసమున
ఆకార ప్రకృతి వికృతు లందున - సుమతీ ! 72

విడువ రాని - కొన్ని విలువ లుండును గదా ;
హృదయ మున్న మనుజు బ్రదుకు నందు;
తల్లి తండ్రి గురు కృతజ్ఞతల్ లేకున్న
అతడు - పశువు కన్న అధము డగును. 73

జగతి హితము గోరు సద్భావముల తోడ
బ్రతుకు గొప్ప దైన క్రతువె అగును;
గుండె శ్రుతిని గల్గి - గొప్ప ఉద్యమముతో
నరుడు బ్రదుకు గాత - చరిత దిద్ది. 74

చెత్త  లోన - పెక్కు చింత పిక్కలు చేరి,
పుచ్చి చచ్చి పోవు  పుడమి లోన;
పెరిగి ఒకటి రెండు - పెద్ద వృక్షము లౌను,
బ్రతుకులో అదృష్ట గతులు వేరు. 75

కలుగు జయము - పురుష  కారమ్ముతో పాటు,
దైవ శక్తి కలియ జీవితమున;
మేటి ఆటగాని  మెదడుతో పాటుగా,
చేత మంచి చీట్లు చేర వలెను. 76

చిట్టి యెలుక చేరి - చేయవచ్చును మేలు,
జీవితమ్ము నందు - సింహమునకు;
బ్రదుకు నందు   జరుగు - ప్రత్యక్ష సత్యాలు
కొట్టి వేయ  రాదు పిట్ట కథలు. 77

అంతిమ విజయమ్ము - న్యాయ పక్షమునకే;
ప్రజకు న్యాయ పక్ష పాత ముందు;
అంతరాత్మ లోన - అన్యాయ విజయమ్ము;
నుంత కూర్చ లేదు - సంతసమ్ము 78

బ్రదుకు పెక్కు వింత  వైరుధ్యముల పుట్ట,
ముళ్ళ పొదలు పూలు రాళ్ళ గుట్ట;
వెన్నెల తమములకు - వియ్యాల ఉయ్యాల!
ఆరు  ఋతువులకును - ఆట విడుపు. 79

దేహ మాత్రు డగుచు ధ్యేయ మేమియు లేక;
నరుడు బ్రదుక లేడు ధరణి మీద;
స్వార్థ రహిత మైన - వ్యావృత్తి యున్నచో
ముసలి వాని బ్రదుకు ముచ్చటగును. 80

సూత్రములను కూర్చి చూపించు శాస్త్రమ్ము
పోహళించి పలు ఉదాహరణలు;
అనుభవమ్ము - తెల్పు - అపవాదముల నెన్ని!
బ్రదుకు దీర్ప - వ్రాయు వార్తికములు. 81

బండ బారు చుండు - బ్రదుకులో తరచుగా
గొప్ప వాని లోని గుండెకాయ,
అతడు నిదుర వీడి - ఆప్త మిత్రుని కైన;
సేవ - జీవితమున చేయ లేడు. 82

ఉండ వచ్చు - ఉన్న తోజ్వల ప్రతిభాంశ,
ధనము పదవి యెట్లు తారసిల్లు ?
బ్రదుకు తీర్చు కొనును - ప్రాజ్ఞుండు సర్వథా,
నేల మీది వాస్తవాలు - తెలిసి. 83

బ్రదుకు - అనిన - కాదు - రాజీ పడని పోరు;
వీర మరణ మందు వెఱ్ఱి వాడు!
నేల పొరల దాగు నిజము లెన్నెడి వాడు;
సూక్ష్మదర్శి - కార్య శూరు డగును. 84

# స్నేహం

జీవితమ్ము నందు - స్నేహ యోగము కంటె,
లేదు - తీయ దైన దేది లేదు;
పుచ్చు కొనెడి వేళ - ఇచ్చి నప్పుడు గూడ,
చెలిమి కూర్చ గలదు - చిత్త తృప్తి. 1

స్నేహము నిలుపదగు - జీవితాంతము మేర,
కలదు - గొప్ప తీపి - చెలిమి లోన ,
కలిమి బలిమి కంటె - కన్న బిడ్డల కంటె,
చెలిమి - తృప్తి కలుగ జేయ గలదు. 2

స్వర్గ మైన - మిత్ర వరుడు లేకున్నచో,
నరక లోక సమము-నరుల కగును;
ఒక అజాత మిత్రు డుర్విపై నున్నచో !
అంత కంటె - ఎవడు వ్యర్థ జీవి ? 3

తియ్య తియ్య నైన - నెయ్య మెచ్చట నిల్చు?
నవ్య నాగరికత - నాట్య మాడు;
పరిచయాలు పెరుగు వ్యాపార సరళిలో,
త్యాగ యోగమునకు - తావు లేదు. 4

దుఃఖితులను డాసి - తోడు నీడగ నిల్చు,
మానవత్వ మున్న మంచి మనిషి;
మాటలాడి గాని - మౌనమ్ముతో గాని
కూర్చు ఊరడింపు కొంత కొంత. 5

స్నేహితునకు - మేలు చేయు కోరిక యున్న,
చేపకూడు విందు - చేయ వద్దు;
జలము లందు - మత్స్యములను పట్టుట - నేర్పి
వలను - దాన మివ్వ వలెను పూని. 6

స్థూల కారణములు - చూప వచ్చును కొన్ని,
స్నేహ బంధమునకు - ఐహికములు;
నిక్క మైన చెలిమి - నిర్హేతుకము గదా!
వింగడింప రాని వింత ప్రేమ. 7

ఇహ లోకములో నరులకు
సహజములే - భిన్న భావ సంస్కారమ్ముల్,
సహ జీవన వేదాంతము,
సహృదయత గలిగి బ్రదుకును సజ్జను డెపుడున్.

కానుపించు - మైత్రి - కర చాలనము నందు,
కనుల లోన ప్రేమ - కాన నౌను,
పలుకు లందు - తోచు - ప్రతిభా విశేషముల్;
నాట్య మాడు - ఎడద నడక యందు. 9

మనిషి కేది ముసలి తనము వచ్చిన గుర్తు ?
తెల్ల జుట్టు - ఊడు పళ్ళు కాదు,
క్రొత్త స్నేహితులను - కూర్చుకో లేనిచో ,
పడుచు వాడు ముసలివాడె అగును. 10

నెయ్య మొకటె గూర్చు - నెత్తావి బ్రదుకులో,
ఉభయ తారకమయి - ఉజ్జ్వల మయి;
జగతి అరయగా రసస్థాయికి తెచ్చు,
మనుజ జీవితమున మైత్రి - తరచు. 11

స్త్రీ పురుషుల మధ్య - శృంగార మొక్కటే,
సహజ బంధ మనుట సబబు కాదు,
స్త్రీ పురుషులు చేరి - స్నేహభావము తోడ,
సహకరించవచ్చు - సంఘ మందు. 12

జగతి - ఎచట నైన - సమ ధర్ము డున్నచో
ఆత్మ బంధు వగును - అతడె మనకు;
ఉండ వచ్చు - మధ్య - కొండ కోనలు నదుల్ !
మతము జాతి భాష మాసి పోవు. 13

సలుప రాదు - మైత్రి - క్షమ చూప లేనిచో,
ఉభయు లందు తప్పు లుండ వచ్చు;
త్యాగ బుద్ధి లేక - వ్యాపార దృష్టితో,
చెలిమి - ఎవరి తోడ చేయ రాదు. 14

నిండి యుండు - జగతి- ఖండ సత్యాలతో;
పూర్ణ సత్య మేది - పుడమి లేదు;
సంస్కృతి యన నేమి ? సహజీవనమె సుమ్ము
శాంతి మీద ప్రేమ - సహన మైత్రి. 15

ఒక్క కోవ పక్షు లొక చోట, గుమి గూడు,
సహృదయులకు కుదురు సౌహృదమ్ము;
వింత యౌను గాక - భిన్న ధ్రువాలలో
గాఢ సంగమమ్ము కానుపించు. 16

మైత్రి గాని - మరియు - శత్రుత్వమే గాని
చెడ్డ వానితోడ చేయ రాదు,
శాత్రవమ్ము హాని - మైత్రి మంచిది గాదు,
రమ్య హాసలోల - రామ కృష్ణ! 17

సంఘ జీవితమున - సరిక్రొత్త మిత్రుండు
తోటి బాటసారి - దొరుక వచ్చు;
ఆ క్షణమ్ము - అద్భుతానంద మధురిమల్
కూర్చ గలదు - రెండు గుండె లందు. 18

హేతు వాదమున కతీతమౌ స్నేహమ్ము,
మమత లుండ వచ్చు - మనుజు లందు;
పృథివి- కానుపించు భిన్న ధ్రువాలలో;
గాఢ మైన పొత్తు - కలయికయును. 19

తన మొగమ్ము - చూచు కొనలేడు మనుజుండు,
అట్లె - స్వీయ శీల మరయ లేడు
మంచి అద్ద మొకటి - మంచి మిత్రు డొకండు
అవసరమ్ము మనుజు లందరకును. 20

చేర వచ్చు దరికి - శిష్య మిత్రులు సదా,
పాడు చేయ గలరు ప్రస్తుతించి;
స్వచ్ఛ హృదయు డైన - అభాస శత్రువే;
మిత్ర తముని కంటె - మేలు మేలు. 21

నిన్ను తెగడు వాడు - నీ శత్రువే యైన
శక్తి యున్న యెడల చంపు మతని !
స్నేహితుండె తెగడ - నీ మేలు కాంక్షించి !
మ్రొక్కు మతని పాదములకు నీవు. 22

వదలు గాత - మనిషి పరుష వాక్కులు సదా,
వీడ వలెను - రూక్ష వీక్షణములు,
జ్ఞాన దీప్తి కంటె - శాంత చిత్తము మేలు,
శ్రేష్ఠ తమము - సహన జీవితమ్ము. 23

స్నేహమును రస స్థాయికి
సాహిత్యమునన్ బ్రతుకున సంధించితి - ఈ
నా హృదయమును తెరచి అ.
భ్యాహూతులకున్ పలికెద స్వాగతము సదా. 24

నీవు మిత్ర పాత్ర - నిర్వహించిన గాని,
ఎట్లు దొరకు మిత్రు డెవడు నీకు ?
చూప వలెను - ప్రేమ కోపించకుండగా,
తప్పు చేయు వాని దరికి తీసి. 25

ధర్మ బాంధవమ్ము- ధర మీద ఇక చెల్లు,
కార్మికునకు హితుడు - కార్మికుండె !
సహృదయుండు సుమ్ము - స్వచ్ఛమౌ మిత్రుండు;
ఈ ప్రపంచ మందు ఎచట నున్న. 26

కలిసి మెలిసి - చాల కాల ముంటిమి గదా !
మనము విడుట మేలు - మైత్రి తోడ,
వద్దు రగడ - వద్దు - వాదోపవాదముల్!
బ్రదుక వచ్చు ఎవరి బ్రదుకు, వారు. 27

అన్న మిడిన మనిషిపై పగ బూని
మొరగ దెపుడు కుక్క కరవ దెపుడు;
మనిషి - మరచి పోయి - తనకు చేసిన మేలు,
స్నేహితునకు కీడు చేయ వచ్చు. 28

## పర పరాగ సమ్మేళనం

ఒక్క భాష గాక - ఒక ప్రదేశము గాక,
మనుజ మాత్రు డొక్క మతమె గాక,
జగతి - పర పరాగ సమ్మేళనముతో,
బహుళ పరిచయములు పడయు గాత. 1

విశ్వ మందు కలవు - వింత పుష్పము లెన్నొ!
తేనె టీగ యగుత - మానవుండు !
సాంస్కృతిక పరాగ సమ్మేళనము వల్ల,
ప్రగతి వచ్చు - నూత్న జగతి వచ్చు. 2

# దానం

ధనము నెవ్వ డైన - తన జేబులో నుండి,
ప్రతిభ గుర్తు పట్టి - పరుని కివ్వ,
అతడె ధర్మమూర్తి - అతడే మహాయోగి,
అరయ మనుజ మాత్రు డతడు - కాడు. 1

పెరుగు నరుని ప్రతిభ -పరిణామ సృష్టిలో,
వేగ తరము చేయు విధము గలదు;
గొప్పదనము వెదకి గుర్తు పట్టెడి - దాత,
పుడమి విరియు ప్రగతి ప్రోత్సహించు. 2

దయకు తోడు - తరచు - దాన మిచ్చుట యందు,
కారణాంతరములు - కలియ వచ్చు;
గుండె లోన - కోరుకొని - పరోపకృతినే,
దాన మిచ్చు వాడు - ధన్యజీవి. 3

త్యాగి కంటె - ఘనుడు - ధరణి లోపల లేడు;
చదువు పదవి త్యాగ సమము గావు;
జగతి - ధైర్య శౌర్య సాహసమ్ములు గల్గి,
ప్రగతిశీలి - దాత - యగును తుదకు. 4

వ్యయము చేయ నేర డార్జించ గలవాడు;
వట్టి వ్యయము చేయు వ్యర్థ జీవి;
గొప్ప లలిత కళయె - కూడ బెట్టుట - డబ్బు;
ధర్మ యజ్ఞమునకు దాన మాత్మ 5

మెచ్చి యిచ్చి నపుడు - మేధావి - సంస్కారి,
విలువ దానమునకు పెరుగ గలదు;
కవికి - విలువ పెరిగె - గండ పెండేరమ్ము
కృష్ణ దేవ రాయ లిచ్చి నపుడు. 6

జగతి - కవిత గొప్ప సంస్కారమా ? కాదు!
చదువు కాదు - మేటి పదవి కాదు;
గుండె పండి నట్టి - గుర్తు లందున ఎన్న,
దాన గుణము మిన్న - ధరణి లోన, 7

ఏది బ్రదుకు లోన ఎత్తైన శిఖరమ్ము?
త్యాగ బుద్ధి తోడి దాన నిరతి;
ఘోర పతన మేది ? ధారుణీ స్థలిలోన
పర హితమ్ము మరచు స్వార్థ బుద్ధి. 8

తెలివి యేల ? దేహ బలము సంపద లేల ?
చదువు లేల? పెద్ద పదవు లేల ?
దాన గుణము చాలు - దయ చాలు - క్షమ చాలు,
బొందె తోడ " ముక్తి " పొంద వచ్చు. 9

మనిషి - మంచితనము మధ్య - స్వార్థము మధ్య,
ఊయల వలె తరచు ఊగు లాడు,
మనిషి బ్రదుకు నందు - మహిమోన్నత మ్మేది ?
త్యాగ పూరిత మగు - దాన గుణము. 10

వినయము విద్యయు కలిసిన
మనుజుని హృదయమున -దివ్య మాధురి విరియున్;
ధనమును - దానము కలిసిన
కనకము సౌరభము గొలుప గలిగిన యటులే. 11

ప్రోగు చేయ - ఏండ్లు పూండ్లు పట్టు గాని,
ధనము వ్యయము చేయ - క్షణము చాలు;
కూర్చి ధనము - దాత - కుడి చేతితో నిచ్చు,
ఎడమ చేయి గూడ ఎరుగ కుండ. 12

బ్రతుకుట యన - తన పొట్టను
సతతము నింపుటయె కాదు - జగతీస్థలిపై;
ఇతరులకై తన ధనమును
వితరణ, సలుపుట అతి ఘన విజయము సుమ్మీ! 13

గొప్పదనము త్యాగ గుణము లేకున్నచో
దాత - కాడు ఎంత ధనికు డైన !
గడ్డి వాము చెంత - కాపలా కుక్కలే,
తరచు - ధనిక వరులు - ధరణి యందు. 14

ప్రవచనాలు - నీతి పాఠాలు వద్దురా,
వద్దు దేవళాలు వద్దు వద్దు,
గుప్త దాన గుణము - గుండె లోపల చాలు,
పరుల మేలు చాలు - పరము వద్దు. 15

బ్రదికి యున్న కవికి - బహుమాన దానమ్ము
సలుపు వాడు - రసిక చక్రవర్తి;
దివికి అరిగి నట్టి కవికి ఇచ్చెడు వాడు,
అమృత హృదయు డైన త్యాగ యోగి. 16

కలియ దాన గుణము - కలిమితో పాటుగా;
బలము తోడ కరుణ కలిసి నపుడు;
పెద్ద పదవి తోడ - వినయమ్ము ; కలియగా
ప్రగతి వచ్చు ప్రజల బ్రదుకు లందు. 17

పాత్ర దాన మనిన - ప్రతిభా విశేషమే
గాని బీదరికము కాదు చూడ;
ప్రతిభ నెన్ను కొనిన - బహుమానమే యౌను.
ప్రగతికి కూర్చు వెలుగు బాట యగును. 18

కవిత యందు లేని - గాన మాధుర్యమ్ము
జ్ఞాన మందు లేని - సౌహృదమ్ము
విద్య యందు లేని - వినయ విన్యాసమ్ము;
కానుపించు - గుప్త దాన మందు. 19

ధర్మ మనిన యెడల - దానమే - జగతిలో,
సగటు మనిషి భావ సరళి యందు;
అంత కంటె - మంచి అర్థమ్ము తట్టునా ?
విశ్వ నిగమ సార వేత్త కైన ? 20

ధర్మ మేది లేదు - దాన శీలము కంటె;
నకల సృష్టి - మిన్న - జాలి గుండె;
పరమ ధర్మ మేది ? పాత్ర దానము కంటె?
అమృత యోగ సిద్ధి - త్యాగ మిచ్చు. 21

పుచ్చు కొనుట కంటె - ఇచ్చు టెప్పుడు మేలు;
ఈవి యందు - పూల తావి గలదు;
త్యాగ గుణము - పాత్రతను గుర్తు పట్టుచో,
మానవతకు - ప్రగతి మకుట మమరు. 22

దాన మందు చూడ దగిన అంశము లేవి ?
మంచి నెంచి ప్రోత్సహించు మనసు;
ఇవ్వ వలెను దాన మిప్పించి ప్రజలచే
సేవ చేసి మరచి పోవ వలెను. 23

జగతి లోన - ధనము - సర్వ పర్యాయమ్ము
నడవు - ధనము నవ్య నాగరికత;
గొప్పవాడు - ధనము కూడ బెట్టెడు వాడు !
త్యాగ యోగి -దాత - దైవ సముడు. 24

వల్లె వేయ వచ్చు - బ్రహ్మ రాక్షసు డైన,
బహు పురాణ నీతి పాఠములను,
పరుల లోని ప్రజ్ఞ - పాత్రతల్ గుర్తించి,
ధనము నిచ్చు దాత - ధన్య జీవి. 25

లాభ నష్టములను లక్ష్యమ్ము చేయునా ?
ధనము లెక్క పెట్టు కొనడు - దాత;
మంచి నెంచి - ప్రోత్సహించు దానము చేసి,
ధనము బ్యాంకు లందు దాచు కొనడు. 26

విశ్వ మందు - ఎవరు ? విద్యాధికుడు చూడ?
విద్య వరలు వేయి విధము లగుచు,
బ్రదుక గలిగి తాను - పదిమంది బ్రదికించి,
ధనము నిచ్చు దాత - ధన్యజీవి. 28

మెదడు చదువు పదవి మేటి సంపద లేల ?
కరగు జాలి గుండెకాయ లేక ?
జ్ఞాన మున్న నేమి? దానమ్ము లేనిచో !
ధర్మమునకు ఆత్మ - త్యాగ గుణము. 29

ధరణి మీద ఏల నరుడు జన్మించెనో ?
తెలియ రాదు - చర్చ - తేల దెపుడు;
బ్రదుకు లోన పూని - ప్రక్కవారికి మేలు
చేత నైన వరకు - చేయ దగును. 30

దాన గుణము కంటె - ధరణి లోపల లేదు
గుండె పండి నట్టి గొప్ప గుర్తు;
దాత - దిద్దు చుండు - ధాత చేసెడి తప్పు!
తగిన వాని నెరిగి ధనము నిచ్చు. 31

## హాస్యం

కవిగ తిరిగె - ఉండి కడుపుతో ఆతండు
పడెను -పెక్కు సార్లు - ప్రసవ బాధ;
వేది నెక్కు చుండు వేవిళ్ల బాధతో
గిట్టె - పురుటి యందె - కృతి చయమ్ము. 1

నాకు, లోక మరయ - నవ్వు వచ్చును గాని,
కోప తాప మెపుడు గుబులు కొనదు;
ఏడ్వ దగిన దేది ఎంత మాత్రము లేదు;
జ్ఞాని - తామర పయి - వాన చినుకు. 2

నవ్వు పువ్వు టమ్మ - నాయక ప్రవరుండు
ప్రక్క వారిపైన బరపు గాత,
ఉండు గాత - నేత - ఉత్సాహ హృది తోడ,
మూడు - మొగము తోడ - మనల రాదు. 3

బ్రదుకు లోన - రాదు - ప్రథమ స్థానమ్ము;
అతని కట్టి మేటి ప్రతిభ లేదు;
రెండవ వరుస అత డుండ నేరడు గదా!
అతని కిక తృతీయ గతియె మిగులు. 4

ఏను నవ్వు కొందు - ఈ ప్రపంచము చూచి,
నవ్వ గలను నేను - నన్ను జూచి,
లోక మందు - హాస్య - మేకైక రసమౌత!
నరుని జన్మ హక్కు - నవ్వు - సుమ్ము. 5

హాస్య భోజనుండు - ఆనంద యోగియే
బొందె తోడ - ముక్తి పొంద గలడు;
మరణ శయ్య మీద - పరిహాస రసికుండు
వదలు - నవ్వు కొనుచు ప్రాణములను. 6

పుడమి మీద - తిరుగు - గడియార మేదైన,
సవ్య మైన టైము - చాట లేదు;
తిరుగ కున్న యెడల - సరియైన కాలమ్ము
చాట గలదు - రెండు సార్లు - రోజు . 7

ఊరిలో మసీదు చేరి ప్రార్థన సల్పి,
మారె పీరుగా ఫకీరు చచ్చి;
పిడికె డతని జీరి - బిచ్చ మేయని ప్రజల్ ;
పేర్మి కట్టినారు పెను సమాధి. 8

అతని రూపు - బొడ్డు కడుగు భాగము నందు,
గాడిద వలె తోచు - కాళ్ళు సాచ,
చూడ - బొడ్డు పైన -సూక్ష్మ దృష్టిని నిల్పి,
గోచరించు నతడు కోతి వోలె. 9

దూక లేదు కోతి - తోక తూకము లేక,
కెదలి కొమ్మ లందు - గెంత లేదు;
పండితునకు శాలువా - అట్లె - భుజముపై
కవికి కరము లోని కలము - నట్లె. 10

అరయ - ధరణి మీద - పరిహాస రసికుడే !
దార్శనికుడు - పరమ ధర్మ వేత్త;
విశ్వసింప రాదు -వేదాంత ధోరణుల్;
ఆచరణము నందు అనువు గావు . 11

అచ్చు చూడ - మిగుల ముచ్చటై ఒప్పారు!
బాగు - భేషు - భేషు కాగితాలు!
అంద చందములకు ఆలవాలము - అట్ట;
నేను చదువ లేదు - లోని రచన. 12

ప్రాతిపదిక కాదు - వ్యవహారముల యందు;
ఆత దొక విభక్తి అనగ జెల్లు;
జనుల చేరు చుండు - సమయానుగుణముగా!
నున్న - అతని యందు సొంత తెలివి. 13

మచ్చరము విడి - పరు గుణము
మెచ్చెడి సహృదయుడు మేటి మేధావిని- ఏ
అచ్చుల తప్పులు దొరలక
ముచ్చట గూర్చెడి కృతి - జగమున కన నౌనా ? 14

అరసి తరచి చూడ - ఆనందమే బ్రహ్మ !
ఈ ప్రపంచ మందు ఎచట నైన;
జనుల కెల్ల ఎవరు - సంతోషమును గూర్చు ?
అతడె గొప్ప ఈశ్వరార్చకుండు. 15

అందు కొనును - మూఢు డానంద గగనమ్ము,
మసలు ధరణి నెల్ల మరచి పోయి;
జ్ఞాని - మసల వలయు - జంకు గొంకుల తోడ,
వసుధ మీద - వాస్తవాల మధ్య. 16

పెరిగి పోయి - ధరలు - ప్రియ మయ్యె వస్తువుల్;
ఎట్టి చెత్త కైన హెచ్చె విలువ;
సర్వ విపణు లందు - చవుక యైనది ఏది ?
రూక తప్ప - లేదు లోక మందు . 17

అరయ నా సెలవుల యందు ఆనంద మే
క్షణము నందు నాకు కలుగ లేదు !
నేను - పొందినాడ - ఆనంద సంతృప్తి;
పై అధిపతి సెలవు పైన వెడల. 18

అప్పు డపుడు - మనిషి ఔదార్యవంతుడే !
చెడ్డ తలపు లేక - చిత్త మందు,
దొడ్డ పుస్తకమ్ము దొంగిలింపగ వచ్చు,
ప్రీతి తోడ - నీతి గీతి మరచి. 19

నరుడు - కాని యెడల - పరిహాస రసికుండు;
బ్రదుక లేడు - ఈ ప్రపంచ మందు,
ప్రక్కవాడు - ఆట పట్టింప దలపోయు,
వెఱ్ఱి వాడు గూడ వెక్కిరించు. 20

అమెరికాకు చేరె అతడు! రష్యా నుండి
హాస్య మయ్యె అతని ఆంగ్ల భాష,
పిదప - రషియ భాష - పీఠాధిపతి యయ్యె!
స్థిర నివాసి పౌర వరు డతండు. 21

కలియుగమ్ము నందు - కవితా జగత్తులో,
కొంత అవసరమ్ము - కోక డాబు;
సాన బట్టి నట్టి - జాతి రత్నము కంటె
కాంతి నిచ్చు - రంగు గాజు ముక్క.. 22

జఘన మంటు - వాలు జడ - సన్న నడుముతో
వనిత కానుపించు వెనుక నుంచి,
శిల్ప సౌష్ఠవమ్ము చెలగు విగ్రహముగా!
ముందు చూడ; కొండ ముచ్చు మొగము. 23

లేదు - వెదకి చూడ - లేదు - విప్రతిపత్తి,
సత్యమునకు హాస్య చతురతకును,
అమరు సత్య మందు - హాస్య విన్యాసమ్ము,
చిందు లాడు హాస్య మందు - నిజము. 24

జ్ఞాన చిహ్న మేది ? ఆనంద హాస్యమే!
నుడులు కావు - బొమల ముడులు గావు,
వాద ఘోష గాదు - వేదాంత తృష గాదు,
పెదవి విరియు గాత - పిన్న నవ్వు. 25

ఎవరు మెచ్చు కొందు రే ప్రసంగము గాని
శీర్షిక విడకుండ చెప్పి నపుడు,
అమిత రక్తి కట్టు అధిక ప్రసంగమ్ము;
రంగరించి హాస్య రసము తోడ. 26

అక్కడ సభ కధ్యక్షుడు
కుక్క మహాశయు డొకండు, కూర్చొనె వేదిన,
పెక్కురు పశువులు శ్రోతలు;
నక్కలు వక్త - లమర ఋషి - నాట్యము చేసెన్.

చీకటి గది లోన - ఏకాంత దీక్షతో
వేచి - లేని నల్ల పిల్లి కొరకు!
వెదకు విశ్రుతుండు వేదాంతి యన జెల్లు;
హాస్య రసిక వాఙ్మయమ్ము నందు. 28

కవిత వ్రాసి - ఋషిగ - ఖ్యాతి కెక్కుట ఎట్లు ?
వేరు సులువు దారి వెదకి నాడ;
కలము కదుప కుండ - గడ్డమ్ము పెంచుచో!
కాళ్ల బడుచు మ్రొక్క గలరు - ప్రజలు. 29

కావలసిన పనిని గంధర్వులే చేయ,
ఇంక మనము సంతసింప వచ్చు;
శత్రు వాత్మహత్య సలుప చూసిన యంత !
అతని సంహరించు యత్న మేల ? 30

కిఱ్ఱు గూర్చు - రాజకీయాలు లేకుండ;
మత్తు గొలుపు నట్టి మతము లేక,
వ్యసన సదృశ మైన-వ్యావృత్తి లేకుండ-
నరుడు బ్రదుక లేడు - ధరణి మీద. 31

బరువు విషయము పయి - బహిరంగ సభ లోన,
పెదవి విప్పు డెపుడు పెద్ద మనిషి;
పిట్ట కథలు చెప్పి - పెట్టు చక్కిలి గింత !
వినెడి వారి హృదులు విచ్చు నట్లు. 32

గుండె గ్రుచ్చు - హాని కూర్చ బోవని కత్తి,
హాస్య మన్న - గొప్ప అమృత రసము,
ఔషధమయి బ్రోచు - ఆయురారోగ్యముల్,
బహుజన హిత మగును బహుళ సుఖము. 33

మేత వేసి యెవరు శ్వేత మత్తేభమ్ము
పెంచి సాక గలరు, పేర్మి తోడ ?
కుక్క నైన పెంచి కూర్మితో పోషింత్రు !
"కారు"- నేడు మత్త గజము సుమ్ము. 34

దిన దినమ్ము నిండు - తిరుమలేశుని హుండి,
ఎంచ - దేవు డౌనె లంచ గొండి ?
దీన భిక్షుకులకు - తిండి వేయని వాడు;
ఏడు కొండలకును ఏగి వచ్చు. 35

అప్పు డపుడు - అద్భుతానంద విశ్రాంతి,
నందన వని చేరి పొందినాడ;
ఏను మరచి పోయినాను - భూలోకమ్ము,
హాస్య మందు తేలి యాడి నపుడు. 36

రేల - తాల్చి శ్రీహరిశ్చంద్ర పాత్రనే,
పగలు బొంకు పలుక వచ్చు - నటుడు,
కరుణ జాలువారు - కథలు వ్రాయగ వచ్చు,
కవి వరుండు - క్రూర కర్మతుండు. 37

లలిత లాస్య లోల - లావణ్య లీలాంగి,
మించుబోణి - తరళ చంచలాక్షి;
ప్రేమ మయి - మనోజ్ఞ శృంగార రసరాజ్ఞి
కీర్తి కన్య - ఎవరి గృహిణి కాదు. 38

హృదయ మందు - ఎన్ని వేదన లున్న !
బ్రదుకు నందు - ఎన్ని బాధ లున్న,
చింది ముఖము నందు- మందహాసము సదా;
ధరణి తిరుగు నరుడు - ధన్య జీవి. 39

పెద్ద ప్రహసనమ్ము - పృథివిపై బ్రదుకెల్ల !
తథ్య మేది కలదు ? ధరణి పైన ?
హాస్య మొకటె - కూర్చు - ఆనంద సంక్రాంతి !
మనిషి తన్ను దాను మరువ వచ్చు. 40

నాదు - లోక మరయ - నాకు కోపము వచ్చె!
నవ్వు వచ్చు చుండు నాకు నేడు;
నవ్వు - చేయ గలదు నరుని జీవన్ముక్తు;
కోప మనిన పిచ్చి గుబులు సుమ్ము, 41

అతిశయోక్తి - బాహిరాహార్యమే గాని,
హాస్యమునకు సత్య మంతరాత్మ,
చూచు హాస్యరసము - సూక్ష్మాతి సూక్ష్మముల్
భూత దర్పణమ్ము చేత బట్టి. 42

అఖిల శాఖ లందు - ఆకులే ఆకులే;
ఆవరించె వృక్ష మాకసమును !
వట్టి చెట్టు పోలు నట్టిదే గ్రంథమ్ము
లేదు పిందె ఒకటి ! లేవు పూలు, 43

ప్రేమ యందు కలదు - భూమి అంచులు దాటి
తేజరిల్లు గొప్ప దివ్య శక్తి !
పేర్మి తన్ను దానె - ప్రేమించు కొను టన్న!
అంత కంటె లేదు - హాస్య రసము. 44

హాస్య రసము ఆయు రారోగ్య దాయమ్ము,
చక్క బరచు - రక్త సారణమ్ము!
నగవు - మనసు బరువు బింకము బాపు;
హాయి గూర్చ గలదు - హాస్య రసము. 45

విద్య - లలిత కళలు - వివిధ వేదాంతముల్;
మనిషి నైజ మేమి మార్చ గలిగె ?
లోక మందు - ఎవడు - ఏకాంత విజ్ఞాని ?
నవ్వ గలిగి నట్టి నరుడు తప్ప ? 46

అరసి చూడ - అత డాగర్భ మేధావి !
అతని ప్రతిభ కెట్టి అవధి లేదు;
పొట్ట పోసుకొనెడి - చిట్టి పూనిక తప్ప,
అన్ని శక్తి యుక్తు లతని కుండు. 47

సాటి లేని గొప్ప సర్వజ్ఞ మేధావి
పండిత ప్రకాండ మండనుండు;
కోడి గ్రుడ్డు నిచ్చి - చూడ వచ్చును మీరు;
పీకి చూపు - టన్ను - ఈక -లతడు ! 48

ఆపలేదు - కడలి ఆటు పోటుల నెప్డు,
నరులు ఆప లేరు నవ్వు నెప్డు,
ఆపలేము దగ్గు - ఆపనేరము తుమ్ము
ప్రకృతి ఎప్పుడు బలవత్తరమ్ము. 49

ఎడద పరువు లెత్తు - ఎండమావుల వెంట;
ఆశ - అంద నట్టి ఆకసమ్ము !
ఎవడు పొంద గలడు - ఏకాంత విశ్రాంతి?
కోరి - హాస్య రసము గ్రోల కుండ ? 50

అరయ - శ్లేష వాడు టథమహాస్యము సుమ్ము
    వక్ర చంక్రమణము వద్దు వద్దు
హాస్యమునకు అంతరాత్మ - సద్యః స్ఫూర్తి;
    తేటదనము సూటి మాట మేలు. 51

నిర్వికల్ప చిత్త నిర్వాణ నృత్తమ్ము
    మంద హాస రోచి చిందు లాడు;
జాలువారి శాంతి సౌందర్య దీధితుల్;
    నవ్వు కనుల లోన నాట్య మాడు. 52

---

## వ్యాపారం

ప్రజ్ఞ యేల ? గొప్ప వ్యాపార సరళిలో ?
    సంతకాలు చేయు శక్తి చాలు,
చాలు - తెలిసికొనిన - గాలి వీచెడు తీరు !
    ప్రజల అవసరాలు - బ్రదుకు తెరువు. 1

ప్రజ్ఞ యెంత యున్న - వ్యాపారి కాలేడు ;
    ముఖ్య మైన దేది ? మూల ధనము;
గొప్ప వస్తువులను కూర్చు - నైపుణ్యమ్ము;
    మారు మూల చేరి మ్రగ్గు చుండు; 2

# ముక్తకములు

కంజ మందు " కవిత " కింజల్క సదృశమ్ము!
జీవితము మహాసరోవరమ్ము;
సౌరభాన్వితమ్ము - స్వర్ణ కల్హారమ్ము!
వేయి దళము లగును - విద్య లెల్ల. 1

అలసి నపుడు మనసు - అల్ప కార్యమె యైన,
కానుపించు మిగుల కష్ట మగుచు;
ఉన్న యెడల - మనిషి కుత్సాహ చిత్తమ్ము;
కొండ పిండి చేసి కొట్ట గలడు. 2

క్రొత్త పాతలకును - పొత్తు కూర్చును పూని,
బ్రదుకు లోన - సామరస్యవర్తి;
సంధి కూర్చగలడు - సంఘర్షణము వీడ;
ఖడ్గవాది గాడు కార్యకర్త. 3

జనన మందు నెడల - జగతిలో - నీగ్రోగ,
నల్ల తోలు గలుగు, నరున కెపుడు;
ఉత్తర ధ్రువమున - ఉదయించు ఎస్కిమో
మంచు గడ్డ ఇండ్ల - మసలు చుండు. 4

పరిఢ విల్లె - పెద్ద వ్యాపార పీఠమై,
చలన చిత్ర విద్య - జగతి యందు,
నాటక కళ మిగిలె - నామ మాత్రమ్ముగా!
విశ్వ మెల్ల గొప్ప వెలుగు చిమ్ము. 5

మధువునకే గద ఝుంకృతి !
మధువును గ్రోలు నపు డింక - మౌన వ్రతమే !
మధు రస సమాధి మగ్నము
లధరములు కదలవు వదల వా అనుభూతిన్. 6

చిక్కు ముడుల గుట్ట - జీవితం బని నంత,
    పగటి కలల పుట్ట - సెగల మెట్ట;
మానవులకు - కవిత - మధుర జీవన్ముక్తి!
    అంతరంగమునకు అమృత వృష్టి. 7

తెలిసి - మనిషి నేడు దేశదేశము లెల్ల,
    భావి పైన - దృష్టి బరుప వలయు;
ఉండ రాదు - కూప మండూకమును బోలి,
    బ్రదుక రాదు - కిలుము పట్టి గుండె, 8

ముక్కు - శీఘ్ర కోప ముద్రాంకితమ్ముగా,
    చిటిపాటి చిరుచెమట చిందనేల ?
మోము పైన - ఆణి ముత్యాల చిరునవ్వు,
    వెన్నెల వలె - వెల్లి విరియు గాక! 9

పాత్ర దానమునకు - వ్యాఖ్యానములు - రెండు;
    ఎంచి యోగ్యునకును ఇచ్చు - దాత,
అరయ - దాత - యోగ్యుడౌ గ్రహీతను మించు;
    జ్ఞాని - దాని పాత్ర దాన మనును. 10

అందదు పలుకుల వేటకు
అందదు గంభీర మానసాన్వేషణకున్;
అందదు కళలకు - హృదికే
అందెడి దివ్యానుభూతి నారాధింతున్. 11

కాన రావు - పుస్తకాల - మందులు కొన్ని;
మాన్ప గలుగ వ్యాధి - మందు సుమ్ము;
ఆదరింప దగును - అమ్మమ్మ చిట్కాలు,
వ్యాధి మాన్ప గలవు - అద్భుతముగ. 12

కలవరమ్ము కలుగు - కార్య క్రమము ముందు;
పిదప తోచు -వాన వెలసినట్లు;
పుట్ట దెపుడు బిడ్డ - పురిటి నొప్పులు లేక,
జయము వచ్చు పిదప - శ్రమము ముందు. 13

దూర దర్శనమ్ము - చేరె నే డింటింట,
పాత బడెను సభలు -శ్రోత లేరి ?
బయటి కేగ నేల ? ప్రజ లిండ్లను వీడి ?
తలప సభ లిపుడు వృథా ప్రయాస. 14

చట్ట మమర లేదు - సర్వతో ముఖముగా!
అందు చేత - జడ్జి - అవసరమ్ము;
మధ్యవర్తి తీర్పు - మన్నించు మర్యాద,
అవని జనుల కెల్ల అవసరమ్ము. 15

మానవులకు ధ్యేయ మానంద సంప్రాప్తి,
స్వీయ సౌఖ్య వాంఛ - చెడుగు గాదు;
కాని - పరుల కేపుడు - హాని చేయగ రాదు;
మనిషి - సుఖము పంచు కొనుట మేలు. 16

దారుణముగ పెరిగె ధరణిలో - జనసంఖ్య !
అదుపు చేయ దగిన అదను వచ్చె;
అంత మొందు నెడల - వ్యయము - సైన్యమ్ముపై
సౌఖ్య మంద గలరు సర్వజనులు. 17

కాలము గతియించె - వాలఖిల్యుల కింక,
శ్రోత్రియులకు నేడు చోటు లేదు.
రేపు మాపు - పూర్వ కూపస్థ భేకముల్,
గగన సీమ లందు - ఎగురు గాత ! 18

నెమలి - పురి విప్పి - నృత్య మాడును నిల్చి,
క్రమ్మ వాన మబ్బు - గగన మందు ;
గాలి అలలు వీచ - కదలి ఆడును చెట్టు,
ఆకు కొమ్మ రెమ్మ లన్ని సాచి. 19

తెలియ నగును మేటి చలన చిత్ర మటంచు;
అధిక సంఖ్య జనము లాదరింప;
తర్క వాదములకు - స్థాన మేమియు లేదు;
నరుడె - ధరణి కేంద్ర గరిమనాభి. 20

భక్త వరుడు కోరి - భగవంతు దర్శింప
వెడల వచ్చు - తాను వెదుకు కొనుచు;
వచ్చు - వెదుకు కొనుచు భగవంతుడే కోరి;
కర్మ యోగి వరుని కాంచు కొరకు. 21

ధరణి ప్రజకు పట్టు దురదృష్ట మేదయా ?
బ్రదుక వలయు బాల్య హృదిని వదలి,
పెండ్లి యగును పిదప - పిచ్చి యెత్తిన మీద;
బిడ్డ పుట్ట - పెద్ద పీడ - మొదలు. 22

అరయ ఏది మంచి దాడు వారికి గూడ ?
బోసి మెడయ లేక బోసి మెదడ ?
చదువు మేలు సుమ్ము స్వర్ణ హారము కాదు;
పసిడి మీద మోజు పనికి రాదు. 23

వడి వడి ఆశు కవిత్వము
నుడివెడు వాడే సుహృన్మనోహరు డగునా?
జడి జడి వచనమునే దుం
దుడుకుగ కురియు గద - దేవ దుందుభి సముడున్.

కలలు కనెడి వాడు - కర్మ యోగికి తండ్రి
స్వప్నములకు జనని - సాహసమ్ము;
అవతరించు రేపు - ఆచరించెడి వాడు !
జయము దిగ్విజయము - స్వప్నములకు. 25

ధర్మ మాచరింప - ధైర్యమ్ముగా నిల్చి
జనులు మెచ్చ గలరు - జయము పలికి;
నలుప నేల సగము సగము కర్తవ్యమ్ము?
అంతరాత్మ పీడ నణచు కొరకు. 26

పెద్ద కప్ప పట్టె - పేరాసతో - పాము;
ఏమి జేయ వలయు నింక మీద !
మృత్యువాత పడును మ్రింగుచో - సర్పమ్ము
కక్కి వేయ - రెండు కనులు పోవు !! 27

అరయ వచ్చు - నరుల ఆరోగ్య వివరాలు
నడుము కొలత బట్టి - నాల్క బట్టి;
కనుల కాంతి బట్టి - కాళ్ళ వేగము బట్టి,
మంచి మనసు తెలుపు మాట బట్టి. 28

ఎపుడు చూడ లేదు - ఏ ప్రభుత్వము గాని
నింగి కెగయు పొగను నేల మీదె;
నీటి కొరకు వెదకు - నిప్పు రేగిన మీద,
కుంటి కాళ్ల గ్రుడ్డి కనుల తోడ. 29

ప్రగతి రూపు రేఖ - ప్రతి యుగమ్మున మారు,
నిన్న ప్రగతి వేరు - నేడు వేరు;
ప్రాతదనమునకును - భరత వాక్యము పాడి
నాంది - పలుక దగును - నవ్య యుగికి. 30

మధుపము వలె - కుసుమ మసృణ
మధురిమ గ్రోలు చుండు మౌనము తోడన్,
విధురిత మానస వృత్తుల
అధి జాగ్రుత రస సమాధి - నానందముమై. 31

ప్రేమ - ఒక నుడి గుడి - పేర్మి కూర్మికి - పొదు;
పచ్చి పుచ్చు పిచ్చి పదము గాదు;
ప్రేమ పెద్ద మాట ! శృంగార జగతిలో !
" వలపు " అనెడి - పదము వాడ వచ్చు. 32

కలల యందు గొప్ప కార్య ప్రణాళికల్
కూర్చ వచ్చు తరచు కొంత మంది;
కలలు కనెడి వారు - కార్య శూరులు గారు,
అంద మపజయమ్ము నందు చిందు. 33

అవసరము నరులకు హఠయోగ సాధనల్;
దేహ సౌష్ఠవమ్ము తీర్చి దిద్ద;
మేలి మెదడు వరలు - మేలి దేహము నందు,
తరుగు క్రొవ్వు - చురుకుదనము పెరుగు. 34

పొంగి పోవు పాలు - పొరలి పోకుండగా
జనులు తరచు నీరు జల్లుచుంద్రు;
ఊరకుండనేల ఉత్సాహి - తేజస్వి ?
ప్రతిభ - మరల మరల పైకి ఉబుకు. 35

కాంచి బిచ్చగాని - కవి గారు రచియించె,
గుండె కరగిపోవు గొప్ప కవిత!
కదలి వచ్చి - వేగ - కవి గారి ఇల్లాలు,
కూడు అతని సంచి గ్రుమ్మరించె 36

మేటి జగతి యెపుడు మిథ్యయే కావచ్చు,
నాటకమ్ము - బ్రతుకు - బూటకమ్ము,
విశ్వ మందు కుక్క విశ్వాసము నిజమ్ము;
తల్లి ప్రేమ తప్ప తథ్య మేది ? 37

పిల్ల జెల్ల లిల్లు - పెండ్లాము గలవాడు,
శ్లేష్మ మందు చేరి చివుకు - ఈగ !
చావు బ్రదుకు గాని - సంసార యాత్రలో
కొట్టుకొనుట కద్దు కొంత తడవు. 38

మెచ్చ వచ్చు - " ధ్వనులు " మేటి కావ్యము లందు
మరి - ప్రతిధ్వనులను - మరువ దగును;
వాణి మెచ్చు - సొంత బాణీల మాత్రమే.
నీడ వేరు - అసలు నిజము వేరు. 39

అచ్చ మైన గొప్ప ఆలోచనా శాలి,
బ్రతుకు బెట్టు లీ ప్రపంచ మందు ?
నరుడు చూచు నెడల నగ్న సత్యములనే !
పిచ్చి వెధవ యగును పృథివి యందు. 40

• • • •

# మతం

నరుడు చేరి - స్వీయ నాక లోకము లోన,
మురిసి సమ్మ కమ్ము - బ్రదుక వచ్చు;
వాని తోడ - వద్దు - వాదోపవాదముల్!
తెరచి యున్న మెదడె అరయు నిజము. 1

మనుజ హితము కొరకె - మత ముండవలె గాని,
మనిషి - బ్రదుక రాదు - మతము కొరకు;
సంఘ మందు నరుడు - స్వచ్ఛంద బంధియై
చేరు చెర నదృశ్య శృంఖలముల. 2

సహృదయ ప్రతీక - సంస్కార చిహ్నమ్ము
పర మత సహనమ్ము - బ్రదుకు లోన,
లోక మందు లేదు - ఏకైక సత్యమ్ము;
ప్రాణ నాడి - మానవతకు - స్వేచ్ఛ. 3

మతము కులము భాష - మాతృదేశ ప్రీతి,
తరచు అణచి వేయు నరుని మెదడు;
ఎంత మంది కలరు హేతువాద వ్రతుల్ ?
మెదడు వాడు నట్టి మేటి నరులు. 4

నిజము కావు - సంఘ నిమ్నోన్నతమ్ము లెల్ల,
దార సుతులు మాయ - ధనము మిథ్య ;
ధర్మ మేది - భూత దయ మించినది లేదు,
గొప్ప దేది జాలి గుండె కంటె ? 5

అర్థ రహిత మైన - అంశమ్ము లెన్నియో
మారు మ్రోగు - నన్ని మతము లందు;
మనుజ జీవితమున - మతము - ముఖ్యము గాదు;
మానవతయె తలప మాన్యతమము. 6

ప్రార్థనలకు లొంగ దా పరాత్పర శక్తి,
గురువు లెవరు వద్దు - గుడులు వద్దు;
వివిధ మతము లరయ విశ్వ వేదాంతముల్
మనసు కూర్చు ఎండమావులె గద! 7

మతములు గితములు వ్రతములు
ప్రతిజ్ఞలు శపథ నియతులు వద్దు - మనుజ జీ
వితమున స్వేచ్ఛాళువుగా
బ్రతికెడి నరుడే మహానుభావుడు సుమతీ ! 8

ఉర్వి నున్న యెడల - ఒక భిక్షుకుండైన
మనుజ జాతి కెల్ల మచ్చ నేడు;
ఇరుగు పొరుగు వారె - నరు లింత జగతిలో;
మానవత ధరైక మతమె యగుత ! 9

పరము మాట లేల ? పాప పుణ్యము లేల ?
నరుడు పుట్టి నాడు - ధరణి మీద;
ఉర్వి మీది - ప్రజకు - ఉపకార మొనరించి,
మేటి తృప్తి - నిష్క్రమించు గాక! 10

నాక నరకము లని - లోక సంగ్రహముకై,
మాట వరుస కొరకు మతము నుడువు;
మతము తరచి చూడ - అతి మానుషము గాదు,
మతము కంత రాత్మ మనుజ సేవ. 11

చేసె మతము - సిద్ధాంతములు పెక్కు,
మరి శరీర విషయ మరయ కుండ;
మనిషి అనిన ఆత్మ - మనిషి దేహము కూడ;
మేలి బ్రదుకు - రెంటి మేళవించు. 12

ఐహికమ్ము విడిచి - అముష్మికము చెప్పి,
తత్వ వేత్త - గొప్ప తప్పు చేసె,
అవని బాగు పరచు నట్టి కర్తవ్యమ్ము
ఎపుడు - నరుడు విస్మరింప రాదు. 13

పరము గూర్చి నరుడు - మరచి పోవుట మేలు,
కూల ద్రోసి నమ్మకాల నెల్ల;
ధరణి నుండి వేగ - దారిద్ర్యముల నెల్ల,
పార ద్రోల దగును - పట్టు బట్టి. 14

ఎన్న - పెక్కు దొంగ లున్నారు జాగ్రత్త!
ధరణి లోన భక్త వరుల లోన!
కానుపించు చెడుగు కావి గుడ్డల మాటు
ఎంచి చూడ - జగతి వంచనమ్ము. 15

కడిగి వేయ దగును - కర్తవ్యముల నెల్ల
నష్ట మైన - హృదికి కష్ట మైన,
మంచి మతము లేదు- మానవత్వము కంటె!
జాలి - సర్వ ధర్మ సంగ్రహమ్ము. 16

మంచి చెడుగు లెన్నొ - మతము లన్నిటి యందు,
కలిసి యుండు -పాలు జలము లట్లు;
విబుధ వరులు తరచి- వెన్న మీగడ లెన్ని,
స్వీకరింప గలరు - వింగడించి. 17

మానవతయె మిన్న - మతము లన్నిటి కన్న,
మనిషి కవసరమ్ము - మంచి చర్య;
మత మటన్న - కావు మంత్రముల్, ప్రార్థనల్!
పరుల మేలు కోరు పనులు - మతము. 18

పుట్టి మతము ఏండ్లు పూండ్లాయె నెన్నడో!
మారె నదుల పారు నీరు - తరచు,
మనుజ సంఘ మందు - మార్పు లెన్నియొ వచ్చె;
మనిషి మరువ దగును మతము నిపుడు. 19

తరచు మానసమును తాకట్టు పెట్టుటే !
మతమ టన్న ఏమి మానవులకు ?
మతము కోరు కొనును మనిషి విశ్వాసమ్ము;
స్వేచ్ఛ లేని మనిషి - జీవ శవము. 20

మెదడు తెరచి యుంచు మేధావి - బ్రదుకులో
నమ్మ నేల ? ఏ మతమ్ము నైన ??
తన నిసర్గ రీవి తాకట్టు పెట్టునా ?
స్వేచ్ఛ విడిచి పెట్టి - హేతువాది? 21

చచ్చి పోవ - అగ్ని సంస్కార మగు గాక,
మట్టి లోన పూడ్చి పెట్ట వచ్చు.
అందు కొరకు మతము - అడ్డు వచ్చుట తప్పు;
కలహ మాడు టంత కంటె తప్పు. 22

మంచియు చెడుగును మతముల
ఎంచ పడుగు పేకల వలె - ఎన్నెన్నో క
న్పించును అవి దేవుడు - క
ల్పించినవా ? సంఘ మందు పేనిరి ప్రజలే. 23

చంద్ర వంక - సిలువ - స్వస్తికల్ చిహ్నాలు
సార మొకటి- శబ్ద సరణి వేరు;
భాష విడిచి పెట్టి - భావమ్ము గుర్తించి;
సాధు చరితు లగుత - సకల జనులు. 24

మతము లన్ని ఒకటె అనుట - అజ్ఞానమ్ము;
బూకరింపు పచ్చి బూటకమ్ము;
ఆచరణము వేరు ఆదర్శములు వేరు
మనిషి మరువ వలెను మతము కులము. 25

నాస్తికత్వ మొక్క - నవ నూత్న మత మయ్యె!
క్రమ్మె క్రొత్త నమ్మకమ్ము కొంత;
దేవు గూర్చి తనకు తెలియదంచును తెల్పు;
హేతు వాదమునకు - నీతి యున్న. 26

సంకుచిత మనస్సు - సంస్థాగత మతమ్ము;
కలుగ జేయు మానవులకు కీడు;
మత్తు గొలుపు నట్టి మతము మంచిది గాదు;
తెరచి యుంచు గాత నరుడు - మనసు. 27

మేలు చేయ లేరు - కాల దోషము పట్టి
సంప్రదాయ కాండ - సంఘ మందు,
దులుప దగును బూజు దుమ్ము డెందము నుండి,
కూర్చ వలయు కొంత క్రొత్త తలుకు. 28

తెలియ నట్టి దేదొ - కలదు - విశ్వము నందు;
అవ్యయ మగు శక్తి - ఆవరించి,
కూర్చె - మతము లెల్ల - గొప్ప సంక్షోభమ్ము,
తెలియ రాని దాని - తెలుప గోరి. 29

మతము - దేని కొరకు ? మనుజు శ్రేయస్సుకే !
నగ్న సత్య శోధనకును కాదు;
మనిషి - మతము నెపుడు తన నెత్తి పై గాక,
కడిగి - పెట్ట వలయు - కడుపు లోన. 30

సహన మానవతయె - జగదేక మత మౌత!
వదలు గాత - నరుడు - పరము గిరము;
వెదకు గాత - మనిషి - విశ్వ కల్యాణమ్ము;
సర్వ జనుల సుఖము జగతి మీద. 31

మనిషి చెవులు కనులు - విన లేవు కన లేవు;
లేని యెడల ఒడల ప్రాణ శక్తి,
ప్రాణ శక్తి కలదు, పచ్చగడ్డిని గూడ,
తీయ వచ్చు అసులు - పోయ తరమె? 32

కవల బిడ్డలు గద - కర్మ సిద్ధాంతమ్ము,
నాస్తికత్వవాద హాళహాళములు,
రెండు తరచు పలుకు చుండు ఖండితముగా!
తెలియ రాని దాని దెలిసి నట్లు. 33

పుణ్య పాపము లెట ? భూకంపముల లోన,
చచ్చి పావుచుంద్రు సకల జనులు??
తెలియ రాదు మనకు దేవు డున్నట్లుగా;
ఎట్లు తెలియు? లేని యట్లు గూడ ? 34

విశ్వ మందు ఉన్న - వివిధ వేదాంతముల్,
ఋజువు చేయ దగిన నిజము లగునె?
వెల్లి విరిసి నట్టి - విద్య దున్మాదముల్ !
ఎంచ - గొప్ప విశ్వ వంచనములు. 35

ప్రార్థనలను చేయ - ఆరు సంజల యందు
సలుప రోజు స్నాన శౌచ విధులు,
మనసు లోని మురికి - మాసి పోవదు గదా!
కరుణ జూప కున్న - పరుల పైన. 36

పావన స్థలమ్ము - పావన గ్రంథమ్ము
పావన సమయమ్ము - పరము లేవు,
నరులు కలరు - నేల నాల్గు దిక్కుల యందు,
చూడ వలయు నరుల సుఖము - చాలు. 37

## ప్రబోధం

అభరణము లేల ? ఆహార్య మేలరా ?
చిన్మయమ్ము సుమ్ము చిత్త తృప్తి;
చాలు చాలు - నిత్య సంతృప్తి బ్రతుకులో;
అంత కంటె తెలివి అవని గలదె. ? 127

సంగమమ్ము మధుర శృంగార రస మందు,
చిట్టి చివరి వట్టి చిలిపి చేష్ట,
హృదిని గూళ్ళ కట్టు ప్రేమాయణము నందు,
మరువ రాని కలలు మధ్య మధ్య. 128

ప్రజల కడకు చేరి - పంచు జీవన్ముక్తి,
ఆంధ్ర దేశ మందు - హరి కథకుడు;
కవన గాన నృత్య కళల - ముచ్చ్యెల గుట్ట,
గడపు - వెన్నెల నడ గుడిగ - బ్రదుకు. 129

# మానవ సంహిత

అవని లోన - మనుజు డమృతత్వమును గోరు!
తాను మర్త్యు డనెడి తలపు వీడి,
చర్చ చేయు - ఆత్మ శాశ్వతత్వము గూర్చి,
సృష్టి నశ్వర మని యెరిగి యెరిగి. 1

మనుజు డెవ్వ డైన తనకు మేలును చేయ
మనసు లోన మనిషి మరువ లేడు;
చచ్చినట్టివాని స్మరియించు హృదిలోన,
మంచి తనము కొంత మణిగి యుండు. 2

మనిషి - నిలువ వచ్చు - వెనుక నేపథ్యాన,
సేవ - కానబడక చేయవచ్చు,
వేరు - పేరు పొందువారు వేదికలపై;
మెడను పూల దండ పడెడు వారు. 3

తెలియ - మనుజు డనిన - దేహమ్ము కాదంచు
తరచి చాటి చెప్పె తత్త్వ వేత్త;
మనిషి అనిన ఆత్మ అను ఖండ సత్యమ్ము;
అవని లోన గొప్ప వ్యాప్తి చెందె. 4

ఆశ్రయింప - మనిషి - ఐహికావర్తమే;
చేరి నట్లు ఈగ శ్లేష్మ మందు,
జీవితమ్ము కొంత సేపు - తీర్చుట మేలు;
తన కుటుంబ పరిధి దాటి - నరుడు. 5

పరద బెడద - గాలి బీభత్సముల్
కలరు ముందు చెప్పగలుగు జనులు;
మంది వర్తనమ్ము - ముందు - చెప్పెడు జనుల్;
ఎవ్వ రైన గలరె పృథివి లోన ? 6

తరచి చూడ - ధరణి - ధన మూలకమె గాని,
ఆర్థిక మనుజు డన లవని లేడు;
మమత లెన్ని మనిషి మనసు లోపల దాగు,
పెక్కు సుడులు ముడులు - వెరసి - మనిషి. 7

రాక్షసత్వ మగును - రక్త పాతము - హింస;
మానవతకు - కరుణ -ప్రాణ నాడి;
సమ్మతింప దగును - శస్త్ర వైద్యము వోలె,
బ్రదుకు నందు తుట్ట తుదకు - హింస. 8

అరయ - గరిమ నాభి - ఆరాధ్య కేంద్రమ్ము
అవని కెల్ల నరుల అంతరాత్మ!
సాగు - దేశ చరిత - జన మనః స్థితి బట్టి,
కలిమి లేమి భూమి గాలి కేమి ? 9

మంచి తనము లోని - మాధురీ గరిమమ్ము;
మనిషి నెమరు వేసుకొనును సతము;
మంచి తనము తోడ - మహిత ప్రతిభ చేర,
ఎడద తోడ - అంజలింప దగును. 10

ధరణి పైన - శత శత శతాంశ లేశమ్ము,
గణిత శాస్త్రమందు - మనుజు డన్న!
ధరణి సృష్టిలో - శత శత కోట్యంశమ్ము,
స్రష్ట నెరుగ గలుగు జ్ఞాని యెవరు ?? 11

ఎవరు సృష్టి కర్త ? ఎట్లు వచ్చెను సృష్టి?
తెలియ రాదు - ఏల తెలియ వలెను?
అరసి తెలియ తగును - పరిపూర్ణముగ ముందు
ధరణి మీద నున్న - నరుని గూర్చి. 12

పుడమి - నరుల బ్రదుకు - బుద్బుద ప్రాయముల్;
కట్టె లట్లు నరులు కలియ వచ్చు,
మనిషి మనిషి కలియ మాధురీ యోగమ్ము;
మనసు గలుగు కట్టె మరువ లేదు. 13

మనిషి - లోభ మోహ మద రోగ భరితుడే !
కాని - యోగి - కొన్ని క్షణము లందు;
స్వార్థ ముడిగి చూపు - త్యాగ సేవా నిష్ఠ
అమృత మయుడు సుమ్ము ఆత డపుడు. 14

వింత యైన - విపుల విశ్వ శిల్పము నందు,
అణు సముండు నరుడు స్వల్ప దేహి !
ప్రాభవమ్ము గాంచె - పంచ భూతములపై,
మనసు బలిమి కలిమి మానవుండు. 15

మనిషి - కాడు - రక్త మాంసాలు మాత్రమే;
మంచి చెడుగు లరయ మనసు కలదు,
కలవు లలిత కళలు - కలదు విజ్ఞానమ్ము;
మనిషి - విశ్వ శిల్ప మకుట శిఖరి. 16

ఆదరించి అతిథి అభ్యాగతుల సేవ,
వేయు వాడె - ధన్య జీవి సుమ్ము !
ఎదుటి కడుపు నింద - ఎవడు తృప్తిని చెందు ?
బుద్ధిశాలి అతడె పుణ్య శీలి. 17

పాలు పడడు - నరుడు పరుగు లెత్తెడి వేళ,
సుంత యైన ప్రక్క చూపులకును;
మనిషి - తీరిక మెయి - పని మాని కూర్చున్న;
అతని మనసు కోతి యౌచు - గెంతు? 18

అరయ ధర్మ మనిన - స్థిర జడత్వము కాదు ;
క్షణము క్షణము మారు జగతి లోన.
మనసు మార్చు కొనుట - మాట తప్పుట గూడ,
తప్పు లనుచు తీర్పు చెప్ప రాదు. 19

కొంత మంది పైకి గోచరింపరు గదా,
నివురు గప్పి నట్టి నిప్పు వోలె;
కదుప దరికి జేర -కాలు సేతులు కాలు,
అగ్గి - దాగ వచ్చు - బుగ్గి లోన, 20

మంచితనము - ప్రతిభ - మనిషి కున్నను గాని,
ఎదుటి వాని ప్రతిభ - ఎరుగ లేదు,
సహృదయుండు లేక - సంఘ జీవిత మందు
జగతి హితము లేదు - ప్రగతి లేదు. 21

వెఱ్ఱి లేని వాడు - పృథివి లోనే లేడు,
వేయి విధము లగుచు వెఱ్ఱి- వరలు;
తాను జ్ఞాని ననుచు - తలపోయు వాడె పో,
విశ్వ మందు - మేటి వెఱ్ఱి వాడు. 22

ధనము - పదవి లేని దర్పమ్ము - వ్యర్థమే,
అంత కంటె లేదు - ఆత్మ హాని,
అంత కంటె ఏది - హాస్యాస్పదము లేదు,
ఏమి లేని విస్త రెగిరి పడుటె. 23

ఎంచ జీవితమ్ము - ఎండ మావుల వేట,
చెడ్డ పనులు పెక్కు చేయు నరుడు;
మంచి పనులు గూడ ఎంచి ఒక్కటి రెండు,
బ్రదుకు నందు చేయ వలయు - మనిషి. 24

జయము కూర్చ వచ్చు - జగతిలో నష్టముల్,
కూర్చు అపజయమ్ము కూడ మేలు;
అపజయముగ మార్చు - అవివేకి జయమునే;
మూర్ఖునకును - జయము - ముప్పు దెచ్చు. 25

నదికి - మరి మనుజు మనః ప్రవృత్తికి గూడ
ఆనకట్ట వేయు టభ్యుదయము!
మదము కోప తాప మాత్సర్య మోహముల్,
అణచు మానవుడు మహాత్ము డగును. 26

జంకు గొంకు లేల - సత్యమ్ము పచియింప??
నిజము తోచు గాక - నిష్ఠురముగ;
న్యాయ నిర్ణయమున - నతడు చూడగ రాదు
ఎట్టి కష్ట నష్ట మెవరి కైన. 27

నరుడు - పుష్ప మౌచు - విరజిమ్ము నెత్తావి ,
మొట్ట మొదట చిన్ని మొగ్గ యైన;
ఎదిగి పిందె యౌను - పిదప కాయగ మారు;
పుట్టుపండు గాడు పుడమి నరుడు. 28

జన్మ తోడ - శక్తి సామర్థ్యములు గల్గి;
పుడమి కొంత మంది పుట్ట వచ్చు;
గొప్పతనము తరచు కూర్చు కొందురు జనుల్;
దిన దినము శ్రమించి - దీక్ష తోడ. 28

వ్యక్తి - మఱ్ఱి చెట్టుపై నున్న - ఒక ఆకు;
మనుజ జాతి పెద్ద మఱ్ఱి చెట్టు,
సమత - స్వేచ్ఛ - విమల సౌభ్రాత్ర బంధమ్ము
ఆకు ఆకునకును అమరు గాత! 29

స్నాన పానములకు - సరిపోని నీరమ్ము
నడపు - ఆవి రైన యెడల - రైళ్ళు;
అధిక శక్తి పుట్టు - అణువు బ్రద్దలు కొట్ట!
మనిషి మనసు అమిత మహిమ గలది. 31

మంచి హృదయ మున్న - మనుజుండు దొరకుచో,
వాని లొసగు లెల్ల నేను మరతు;
కర్మయోగి తప్పు - గమనింప వచ్చునా?
ధరణి - క్షమయె - ఉభయ తారకమ్ము. 32

అరయగా స్వత స్వయంతంత్ర యంత్రమ్ము,
నర శరీరమె గద ధరణి యందు !
చేతనా పరీత శిల్ప సౌష్ఠవముతో,
సృజన శక్తి గలిగి చెలగు చుండు. 33

వాహనమ్ము వలన - వస్త్రధారణ వల్ల;
వినయ వాక్కు వలన - విద్య వలన;
దేహ దీప్తి వలన - స్నేహ శీలము వల్ల;
గౌరవమ్ము - నరులు - గాంచ వచ్చు. 34

మతము కులము గొప్ప మాదక ద్రవ్యాలు,
మత్తు గొలుప గలవు మనిషి మనసు;
మనసు నిగ్రహించు మనిషి - యోగీశుండు;
ధరణి జన్మభూమి నరుల కెల్ల. 35

# ప్రగతి

బ్రదుకు లోన  తలప రాదు దేవుని గూర్చి;
మరువ దగును వేగ  పరము గూర్చి;
ఉత్తమ పథ మేది   ఉత్పత్తి పెంచుటే ?
ప్రగతి కొరకు పాటు బడుట నేడు. 1

వ్యయము చేయు నెడల - బాల బాలికలకై,
దేశమునకు ప్రగతి దిద్ద వచ్చు;
బహుళ శాఖలందు -పైకి వత్తురు వారు;
పెట్టు బడికి పొంపు పెంపు గలుగు. 2

ధనికునకు పాత్ర దానము;
వినయము సహనము విశిష్ట విద్యా పతికిన్;
అనవరతము ప్రజ లందున
పని చేసెడి దీక్ష యున్న - ప్రగతిని తీర్చున్. 3

కోతి గంతు లెల్ల  చైతన్య మనరాదు
ధ్వంస - దహన కాండ - ప్రగతి కాదు,
మలుపు త్రిప్పి చరిత - మనుజ సంఘము నందు
విద్య - తీర్పు - ప్రగతి - విప్లవమ్ము. 4

రాక పోక లందు - రైలు స్టేషను  లందు,
పాఠశాల లందు - బస్సు లందు,
నెగడు చుండె నేని - నిశ్శబ్ద వర్తనల్;
అవతరించు దేశ మందు - ప్రగతి. 5

ప్రగతి కాదు - కల్లు - పొగ త్రాగు టన్నచో,
ఇల్లు వళ్ళు గూడ గుల్ల యగును;
వినెడి వార లెవరు - విజ్ఞాన హితబోధ?
స్వార్థ లాభ మెంచు వర్తకమ్ము. 6

వసుధ మీద - ప్రగతి పథము దిద్దుట మేలు,
ఆత్మ దేహ చర్చ లనవసరము ;
విడువ దగును మెట్ట వేదాంత విషయాలు;
నేల విడిచి చేయ నేల సాము ? 7

ధర్మ చింత లేక - త్యాగ భూమిక లేక,
ప్రగతి రాదు దేశ భక్తి లేక;
సంఘ మందు బ్రదికి సామాన్య మానవుల్,
సేవ - తెర మరుగున - చేయ దగును, 8

కాల హరణ మేల ? - గతము వీడుట మేలు;
భావి మీద దృష్టి బరుప వలెను,
శీఘ్ర లాభ దృష్టి - చెరుపు చేయగ వచ్చు,
వ్యక్తి మేలు కాదు - ప్రగతి యనిన. 9

అంత మొందు గాక - అవినీతి - ముందుగా,
పలు సమస్య లుండ వచ్చు గాక !
ప్రగతి వచ్చు - పిదప - భరత దేశము నందు
పగలు - రాత్రి వెనుక వచ్చు నట్లు. 10

అవని - ప్రగతి విరిసె - అంక క్రమము లోన:
ఇంత వరకు యుగ యుగాంతరములు:
ఇక - గుణోత్తర గతి వికసించి పరుగెత్తు;
వేగ తరము జ్ఞాన విప్లవమ్ము. 11

పరము గూర్చి - ఇంత వరకు తెలిన దేమి ?
ఇంక తెలియ దగిన దేమి గలదు ??
పరము మరచి - ఇహము - వాసయోగ్యము చేయ,
ప్రగతి కొరకు - నరుడు - పాటు బడుత. 12

జనులు - కోరవచ్చు - స్వాతంత్ర్య సంక్రాంతి,
హాని గూర్చు - హద్దు లేని - స్వేచ్ఛ;
ప్రగతి రాదు రాదు - క్రమ శిక్షణము - లేక
కారు - బ్రేకు లేక - కదప రాదు. 13

సంప్రదాయములను సమయానుగుణముగా,
మార్చుకొనుట మేలు మనుజు లెల్ల;
సంఘ సంస్కరణము - చైతన్య చిహ్నమ్ము;
ప్రగతి కంతరాత్మ జగతి యందు. 14

కూల ద్రోయ వచ్చు - నేల మట్టమ్ముగా,
పగిలి పోయి నట్టి - పాత కోట;
కోరి యెవడు కట్టు ? క్రొంగొత్త భవనాలు ?
ప్రజల మేలు కొరకు - ప్రగతి కొరకు. 15

ఉత్తమ తమ నీతి - ఉత్పత్తి పెంచుటే;
సర్వతోముఖముగ - సంఘ మందు,
నేత- పూన దగును - నిర్మాణ చర్యలే !
ప్రజల - మేలు కొరకు - ప్రగతి కొరకు. 16

సంప్రదాయము లను సంకెళ్ళు - తరచుగా,
స్వేచ్ఛ నపహరించు - జీవితమున,
శాంతి దాంతి గూర్చు - సంసార యాత్రలో,
ప్రగతి - కూర్చ లేవు - జగతి కెపుడు. 17

గురువు తోడ కూడ - నెరప వచ్చును పోరు,
చిత్త శుద్ధి యున్న - శిష్య వరుడు;
నీతి నియతి కొరకు - స్వాతంత్ర్య రక్షకై;
ప్రగతి కొరకు - నూత్న జగతి కొరకు. 18

ప్రగతి కుంటు పడును - పరిపూర్ణతను చూడ,
చాలు - చేయ పనులు సగటు జయము;
సంతసింప వలయు - సగటు శాతము దాట;
మెట్టు పైన మెట్టు మెట్ట వచ్చు. 19

అభ్యుదయము - ప్రగతి - అనిన అర్థ మదేమి ?
ఏది కొలత బద్ధ ఏది సూచి ??
అధికమైన - సగటు ఆయుష్షు జనులలో
అది ప్రగతికి మొట్ట మొదటి గుర్తు. 20

నెలలు కొన్ని పట్టు - నిర్మించుటకు - బస్సు,
చాలు - తగుల బెట్ట క్షణము లైదు !
బ్రదుకు అనిన - హింస రక్త పాతము కాదు;
ప్రగతి కాదు కాదు - ధ్వంస కాండ. 21

యువక వరుడు - తెగువ - ఉత్సాహ దీప్తితో
ఉద్యమమ్ము లోని కురుక గలడు!
అగ్ని లోన - శలభ మటుల ఆహూతి యౌను,
ప్రగతి - త్యాగ యోగ ఫలము - జగతి. 22

ప్రగతి కేది గుర్తు? జగతి యెల్లెడ చూడ ;
అభ్యుదయము కేది అనవాలు?
గోల లేని తుముల కోలాహలము లేని
సభలు సంత - పాఠశాల లెల్ల. 23

ప్రగతి - ప్రజలు చేయు పనియొక్క ఫలితమే,
స్వర్గ మిచ్చు నట్టి వరము కాదు;
కరువు కాటకాలు - దరి రావు కృషి చెంత,
జయము దిగ్విజయము - జయము శ్రమకు ! 24

యంత్ర పరికరములు యావజ్జగత్తులో
ప్రగతి సౌఖ్యములను ప్రజకు కూర్చు,
సానుభూతి ప్రేమ - సమ సమాజము పైన,
పెరుగు - గాత ఇంక పృథివి లోన 25

నరుని అంతరాత్మ - సరిదిద్దుటే మేలు,
విద్య వెలుగు వెల్లి విరియ జేసి;
పెట్టుబడులు కూర్చి పెంచ వస్తూత్పత్తి
బాగుపడరు ప్రజలు - ప్రగతి రాదు. 26

ప్రగతి కూర్చు - పర పరాగ సంపర్కమ్ము
సర్వ శాఖ లందు జగతి లోన;
వర్తమాన భావి - వర్తించు మెదడులో,
అరుగ హృదిని తెరచి యాత్రికుండు. 27

కార్య కారణములు కాల దోషము పట్టి
విడిచి ఉన్నచోటు - వెడల వచ్చు;
క్రొత్త గమ్య మేది గోచరింపదు గాని
ప్రగతి కొరకు మార్చ తగును మనసు. 28

ధరణి చరిత పెక్కు తప్పు లొప్పులు చేసి,
మెట్టు ప్రగతి పథము తుట్ట తుదకు;
తలప - అప్పు డపుడు - తప్పు చేయుట గూడ,
ప్రగతి సాధనా విభాగ మగును. 29

విశ్వ మందు లేదు - విజ్ఞాన పరిపూర్తి;
జగతిలోన మనిషి ప్రగతి యోగి;
భావి నరుడు - గొప్ప పరిశోధనలు చేసి,
అందు కొనుత - క్రొత్త అకసములు. 30

ప్రకృతి సిద్ధమైన వ్యత్యాసములు కొన్ని,
మనుజ కల్పితములు మరియు కొన్ని;
సామ్య వాద మన్ని సరిదిద్ద యత్నించు!
ప్రగతి కొరకు దళిత రక్ష కొరకు. 31

బ్రతుకు నందు వేరు గతి లేక మనుజుండు
చేయ వలసి వచ్చు చెడ్డ పనులు!
కలిగి మంచి మనసు తెలియకుండగ చేయు,
తప్పు పనులు మనిషి అప్పు డపుడు. 32

పారు క్రొత్త నీరు - పాత నీటిని త్రోసి,
సృష్టి శిల్ప మందు జీవ నదుల;
మార్పు - తప్పని సరి - మనుజ లోకము నందు
ప్రగతి కొరకు నూత్న జగతి కొరకు. 33

---

☆ మనుజ సంఘమన్న -మార్పు మాత్రమె గాదు
బ్రదుకు తెరువు సామరస్య - సంధి;
క్రొత్త పాతలకును - కూర్మి కూడలి యైన
ప్రగతి - కూర్చదగును బ్రదుకునందు.

☆ సత్యమునకు ఆత్మ సహజ సౌష్ఠవ శైలి
అనుకరింపరాని ఆర్జనమ్ము
అందదునుల ముసుగు లన్యత విన్యాసముల్
కడకు గుట్టు మట్టు కప్పలేవు.

# సందేశం

ఒక్క బిచ్చగాడు - ఉన్నచో దేశాన,
    వంచ వలెను ఎల్ల ప్రజలు తలలు;
స్రష్ట - విశ్వశిల్పి - బ్రహ్మదేవుడు గూడ,
    శిరము వంచు గాత - సిగ్గు తోడ. 1

ఎవరి దురద వారె యెరుగవచ్చు గాని
    పరుల గోకు మనుట పాడిగాదు,
చేయ వలయు పూని - స్వీయ కర్తవ్యముల్,
    ఎదుటి వారి కప్పగించ-రాదు. 2

మన మతమ్ము లందు - మన పురాణములందు,
    కలవు గ్రుడ్డి నమ్మకాలు - కొన్ని;
గోచరించు వింత వింత విప్రతిపత్తి!
    వెనుక చూపు వద్దు - మనకు నేడు. 3

మిత వచస్సు మేలు - మిత భోజనము మేలు;
    మితిని మీరు టెపుడు మేలు కాదు;
అతి వినయము గూడ - అంత మంచిది గాదు,
    వెఱ్ఱి వెనుక కతిని వేయవచ్చు. 4

గుండె కాయ లోన - గొప్ప ఒత్తిడి గూర్చు
    వీర శపథ నిష్ఠ వింత వెఱ్ఱి;
సంచరింప దగును సమయానుగుణముగా;
    మనసు తెరచి యుంచుకొనుట - మేలు. 5

కట్ట వలెను - శ్రమకు పట్టాభిషేకమ్ము;
చెమట - ఎక్క దగును - సింహ పీఠి,
ఎట్లు సృష్టి యగును పృధ్విలో సంపత్తి ?
చెమట పట్టు శ్రమయె సిరుల గుట్ట. 6

అలపు గొలుప కుండ - తొలి యుషస్సులలోన
నడక - మేలు చేయు - ఒడలి కెల్ల;
ఎంచి చూడ - నడక - మంచి వ్యాయామమ్ము
వయసు మీరి నట్టి వారి కెల్ల. 7

ఎదుటి వారి కష్ట మెరుగ గల్గుట కంటె
ధరణి లోన - మంచి తనము లేదు,
ఎదుటి వారి ప్రతిభ - ఎరుగ గల్గుట కంటె -
ధరణి లోన గొప్పదనము లేదు. 8

మెదడు ఎదుగు కొరకు - చదువుతో పాటుగా,
ఆట విడుపు గూడ - అవసరమ్ము,
గ్రంధ పఠన మొకటె - బ్రతుకులో సరిపోదు;
ఎదుటి వారి కష్ట మెరుగదగును. 9

బ్రదుకు నందు తరచు గత కాలమును గూర్చి,
తలచుకొనిన - ముసలితనము వచ్చు,
బ్రతుకు నందు తరచు భావి కాలము గూర్చి
తలచు కొనిన - పడుచు తనము మిగులు, 10

ఉర్వి మీద మనిషి - ఉత్సవ ప్రియ శీలి,
    ఆట విడుపు నరుల కవసరమ్ము;
ఉండ వలయు కొన్ని పండుగల్ తిరునాళ్ళు,
    ఎడద మెదడు ఎల్ల లెదుగు కొరకు. 11

విజయ సమయ మందు - వినయమ్ము చూపించు,
    అహము చూపు మపజయమ్ము లందు;
వినయ మహము లెపుడు విపరీతములు గాక
    అదను బట్టి చూపు బ్రదుకు నందు. 12

మంచి పనులు చేసి - మరచి పోవుట మేలు,
    చాటి చెప్పరాదు - జనుల కెల్ల;
ఉత్తముండు తరచు - ఉపకార మొనరించు,
    గుర్తు పట్ట లేని గుప్త ఫణితి. 13

అవసరమ్ము నరున కద్దమ్ము బ్రదుకులో,
    అంతరంగ బింబ మరయు కొరకు,
మిత్రుడొకడు - మేటి మేధావి - అద్దమై;
    సహకరింప జన్మ సఫల మగును. 14

జీవితమ్ము నందు - శీలమే ముఖ్యమ్ము;
    అల్లి బిల్లి కవిత లల్ల నేల ?
సభల లోన - నీతి ఝుంఝూనిలము లేల ?
    బిచ్చ మొక్క ముద్ద వేయ - మేలు. 15

కుంటి కవికి - ఇంట కూర్చి - ఆతిథ్యమ్ము
అడుగ రాదు నాట్య మాడు మంచు;
ఎదుటి వాని - ప్రజ్ఞ వెదకి పట్టుట మేలు;
ఏడిపించ నేల ఎవరి నైన ? 16

మంచివాడు - చెడ్డ మనిషి ! ఎన్నుట యెట్లు ?
ఒకరి యందె ఇరువు రుండ వచ్చు;
మార వచ్చు - మంచి మనిషి - దుర్జనుడుగా!
భోగి గూడ - త్యాగయోగి యగును. 17

మనసు నిండ ఉంది - మంచి ఆలోచనల్!
నరుల చేర్చ వచ్చు - నరకమునకు;
స్వర్గమునకు మంచి పనులె - సోపానముల్;
మాట లేల ? గాలి చేటు గాని. 18

నిలుచు అంట కుండ - నీరు తామర పైన;
అట్లె బ్రదుకు గాత అవని నరుడు,
నాటకమ్ము లోన - నట శేఖరుని వోలె
నరుడు తిరుగు గాత ధరణి మీద. 19

ప్రజలు పెక్కు మంది - రావచ్చు పోవచ్చు,
వ్యక్తి గొప్పదనము అరయ నేల ?
తేరు వెడలి వచ్చు - తిరునాళ్ళ ఊరేగ!
జరుగు ఉత్సవాలు శాశ్వతముగ. 20

వక్త హృదయ మెరిగి - వాచ్యార్థమును దాటి
చర్చ - సలుపవలెను - చరిత, తరచి;
సమయ సీమ లెరిగి - సందర్భ శుద్ధితో,
వ్యాఖ్య చేయ వలెను - వాక్యములకు. 21

యుగ యుగాంత చరిత గతిలోన శబ్దాలు
అర్థ విపరిణామ మరయ లేము;
నాటి రచనములకు - నేటి అర్థము బట్టి,
సాహసించి - వ్యాఖ్య - సలుప రాదు. 22

భూతలమును పలు సారుల
జాతీయత ముంచె - ఘోర సంగ్రామములన్;
ఈ తరము - జ్ఞాను లంతర్
జాతీయతకు పలుకుదురు స్వాగత సూక్తుల్. 23

భరత దేశ మందు - స్వాతంత్ర్య రక్షణే
పరిహరింప రాని బాధ్యత సుమ!
నియమ నిష్ఠ తోడ - నిత్య జాగృతి తోడ,
దేశ రక్ష - తీర్చి దిద్ద వలయు. 24

తరచు వచ్చు చుండు - చిరు చికాకులు కొన్ని,
ప్రక్కవారి తిట్ట రాదు - మనిషి;
గుబులుతో చిరాకు - కోపతాపము చూపి,
గొంతు చించు కొనుట కూడ దెపుడు, 25

నరులు గీసి నట్టి సరిహద్దులే గదా,
    జాతి మత విభిన్న సంజ్ఞ లెల్ల?
జ్ఞాన విప్లవ నవ సవనోత్సవము లోన;
    సూత్రధారి ఋత్విజుండ వగుము. 26

గుండె లోన - దాచు కొన మేలు - వినయమ్ము;
    గుప్త సరళి చూపు గురువు వద్ద!
విసము కక్క వద్దు - బుస కొట్టు భయ పెట్ట,
    పరుల నెవరి కోరి కరువ వద్దు. 27

నీవు - కేవలమ్ము -నెల జీతమును కోరి,
    ధరణి మీద బ్రదుక దగదు గదర!
పుడమి చెరిగి పోని అడుగు జాడలు కొన్ని;
    నీ చరిత్ర లోన - నిలుప వలయు. 28

మతము గితము వద్దు - మానవత్వము చాలు;
    పండి నట్టి మేటి గుండె మేలు;
దేశ భక్తి వద్దు - దేవ భక్తియు వద్దు;
    మంచి నెంచ దగును - మమత విడిచి. 29

బ్రదుక వలెను - నరుడు - వ్యక్తిత్వమును గల్గి;
    గుర్తు కోలు పోక - గుంపు లోన,
కుల మతాది వర్గముల కతీతమ్ముగా,
    మంచి మాత్రమే - గ్రహించ గలిగి. 30

భయము భక్తి వద్దు - భగవంతు డన్నచో,
మరువ వచ్చు - స్వర్గ నరకములను;
మరువ రాదు మనిషి ధరణిపై ఉన్నట్లు;
చేయ దగును సంఘ సేవ కొంత. 31

వినదగు పెద్దల వాక్కులు
మననము చేయవలె పిదప మానస మందున్;
మనుజుడు స్వేచ్ఛగ చేయుత
తన కర్తవ్యమ్ము నెల్ల - ధైర్యము తోడన్. 32

పనుల జరుప వలెను - భయపెట్టి బుసకొట్టి,
శిక్ష వేయ రాదు - సేవకులకు,
ఉత్తమములు కొన్ని ప్రోత్సాహ బహుమతుల్
దయను చూపు టుభయ తారకమ్ము. 33

సంఘ మందు సతము స్వచ్ఛంద పరిధిలో
ఉండు గాత త్యాగ యోగ నిష్ఠ;
చేయవచ్చు సేవ - శ్వేత వస్త్రాలతో
కట్ట నేల పూని కావి గుడ్డ. 34

తల్లి కాని యెడల - ధరణి స్త్రీ - స్త్రీ కాదు;
ఎడద దాగు - కానబడని లోటు;
శిశు మనస్సు గూర్చి -శిశు పోషణము గూర్చి;
స్త్రీల కివ్వ వలయు - శిక్షణమ్ము. 35

కలి యుగమ్ము నందు - కిలుము పట్టును గుండె,
    సెలవు లందు వీడ వలెను - ఇల్లు;
మానవుందు - జీవదానంద యోగమ్ము
    భూమి మీద - తిరిగి పొందు గాక! 36

కనుల ముందు జరుగు - క్రౌర్యమ్ము తిలకించి,
    ఊరకుండ రాదు పౌరు డెవరు;
ప్రజలు కలిసి మెలిసి - రౌడీల రాజ్యమ్ము
    సాగనీయ రాదు - సంఘ మందు. 37

సానుభూతి తోడ - క్షమ చూప దగు గాని,
    ఎపుడు తెగడ వద్దు - ఎవరి నైన;
క్రూర హత్య వెనుక - ఘోర కారణముందు!
    మనిషి - నోరు మూసుకొనుట మేలు. 38

మతము వేరు వద్దు - మానవత్వము తప్ప,
    మంచి మీద తప్ప - మమత వద్దు;
కరుణ కంటె - విశ్వ కల్యాణ మేదయా?
    పరము గిరము మాట మరువ దగును 39

కాశికాపురి - మమకార రాహిత్యమ్ము
    పూర్వకాల మందు బోధ చేసె;
సర్వ మమత లిపుడు - జ్ఞాన గంగోత్రిలో,
    విడిచి పెట్టు గాత - విశ్వ నరుడు. 40

బిచ్చ మెత్తి బ్రదుక నిచ్చగించును - పేద ;
గ్రుడ్డి - కుంటి బ్రదుక గోరు చుండు;
వదల లేడు - రోగి - ప్రాణాలపై తీపి;
జీవహింస నెవరు చేయ రాదు. 40

సాయ మడుగ రాదు - సర్దుకోవలె గాని,
అడుగ కుండ సాయ మందు గాత;
సంఘ మందు తరచు స్వార్థమే కన్పించు;
ఎద్దు పుండు కాకి కేమి నొప్పి? 41

మాట లెల్ల - గాలి మూట ముల్లలె సుమా!
సానుభూతి చూపు చర్య వలయు;
పేదవి కదుప కుండ - హృదయ పూర్వకముగా
చేత నైన మేలు చేయ దగును. 42

అమరు చుండు - ప్రజకు - యాదృచ్ఛికమ్ముగా,
భాష - మతము - కులము - బ్రదుకు లందు;
దురుసు తనము తోడ - దురభిమానము - నరుల్
పెంచు కొనుట వట్టి పిచ్చి గాదె. 43

## రాయల సీమ

క్షామము దాపురించి పలుసారులు వచ్చెను జంతు సంతతుల్ !
వేమరు వచ్చినారు - ప్రజ వేనకు వేలు చరిత్ర చాటునన్,
క్షామము లెన్ని వచ్చిన - రసజ్ఞత - ఇంచుక చావలేదు - జ్ఞా
నామృత వృష్టికిన్, కొరత నందని రాయల సీమలోపలన్.

# ప్రేమ

సేవ పాలు హెచ్చు - శృంగార రతి కంటె;
భర్త కోరు కొనును భార్య యందు,
ధర్మ బద్ధ మైన - దాంపత్య దీక్షలో,
ముందు-కామ దహనము జరుగ వలె. 1

తమ్మి మొగ్గర మగు - తరచు జీవిత యాత్ర,
తిరిగి వచ్చు తెరువు తెలియ రాదు;
కలవు - నరులు పడెడి - ఎలుక బోనులు గూడ;
తొందర పడు పెండ్లి అందు ఒకటి, 2

మధుర మైన ప్రేమ - మౌన సంభాషణే!
స్వార్థ రహితమైన - త్యాగ నిరతి;
కౌగిలింత కాదు - కామ రాగము కాదు;
నెమరు వేయ దగిన - స్నేహ నిష్ఠ. 3

భూమిలో పునాది - ప్రేమాభిమానముల్,
మనుజ సంఘ సౌధమునకు త్రవ్వు;
మేటి మేధ - పిదప - మేడ - మిద్దెలు కట్టు,
గోపురాల తోడ - గుడులు కట్టు. 4

పుత్రు డైన గాని - మిత్ర వర్యుడు గాని,
కూర్మి చూప లేడు - కుక్క వోలె;
ఏ రహస్య మిమిడె ? ఆ రక్తమునయందు ?
గొప్ప ప్రేమ మూర్తి కుక్క పిల్ల. 5

గోచరింప దెచట - కుక్క విశ్వాసమ్ము,
వెదక - వచ్చు గాక -విశ్వ మెల్ల,
జనుల నున్న - అందు - శత సహస్రాంశమ్ము
బ్రదుకు లెల్ల ఎంత రక్తి కట్టు !! 6

కుటిల వేశ్య మిన్న - కోటీశ్వరుని కన్న,
సౌఖ్య మిచ్చు ధనము సంగ్రహించి,
కొల్ల గొట్టి ప్రజల కోటీశ్వరుండౌను;
వాడు పంచ లేడు - ప్రేమ వలపు. 7

తనయు లెల్ల పూని - తల్లి దండ్రుల పైన,
శుద్ధ మైన ప్రేమ చూపలేరు;
చిత్త మెల్ల నిలిపి - స్వీయ సంతతిపైన,
శుద్ధ మైన ప్రేమ చూప గలరు. 8

పాత కోట లోకి - పాగా బిగియ గట్టి
వీర వరుడు వేగ వెడల వచ్చు;
భార్య అనిన - వట్టి పాత కోటయె గదా!
క్రొత్త కోట గెలుచు కొనుట - గొప్ప. 9

స్నిగ్ధ మధుర లలిత శృంగార కళ యందు,
సౌహృదమ్ము పాలు చాల హెచ్చు;
స్వచ్ఛ మైన ప్రేమ - శారీరకమె కాదు,
సౌరభద్వయాల సంగమమ్ము. 10

ప్రేమ - జంట యందు - శృంగార రసమౌను
నీరసమ్ము - ఏక నిష్ఠ మైన;
ఆత్మ నిష్ఠ మైన - హాస్యాస్పదమె సుమ్ము
అచ్చ మైన ప్రేమ - త్యాగ నిష్ఠ. 11

తనయు పైన చూప - తండ్రియే ప్రేమమ్ము
వింత యేమి కలదు విశ్వమందు ?
అల్లుని పయి మామ - అభిమానమును చూప,
త్యాగ యోగ సిద్ధి తాండవించు. 12

కొండ లెక్క గలరు - గుడి గోపురము చూడ,
గ్రుంకు లాడ గలరు కొలను చేరి,
ఎవరు కొలువ గలరు ? ఎత్తు లోతుల నెల్ల ?
గుడులు కొలను వేరు - గుండె వేరు. 13

సుంత తృప్తి చెంద రెంత పెట్టిన గాని
పృథివి లోన కన్న బిడ్డ లైన,
ఒరుడె అయిన యెడల ఉపకారమును పొంద,
ప్రేమ చూపగలడు తృప్తి చెంది. 14

తల్లి తండ్రి మగడు - తరువాతి వారికే
ఆడదాని ప్రేమ అమరు నెచట;
అంత ప్రేమ ఇముడు సంతానమున పైన,
తక్కు చోట్ల తరచు తగ్గి పోవు. 15

అరయ పుణ్య మనిన - పరులకై సాయమ్ము
పరుల పీడ సుమ్ము పాప మనిన,
సర్వ ధర్మ సార సంగ్రహం బొక మాట;
ప్రేమ - ప్రేమ -ప్రేమ - ప్రేమ - ప్రేమ. 16

ఏటి నీటి లోన - ఇర్వు రెంతటి సేపు,
ముంచి వేసి శిరము లుంచ గలరు?
బింక మెపుడు నుండు ప్రేయసీ ప్రియులలో
ఎవరు ముందు తేల ఇష్టపడరు ? 17

అచ్చ మైన ప్రేమ - త్యాగ యోగము కదా !
అమ్మ పెట్టగలదు అడుగకుండ
ఆశ యున్న ప్రతిఫలాపేక్ష యున్నచో!
కాదు ప్రేమ - వర్తకమ్మె యగును. 18

ప్రేమ నరయ కాకి పిల్ల కాకికి ముద్దు;
మమత లోన గొప్ప మాయ గలదు;
అవని నెల్ల - మాయ - ఆవరించక యున్న
అంతరించి పోవు - ప్రాణి కోటి. 19

కామ మణచు కొనుట కష్టమ్ము పృథివిలో;
మానవుండు రక్త మాంసలుండు;
దాగి యుండి తోచు- యోగీశ్వరుల లోన;
మేలి ముసుగు జారు వేళ లందు. 20

ధరణి మనిషి బ్రదుకు - తర్క బద్ధము గాదు:
ప్రేమ అనిన గొప్ప పిచ్చి మమత
నిక్క మైన మైత్రి నిర్హేతుకము గదా !
ద్వేష మర్థ రహిత విభ్రమమ్ము. 21

పిచ్చి గుబులు తరచు ప్రేమగా ధర జెల్లు;
పెండ్లి తంతు వేరు - ప్రేమ వేరు;
ప్రేమ - దాటి పోవు - శృంగార పరిధినే
అచ్చ మైన ప్రేమ - అమృత సరసి. 22

చెడ్డ ఏమి లేదు - శృంగార రస మందు;
ప్రేమ యందు పాప మేమి లేదు,
ఆచరింప వచ్చు ఆధ్యాత్మ యజ్ఞమ్ము,
అమృత యోగ సుఖము ననుభవించి. 23

వలపు - యౌవనమున వచ్చు వ్యాధియే సుమ్ము
వట్టి పిచ్చి ఒంటి బాట యైన;
ఉండ వలెను - ప్రేమ - ఉభయ తారకముగా;
అవని లోన - ప్రేమ ద్వివచనమ్ము. 24

అరయ - ధనము కన్న - ఆప్యాయతయె మిన్న!
విలువ కట్ట లేరు - ప్రేమ కెవరు?
హృదిని మించ లేదు - పెదవి యెన్నడు గాని
భక్తి వేరు - నటన శక్తి వేరు. 25

నవ్వి నపుడు - రాలు - నవ రత్న దీధితుల్;
వ్రేలు -కనుల తుదల వేల్పు విల్లు;
మ్రోయు చుండు వాణి వేయి తంత్రుల వీణ
ఆడి నపుడు - ఆమె - పాడినపుడు 26

విశ్వ సృష్టి లోన - వింత ఆకర్షమ్ము,
వేరు ధ్రువము లందు - వెల్లి విరియు,
స్నేహ శీల మందు - శృంగారమున యందు:
పొత్తు కుదురు - భిన్న చిత్తములకు. 27

దొంగతనము హత్య - ద్రోహముల్ కావచ్చు:
నర సమాజ నీతి సరళి లోన,
వికట మైన - దైవ విద్రోహ చర్యయే,
సామ్య లింగ యుగళ సంగమమ్ము. 28

ఆడ మగల మధ్య - అమరు శృంగారమ్ము
సృష్టి శిల్ప సహజ చిన్మయమ్ము,
సామ్య లింగ సహిత సంభోగ మన నేమి ?
వికట రాగ రోగ విభ్రమమ్ము. 29

ద్వేష మనిన ఏమి ? దిగజారి పోవుటే !
ప్రేమ - నరుని గుండె పెంపు దెలుపు;
విడిచి పెట్ట వలయు ద్వేషమ్ము బ్రదుకులో
పెంచు కొనుత నరుడు ప్రేమ గుణము. 30

కదిపి - కుదిపి కరగు పిదపనే - సీసాను
    వాడ వలెను - ముందు వాడ రాదు;
ఔషధ రస సేవ కన్వయించెడి నీతి;
    మొదటి రాత్రి సూత్ర మిదియె సుమ్ము! 31

స్నేహ మమరు గాక - శృంగార కళ యందు;
    కామ నిరతి వేరు - ప్రేమ వేరు;
హాయి సుఖము శుభము - నాయికా నాయకుల్,
    భార్య - భర్త లైన బ్రదుకు నందు. 32

మానవ స్వభావ మాయావరణ మందు,
    కామ గుణమె అగ్ర గణ్య మగును !
అణచ కున్న యెడల అధిక కామము వేగ
    మనిషి - పశువు వోలె - మారి పోవు. 33

మనిషి - ప్రేమ నెవడు కొనలేడు ధనముతో;
    వెఱ్ఱి వాడు తప్ప - విశ్వ మందు;
ఆ ధనమ్ము దాచి - వ్యయము చేయగ వచ్చు;
    పుడమి కలవు పెక్కు పుణ్య కృతులు. 34

కూర్మి- చూప గలదు - కుక్క పిల్లను పెంచ;
    దార సుతులు చూప లేరు - ప్రేమ;
వెదికి చూడ అంత విశ్వాసమును చూపు
    వేరు ప్రాణి యేది ? విశ్వ మందు. 35

# అమ్మ

మార్క్సు - శంకరుండు - మరచి పోయిరో ఏమొ.
ఉర్వి మాతృ హృదయ మున్న మాట,
ధరణి - అర్థ మొకటి - పురుషార్థ మనరాదు!
జగతి మిథ్య కాదు - జనని యుండ. 1

అమ్మ - అన్న మందు - అమృతమ్ము జోడించి
పెట్టు బిడ్డలకును ప్రేమ తోడ,
నేరములను చేయువారు - ప్రాయికముగా,
తల్లి లేని వారు ధరణి లోన. 2

ఆడ దయ్యె అబల - త్యాగ యోగము చేత,
బిడ్డల పయి గొప్ప ప్రేమ చేత;
అమ్మ దది స్వయంకృతాపరాధమె గదా!
మాత అనుభవించు మౌన శిక్ష. 3

జనని బిడ్డలకును స్వచ్ఛంద దాసియై,
త్యాగమూర్తి అయ్యె - అబల యయ్యె;
పెత్తనమ్ము చేసె పేర్మితో జనకుండు
ఆతడింటికి అధినేత యయ్యె. 4

సృష్టి నరసి నపుడు - హెచ్చు మార్కులు పూని
విశ్వ శిల్పి కేను వేయ లేను
సృష్టి చేసె - మాతృ హృదయమ్ము, కాబట్టి
అతని ప్రతిభ నెంచి అభినుతింతు. 5

మాతృ హృదయ మెపుడు మకుటాయమానమే,
జీవ కోటి సకల సృష్టి యందు!
మనుజ జాతి యందు మాత్రమే - యన నేల ?
పశువు లందు మరియు పక్షు లందు. 6

భరత దేశ మందు - వనితా మణులలోన
మంచి తనము హెచ్చు - మమత హెచ్చు;
త్యాగ యోగమునకు - యావ జ్జగత్తులో,
మాత కంటె - గొప్ప మాట లేదు. 7

జనని కుండు ప్రేమ -సంతానమున పైన,
తండ్రి కుండు నెంత ధరణి లోన!
భార్య కుండు ప్రేమ - భర్తపై ఎంతయో !
భర్త కుండు నెంత భార్య పైన. 8

మాతృ పాత్ర కంటె - మాన్య మైనది ఏది ?
ధరణి పురుషు డెవడు తల్లి కాడు;
ఈ విచిత్ర జగతి కావచ్చు మిథ్యయే !
తల్లి ప్రేమ తప్ప - తరచి చూడ. 9

వింగడింప వచ్చు - భేద సామ్యము లెన్నొ!
అరయ స్త్రీ పురుషుల అవయవాల
మొదట ఆమె అమ్మ - పిదపనే - ఏమైన
పుడమి మీద అన్నపూర్ణ - ఆమె. 10

నిర్వికల్పమైన - నిత్య సత్యము గదా!
బిడ్డల పయి తల్లి ప్రేమ తలప;
ధరణి యెల్ల - అరయ - ధన మూల మని చెప్పె,
మరచి పోయె - మూర్ఖ - మాతృ హృదిని. 11

ఊయ లూచు చేయి - ఉర్వి యంతటి నేలు;
తల్లి కంటె వేరు దైవ మెవరు?
అమ్మ అనెడి మాట - అమరియుండును సుమ్మ!
దివిని భువిని లేని - తియ్య దనము. 12

" జగతి మిథ్య " - చాటె - శంకరాచార్యుండు,
తాత్త్వికమగు నిజము - దార్శనికుడు;
సాంఘికముగ గూడ - సత్యమే ఆ మాట.
తల్లి ప్రేమ యెడల తప్ప గాని, 13

నిత్య సత్య మైన ప్రత్యక్ష దైవమ్మ
ధరణి మీద కలదె? తల్లి తప్ప?
మాత మనసు లోని - మమత - మాధుర్యముల్;
మాయదారి సృష్టి మరచు చుండు. 14

కడిగి సేవ చేసి - కన్న బిడ్డలకునై;
అమ్మ - జీవితమున అరిగిపోవు;
నిండు అమ్మ కడుపు - తిండి బిడ్డలు తిన్న;
అమ్మ అనిన చాలు అంజలింతు. 15

అమ్మ పాలు త్రాగి - ఆయురారోగ్యముల్
పడయు చుండు బిడ్డ బ్రదుకు నందు;
బిడ్డ యెదిగి సంఘ విద్రోహి కావచ్చు !
జనని ప్రేమ చూరగొనని యెడల. 16

తథ్యమైన దేది? మిథ్యా ప్రపంచాన ?
మాత చూపు నట్టి మమత తప్ప !
గుడ్డి వాని గాని - కుంటి వానిని గాని
ప్రేమ తోడ - అమ్మ - పెంచ గలదు. 17

అమ్మ పెట్టు నట్టి ఆహార మది వేరు !
పూట కూటి పొట్ట పూడ్చు వేరు!
వచ్చు గొప్ప విలువ - వస్తు జాలము కెల్ల,
ఇచ్చు నట్టి వారి హృదిని బట్టి. 18

* పైకి చూడ-రెండు బండ రాళ్ళే గాని,
రవ్వ వీను చుండు రాపిడులకు,
జరుగు చుండ - చర్చ - సాహితీ గోష్ఠిలో
విస్ఫులింగ కాంతి వెల్లి విరియు.

* అల్ప విషయము పయి - అధిక శోధన చేయు
ఆధునికుడు పండితాగ్ర సరుడు
ఖండ సత్యములకు కట్టు పట్టము నేడు
విశ్వమందు వివిధ విద్యలెల్ల.

# విద్య

బ్రదుకు లోన నరుని వ్యక్తిత్వమున చేరు.
పరిసరాలు నెరపు ప్రాభవమ్ము;
వాన - గాలి - వెలుగు ప్రాణ బీజము పెంచు,
గొప్ప చెట్టు పెరిగి గోచరించు. 1

లేశ మైన వెఱ్ఱి లేనిచో - మనుజుండు
జగతి లోన యంత్ర సమ్మితుండు;
తరచు మనుజు మెదడు - తర్క బద్ధము గాదు.
సుంత వెఱ్ఱి లేక సుఖము లేదు. 2

మనిషి - తెలివి గలిగి - పనిచేయ కున్నచో
బ్రదుకు నందు - త్రుప్పు పట్ట వచ్చు;
మనుజ సంఘ మందు - పనిచేయు వారికే,
అయురభ్యుదయము లమర గలవు. 3

పూర్ణ పాపి లేడు - పూర్ణ పుణ్యుడు లేడు.
జగతి లోన మనుజ జన్మ లందు;
పాప జలధి మధ్య - ద్వైపాయనుండౌచు,
పూర్ణ పుణ్య మూర్తి - పుట్ట డెవడు. 4

బ్రదుకు నందు - ధనము - పాండిత్యములు కల్గ,
నరుడు తరచు గర్వ భరితు డగును!
విద్య కాత్మ యేది ? - వినయమ్ము మాత్రమే;
మానవతకు - గుర్తు - మంచితనము. 5

ప్రౌఢ మానసమ్ము - మూఢ విశ్వాసమ్ము
వెలుగు నీడ లట్లు వేరు వేరు
బ్రదికి యున్న తెలివి - యెదురు ప్రశ్నలు వేయు
చదువు - విశ్వ మెల్ల కదుపు కుదుపు. 6

శైశవమ్ము లోన - చదువు పేరును పెట్టి,
మోయ లేని బరువు మోపరాదు,
విద్య కవసరమ్ము - విశ్రాంతి మననమ్ము
పెరుగు మనసు లాట విడుపు లందె. 7

విద్య - వేగ - మూఢ విశ్వాసముల నెల్ల,
గుండె నుండి వెడల గొట్ట వలెను;
ఇహము నందె - స్వపర గృహము లన్నియు నుండు;
నరుడు - బ్రతుకు గాక పరము విడిచి. 8

అరయ - జ్ఞాన మెపుడు - అధికార మొన గూర్చు;
ఆత్మ గౌరవమ్ము నంద జేసి ,
చదువు గూర్చు చిత్త సంస్కార సందీప్తి;
అగ్ర గణ్య లాభ మనగ జెల్లు. 9

నరుడు సృష్టి గూర్చి -పరిశోధనలు చేసి
యుగ యుగాల నుండి - ప్రగతి కూర్చె;
తన మనస్సు గూర్చి - తన శరీరము గూర్చి,
చాలి నంత కృషిని సలుప లేదు. 10

విద్య - విద్య కాదు - వినయమ్ము లేనిచో !
సహన గుణము లేక జ్ఞాని కాదు,
వ్యర్థ మగును విజయ మౌదార్య రహితమై;
ఆది యందు అపజయమ్ము మేలు. 11

బాల బాలికలను - పలు దురాశల తోడ,
బడికి - తల్లి తండ్రి - పంపుగాక!
స్వేచ్ఛ తోడ - బిడ్డ ఎదుగ నిల్చుట మేలు,
చదువు - ఆట వోలె - సాగు గాత! 12

చదువు లెల్ల పెంచు - శబ్ద కాలుష్యమ్ము,
పాఠశాల - గోల - పనికి రాదు,
మనసు విరియు నట్టి - మౌనమ్ము మననమ్ము
నేడు పాఠశాల నేర్పు గాత! 13

వయసు పెరుగు కొలది - బండ బారుచు నుండు
మనిషి మెదడు చురుకు దనము తరిగి,
ప్రగతి శీలురైన పాలకుల్ - తమ దృష్టి
పాఠశాలల పయి - బరపు గాత! 14

లోక మందు - జనులు - ఏకదేశము గాంచి,
పూర్ణ మనుచు భ్రాంతి పొంద వచ్చు;
విద్య - భాగములుగ - విభజించు జ్ఞానమ్ము,
పూర్ణ దృష్టి - జ్ఞాని - పూన దగును. 15

విద్య - ప్రగతి కాత్మ - విశ్వ మంతటి లోన,
    విద్య - వేయ గలదు - వెలుగు బాట;
బ్రదుకు కెల్ల - విద్య - పాథేయ మొనగూర్చు
    ప్రజ్వరిల్లు  అంతరంగ దీప్తి. 16

విద్య - ఒసగు  ఆత్మ విశ్వాస యోగమ్ము,
    వినయ మందు దాగు  వికట నటన;
దొంగ వినయ మెపుడు - ధూర్త లక్షణ మౌను;
    ధరణి - సత్యవాది - ధన్య జీవి. 17

ప్రజ్ఞ కంటె మేలు - ప్రాజ్ఞతల్ - జగతిలో !
    పొదుపు  గొప్ప గుణము  బ్రదుకు లోన,
విద్య కంటె  ఘనము - వినయమ్ము  మనిషిలో!
    అధమ గుణము లేదు - అహము కంటె. 18

చదువు లందు  ఇంక - శని ఆదివారాలు
    సెలవు దినము  లగుచు చెలగు గాత !
పఠన మందిరములు - వర్ధిల్ల వలె  నింక,
    బడులు  కొన్ని  మూత పడుట మేలు. 19

అక్షరాలు గాక - ఆంతర్య మరయుటే,
    మేలు - పూర్వ పుస్తకాల యందు;
చదువ కష్ట మౌను - సమయ సీమలు వేరు,
    అర్ధ విపరిణామ మందు -  భాష. 20

చిత్ర చిత్రము నరు చిత్త ప్రవృత్తియే;
వశము గాదు - హేతు వాదమునకు,
కలిసి మెలిసి విశ్వ కల్యాణ మార్గాలు,
విద్యలు కళ లింక వెదకు గాత! 21

చేర రండు - గుండె చీకటుల్ పోకార్చ,
క్రొత్త విలువ లెన్నొ కూర్చు - విద్య;
పొండు-వెలుగు తళుకు పండింప పృథివిలో,
ఎల్ల లెల్ల దాటి యెదిగి మీరు. 22

" తల్లి - రత్న గర్భ - తనయుండు నిరుపేద "
భరత దేశ మందు - వచ్చె నిజము;
పార ద్రోల వలయు - దారిద్ర్యమును ముందు;
విద్య - పెంచు పిదప విలువ లెల్ల. 23

అక్షరాల మీది - ఆధిపత్యము కంటె,
చేతి విద్య మేలు - జీవితమున,
సామ్యవాద మందు శ్రమజీవి పూజ్యుండు;
మాన్య తముడు నవ సమాజ మందు. 24

చెప్ప వచ్చు శుద్ధ సిద్ధాంతములు తీర్చి,
ఆచరణము ముఖ్య మంత కంటె;
అవసరమ్ము కుదురు టవగాహనము సుమ్ము;
విషయ సంకలనము విద్య కాదు. 25

నరుడు సలుపు చున్న - పరిశోధనల యందు,
పూర్ణతాసమగ్ర బుద్ధి ఏది ?
విద్య లందు సగము విభ్రాంతియే సుమ్ము!
నొక్కి చెప్ప రాదు నిక్క నీల్గి. 26

మనుజు నందు - రక్త మాంసమ్ములే గాక,
వెల్లి విరియు చుండు వెలుగుకూడ
దాని - నాల్గవ కొలతగ తిద్దు నట్టిదే
విద్య యనగ చెల్లు - విశ్వ మందు. 27

మేధ - చదువు మీద - ఆధారపడి యుండు,
మనుజ వర్తనమ్ము - మలచ వచ్చు,
మతము విడిచి పెట్టి - మానవత్వము - ప్రేమ
నీతి - త్యాగ నిరతి - నేర్ప వలెను. 28

మనుజు లందు - మోహ మాత్సర్యములె గాక,
త్యాగబుద్ధి- ప్రేమ దయయు గలవు,
చదువు వలన - సరళ సౌశీల్య భావమ్ము
పొదుగ వచ్చు బాల హృదుల లోన. 29

సంఘ కల్పితములు - సంప్రదాయము లెల్ల,
ఏది పావనమ్ము కాదు; - లేదు ;
చదువు - కూర్చ దగును - హృదయ వైశాల్యమ్ము;
సర్వ సంగ్రహమ్ము - సహన నీతి. 30

సంగ్రహించు కొరకు - సర్వ విజ్ఞానమ్ము
 భారతమ్ము - చదువ వలయు ప్రజలు;
భారతమ్ము నెల్ల -పఠియింప లేనిచో !
 చాలు - భర్తృహరిని చదువ వలయు. 31

పుటలు విప్పి అతడు పుస్తకమ్ముల పెక్కు
 బ్రదుకు నందు ఎపుడు చదువ లేదు;
చదువు - ఎదుటి వారి హృదయాలు వెంటనే;
 చాలు - మొగము చూడ - క్షణము లోన. 32

గొప్పదనము తెలుపు - కొలబద్ద యేదయా ?
 చదువు గాదు గొప్ప పదవి కాదు;
అరయ - ధనము చేయు ఆర్భటమా ? కాదు !
 విద్య వలన కలుగు - వినయ నిష్ఠ. 33

పాఠశాల లందు -వ్యాయామమే గాక,
 నీతి నియతి గూడ నేర్పవలయు
బాల బాలికలకు శీలమే ముఖ్యమ్ము
 బ్రదుకు నందు - గొప్ప చదువు కంటె. 34

చదువు పేర - వివిధ శాస్త్రాలు చదివించి,
 చంపి వేయ రాదు - శైశవమును.
మెదడు - చోటు లేని గదిని చేయగ రాదు;
 శిశువు పెరుగు గాత స్వేచ్ఛ తోడ. 35

అల్ల - లంక మ్రగ్గి నట్టి సీతను బోలు;
ఆట విడుపు లేని అధ్యయనము;
దేహమునకు - క్రీడ - దోహదమ్మను గూర్చి,
శుద్ధి చేయు మెదడు - బుద్ధి పెంచు. 36

చదువు - బ్రదుకు లోన - సాధించునది ఏమి ?
మెదడు సాన బట్టి పదను గూర్చు,
వాడ మెదడు తరచు -బహు సమస్యలు తీరు;
పదను కత్తి తరుగు పండ్ల నెల్ల. 37

ప్రతి దినమ్ము నందు - ప్రతి పాఠశాలలో,
కొంత సేపు మౌన శాంతి నిష్ఠ;
ప్రార్థనా సమాధి పాటింప బడుగాక!
తేరు కొనుచు మనసు తేట బడును. 38

బ్రదుకు నందు చదువు పది శాతమే చాలు;
వెఱ్ఱి పరుగు లేల ? విద్య పేర ?
చదువు వేరు! హృదయ సంస్కారమే వేరు;
మనిషి పెంచుకొనుత మంచితనము. 39

బాల బాలికలకు - పదునాల్గు వత్సరాల్
తోట బడుల ఆట పాట చాలు;
వ్రాత - నీతి కథల పఠనమ్ము - పద్యాలు,
మేలు చాలు ప్రాథమిక గణితము. 40

తోట బడుల లోన - ఆట పాటలు మేలు;
విద్య - జీవహింస - వేట గాదు,
లేత బుఱ్ఱ లందు - భూత శాస్త్రము లెల్ల,
రోత గొలిపి వేగ - క్రుక్క రాదు. 41

జన్మ చేత - నరుడు - జ్ఞానవంతుడె గాని,
మెదడు లేని - క్రూర మృగము కాదు;
మేలి హృదయ మున్న - ఆలోచనా శీలి;
సంస్కరింప గలదు చదువు నరుల. 42

నరుని లోని చెడు గుణాలు నిర్మూలించి,
మంచి గుణము లెల్ల పెంచ వచ్చు;
చదువు - మనిషి హృదయ సంస్కారమును పెంచి
వెలుగు బాట - పూని - వేయ గలదు. 43

తీరిక మెయి - పశువు - తినిన గడ్డిని పేర్చి,
వెలువరించు నెమరు వేసుకొనును.
చర్విత చరణముగ చదివినట్టిది యెల్ల;
మనిషి - నెమరు వేసి కొనుట - మేలు. 44

చదల పిడుగు లురలి - ఝంఝా నిలము రేగి,
జగతి యెల్ల కుదుపు సమయమందు,
చెవుల నొగ్గ రెవరు - సెలయేటి పాటకై!
జ్ఞాని - యోగ నిద్ర - పూను గాత. 45

సమత - స్వేచ్ఛ - విశ్వ సౌభ్రాత్ర భావాలు,
ఘోర విప్లవాలు కూర్చ లేవు!
విద్య - కూర్చ గలదు - విశ్వ కల్యాణమ్ము;
విప్లవమ్ము కంటె - విద్య మేలు. 46

వీను లొగ్గి వినుడు - విశ్వ సంగీతమ్ము,
తారకాగ్రహతతి తాండవింప;
జ్ఞానయోగి - బ్రదుకు - సచ్చిదానందుడై,
డెంద మందు - శాంతి చిందు లాడ. 47

సంఘమునకు ఎట్లు సమకూరు శ్రేయస్సు ?
వ్యక్తు లెల్ల - మంచి వారలయిన;
వ్యక్తి - యెట్లు బాగుపడు ప్రపంచము నందు ?
మనిషి బాగు పరచు - మంచి చదువు. 48

ప్రొద్దు పుచ్చ రాదు - పుస్తకమ్ములతో
మెదడు మొద్దు వారు చదువు వలన;
చదువు కొనెడి వారి మెదడు క్షాళన చేయ
ఆట విడుపు గూడ అవసరమ్ము. 49

ఎన్ని పదవు లున్న - ఎన్ని సంపద లున్న
లేదు సుఖము- తృప్తి లేని యెడల
విద్య - యెంత యున్న - వినయమ్ము లేనిచో!
లేదు - చిత్త శాంతి - లేదు సుఖము. 50

భాష్యకర్త - చూప వచ్చు - స్వారస్యముల్
అనుసరణలు వాఙ్మయమున
వ్యంగ్యవైభవమ్ము - ధ్వని లక్షణార్థమ్ము
తెలిసి నట్టివారు తలల నూప 51

ఎరిగి - సూత్ర కర్త - ఏకాంత విషయమ్ము,
స్వీయ శైలి లోన చెప్ప వచ్చు,
అన్ని విషయములను - వ్యాఖ్యాత వివరించి,
విప్పి చెప్ప వలెను - విపుల శైలి. 52

వక్ర భాష్య మెట్టి వాక్యమ్ములకు నైన,
వ్రాయ వచ్చు పాత్రికేయ వరుడు,
మౌన నిరతి మేలు - మంత్రి వర్యుల కెల్ల,
రాజకీయ కవచ రక్ష గూర్చు. 53

ఎచట దొరకు నేడు - ఏకాంత వాసమ్ము ?
బ్రదుకు నందు తీరు బడియె లేదు !
హృదికి లేదు చోటు - చదువు లందున నేడు,
మేత వేయబడును మెదడు కెపుడు. 54

హాని చేయ నేర దజ్ఞాన తిమిరమ్ము;
చూర గొనదు ప్రజల గౌరవమ్ము;
మేటి హాని చేయు మిడిమిడి జ్ఞానమ్ము
మభ్య పెట్టు ప్రజల మాయ చేయు. 55

బౌద్ధ మంతరించె భారతదేశమునందు
బోధ చేసి - సకల భూత దయను:
బ్రహ్మ చర్య నిష్ఠ - ప్రజకు సాధ్యము గాదు
అవధు లుండ వలెను త్యాగమునకు. 57

సంఘ మందు శాంతి సౌశీల్య సంరక్ష,
సంఘటింప లేవు శాసనములు ;
చదువు - ప్రజకు - హృదయ సంస్కార మొనగూర్చు,
ఆత్మ నిగ్రహమ్ము నందజేయు. 58

అవని లోన అనుభ వామ్రేడితము సుమ్ము!
గొప్ప మత్తు మతము గొలుప గలదు!!
మతము విఫల మయ్యె - మానవత్వము పెంచ
వెదకు గాక వేరు వెరవు - విద్య. 59

---

☆ జరిగె చరితలోన - సన్నివేశము లెన్నొ
శవ పరీక్ష లిపుడు జరుప రాదు;
మానవులకు వర్తమానమే ముఖ్యమ్ము
చూపుకొంత వలయు రేపు మీద.

☆ అల్ప విషయము పయి - అధిక శోధన చేయు
ఆధునికుడు పండితాగ్ర సరుడు
ఖండ సత్యములకు కట్టు పట్టము నేడు !
విశ్వమందు వివిధ విద్యలెల్ల

# నరుడు

స్వర్గ నరకములకు - సంగమ క్షేత్రమ్ము
అవని - పుట్టి గిట్టు నట్టి - నరుడు;
నరుడు - రాక్షసు డగు - కరుణార్ద్ర యోగియౌ!
స్థితి గతులను బట్టి - జీవితమున. 1

పుట్టుపాపి యెవడు పుడమిపై జీవించు ??
ఉర్వి - పైన పుట్టుయోగి గలడె ?
బొమ్మ బొరుసు పగిది - భూమిపై చరియించు
పరమయోగి గాని - పాపి గాని. 2

అవని పుట్ట డెవ్వ డాజన్మ పాపియై;
ఎంచ నరుని ప్రకృతి మంచితనమె;
జగతి మానవుండు - సంఘమ్ము చేతిలో
ఆడు కీలు బొమ్మ యగుచు తరచు. 3

వయసు మళ్ళి - తెల్ల బడవచ్చు వెంట్రుకల్!
కఱ్ఱ చేత బట్టి కదల వచ్చు;
కాని బాల హృదిని కలిగి యుండిన గాని,
గొప్ప వాడటంచు చెప్ప రాదు. 4

అమరు కొంత మంది కజ్ఞాత పుచ్ఛముల్ !
గోచరింప నట్టి కొమ్ము లుండు !!
మసల వచ్చు వారు - మనుజ రూపము తోడ,
పరుల కష్ట సుఖము లెరుగ కుండ. 5

ఘనత - తరచు - దేశ కాల సాపేక్షమే !
వ్యక్తి శక్తి మిగుల పరిమితమ్ము;
సగటు మనిషి గూడ - సాంఘిక స్థితి గతుల్
తోడు పడిన -గొప్ప వాడె యగును. 6

వానరునకు - నరుడు - ప్రతిబింబమై తోచు!
దైవమునకు కాక ధరణి యందు !
జగతి లోని సర్వ జంతు సమ్మేళమే,
మానవ ప్రగతిగ - కానుపించు. 7

కార్చ కుండ వేడి కన్నీరు వరదలై
కనుల లోన మ్రింగు కొనెడి వాడు,
పగలు మరచు వాడు - జగదేక వీరుండు;
అరయ - ఏడ్చు వాడు - పిరికి పంద. 8

అవని - బ్రదుకు నట్టి హక్కు - జీవితములో
కలదు రెండవ తరగతి ప్రజలకు;
లోక మందు అరయ కోకొల్ల లున్నారు;
దీన జనులు ఏమి లేని వారు. 9

వెలుగు జిలుగు కాదు - నలుపు నీడయె గాని
అతుకు లున్న రాతి ప్రతిమ నరుడు ;
విద్య లెల్ల - కృతక విగ్రహారాధనల్;
పుడమి నరుడు మిణుగు పురుగు బోలు. 10

పూని మంచి పనులు - పుణ్యమ్ము కోసమై,
చేయువాడు కాడు - శ్రేష్ఠ తముడు;
మంచి పనులు -కోరి - మంచి కోసమె పూని,
చేయు నట్టి వాడు - శ్రేష్ఠ తముడు. 11

బ్రదుకు - నరుడు దేహ రక్త మాంసాలతో;
అమృత పరము గాదు - అతని మనసు;
ఉండ వచ్చు గాక - ఒక స్థితప్రజ్ఞుండు;
భూతలాన గాక - గీత లోన. 12

అరయ - నరుని జన్మ - యాదృచ్ఛికము సుమ్ము
తల్లి - తండ్రి - మతము - ధనము - భాష;
గుణ సమూహ రక్త కణ యోగము లెల్ల;
ప్రకృతి చేతి 'గాలిపటము ' నరుడు. 13

నరుడు పూని ఒక్క నందనోద్యానమ్ము ,
మనసు లోన , పెంచు కొనుట మేలు ;
పెంచ గలడె ఇంటి పెరడులో ఎవడైన?
చిన్ని పూల తోట - చేతులార. 14

ధరణి లోన - నరుల ధన వాంఛ చెడ్డదే,
దుర్గుణమ్మె కీర్తి దురద గూడ;
నిర్వహింప దగును - నిర్వ్యాజముగ పూని,
మంచి పనుల నెల్ల - మానవుండు. 15

పుడమి గుడిని - నరుడు - గడియారమున వ్రేలు,
కీలు మరల లోహ లోలకమ్ము!
ద్వంద్వ బద్ధ జీవిత విచలత్ డోలలో,
మనిషి - ఊగు లాడు ఇనుప గొలుసు. 16

చిన్న చిన్న పనులు - శీఘ్ర కాలము లోన,
నిర్వహించు నరుడు నేర్పు తోడ;
మనిషి - పెద్ద పెద్ద పనులు చేసెడి లోన,
బడల వచ్చు - త్రుప్పు పట్ట వచ్చు. 17

కనులు మూసి - గుండె కప్ప గంతులు వేసి,
మంచి తనము తరచు మరిచి,
పరులమీద ప్రేమ - కరుణ - న్యాయము చూపి
కలి యుగాన బ్రదుక గలడె ? నరుడు. 18

ఎపుడు తెగడ వద్దు - ఎవరి చర్యను గాని,
ప్రతి మనిషికి కలదు బ్రదుకు హక్కు;
సానుభూతి తోడ - క్షమ తోడ - దయ తోడ,
జరిగి నట్టి కీడు మరువ దగును. 19

ఈ విశాల మైన సృష్టిలో గణియింప,
పురుగు బోలు వాడు నరుడు సుమ్ము!
అయిన గాని ఉన్న అణుమాత్ర శక్తితో,
మిణుగురు పురుగు వలె మెరయ వచ్చు. 20

మానవ స్వభావ మాయావరణ మందు,
కామ గుణమె అగ్రగణ్య మగును;
అణచ కున్న యెడల - ఆ కామ లౌల్యమ్ము
మనిషి - పశువు పోలె - మారి పోవు. 21

ఉండు నెడల - గడును పిండమ్ము - మనుజుండు
ఎక్కు ఏన్గు నైన - ఎలుకనైన,
త్రిప్పుకొనును వెంట తెలివి తేటల తోడ,
కుక్క నైన - గుంట నక్క నైన. 22

చదువు మాత్ర మున్న సరిపోదు బ్రతుకులో,
పండ వలెను నరుని గుండె గూడ;
అక్షరాల మీద - ఆధిపత్యము తోడ,
మనిషి పెంచు కొనుత - మంచితనము. 23

అర్థ శాస్త్ర కృతక యవని కాంతర మందు,
ఆడు నీడ బొమ్మ కాడు నరుడు;
ఎడద నుడులు వేరు - హేతువాదము వేరు!
మనిషి మనసు ఇంద్ర ధనువు సుమ్ము! 24

నరుడు - అవయవాల వెరసి మొత్తము కాడు,
అంతరార్థ మైన ఆత్మ కలదు;
సృష్టియందు - నరుడు - చైతన్య నిధి గాని
లోక యంత్ర మందు - మేకు కాడు. 25

తెలియ లేదు - సృష్టి ధ్యేయమ్ము మనుజుండు;
మాట మూగ వోవు - మనసు మరలు !
సృష్టి తీర మందు - జిజ్ఞాసు బాలుండు;
గులక రాళ్ళ నేరు కొనును సతము, 26

వేయు - మనిషి మెదడు - విజ్ఞాన విజిగీష,
నింగి కెగయు నిడివి నిచ్చెనలను,
ధరణి - క్రగ్గు - పెక్కు దారిద్ర్య నరకాలు;
సిగ్గు సిగ్గు - మనిషి చిత్త వృత్తి. 27

నేల మీద తిరిగె నిర్భీతితో - కోతి ,
తిరిగె ప్రజలు గల ప్రదేశ మందె;
మానవ స్వభావ మర్మమ్ము నెరిగెబో!
నరులు - దరికి చేర వెరచి నారు. 28

తాడి చెట్ల పైన - తరచుగా తరచుగా
కానుపించు - ముంజ కాయ లెన్నొ!
పోతు తాడి చెట్టు పుష్పాడుల్ తరచుగా,
కాన రావు మనిషి కనుల ముందు. 29

బండ బారి పోవు - గుండె - మానవులలో,
వచ్చె నేని ధనము పదవి - చదువు ;
శీలమునకు గుర్తు - జీవ కారుణ్యమే;
జాలి గుండె యున్న మేలు - చాలు. 30

తన ఘనతను గూర్చి - తన అభిప్రాయమ్ము
ఎదుటి వాని గూర్చి - ఏవగింపు;
ఎవడు దాచుకొనునొ - హృదయాంతరములోన!
అతడు - పెద్దమనిషి - యనగ బరగు. 31

మనిషి - బ్రదుకు నేడు - మర బొమ్మగా మారె,
ఆట విడుపు లేదు - అతని కిపుడు,
నేల నిలువ లేడు - నింగి తారల చూడ;
తిరుగు - ఇల్లు విడిచి - తిండి కొరకు. 32

మనిషి - మిగులు ధనము - వినియోగబడు తీరు;
శీల శోధనమ్ము చేయ గలదు;
పరుల ఆర్తి బాపు కొరకు - వెచ్చించుచో!
ధర్మవీరు డతడె - ధన్యు డతడె.! 33

తెలివి యుండి గూడ - తెలివి లేనట్లుగా
నటన చేయ గలుగు నరుడు - ఘనుడు;
పనులు జరుగు తరచు - వినయమ్ము చూపింప,
బెడిసి కొట్టు - చూపు నెడల డాబు. 34

నాణెములకు వోలె - నరుల వైఖరు లందు,
అరయ వచ్చు బొమ్మ బొరుసు షేరుస;
మనిషి చర్య వేరు మాట వేరన నేల ?
తెలిసి కొనుట సులువు త్రిప్పి చూడ. 35

ఆశ - పదవి పైన - అంతరించదు గదా!
ఎంత మునలి వారి కేని గాని,
పొంగి పొరల వచ్చు - శృంగార లౌల్యమ్ము!
వయస్సు మళ్లి నట్టి వారి కైన. 36

యంత్రమునకు దాసుడై పోయె మనుజుండు!
జడము గెలిచె - ప్రాణి ఎడద నణచి;
మంచి చెడ్డ లేదు -మానవత్వము లేదు;
కలి యుగమ్ము రాక్షసులకు నెలవు. 37

## హేతువాదం

హేతు వాదమున కతీతమై నరులలో,
అభిమతములు కొన్ని అమరి యుండు !
సర్దుకొనుట మేలు - సల్లాపముల యందు;
సంఘ యాత్ర యందు సాటివాడు. 1

"అతని ప్రాతిపదిక లంగీకరించుచో
అతని తర్క శక్తి - అద్భుతమ్ము;
అతని నిర్ణయమ్ము లన్ని "నిర్దుష్టముల్"
" పలికె - యోగి - హేతు వాది గూర్చి. 2

పాత నమ్మకాల - హేతు వాదము చంపె;
నరక భీతి లేదు - నరుల కిపుడు;
నిఖిల జగతి నిండె - నేడు శూన్యత్వమే !
మంచితనము నింక పెంచు టెట్లు ? 4

# కాలం

పరసు వేది - సర్వ పర్యాయ పారమ్ము-
కాలమునకు విలువ గట్ట లేము;
సమయ పాలనమ్ము - సౌశీల్య చిహ్నమ్ము
సుప్రసిద్ధ - సంస్కృతీ ప్రతీక. 1

గాంధి ఋషిని దిద్దె కాలమ్ము గొప్పగా !
ఒక మహాత్మ జేసి - ఉగ్గడించి;
జ్ఞాని యయ్యె గాంధి - సమయ సీమలు చేర,
ఉర్వి మీద - త్యాగ యోగి - యయ్యె. 2

సంఘ సేవ కొరకు - సత్కార్యములకునై
దాన మీయ వచ్చు ధనము తరచు;
కార్య శూరు డెపుడు కాలమివ్వగలేడు
మైకు ముందు మేను మరువ లేడు. 3

కలిసి వచ్చినపుడు కాలమ్ము మనుజుండు,
విఱ్ఱవీగ వచ్చు బుఱ్ఱ తిరిగి;
నాకమునకు ఎత్తు నరజన్మ - కాలమ్ము !
వేగ నరకమునకు - విసరి వేయు. 4

తిరిగి పోవు చుండు - గిరగిరా కాలమ్ము !
ఆగ కుండ క్షణము - సాగి పోవు;
వేయ లేదు - చరిత - వెనుకంజ ఎపుడైన;
జరిగి నట్టి క్షణము - తిరిగి రాదు. 5

పుడమి మీద - నేడు భూత కాలము గూడ
నరుల రూపు దాల్చి తిరుగ వచ్చు;
మనిషి - యెడద వర్తమాన కాలము తోడ
శ్రుతిని గూర్చు కొనుత - బ్రతుకు నందు. 6

జయము కూర్చ లేవు - శక్తి సామర్థ్యముల్!
కలిసి రాని యెడల కాల మెపుడు;
నాడు చేసిన పని - నేడు - చేయగ రాదు;
ఉండ వచ్చు - శక్తి యుక్తు లెల్ల. 7

నాటి పలుకుబడికి - నైఘంటు కార్థమ్ము
చెప్పి నేడు వ్యాఖ్య చేయ రాదు!
సంఘ గతులు మారె - సందర్భములు మారె!
మాట - వక్త మనసు - చాట లేదు. 8

గడచె - ఏండ్లు పూండ్లు కాలమ్ము సృష్టిలో!
ధరణి చుట్టు చేరి తిరుగ సాగి;
ప్రాణికోటి - సృష్టి పరిణామ సరళిలో
చేరి ఆడు ఒక్క చిన్ని బుడగ. 9

జగతి సూర్య రహిత సమయ ముండును గదా!
కూలి పోవు - సూర్య గోళ మెపుడో !
ఆరి పోవు కొన్ని - తారకల్ క్రమముగా;
సాగి పోవు సృష్టి ఆగకుండ. 10

ఏ నిముసమ్మును - కాల
జ్ఞానము లోన గలిగి - వృథ సలుపని వాడే;
మానవ మాన్యుడు, ధన్యుడు;
జ్ఞానానంద యోగి - జగతిని - సుమతీ 11

మేలు - చేయ వలెను ఆలస్యమును వీడి
రక్తి చెడక ముందు - శక్తి కొలది;
విలువ పెంచు -పెంచు విశ్వాస బంధమ్ము;
సత్వరమ్ము సలుపు సాయ మెపుడు. 12

కదలి పోవు నట్టి - కాల స్రవంతిలో,
పుట్టి గిట్టు చుండు -బుడగ లెన్నొ !
పరగు - అండ పిండ బ్రహ్మాండములు నట్లె
ఇంక - నరుని ఆయు వెంచ నేల? 13

చింద వచ్చు తరచు మందహాసము గాని,
పెదవి విప్పరాదు - పెద్ద మనిషి,
సభల లోన ఏ ప్రసంగమైనను గాని;
ఎంచ పావు గంట మించ రాదు. 14

జరుగు - చుండ మార్పు - సంప్రదాయము మధ్య,
సంఘ మందు పోరు సంతతమ్ము;
చరిత లోన సహజ పరిణామ సిద్ధమ్ము;
మార్పు - కాల చంక్రమణము నందు. 15

గొప్ప విలువ లెల్ల - కూలి పోయెను నేడు;
ఉప్ప దనము పోయె ఉప్పు నందు;
అఖిల శాఖ లందు - అవినీతి హెచ్చయ్యె!
హరుని చిచ్చు కన్నె - ఆరి పోయె! 16

తొందరపడ వద్దు - తొట్రు పాటును వద్దు;
కలదు గొప్ప శక్తి కాలమునకు,
తరలు శత్రు శవము లరయ వచ్చును నీవు ;
ఓర్పు తోడ - వేచియున్న యెడల. 17

దున్న వలెను - పొలము - తొలకరించిన వేళ,
వీలు చాలు నెరిగి విత్త వలెను;
జయము దాగు; ఉచిత సమయమ్ము పొట్టలో;
అదను పదను లెరుగు టవసరమ్ము. 18

తిరుగు కాలము గిర గిర ఆగకుండగా,
వారములును నెలలు వత్సరాలు,
మరణ మొందు పిదప - స్మరణావశేషమై,
నిలువ వచ్చు - పేరు - నేల మీద. 19

కాటు వేయ వచ్చు - కర్కోటకుని వోలె,
కాల సర్పమే - అకారణముగ;
కలిసి రాని యెడల కాలమ్ము - బ్రదుకులో,
ఏమి చేయ గలడు - ఎవ్వ డైన ? 20

మనుజ సంఘ చరిత - మార్పులే ! మార్పులే !!
కాలమునకు మార్పు గరిమ నాభి;
బ్రదుక నేర్చు - కాల పర్యాయ వేత్తయే!
మార్పులకు సుముఖుడు మనుజ వరుడు. 21

ఏలు చాలు నెరిగి - కాలమ్ము గుర్తించి,
పనులు చేయ దగును మనుజు లెల్ల ;
పాదు పెట్ట దగును వాన కాలము నందె,
అసమయ కృషి తరచు వ్యర్థ మగును. 22

శాశ్వతమ్ము - సూర్య చంద్రు లైనను గారు,
చిత్ర చిత్ర మైన సృష్టి లోన
అరయ; మూల " శక్తి " ఆద్యంత రహితమ్ము!
కవుల ప్రతిభ - మూర్తి కల్పనమ్ము. 24

చేరి - చంద్ర రహిత శివ జటా జూటమ్ము
అరసె - జాంబవంతు డల్ల నాడు;
కాంచు - కాలవేత్త - గగనమ్ము రవి వినా;
కల్పనా కథ అది గాదు - నిజము. 25

ఏ నిముషమ్మును కాల
జ్ఞానములోన గలిగి వధ సలుపని వాడే
మానవమాన్యుడు ధన్యుడు
జ్ఞానానందమయ యోగి జగతిని - సుమతీ . 26

సులువు బలువు లెరిగి - సూక్ష్మ దృష్టిని గల్గి,
పనుల చేయ వలెను - బ్రదుకు నందు,
పొలము దున్న దగును - తొలకరించెడు నాడు;
విత్తు నాట వలెను - వేళ నెరిగి. 27

పక్వ మైన యెడల - భావాలు జగతిలో !
వ్యాప్తి - చెంద గలవు - ప్రజల లోన,
కొన్ని నాళ్ళు - ముందు - గొంగళీ పురుగుగా,
సీత కోక చిలుక - చెందు నిదుర. 28

కాల మాగి పోదు -గడియార మాగుచో!
ప్రొద్దు - పొడుచు - కోడి పుంజు లేక;
మనుజు లెవ్వ రైన - పని మానుకున్నచో,
భూమి తిరుగు టాగి పోదు - సుమ్ము! 29

బ్రదుకు నందు - కాల పర్యాయ వేదియే
జయము గాంచు చుండు - సమయ వేత్త;
జయ మటన్న - ఒక రసాయన ద్రవ్యమే,
కాలమునకు పురుషకారమునకు. 30

అవని లేక - చంద్ర రవి తారకలు లేక
కాల మలలు లేని పాల కడలి;
పాల కడలి - స్రష్ట - వట పత్ర శాయియే:
అనెడి మాట కంత రార్థ మేమి ? 31

జయము నందు నరుడు - సమయజ్ఞు డైనచో!
వ్యర్థ మగు అసమయ యత్న మెల్ల,
సంగమించ వెదల - సమయ సన్నాహముల్,
పుట్టు బిడ్డ పేరు " పూర్ణ శుభము. " 32

కాయ యగును - పండు- కాలమ్ము గడువగా,
అనవసరము నరుల యత్నమేది;
మేలు తెలిసి కొన - కాల ప్రభావమ్ము!
నాలుగవ కొలతయె కాల మనిన. 33

## వ్యవస్థలు

లోన నుండ వచ్చు లుకలుకల్ మితి మీరి
పలు వ్యవస్థ లందు - బయలు పడక,
ప్రగతి శీలి - చెడును - పరికింపకుండగా
చేత నైన సేవ- చేయు గాత ! 1

సంస్థలకును గూడ - జగతి వ్యక్తుల యట్లు !
వచ్చు యౌవనమ్ము - వార్థకమ్ము;
బుద్ధి లోన తరచి - వృద్ధిక్షయము లెల్ల;
జనులు చేర దగును - సంస్థ లందు. 2

మేలు చేయ లేదు - కాల దోషము పట్టు,
వసుధ యందు ఏ వ్యవస్థ కైన;
మార్పు చేర్పు కూర్పు - మనుజ సంఘము కోరు
ఏరు - క్రొత్త నీరు - కోరు కొనును. 3

# సంస్కృతి

విద్య యొసగు నట్టి - వినయమ్ము కాదయా ;
సంస్కృతి యన - విమల సహన గుణము,
వీడ - అనవసరము - స్వీయ వాదము సుంత;
ఎదుటివాని ఆదరించ దగును. 1

ఆత్మ నిగ్రహమ్ము - అతిశయింపగ జేయు,
బ్రదుకు లోన అంతరంగ దీప్తి;
స్వార్థ భోగ రక్తి - క్షయ రోగ తుల్యము;
జీవితమును పాడు చేయ గలదు. 2

చెప్ప వచ్చు - నీతి సిద్ధాంతములు పెక్కు;
వ్రాయ వచ్చు గొప్ప గ్రంథకర్త,
శ్రేష్ఠ జీవి యెవ డనుష్ఠాన వేదాంతి ;
చెప్పినట్లు తాను చేయు నతడె. 3

ఆగ్రహమ్ము కంటె - అధమ భావము లేదు,
మెదడు పాడు చేయు - హృదిని చెరచు;
ఉబ్బు సిరలు - కొంత ఉన్మాదమును కల్గు;
మనిషి - పశువు వోలె - మారవచ్చు. 4

ఎల్ల సృష్టి - మన అభీష్టానుసారమే,
ఉండ వలయు ననుట - ఉట్టి వెఱ్ఱి !
జగతి - పొంగు నిత్య చైతన్య విస్ఫూర్తి,
సర్దుకొనుట మేలు సరను డెపుడు. 5

శాంతి సామరస్య సంధాత బ్రతుకులో,
తొణక డెపుడు మరియు బెణక డెపుడు,
సర్వతో జనీన సమ బుద్ధి ప్రకటించు;
పోలు -గొప్పవాడు - పూర్ణతులను. 6

మాయ లేడి వేట - మనిషి సల్పును గదా!
తెలియ కుండ తరచు దిన దినమ్ము;
రామ చరిత తోడ - రామాయణము నందు
ప్రతిఫలించు నరుల బ్రతుకు సరళి. 7

బ్రదుకు హక్కు కలదు ప్రతి వానికిని గూడ,
పండితుండె యైన బండ యైన;
ధరణి మీద లేడు - తప్పు చేయనివాడు!
సానుభూతి వలయు జనుల పైన. 8

సాగు నరుని బ్రదుకు సాపేక్ష జగతిలో;
వద్దు నమ్మకములు వద్దు వద్దు;
సర్వ వాదములకు స్వస్తి పల్కుట మేలు;
సహన సంస్కృతులకు జయము జయము. 9

నిండి యుండు - జగతి - ఖండ సత్యాలతో,
పూర్ణ సత్య మేది పుడమి లేదు;
వివిధ దృక్పథాల అవగాహనము కూర్చు;
శాంతి మీద ప్రేమ - సహన మైత్రి 10

చదు వెంతగా నున్నను - సం
పద లున్న బహుముఖ ప్రతిభా బల మున్నన్,
పదవియు నున్న - మృదు మధుర
హృదయ విహీనుని కడ కెపు డేగకు - సుమతీ! 11

త్యాగ నిరతి కేది - తారకోపాయమ్ము ?
స్వార్థ భరిత మనుజ సంఘ మందు ??
సంఘ సేవ అనిన - సన్న్యాస వసనమా?
పండి నట్టి జాలి గుండె కాక. 12

శాంతి నివ్వ గలదు - స్వచ్ఛంద శిక్షణే!
సంఘటించు సంఘ సంగ్రహమ్ము
చదువు - ప్రజకు హృదయ సంస్కార మొనగూర్చు;
సంస్కృతి యన - ఆత్మ సంయమమ్ము 13

భాష - తెచ్చి పెట్టు - వాదోపవాదముల్!
శబ్దములకు విపుల శక్తి గలదు;
శబ్దములకు సమయ సందర్భముల బట్టి
వ్యాఖ్య చేయ వలసి వచ్చు - తరచు. 14

లోక మందు ఏమి లేక పోయిన గాని,
శీల మున్న యెడల - చాలు చాలు!
జీవితమ్ము నందు - శీలమ్ము లేనిచో !
ఏమి లాభ మగును - ఎన్ని యున్న ? 15

అందు కొనిన - సచ్చిదానంద యోగమ్ము;
అనుభవైక వేద్య మైన తృప్తి,
సంఘ హితము - కొన్ని క్షణము లూనిన చాలు;
త్యాగి జీవితమ్ము - స్వార్థకమ్ము. 16

నిండు జవ్వనమ్ము - పండు వెన్నెల సొరు;
జీవితమున ఎంత సేపు నిలుచు ?
చెడక నిల్చి యుండు - శీల సౌందర్యమ్ము
మనసులోన పెంచు మంచి తనము. 17

బ్రదుకు నందు గొప్ప ప్రతిభతో పాటుగా
వర పరోపకార నిరతి యన్న,
సృష్టి శిల్పమునకు శిఖరాయమానుడై;
అలరు గాత అట్టి అమృత హృదుడు. 18

సంధి జరుగు చుండు - సమరమ్ము పిమ్మటే,
జాతు లందు -వివిధ నీతు లందు,
వ్యక్తు లందె తరచు వచ్చు చుండును స్పర్థ,
మనుజ చరిత - శుభ సమన్వయమ్ము. 19

ఎవరు చెప్ప నేర రే అభిప్రాయముల్,
సవ్య మైన వగునొ జగతి యందు,
బ్రదుకు నందు - తనకు ప్రతికూల భావముల్,
గౌరవించు వాడె - ఘనుడు సుమ్ము!. 20

జనుల లోన నుండు సహజమే భేదాలు
సహన ముండ వలయు - సంఘ మందు,
శాంతి మేలు - సుఖము - సంఘర్షణము కంటె
పూవు లందు పెక్కు తావు లుండు. 21

నాక నరకము లేవి - లేక పోయిన నేమి ?
మనిషి చేయ వచ్చు - మంచి పనులు;
సర్వ మానవ సుఖ సాధనా నిరతిలో,
నరుడు బ్రదుకు గాత ధరణి మీద. 22

ఎంచ - నరుని జయము - పంచ భూతాలపై
పొగడ దగిన గొప్ప ప్రగతి సుమ్ము;
అంత కంటె గొప్ప దరిషట్క విజయమ్ము
అంతరంగమునకు శాంతి నిచ్చు. 23

తెలివి వలన - మేలు కలు గా సమయ మందె
జనులు పిదప మేలు కొనుట జరుగు;
శాశ్వత మగు మేలు - సౌశీల్యమున జేసి,
కలుగు చుండు మానవులకు సతము. 24

తెల్ల కల్ల లెల్ల -దినచర్యతో పాటు,
తప్పు గాదు తరచు చెప్ప వచ్చు;
మాట లాడ దగును - మర్యాదగా సదా;
కంద కుండ ఎదుటి డెంద మెపుడు. 25

జరుగ వచ్చు కొన్ని పొరపాట్లు జగతిలో;
బ్రదుక టన్న పూల పాన్పు గాదు;
అవ్వి ఆట లోని -అవినా విభావముల్;
సర్దు కొనుట మేలు - సజ్జనుండు. 26

జగతి యందు - కన్న సంతానమున - యందు,
పశువు కుండు - ప్రేమ - పక్షి కుండు;
గుండె పండి నట్టి - గొప్ప వానికె యుండు,
తల్లి తండ్రి పైన - దయయు ప్రేమ. 27

అవసరమ్మె అగును - ఆవేశ రోషాలు;
అరయ బ్రదుకు నందు అప్పుడపుడు;
కనుల యెదుట - కరకు క్రౌర్యంబు జరుగుచో!
కాంచి ఊరుకొనడు- మంచి వాడు. 28

తప్పకుండ పొగడ దగు పిశాచము నందు;
ఒక్క గుణ విశేష మున్న యెడల,
మంచి యెచట నున్న - పొంచి గుర్తించుటే,
సహజ సహృదయతను చాటు గుర్తు. 29

భారతమున - వివిధ వైరుధ్యముల నెల్ల,
వ్యాస ఋషి - సమన్వయమ్ము సలిపె,
సరస సామరస్య సహన సంధానమే,
సంస్కృతి యన దగును - జగతి యందు. 30

ఈర్ష్య బడును - మనిషి ఈషణ త్రయముచే;
దార సుతుల వలన - ధనము వలన;
జనుల కెల్ల - చదువు - సంస్కార సభ్యతల్
నిగ్రహమ్ము కొంత - నేర్ప దగును. 31

పుడమి - నరుల బ్రదుకు - బుద్బుద ప్రాయమ్ము
అరిగి నట్టి క్షణము తిరిగి రాదు!
కాదు నరక మేది - కాల యాపన కంటె,
మేలి గుణము - సమయ పాలనమ్ము. 32

ప్రజ్ఞ ఏది ? ఏది ప్రతిభా విశేషమ్ము ??
ఓర్పు కంటె ధరణి- నేర్పు లేదు;
కష్టములను చూచి - కంగారు పడరాదు;
కాల మిట్లె తరచు గడచి పోవు. 33

కష్ట సుఖము లెల్ల - కాలానుగుణముగా
అనుభవించు మనిషి - అప్పు డపుడు ;
మానసికమె సుమ్ము - మనుజానుభవ మెల్ల,
శూన్య మగును మనసు శుద్ధి చేయ. 34

కష్టము లన ఏమి ? - కసరత్తు లన వచ్చు;
బలము కూర్చ గలవు - బ్రదుకు నందు ;
సంపద లన - పసిడి సంకెళ్ళు కావచ్చు!
భోగ వాంఛ -పట్టి బురద గుంట. 35

# పెండ్లి

పెండ్లి అన వినోద విక్షేపమా ? కాదు ;
దీర్ఘ సత్రయాగ దివ్య దీక్ష;
రెండు నదులు చేరు - శృంగార తీర్థమ్ము;
ఇచ్చి పుచ్చు కొనెడి మెచ్చి కోలు. 1

అడవి లోన ఉసిరి - కడలి ఉప్పును బోలి,
భార్య భర్త - కలియ వచ్చు తరచు,
ధనము చదువు అంద మనుబంధ మేమిచ్చు ?
పెండ్లి శక్తి మిన్న - ప్రేమ కన్న. 2

కన్నె కోరు - సకల కల్యాణ గుణ భద్రు,
వరుని తెచ్చు తండ్రి - ధరణి కలడె?
ఆమె మాత్ర మగునె ఆదర్శ సాధ్విగా,
జరుగ దెపుడు పెండ్లి సర్దుకొనక. 3

ఆలు మగల పూర్తి అద్వైత యోగమ్ము
ఉర్వి మీద ఎచట ఉండ బోదు !
సానుభూతి యున్న చాలు నిర్వురి మధ్య,
తలపు లందు - బ్రతుకు మలుపు లందు. 4

కలిమి - తెలివి - పదవి కలిగి యుండెడి వాడు,
ఉండు వేయిమంది కొక్కరుండు;
కన్నె పడుచు - కలల కాక్షించు దొర భర్త
దొరకు టంత సులువె - ధరణి లోన. 5

పెరుగు - ఇంక మీద - పెండ్లికూతురు పాలు,
ప్రేమ పాలు గూడ - పెండ్లి యందు;
వధువు మనసు - ముందు పసిగట్ట గల ప్రజ్ఞ,
బ్రహ్మ దేవు కైన - వశము గాదు. 6

పెండ్లి అయిన పిదప -స్వేచ్ఛ తగ్గును కొంత ,
త్యాగ గుణము కొంత అవసరమ్ము;
గొప్ప - కలదు స్వేచ్ఛ కోలు పోవుట యందు,
సామరస్య మందు - సహన మందు. 7

ప్రేమ వేరు - వేరు కామమ్ము బ్రదుకులో
పెండ్లి కాదు వలపు పిచ్చి గుబులు;
ధర్మ నిర్వహణమె - దాంపత్యమున కాత్మ;
తెగని - భవ్య దివ్య దీక్ష - పెండ్లి. 8

వలపు నందు ఇముడు - వంకరల్-టింకరల్;
ప్రేమ - అన పరమ పవిత్ర మగును,
ప్రేమ యందు - త్యాగ భూమికల్ - కన్పించు,
స్వార్థ పరత - ఇముడు- వలపు నందు. 9

కలి యుగాన -జరుగు - వలపు పెండిండ్లలో,
అచ్చ మైన ప్రేమ అమరు నెచట ?
హెచ్చ వచ్చు - జగతి - ఇక విడాకుల సంఖ్య;
అంతమౌ కుటుంబ శాంతి తరచు. 10

పసిడి వద్దు - రెండు పసుపు కొమ్ములు- చాలు!
కట్ట వచ్చు -తాళి బొట్టు చేసి;
వద్దు భోజనాలు - బాజా భజంత్రీలు;
పెండ్లి జరుగ - కూర్మి పేర్మి - చాలు. 11

పెండ్లి పేరు మీద - పిచ్చి వేడ్కలు పెక్కు,
భరత దేశ మందు - పెరిగి పోయె;
ఆలు మగల మీద - వ్యయము న్యాయము గాని,
గాలి లోన - ధనము కలుప నేల? 12

సర్దు కొనెడి ఇచ్ఛ - సహనమ్ము లేనిచో !
పెండ్లి ఆడరాదు ప్రేమ యున్న;
కాపుర మన కుటిల కామబంధము కాదు;
కలిసి మెలిసి తిరుగ గలుగు - చెలిమి. 13

బ్రదుకు లోన ప్రేమ - ఫలియించు టన్నచో
పెండ్లి జరుగ వలెను పేర్మి కూర్మి;
పెండ్లి జరుగ నట్టి - ప్రేమ - ప్రేమయె కాదు !
స్వార్థ తుచ్ఛ కామ సంగమమ్ము. 14

స్నేహమునకు - ప్రేమ - చేరువై యున్నచో
కామ శబలితమ్ము కాని యెడల
సామ్య భావ యోగ సంక్రాంతియే పెండ్లి;
సంఘ సత్ర యాగ శాల యగును. 15

ప్రేమ లోన ఉందు - కామ యోగము గూడ,
పెండ్లి జరుగ రాదు - ప్రేమ లేక;
కష్ట సుఖము లందు కలిసి యుండుట - పెండ్లి;
బిడ్డ లందు కూర్మి పేర్మి -పెండ్లి. 16

పొంగి పొరలి పోవు శృంగార రసికతల్
కామ నిరతి తప్పు గాదు నేడు;
అధిక మోను తరచు వ్యభిచార తంత్రముల్!
బీట వారి పగులు పెండ్లి పీట. 17

కలి యుగమ్ము నందు - కాల దోషము పట్టె,
పెండ్లి అనగ పట్టి పిచ్చి వేడ్క;
పెండ్లి కాక యున్న - పెను ప్రమాదము సుమ్మ!
వేరు వెరవు లేదు - పెండ్లి కంటె. 18

రోత గొలుపు నేడు - పాత పద్ధతి "పెండ్లి"
ప్రేమ పెండ్లి పైన - ప్రీతి పెరిగె,
కలి యుగాన - ప్రేమ - గాజు వాటము సుమ్మ;
పగులు వారు - చిన్న దెబ్బ చాలు. 19

ప్రేమ చంచలమ్ము - శృంగార లౌల్యమ్ము
ప్రకృతి సహజ గుణము ప్రజల లోన;
నిజము -పెండ్లి - కృతక నిర్బంధమే గాని,
అదియె- సంఘ సంగ్రహమ్ము కూర్చు. 20

# వైద్యం

నరక సమము - వ్యాధి భరిత వార్ధక బాధ,
వరమె సుమ్ము - శీఘ్ర మరణ మనిన,
ఆయు వేల ? నరుల కారోగ్య మే లేక ?
యౌవనమ్ము నందె చావు మేలు. 1

ఔషధాల కంటె వ్యాధి మాన్పెడు శక్తి,
ఆప్త దర్శనమున అమరి యుండు;
అంత కంటె గొప్ప దనురాగ వర్షమ్ము
బ్రదుకు నందు అమృత రసము సుమ్ము! 2

ఔషధాల కంటె - ఆప్త వాక్యమె మేలు !
మనిషి కెపుడు - ముసలి తనము నందు,
ఆయు వధిక మౌను - ఆరోగ్య మలరారు !
మనసు సంతసించు మాట వినిన. 3

మందు వలన కీడు - మనిషి గుర్తించినా
మందు వాడకమ్ము మాన లేదు,
జబ్బు నయము చేయు - సంగీత మను మాట,
నమ్మ లేరు పెక్కు నరులు నేడు. 4

వైద్య వరుడు - తన్ను బ్రదికింప గలడంచు
మంచ మెక్కి రోగి మది తలంచె;
అంత -చచ్చె వైద్యు డాకస్మికమ్ముగా!
పొత్రు పెండ్లి దాటి - బ్రదికె రోగి. 5

చేయు నెడల - వైద్య సేవ - మానవతతో,
ధనము కొఱకె గాక - దయ వహించి,
నరుల లోన - అతడు నారాయణ సముండు;
తరళ ధర్మ రూపధారి యగును. 6

పరుల బాధ తెలియ వలె నన్న బ్రదుకులో
అవసరమ్ము - వ్యాధి - అప్పు డపుడు
మనిషి మనసు లోన - మార్దవమ్మును గూర్చు;
మంచితనము గూడ పెంచు కొంత. 7

ధరణి కవతరించు - తత్కాల నరకమే !
బ్రదుకు నందు, శస్త్ర వైద్య మనిన
మరువ లేని మేటి దురదృష్ట దశ అద్ది
తలప మనిషి జీవితమ్ము నందు. 8

మాయ మగునె జబ్బు - మంత్ర దండము నూప ?
మందు లెన్ని వాడి - మాన్పదగును,
వ్యాధి కుదురట కయి వ్యయము తప్పదు కొంత,
దేహ బాధ తప్ప - తెరువు లేదు. 9

విద్య ఇవ్వ లేని - వినయమ్ము బ్రదుకులో,
కూర్చ వచ్చు వ్యాధి కొంత మేర,
మనిషి - తెలిసి కొనును - తన అల్పతను వేగ!
మంచ మెక్కి నపుడు - మనసు నందు. 10

ఆయు వున్న యెడల - వ్యాధి మేలునె చేయు
తత్త్వ వేత్త యగును - తరచు రోగి,
అందు కొనును గొప్ప అనుభూతు లెన్నియో
ఆదరణము తోటి - సానుభూతి. 11

మంచ మెక్కి నపుడు -మనుజుండు సులువుగా
అరయ వచ్చు - తనకు ఆప్తు లెవరో !
వ్యాధి - ఒక పరీక్ష - ప్రక్కవారికి గూడ,
పుత్ర మిత్ర బాంధవులకు గూడ. 12

వేత్త - అచ్చ మైన వేదాంతి యెపుడౌను ??
వ్యాధి చేరి దరికి వచ్చి నపుడె ?
వైద్యశాల - తత్త్వ విద్యా నివేశమ్ము !
ఉత్తమోత్తమ ప్రయోగ భరణి. 13

అళ్ళు పెళ్ళ మనుచు - ఆరోగ్య వంతుండు,
తిరుగు శిరము నెత్తి ఉరము విరిచి;
వ్యాధి వచ్చి నపుడు - పడవచ్చు మరి బాధ,
రోగి తరచు - జ్ఞాన యోగి - యగును. 14

శక్తి మిక్కుటమ్ము - సంకల్ప నిరతిలో!
లే దనుకొన - కలుగ బోదు - జబ్బు;
గట్టి మనసు గలుగ - కష్ట మేమియు లేదు;
వంద సార్లు - చంపు - భయము - నరుని. 15

ఔషధాలు చాల వారోగ్యమును కూర్చ,
మంచి మాట మేలు మందు కంటె,
ఆప్త దర్శనమ్ము - హాస్య సంగీతముల్;
వ్యాధి నయము చేయవచ్చు - తరచు. 16

అరయ - వైద్య వరుల ? యమ కింకరుల వీరు ??
కాదు - ధనము కోరు గడుసువారు,
ఔషధాల నమ్ము - వ్యాపార కింకరుల్;
వైద్య విద్య నెరుగువార లరుదు. 17

ఔషధాలు కూర్చ వాయు రారోగ్యముల్
ఎట్లు బాగుపడును ? ఎడద - మెదడు ?
వినిన మేలు - విమల సంగీతమ్ము;
మనసు బాగు చేయు - మంచి పనులు 18

బ్రదుకు నందు - నష్ట పరిహారమును గూర్చు
నిదుర - బ్రహ్మచర్య నియమనిష్ఠ;
ప్రార్థనా సమాధి - ప్రాయోపవేశమ్ము
అప్పు డపుడు నరుని కవసరమ్ము. 19

నర శరీర రక్త నాళాలలో దాగి,
కాన రాని రోగ కణము లుండు
సూక్ష్మ బీజకములు - సుప్త చైతన్యముల్ !
ఎపుడొ -మేలుకొనుచు ఎదుగ వచ్చు. 20

అవయవాల నన్ని - అచట కూర్పగ వచ్చు !
అది సమైక్య దేహ మనుట -తప్పు;
ప్రాణ నాడి - సామరస్య సంధానమ్ము ;
లేని యెడల శవ సమాన మగును. 21

మనిషి మీద మందు పనిచేయు సమయమ్ము
వయసు - వ్యాధి చూడ వలయు సుమ్ము!
వైద్యు తప్పు గాదు - వ్యాధి తీరే వేరు!
పుట్టి నట్టి ప్రాణి గిట్టి తీరు. 22

మందు కంటె గూడ - మనసు ముఖ్యము సుమ్ము;
జబ్బు కుదురు- రోగి సహకరింప;
అంత కంటె ముఖ్య మాహార పథ్యముల్;
వ్యాధి - మాన్ప లేడు - వైద్యు డొకడె. 23

పరిమితమ్ము వైద్య పరిధి విజ్ఞానమ్ము ,
సానుభూతి రోగి కవసరమ్ము
మందు లెన్ని యున్న మరణమ్ము తప్పునా ?
వైద్యులకు మృదుమధు వాక్కు వలయు. 24

వైద్య మునకు లేదు - వ్యాధి మాన్పెడు శక్తి
మందు లెల్ల మృషలు - మాయ మిషలు;
నయము చేయు - ప్రకృతి - నర దేహమును సదా;
లాభ దాయకములు లంఘణములు. 25

నిదుర పొమ్ము రేయి పది గంటలకు ముందు,
రెండు పూట లందు తిండి తినుము,
అంద జేయు బలము - ఆహారమున కంటె;
నిదుర మానవులకు బ్రదుకు నందు. 26

అవసరమ్ము ప్రజకు వ్యాయామ మొకకొంత;
ఇంట నడక గాని - వంట గాని,
ఉత్తమోత్తమమ్ము - ఉద్యాన కృషి యైన;
స్రష్ట తోడ - క్రీడ - సలుప వచ్చు. 27

అంద చందములకు ఔషధ ప్రకటనల్,
తోచు మేలి మచ్చు తునక లట్లు;
అచ్చరమ్ము లచ్చు అల్లారు ముద్దుగా
వేల్పు విల్లు సిరులు వెల్లి విరియు, 28

వైద్యునకు సమయము - వశములో ఉండునా ?
ఎవరొ పిలువ వచ్చు ఎప్పు డైన;
సంఘ హితము కొరకు సర్దుకోవలె జనుల్
కాల నియతి కతడు కట్టు బడడు. 29

ఆయువు క్షయ మగు - ఆవేశముల వల్ల,
కండరముల బలము కగ్గి పోవు ;
కాయ మందు - పెక్కు కలత లేర్పడ వచ్చు,
క్షమ - ప్రశాంత మనము - సౌఖ్య మిచ్చు. 30

వైద్య మనిన ఏమి ? వ్యయ బాధయే ముందు,
ప్రజలు మోయ లేని బరువు సుమ్ము,
ఆసుపత్రి యనిన - యమ లోకమన కేగ,
ధరణి మీద నున్న ఇరుకు దారి. 31

మనిషి - చూడదగును - మానసారోగ్యమ్ము;
చేయ దగును దేహచింత - పిదప;
" రసము " - మానసమును - ప్రక్షాళనము చేసి
బుద్ధి శుద్ధి - యోగ సిద్ధి - గూర్చు 32

వృత్తు లందు చూడ శ్రేష్ఠమైనది ఏది ?
సేవ చేయు నర్సు జీవితమ్ము;
అవని కవతరించు - అపర నైటింగేలు !
కరుణ చూప గలదు పరుల పైన . 33

అంత రంగమునకు - శాంతి కూర్చును నిద్ర,
మేలు చేయు అవయవాల కెల్ల,
అభ్యుదయము ఆయురారోగ్యముల కూర్చు
నిత్య సుఖము నిద్ర నిత్య శుభము. 34

పడకల నడయాడ - వైద్యుండు కాలేడు,
కాడు జ్ఞాన ముండి గూడ కాడు,
పరి కరముల కంటె - కరుణయే ముఖ్యంబు,
విజయమునకు - వైద్య వృత్తి యందు. 35

# ధనం

అగ్ని - వండ వచ్చు - అన్నమ్ము గృహములో
తగుల బెట్ట వచ్చు - ధరణి నిండ్లు;
కీడు మేలు కలుగు - వాడు వారల బట్టి,
దాగు -మేటి శక్తి - ధనము నందు. 1

జనుల లోని - సహజ శక్తి సామర్థ్యముల్
జయము గాంచు గాక సంఘ మందు
సమత గలిగి - పెరిగి సౌభ్రాత్ర భావముల్,
ధనము పెత్తనమ్ము తరుగు గాక! 2

పుడమి మీద తరచు - నడ పీనుగే - యౌను,
మానవుండు - ధనము లేని యెడల,
అగును రాక్షసుండె - అధిక సంపద యున్న !
మధ్య తరగతి యగు మనిషి -మనిషి. 3

ప్రజల కెపుడు ధనము - యజమాని కారాదు;
పనులు చేయ వలెను - బానిస యయి,
ఎపుడు నెత్తి మీది కెక్కించు కొన రాదు.
ధనము నణగ ద్రొక్క దగును - నరుడు. 4

ధనము నెవడు తనకు దాసిగా చేయునో
ఉత్త మోత్తము డత డుర్వి లోన;
ధనమునకు ఎవండు దాసుడై పోవునో,
అధమ జీవి ఆత డవని యందు. 5

భరత ఖండ మెల్ల - పాలించె అలనాడు ;
చదువు - కులము - మతము పదవి కలసి,
సార్వభౌమ పదవి - సంక్రమించెను సదా
ధనము కిపుడు భరత ధాత్రి మీద ! 6

పలుక వచ్చు - ప్రజలు - పంచేంద్రియములంచు
ఆరవ దగు ఇంద్రియమ్ము - " మనసు"
ధనము లేని యెడల - పని చేయ వా ఆరు !
చూడ - ఇంద్రియమ్ము లేదు - సుమ్ము ! 7

కనులకు గ్రుడ్డి తనమ్మును
మన మందున కాన రాని మదమును, మత్తున్
ధనమున వచ్చును-పలు చెడు
గుణములు, క్రిమి కీటకములు గుండెను దాగున్. 8

బ్రతుకు నందు - ధనికు పాత్ర వేయుట ఎట్లు ?
పేదవాడు నేల మీద నిలిచి ?
గొప్ప తెలివి - జాలి గుండె ఉండగ వచ్చు;
ధనము ఎచట నుండి తరలి వచ్చు ? 9

ఆదు కొనును నరుని అవసరమ్మును బట్టి,
పెరుగ వచ్చు తరచు విలువ గూడ,
పసిడి దాచు కొనిన బ్రతుకులో మేలౌను
ఉంగర మొక టైన ఉండ దగును. 10

ఎక్క గలవు అపర ఎవ రెస్టు శిఖరాలు !
కాంచనమ్ము మోయు గార్దభములు !
అమ్ముకొందురు - ప్రజ - అంతరాత్మను గూడ,
ధనము నిచ్చువాడు తారసిలిన; 11

శుభము - పెంచె సకల సుఖ వస్తు సంపదల్
జగతి యందు నవ్య సభ్యత గద,;
పేద లకట - వికట వినియోగమున చిక్కి
ధనిక వర్గమునకు దాసు లైరి. 12

పెరుగ ధనము పైన -పేరాస మనసులో,
చిహ్న మగును దుష్టశీలమునకు,
ధరణి లోన - కొరవి దయ్యాల వేటగా
మారవచ్చు - తరచు మనిషి బ్రతుకు. 13

డబ్బులున్న వారి డాబు దర్పము వేరు ,
బ్రదుకు పందెములను వలపు లందు.
పాడు ధనము చేత - ఓడింపబడు చుండు;
ప్రతిభ - మనుజ సర్వ పాటవములు. 14

జరుగు చుండు - పనులు - చాకచక్యము తోడ
చేతిలోన డబ్బు చేరి యున్న!
ఆగ ధనము కొరకు - అలస్య మగు పనుల్ !
ధరణి తిరుగు సతము ధనము చుట్టు. 15

బ్రదుకు లోన ఆస్తి రక్షించుకొను టెట్లు?
బండ బారకుండ - గుండె కాయ
చేర పదవి ధనము - స్వీయ ప్రతిభ వల్ల,
పరుల కష్ట సుఖము లరయు నతడు. 16

ధనము కూర్చి పేర్చు కొనుటకై మాత్రమే
నరుడు బ్రతుక నేల ధరణి పైన ?
అంతకంటె లేదు వ్యర్థ జీవిత మేది,
మనిషి చేయవలెను మంచి పనులు. 17

మనిషి శ్రమకు రత్న మాణిక్యముల కంటె,
వచ్చె విలువ సామ్యవాద మందు;
పృథివి జనుల పైన - ఇక ధనస్వామ్యమ్ము
పెత్తనమ్ము చేయ వీలు లేదు. 18

బ్రదుకు లాభసాటి వ్యాపారముగ మారె
విలువ లెల్ల పాతిబెట్ట బడియె;
కట్టినారు ప్రజలు - పట్టాభిషేకమ్ము
జగతి యందు ధన పిశాచి కిపుడు. 19

స్పర్థ పెరిగి పోవు - జన సంఖ్యతో పాటు.
మంచితనము విలువ - మాసి పోవు,
సడలి పోవు -బహుళ సంసార బంధముల్,
ధరణి నెల్ల - ఏలు - ధన మదమ్ము. 20

వినయము విద్యయు కరుణ - సు
గుణ గణములు మారె నిపుడు - కొఱగానివిగా;
ధనమె కొలమాన మయ్యెను
మనుజ సమాజమ్ము నందు - మహిలో సుమతీ! 21

మనుజ సంఘ మెల్ల - మాయాన్వితము గదా !
మతము కులము భాష మత్తు గొలుపు ;
ఆస్తి - ధనము జన్మ - వ్యత్యాసములు గూర్చు,
మానవత్వమునకు స్థాన మేది ? 22

బ్రదుక లేడు - గుండె బండ బారిన గాని ,
నరుడు కలి యుగాన ధరణి లోన,
కొంత మేర పరుల కొల్ల గొట్టిన గాని,
ధనము కూడ బెట్టి - దాచ లేడు. 23

సార్వభౌమ పదవి - సంక్రమించెను గదా!
ధన విశేషమునకె ధరణి మీద;
సమ సమాజ మెట్లు - స్థాపించ వీలౌను?
అంతరించకుండ - ఆస్తి హక్కు.? 23

ధనవంతుల సంతానము
మనుజ సమాజమున కృతక మహిమలతో - పె
త్తనము చెలాయింతురు గద
ధన శక్తికి కళ్ళెములను తగిలించ దగున్.

ధనము - పరుల నుండి - తన జేబులో చేర్చు,
తెలివి - ఎంచ గొప్ప లలిత కళయె !
అది జగద్ధిత క్రియయె యైన - కొనసాగు;
బ్రతుకు లోన గొప్ప క్రతువు వోలె 26

ఆస్తి హక్కు - ధనము - యావజ్జగతిలో
బహు జనముల బ్రదుకు పాడు చేయు;
ప్రజలు; పెక్కు మంది - ప్రజ్ఞా ధురీణులే
బానిస లయి - బ్రదుకవలసి వచ్చు. 27

మేలు చేయ లేదు - కాలదోషము పట్టి,
ఎంత గొప్పదైన నేమి - గతము;
ఆస్తి - కులము మతము వ్యత్యాసములు గూర్చె;
క్రొత్త సమత ప్రేమ కూర్చ దగును. 28

మనుజు లందు రక్త మాంసాల పెంపులో,
పుష్టి కలుగు కొంత తుష్టి కలుగు,
ధనము కలుగ - పెరుగు - ధైర్య విశ్వాసముల్;
గర్వ మధిక మౌను కలుగ - పదవి. 29

పల్లమునకు నీరు పారుచుండగ సదా,
ఎత్తు పైకి ధనము ఏగు చుండు;
వచ్చి కలియు చుండు - వడ్డీలపై వడ్డీ;
చాలి నంత ఉన్న మూల ధనము. 30

ధనికులు స్వార్థమ్ము వదలి
ఘన కార్యంబులను చేయ గలరే ధరణిన్ ?
మనుజ సమాజములో సమ
తను సౌభ్రాత్రమును చంపు ధనమే - సుమతీ ! 31

విలయ వికృతి విశద వికటాట్టహాసమ్ము
సలుపు - ధనము - మనుజ - సంఘమందు;
సమ - సమాజ ధర్మ సంస్థాపనార్థమై
అంతరింప వలయు ఆస్తి హక్కు. 32

జన్మ బట్టి ధనము - సంక్రమింపగ రాదు,
అంతరింపవలయు ఆస్తి హక్కు,
చదువు చెప్పబడుత - సహజ ప్రకృతి బట్టి ,
పదవి వచ్చు గాక - చదువు బట్టి. 33

దాట వచ్చు కటిక దారిద్ర్య బంధముల్
ఈద వచ్చు మనిషి ఏటి కెదురు;
అంతరాత్మ నణచి ఐశ్వర్య సంసదల్
హాని చేయు ఎంత వాని కైన. 34

ఉండు - ఉద్యమాల - ఉజ్జ్వలాశయములే !
పనులు జరుగు టెట్లు ధనము లేక ?
ప్రజలు ధనము లివ్వ - పైస పైసకు గూడ,
చిత్త శుద్ధి - లెక్క - చెప్ప వలెను. 35

అవని ఘనుడు - ధనము నార్జించ గల వాడు
అతని తెలివి తేట లద్భుతములు;
అంత కంటె ఘనుడు - ఆర్జించు ధనమెల్ల
సవ్య మైన వ్యయము సలుపువాడు. 36

నందన వన సదృశ సౌందర్యములు చింద,
కట్టు కొనెడి వారు కలరు గృహము!
అంద చంద మొలుక - డెందమ్ము సరిదిద్దు
ధనికు డెవడు కలడు ధరణి మీద ? 37

ధనము లేని యెడల ధరణియే నరకమ్ము,
నడచు నట్టి శవము నరుడు సుమ్ము,
కలుగ మిగులు ధనము - కాపలా కుక్కయే,
చాలి నంత ధనము మేలు - శుభము. 38

గడియింప కుండ వచ్చును
వడి వడి అబలులకె ధనము పైతృక మగుచో. !
పడ వచ్చును శ్రమ యెంతో
బడుగుల కెప్పుడు లభించు ఫలితము సున్నా. 39

ఆస్తి హక్కు చెరచు యావత్ ప్రపంచమ్ము;
సమత రూపు మాపి సంఘమందు;
ఆస్తి యున్నవాడు - యజమానియై పోవు,
బానిస యగు పేద - బ్రదుకు నందు. 40

ఎంచ - జగతి నెవరి వంచింప కుండగా!
ఎవడు పేర్చగలడు ? హెచ్చు ధనము ??
అహము పెంచ గలదు - ఆత్మ వంచన గూర్చి,
ధనము - మార్చు నరుల దానవులుగ. 41

ధనము కొరకు చేయు పని కంటె జగతిలో
లేదు - అధమ మైన దేది లేదు;
ధనము కొరకు గాని పని మాత్రమే గదా!
పరమ పావనమ్ము ధరణి పైన. 42

కలి యుగమ్ము నందు - కామ రూపిణి యేది ?
ధనము ధనము మరియు ధనము ధనము
వేయ గలదు - ధనము వేల వేల్ వేషాలు!
ధనము లొంగ దీయు ధరణి నెల్ల. 43

భరత దేశ మందు - దొరగారు - రూపాయి!
దైవ మదియె -నీతి, ధర్మ మదియె!
ఏమి చేయగలము ! ఇది ధన స్వామ్యమ్ము.
ధనము - సర్వ పాప తారకమ్ము!! 44

చేయు నట్టి దేమి ? జీవచ్ఛవము కదా!
ధనము లేని వాడు -ధరణి మీద?
వేయ వచ్చు -ఎత్తి వేషమ్ము లెన్నైన,
ధైర్యవంతుడైన ధనిక వరుడు. 45

బ్రదుకు నందు - వలపు - పరమ నిర్మల ధార,
అమృత యోగ సిద్ధి అంద్రు గాని;
తరుణి - ధనిక యువకు తరచుగా ప్రేమించు,
సృష్టి కలుషితమ్ము చేయు - ధనము. 46

మనుజు బ్రదుకు లోన - ధనము ముఖ్యము గాదు;
వ్యయము కలిసి యుండు - ఆట లోన,
ఉత్త మోత్తమ ప్రయోజకుం డెవ్వడౌ ?
ధనము నెంచ అప్రధానముగనె. 47

ధనము రాదు - కోరు కొని నంత మాత్రాన !
మేలు కాదు ధనము మీది ఆస;
కలదు ధనము పేర్చ గల శక్తి ధనముకే
పేదవారు ధనము పెంచ లేరు. 48

ప్రతి దినము - " ధనమ్ము " భ్రష్టమౌ నష్టమౌ ,
ప్రౌఢ జగతి కోరు " ప్రగతి " కొరకు;
పుస్తకాలు కొనిన - పూజ్యమౌ - విత్తమ్ము;
పెట్టి బడికి సొంపు పెంపు గూర్చి. 49

సర్వతోముఖ మగు సామర్థ్యమును గల్గి,
మనుజ హృదుల నేలు - ధనము నేడు;
అగ్గ కున్న యెడల - ధన పాత్ర ధరణిలో,
లేదు న్యాయమునకు లేదు చోటు. 50

# ఎన్నికలు

మునిగి పోవు - నీట - మణులు మాణిక్యముల్;
గులక రాళ్ళె ఈత కొట్ట వచ్చు !
గగనమునకు పాము లెగురు రెక్కలు వచ్చి
కలల అలలు ఎన్నికలకు సిరలు. 1

ప్రజ లటన్న - నమ్మ రాని గొఱ్ఱెల మంద,
నేడు ఎన్ని కగును నేత యొకడు,
అట్లె అతని శత్రు నాదరింతురు రేపు;
కలల వంటి వెన్ని కలలు సుమ్మ. 2

"ప్రభువు - నరకమునకు - రాజ్యాంతమున నేగు "
అంచు పెద్దలు వచియించి నారు;
ఉండ లేదు - చేయ కుండ తప్పులు కొన్ని,
నేటి కాల మందు - నేత గూడ. 3

విశ్వ మందు కొన్ని - విధి వైపరీత్యముల్!
మనుజ కల్పితములు మరియు కొన్ని;
ఏల ? తిండి బట్ట ఇల్లు వాకిలి లేక
మ్రగ్గ వలయు ఇంత మంది ప్రజలు ?? 4

మాట - కొండ కోన - కోటి పేటలు దాటు;
కడలి దాటు - నదుల గట్లు దాటు,
గెంతు - సర్వ దిగ్ది గంతరమ్ములు దాటి,
రాజకీయ నేత బ్రదుకు వేరు. 5

ఓటు మీది మమత - ఉన్న - న్యాయము పైన
నీతి శాలి యైన - నేత యగును,
ఓడి పోవ - జంక దున్నతోన్నత నేత,
మేటి దంతరాత్మ - ఓటు కంటె. 6

తినిన యెడల తీసి తిండి గొంగళి నుండి,
వెరపు గాదు ఏర వెండ్రుకలను;
బ్రదుకు వడలి పోవు - రాజకీయము లందు
ఆడు ధర్మరాజు గూడ బొంకు. 7

మంత్రి వరుడు చూడ - మగ జగన్మోహినే !
లౌక్య హావ భావ లాస్య ముఖుడు !!
ఓర చూపు బరపు - ఒక చోట హొయలుతో !
వేరు చోట పంచి పెట్టు సుధను. 8

మేటి నీతి యున్న - మేధావి వర్గమ్ము
తేరి పార జూచినారు - నిలిచి ,
భ్రష్ట రాజకీయ రంగ ప్రవేశమ్ము
చేయ లేదు చెంత చేరలేదు. 9

చేయ దొడ్డ పనులు - స్వీయ ప్రతిభ తోడ,
అత డొక్క గొప్ప నేత గాదు;
అనుచరులకు - నెవ్వ - డాత్మ విశ్వాసమ్ము
అంద జేయ గలుగు - అతడె నేత. 10

ఆస్తి హక్కు - సమత - నంత మొందగ జేయు,
కుల విభజన - సమత - కూల్చి వేయు;
అరయ - ఓటు హక్కు - అభాస సమతయే !
ధరణి నేల గలదు - ధనము తరచు. 11

నోటి ధాటి కాదు - మాట లాడుట యన్న
ఆంగికమ్ము గూడ - అవసరమ్ము;
వాచికమ్ము సాగ వలె - స్ఫుట స్వరముతో,
నాయకుండు కాడు - నటన లేక. 12

కుల బలమ్ము - ధనము కూడ గట్టెడు యుక్తి,
లలిత లౌక్య చాకచక్య శక్తి;
కుటిల రాజ నీతి పటు పటాటోపమ్ము
వెరసి - ఎన్నిక లనబరగు నేడు. 13

జగతి కేంద్ర నాభి - స్వార్థ పారీణతే;
పరుల హితము కోరు వార లరుదు;
కట్టు - త్యాగయోగి కంకాళము పైన
స్వార్థ నేత - స్వీయ హర్మ్య ములను. 14

మార్పు అవసరము - మానవ ప్రగతికై !
క్రొత్త నీరు నదికి కూర్చు శోభ;
క్రొత్త దొరతనమ్ము కోరు కొందురు ప్రజల్;
ధాత్రి ఎన్నికల చరిత్ర చూడ. 14

ప్రజలు - మంచివారు - రాజకీయము లందు
చిత్త శుద్ధి తోడ - చేర లేరు !
మాయ లేడి పాత్ర - వేయ నేర్వని వాడు,
నేడు - భూతలాన - నేత కాడు. 16

విఱ్ఱ వీగ వచ్చు - విప్లవ ప్రియ నేత,
తను దిగంబర కవి ననుచు చాటి,
వసుధ వెడల గలడె ? వస్త్ర ధారణ మాని ,
సంఘ నీతి విడువ - సాధ్య మగునె? 17

మారు చుండు తరచు - మనుజ సంఘము లెల్ల
తరచు మారు దేశ చరిత గూడ
మార్పు లెంచి, మనసు మార్చుకోవలె - నేత;
బ్రదుకు - మార నట్టి రాయి కాదు. 18

వక్ర భాష్య మెట్టి వాక్యమ్ములకు నైన,
వ్రాయ వచ్చు ప్రాత్రికేయు డెవడొ !
మౌన నిరతి మేలు - మంత్రి వర్యుల కెల్ల;
రాజకీయ కవచ రక్ష గూర్చు. 19

నేత చేయ వలెను - నిర్మాణ కృషి పూని,
చేసి - ప్రజకు తెలియ చెప్ప వలెను.
కొంత మంది తెగడ - కోపించకుండగా,
అత డజాత శత్రు వగుట - మేలు. 20

గంగ కంటె గూడ - కలుషితంబై పోయె
రాజకీయ నవ్య రంగ భూమి !
నేటి ఎన్నికలను - నిరుపేద నెగ్గునా ?
నేత-బ్రదుక లేదు - నీతి తోడ ! 21

మొదట వాగు -నేతపదవి వచ్చిన వేళ
పిదప - గుర్రు కొట్టి - నిదుర బోవు;
సంఘ మందు - నగ్న సత్యాలు గుర్తించి
లోక మేలు కొనును - తోక ముడిచి. 22

గడుసు దనము మరి జగద్వంచనము లేక,
ఆత్మ వంచనమ్ము అసలు లేక,
ప్రజల నాడి పట్టు ప్రజ్ఞ - ఏదియు లేక,
నేడు రాజకీయ నేత - కాడు. 23

ఒక భ్రమను విడిచి పెట్టి మ
రొక భ్రమనే స్వీకరించు ఓటరు దొర గా రె
న్నిక లనబడు సమయంబున,
ఇక యోగ్యుడు ప్రగతి శీలి ఎట్టుల నెగ్గున్. 24

మెదడు లోన నక్క - హృది లోన సింహమై,
తేలు కొండె మున్న - తేటి యగుచు,
గోవు ముఖము గలిగి - కోకిలై గొంతులో!
రాజకీయ నేత - బ్రదుకు చుండు 25

బొంకు లాడి - వాటి భుజయించి కడుపార,
కాలధర్మ మొందు - కట్ట కడకు;
ప్రబల రాజకీయ పక్షాలు పృధివిలో!
తరచు మోయ లేక తమ బరువును. 26

కావు - రబ్బరు బుడగలు - గాజులా ? కావు,
ఇట్టె పగిలి పోవు నట్టి వేవి ?
రాజకీయ నేత - ప్రజకు ఎన్నికలలో,
తరచు చేసెడి శపధాలు సుమ్మ. 27

యువకులకును తగిన ప్రోత్సాహ మివ్వాలి
ఉన్నత శిఖరమున నున్న నేత;
తానె - ఎక్కి నట్టి ఆనిచ్చెనల నెల్ల,
తన్ని వేయరాదు - ధరణి పైన. 28

" నేల మీద పడదు - నింగి నీ వల్లనే !
సూర్యు చుట్టు తిరుగు చుండు భూమి ! "
అనుచు చెప్ప - నమ్ము అవివేకి ఎవడయా ?
నేటి రాజకీయ నేత తప్ప ? 29

వసుధ లోన - " శాంతి " - వర్థిల్ల వలె గాని,
సతము విప్లవమ్ము సాగ రాదు;
సంఘ జీవితమున - సరిదిద్ది న్యాయమ్ము
వేగ చల్ల బడుత - విప్లవమ్ము. 30

రాజకీయములన - ప్రజల మూర్ఖుల జేయు,
సులువు కిటుకు లరయు తెలివి తేట,
అంతు చిక్కకుండ - అతుకు కన్పడ కుండ,
తలలు మార్చ గలుగు - తంత్ర విద్య. 31

చేర లేరు దరికి - స్నేహితుల్ పదిమంది ,
నవ్య రాజకీయ నాయకునకు,
వంద మంది శత్రు వర్గమ్ముగా మారి,
చెప్ప లేని హాని చేయ గలరు. 32

సాంఘికాభ్యుదయము - శాంతి భద్రతలతో,
సర్వతో ముఖముగ సాగ గలదు;
సర్వ నాశనమ్ము - సంఘటించును - హింస,
సకల సౌఖ్యములకు జనని - శాంతి. 33

రాజకీయ మందు రౌడీలు గూండాలు,
కొంతమంది చేరి కూడినారు
మంచివాడు - మంజు మధుర స్వభావుండు
రాజకీయ మందు బ్రదుక లేడు 34

సహజ మాంధ్ర మందు - సాహిత్య రసికతల్;
గాన మరవ వారి దైన సొత్తు
రాజకీయ మలరు రంగారు వంగాన
ఊపు - భాష మమత - ఉత్తరమున 35

# ప్రబోధం

అస్తి కతయు కాదు - నాస్తికత్వము గాదు;
మనుజుల కిపు డది సమస్య కాదు;
మంచితనము చాలు - మానవత్వము చాలు
జాలి గుండె యున్న చాలు చాలు. 1

గుండెలోన - మేడి పండు వాటము వద్దు.
చిత్త శుద్ధి మేలు జీవితమున,
పూత పసిడి వద్దు - పొట్ట ఇత్తడి వద్దు
సుంత యైన డాబు చూపవద్దు. 2

సృష్టి జరుగ బోదు - ఏకైక మాత్రాన,
ఆడ మగల యోగ మవసరమ్ము;
సహజ మనుజ నీతి - సహకార హృదయమే,
భోగి కైన - త్యాగ యోగి కైన. 3

ఏక కాల మందు - ఎవడు స్వారీ చేయు ?
కోరి కోరి రెండు గుఱ్ఱములను ?
శీల సంగ్రహమ్ము - చిత్త శుద్ధిని గోరు,
జయము కాంచ లేదు సంశయాత్మ. 4

ఎంచ మనిషి బ్రదుకు -ఎండమావుల వేట !
వెలుగు నీడ ఆట విడుపు తోటి,
లలిత కళలు విద్యలకును శోధన నాళి;
సకల సంగరముల సత్రశాల. 5

ఆలసింప - న్యాయ మన్యాయమే యౌను,
జనము కోరు - శీఘ్ర చర్య లిపుడు;
జలగ - నత్త - నక్క కొలువు కూటము కోర్టు !
వ్యయము లేని - న్యాయ మమరు గాత! 6

తూర్పు పడమర లను - వేర్పాటు కృతకమే,
మానవ స్వభావ మర్మ మొకటె !
దేహ శిల్ప మొకటె - ధీశక్తు లొక్కటే !!
ఏల చూడ వలెను ? తోలు రంగు ? 7

చాల నాళ్ళు బ్రదుకు క్షమ యున్న మనుజుండు;
చిత్త శాంతి గలిగి చిన్మయుడయి;
ఆయు వణచు మరియు ఆరోగ్యము హరించు
ద్వేష మయ మసూయ తెలియకుండ. 8

గుడ్లు పొదుగు టందు - గూళ్ళు కట్టుట యందు,
పక్షు లందు గొప్ప ప్రజ్ఞ కలదు,
ధరణి లోన పక్షి దాంపత్య బంధమ్ము,
నరుల యందు తరచు అరయ లేము. 9

నరుడు - బ్రదుక లేడు - నైరాశ్య జగతిలో;
ఆశ - మానవులకు ప్రాణ నాడి,
కలలు మేలు నిదుర కలవరింతలతోడ;
మనిషి - అపజయాలు -మరువ దగును. 10

పెద్ద వారి యెడల - వినయమ్ము చూపించు;
తిట్ట వద్దు - ఎవరి కొట్ట వద్దు,
బ్రతుకు లోన మేలు -మిత భాషణము గదా!
వాదు లాడ వద్దు - స్వరము పెంచి. 11

ధనము కూర్చి - గుప్త దాన మిచ్చుట మేలు
ఉన్న లోన కొంత ఉన్న యంత
అర్హు డైన వాని కడుగ కుండగ నిమ్ము
పెదవి విప్ప కుండ పేర్మి - ఓటు? 12

అపరిచితుల కైన - ఆహ్వాన శుభలేఖ
పేరు పెట్టి వారి పిలిచి ఇమ్ము;
అతిథి కంటె ముందు అభ్యాగతులకిమ్ము
హార్దిక మగు - గొప్ప స్వాగతమ్ము. 13

అరయ - ధరణి లోన - న్యాయ శాస్త్రము వేరు
" దేవుని తుల " తీరు తెన్ను వేరు !
ధర్మ సూక్ష్మ తత్త్వ తర్క వాదము వేరు !
అంతరాత్మ నిర్ణయమ్ము వేరు. 14

ఆకసమ్ము కూలి అవనిపై పడ బోదు
ఎవరి కేమి జరుగ నెప్పు డైన !
తొణక రాదు సుంత బెణక కుండగ సదా;
మనిషి - ఓర్పు గలిగి మసలుగాత.

నిన్ను గూర్చి నీవు నీ ప్రసంగము లందు,
చెప్పు కొనుట గొప్ప తప్పు సుమ్ము;
బ్రతుక వయ్య -గొప్ప మితభాషివై నీవు
వేది పైనె - పెదవి విప్ప దగును. 16

సాయ మివ్వ దగును -శక్తి వంచన లేక,
పాత్రు డయిన యెడల ప్రతిభ నెరిగి;
మంచి నీరు నివ్వ - మనిషి ఆకొని యున్న
నరక నేత యైన -నవ్వ వచ్చు. 17

మంచి కనుట మేలు మన దేశ మన నేల ?
స్వీకరింపరాదు చెడ్డ నెపుడు;
మంచి ఎచట నున్న - ఎంచి గైకొనవచ్చు;
వట్టి పిచ్చి దేశభక్తి - మమత. 18

ఉండగూడ దెపుడు - స్వోత్కర్ష పలుకులో,
మొగము నెదుట - ఎవరి పొగడ దగదు,
ఎవరి తెగడ గూడ దెన్న డైనను గాని,
నిజము గూడ కోరు - నిగ్రహమ్ము. 19

ఉండు శ్రీనిరంజనుండుగా ఏకాంతి !
ఉభయు లున్న యెడల -శుభము సుఖము;
ముగ్గు రున్న యెడల - మొద లౌను గడబిడల్,
యుద్ధ మగును నల్గు రున్న యెడల. 20

పెక్కు చోట్ల కేగ - పెక్కు భాషలు నేర్వ,
తరచు పెరుగ వచ్చు -నరుని మెదడు;
జనులు పర పరాగ సంపర్కమున జేసి,
పుడమి మీద - ఘనత - పొంద వచ్చు. 21

జీవితమ్ము వింత చెఱసాలయే గదా,
ఎన్నొ కల వదృశ్య శృంఖలములు;
సంఘ మందు సర్వ సౌభ్రాత్రము హుళక్కి,
సమత కొరకు పోరు సలుప వలెను. 22

కానబడక పైకి - మౌన ముద్రను దాల్చి,
ఎదుటి వాని ప్రస్తుతింప వచ్చు;
వీను లొగ్గి - కనుల - వాని మాటలు విన్న
పులకరించి - అతడు - పొంగి పోవు. 23

నాటి చరిత కలదు నేటి యోగికి కూడ
పుట్టు పాపి లేడు పుడమి మీద,
భావి కొంత కలదు - పరమ పాపికి కూడ,
నిర్ణయించ నేల? నేడె మనము. 24

సంస్కరింప వలెను - స్థాన జాగృతి గల్గి,
వివిధ కళల నెల్ల విద్య లెల్ల;
పాత బూజు పెంచు - పంచాంగముల నెల్ల,
చెదలు పట్టి నట్టి హృదుల నెల్ల. 25

ఉడుత భక్తి ఎంత యున్న - లాభము లేదు,
ఆంజనేయ శక్తి - అవసరమ్ము;
ఇసుక రజము చిలికి తృప్తి చెందుట తప్పు
శక్తి వంచనమ్ము సలుప రాదు. 26

ప్రతిదినమ్ము - మంచి పనిని ఒక్కటి యైన
మానవుండు చేయ బూన వలయు;
పుడమి మీద - సొంత పొట్ట నింపుకొనుటే,
బ్రతుక టంచు - తలప రాదు - మనిషి. 27

ప్రగతి పడయ రాదు - క్రమ శిక్షణము లేక,
శ్రమకు ఓర్చు నట్టి శక్తి లేక,
అభ్యుదయము లేదు - ఐకమత్యము లేక,
నియమ నిష్ఠ లేక - నీతి లేక. 28

చేయు నట్టి మేలు - శీఘ్రమ్ముగా చేయ
బ్రతుకు నందు - గాథ రక్తి కట్టు;
అమృతమే విష మగు - ఆలస్య మైనచో !
దాన మివ్వ దగును త్వరిత గతిని. 29

అంగ బలము లేక - ఆదర్శముల తోడ
ధరణి మీద - పనుల జరుప లేము;
వెరవు గలిగి - ధ్యేయ విజయమ్ము కొసమే,
వంగ వచ్చు - కొంత లొంగ వచ్చు. 30

ఆడ రాదు జూద మమితాశ - బ్రతుకులో;
తేర లాభములను కోర రాదు;
కలదు - గౌరవమ్ము -కష్టార్జితము నందు,
శుభము - పాదుపు తృప్తి సుఖము నిచ్చు. 31

మధుర ఫణితి - సతము మాట లాడుట తప్పు;
స్వరము శైలి మార్చ వలెను తరచు,
భాష దేశ కాల పాత్రానుగుణముగా
బ్రదుకు నందు తూచి వాడ వలెను. 32

కార్చ నేల ? వేడి కన్నీరు మున్నీరు ?
చచ్చి నట్టి వాని మెచ్చు కొనుచు,
బ్రదికి యున్న వానిపై ఆదరణ చూప,
సార్థకమయి చెల్లు - సానుభూతి. 33

బ్రదుకు కాదు మనిషి కది సజీవ సమాధి!
మెదడు వాడకుండ మెదిలె నేని
గొఱ్ఱె పిల్ల వోలె - గ్రుడ్డిగా పోరాదు,
పదను పెట్ట దగును మెదడు కెపుడు. 34

తన అవయవముల విధాన విజ్ఞానమ్ము
దేహ శిల్ప రీతి - తెలిసి కొనక;
నరుడు - దృష్టి - బరపె నాకగ్రహాలపై!
అంతు చిక్క నట్టి ఆత్మ పైన. 35

నీడ పట్టు కొనును - నిజ వస్తువును వీడి,
శుద్ధ ఛాందసు డగు - శ్రోత్రియుండు!
అక్షరాలు వేరు - అంతరార్థము వేరు;
సార మరయు గాత - సహృదయుండు. 36

ఆలకింప దగును - అనుభవజ్ఞుల మాట,
పిరికిదనము లేక - భీతి లేక;
వేయ రాదు సుమ్ము వెనుకంజ వెరపుతో;
వెరవు గలిగి ముందు కరుగ దగును. 37

మూర్ఖ జనుల తిండి మొగము ముందు పొగడ్త;
లంపటమ్ము ఉభయ లాఘవమ్ము;
వాక్కు గూడ చచ్చు పుచ్చుగ దోచు;
మొగము ముందు ఎవరి పొగడ రాదు. 38

జరిగి నట్టి దెల్ల - మరచి పోవుట మేలు,
వద్దు - శవ -పరీక్ష వద్దు వద్దు,
శత్రువులను గూడ - క్షమియించ మనసార
పడయు సుఖము బ్రదుకు బాటసారి. 39

మెదడు పెరుగ వచ్చు - చదువుతో పదవితో !
పండ వలెను మనిషి గుండెకాయ;
మంచితనము లేక - మానవత్వమె లేదు;
అంతరాత్మ శుద్ధి అవసరమ్ము. 40

కలలు గనుట కొరకు కాలమ్ము లేకుండ
నవ్య నాగరికత - నడచి పోవు.
పిచ్చి యెక్క వచ్చు విశ్రాంతి లేనిచో
ధ్యాన మవసరమ్ము మానవులకు. 41

విద్య ఇవ్వ లేని - విషయ వైశద్యమ్ము;
మనిషి కివ్వ గలదు - అనుభవమ్ము;
బలము గాని - మేటి తెలివి తేటలు గాని
జగతి - అనుభవమ్ము సాటిగావు. 42

ఆచరణము వేరు - ఆదర్శములు వేరు!
కోట దాట వచ్చు మాట లెల్ల!
మంచితనము నుంత - మానవత్వము కొంత,
పనుల యందు వ్యక్త పరచ వలెను. 43

సానుభూతి గాని - సంతాపమును గాని
తెలుప రాదు గాలి పలుకు లందు;
సహృదయత్వ మున్న - శక్తి వంచన లేని
ప్రేమ - చూప దగును - క్రియల యందు. 44

దానముగా ఇవ్వకు - బహు
మాన మనుచు చాటుము - మృదు మధురముగా - ప్ర
జ్ఞా నిధికిని - యత్ కించి
త్తైనను తోడ్పడిన జన్మ - సఫలము సుమతీ! 45

ప్రగతి వచ్చు - పర పరాగ మేళనముచే,
    సాంస్కృతిక సమాజ శాఖలందు
భిన్న మత కులాలు ప్రీతితో పెండ్లిండ్లు,
    భరతభూమి పైన జరుగ వలయు. 46

నిండి యుండు - జగతి ఖండ సత్యాలతో!
    ప్రగతి కలదు సామరస్య మందె;
వివిధ దృక్పథాల అవగాహనమె - సుమ్ము;
    అవతరింప చేయు నవ యుగమ్ము. 47

మాట వరస కొరకు - మర్యాద కోసమై;
    పలుపు రౌనటంచు పలుక వచ్చు
ఒకడు కాదటంచు ఒకవేళ పలుకుచో,
    ఆదరింపవలయు అతని మాట. 48

ఏదో ఒక ఆదర్శము,
ఏదో ఒక పని సమష్టి హితమున కై తా
నౌదల దాల్చిన త్యాగికి
నైదు పదిని చేసి - లోక మారాధించున్ 49

నరుడు మసల రాదు - నాల్గు గోడల మధ్య,
    ఒక్క ఊరి లోన - ఉండి పోయి;
బ్రదుక రాదు - మనిషి బావిలో కప్పయై;
    అరయ దగును - క్రొత్త ఆకసములు. 50

అనుభవింప వలయు - ఆనంద విశ్రాంతి,
అలసి పోవరాదు సెలవు లందు,
సెలవు తీరు తీయములు జీవితమ్ములో,
తెలిసి కొనుట గొప్ప లలిత కళయె. 51

నీవు తోడు పడిన - నిర్హేతుకమ్ముగా,
ఎవని కైన గాని - ఎప్పు డైన!
మరువ డతడు - నీవు మరువ వచ్చును గాని ;
వచ్చు విలువ - మానవత్వమునకు. 52

దొరలు చుండు తరచు దోషాలు పనులలో!
చేయి తిరుగు వాడె చేయవచ్చు
తప్పు వేరు గలదె - తప్పు లెన్నుట కంటె ?
తప్పు లెన్న బోరు - గొప్పవారు. 53

పాఠశాల లేక - ప్రథమ వైద్యము లేక;
బస్సు లేక - మంచి బాట లేక,
త్రాగు నీరు లేక - గ్రంథాలయము లేక,
ఒక్క ఊరు గూడ - ఉండ రాదు. 54

ఉబికి పైకి వచ్చు - ఉత్సాహ భావమే
వీరమునకు తల్లి వేరు సుమ్ము
జయము పొంద - చాలు సగము సామర్థ్యమ్ము,
సగము బలము నిచ్చు - సంతసమ్ము! 55

జయ మహోత్సవములు - సత్కార సంస్తుతుల్
పతన హేతువు లగు బ్రతుకు నందు,
అపజయము గొప్ప - వ్యాయామ శాలయై,
అవతరింప జేయు ఆత్మ శక్తి. 56

చిట్టి యెలుక చేరి - చేయ వచ్చును, మేలు
జీవితమ్ము నందు - సింహమునకు,
బ్రతుకు నందు జరుగు ప్రత్యక్ష సత్యాలు,
కొట్టి వేయ రాదు పిట్ట కథలు. 57

ఆదరించి - తిండి - అతిథి కుత్తుక నిండ
పెట్ట వద్ద జీర్తి పెంచ వద్దు;
అరసి పేదవాని కాహార మిడినచో,
ఉభయ తారకమ్ము - ఉజ్జ్వలమ్ము. 58

పాడు చేయ గలవు - ప్రత్యక్ష సంస్తుతుల్
ఎంత గొప్ప బుద్ధి మంతునైన;
కడిగి వేయగలవు - ఎడద మాలిన్యముల్;
చేదు తిట్లు - మేలు చేయ గలవు. 59

భూత దయను మించు - పుణ్య మేదియు లేదు,
హింస కంటె - పాప మేది లేదు;
విశ్వహితము కంటె - వేదాంతమే లేదు;
మంచితనము మించు మతము లేదు. 60

అరయ దేశమునకు - మురికి వాడలు గాదు,
చదువు రాని వారు గదర - సిగ్గు!
రాజకీయములకు రౌడీలు గాదురా!
శీల రహిత నేత - సిగ్గు సిగ్గు. 61

జీవితమ్ము నందు శీల సామర్థ్యముల్
రెండు రెక్కల వలె ఉండ దగును,
ఎగుర లేదు - పక్షి - గగన వీధుల లోన;
ఒక్క రెక్క మాత్ర మున్న యెడల. 62

నిదుర పొమ్ము - వేగ - నిష్ఠగా ప్రతిరోజు,
ఉదయ మందు - వేగ - నిదుర లెమ్ము
అభ్యుదయము - ఆయురారోగ్య సంపదల్,
పడయ గలవు నీవు బ్రతుకు నందు. 63

తాప మంద నేల తాదాత్మ్యమును పొంది,
నరుడు పాత్రధారి నాటకమున
అహము మమత లేల ; ఇహ జీవితము లోన
జగతి యందు - నిత్య సత్య మేది. 64

వెలయు నీడ నిడివి - వెలుగు వ్యాప్తిని బట్టి
తిరుగు ప్రొద్దు తీరు తెన్ను బట్టి;
శబ్ద భావ సరళి - సమ యోచితమ్ముగా,
మారు చుండు మనిషి మాట బట్టి. 65

పెరిగి పోయె ధరలు - ప్రియ మయ్యె వస్తువుల్;
రూక చవుక యయ్యె - లోక మందు,
విద్య వైద్యములకు - బీద - దూరము నేడు,
దేవు డిపుడు నిదుర బోవు చుండె. 66

చాలు - మబ్బు తెరలు సన్నగిల్లగ జేయు,
చదల సూర్యరశ్మి చాల సేపు;
అణచు కొంత సేపు - అధిక తేజస్వినే!
అల్పు డొక్క డెవడొ అధిగమించి. 67

మాట లనిన ఏమి ? మాయా బజారులే !!
నిప్పు పుట్టజేయు నీటి నుండి!
నేల పైకి రాల్చు - నింగి నక్షత్రముల్;
పొంగ జేయు కడలి నింగి వరకు. 68

అరయ వచ్చు గొప్ప అన్యోన్య సహకృతుల్,
బృంద వాద్య గాన మందు - సతము;
నరుని జీవితమ్ము ధరణిపై సర్వదా
ఏక గాత్ర గాన మెపుడు గాదు. 69

గొప్ప దనము గాంచి గుర్తు పట్టెడు వాడె,
గొప్ప వాని కంటె గొప్పవాడు !
గొప్ప దనము తోడ - కూడ సౌజన్యమ్ము
సహృదయు డగు చుండు జగతి యందు. 70

చేయ లేదు పనులు ఏ యొక్క అధికారి,
లేదు - చిక్కు లేవి లేని - సంస్థ,
భృత్యుల కధినేత - శ్రేయోభిలాషియై,
పిదప - చేయ వచ్చు పెత్తనమ్ము. 71

వినయ మొకటి - విమల విజ్ఞాన చిహ్నమ్ము
కామ రూపి " అహము " కాలనేమి?
వేయ గలదు - " అహము " వినయ వేషము గూడ,
ప్రజల మోస పుచ్చవచ్చు - తరచు. 72

విలువ యైన దేది ? విందు భోజన మందు ?
ప్రేమ తోడి పిలుపు - వీడుకోలు;
తిండి గాదు - పెక్కు పిండి వంటలు గావు,
అతిథి పొందు స్వాగతాదరణము. 73

అరయ కాన్క అన శుభాకాంక్షయే గదా!
కనుల యెదుట తరచు కానుపించు;
ఆవరించియుండు అదృశ్యమై - ప్రేమ,
జ్ఞాపకమ్ము వచ్చు సౌహృదమ్ము. 74

నేల నింగి అదర - గాలి వార్తలు వ్రాయు
నీళ్ళ లోన - నిప్పు నిగుడ చేయు;
పుడమి కడలి అదర సుడిగాలి పుట్టించు
వక్ర పాత్రికేయ చక్రవర్తి. 75

యువకు లైన వారి ఉత్సాహ విక్రాంతి,
దేశభక్తి వైపు త్రిప్పవచ్చు;
ప్రోత్సహించ వలెను - యువజనోన్మేషమ్ము;
స్వార్థపరులు ముసలివారు తరచు. 76

పృథివి లోన ఏది పెరుగు చుండును సదా ?
వనరు లేవి గావు - గనులు గావు;
ధనము కాదు - ఒక్క జనసంఖ్య మాత్రమే!
అదుపు తప్పిపోయి అధిక మౌను. 77

శాంతి సౌఖ్యములను సంధించి స్వగృహమ్ము
అంద జేయు గాత-స్వాగతమ్ము
నరుల కిల్లు - బోను - చెరసాల కారాదు,
గుండె లోన హాయి - కూర్చ వలెను. 78

చేర లేడు - నరుడు - గౌరవస్థానమ్ము
చదువు తెలివి ధనము పదవి గలిగి !
కావి గట్టి - పెంచి గడ్డాలు మీసాలు,
దొడ్డి దారి నుండి దూర వచ్చు. 79

శవము నెడల కలదు - సంఘ కర్తవ్యమ్ము;
చూడ నట్లు వెడలు - శుద్ధ శుంఠ;
కూడి నట్టి వారు - కొంత సేపట నిల్చి
చేత నైన సేవ చేయ వలయు. 80

శవ పరీక్ష సలుప - చైతన్య దేహమ్ము
తీరు తెన్ను లెట్లు తెలియ నగును?
కానుపించు చుండు - ఖండ సత్యము లెన్నొ;
వింగడింప శాస్త్ర విద్య లందు. 81

అవని లోన - మార్క్సు - అవతరించిన మీద,
విలువ పెరిగె శ్రమకు - విశ్వ మందు,
జాగృతు డయి - స్వీయ శక్తి సామర్థ్యముల్;
కార్మికుండు తెలియ గలిగె నేడు. 82

నిగ్రహమ్ము నీతి నియమ నిష్ఠాచర్య,
మేలు నరుల జీవితాల లోన;
ఆనకట్ట లేక అంభోధి పడిపోవు,
వ్యర్థ మగుచు నదుల యందు నీరు. 83

ధ్యాన మనిన ఏమి ? జ్ఞాన జాగృతి గల్గి,
నిద్ర దాటి - మౌన ముద్ర దాటి ;
మానసమున విరియు - ఆనంద సంక్రాంతి,
అనుభవైక వేద్య మైన - తెలివి. 84

వదల వద్దు ఇల్లు - వద్దు సన్యాసమ్ము
నగటు మనిషి వోలె జగతి బ్రదుకు,
గ్రుడ్డి నమ్మకాల - గుండె దాచగ రాదు,
గురువు లెవరు వద్దు - గుడులు వద్దు. 85

తరచు - ఎల్ల పనులు ధైర్య సాహసములే,
జయము కూర్చు చుండు జగతి యందు;
వేయ రాదు జంకి - వెనుకంజ - ఏనాడు
సగము సగము పనులు సలుప రాదు. 86

వంకాయలలో పుచ్చులు
టెంకాయలలోని క్రుళ్ళు, డెందములోనన్
వంకర టింకర శంకలు;
శంకర దేవుడె తెలియ జాలడు - సుమతీ! 87

జంట నగరములకు - సంస్కృతి క్షేత్రమ్ము;
గరిమ నాభి - లలిత కళల కెల్ల;
వెలుగు గోరు ప్రజకు - విశ్రాంతి సత్రమ్ము
త్యాగరాజ సభను - అభినుతింతు. 88

కారు నెక్కి వెడల - ఘను డౌనె మనుజుండు ?
సైకి లెక్కి పోవ చవట గాడు,
ప్రజ్ఞ లుండ వచ్చు పాదచారుల యందు;
వాహనమ్ము వేరు - ప్రతిభ వేరు. 89

కవులు చేయుదు రధిక ప్రసంగమ్ములే!
సాహితీ సభలకు - జనులు రారు;
చివరి వక్త గూడ - సిగ్గు లేకుండగా,
మైకు విడువ లేడు మరులు గొనుచు. 90

వాపు - దేహ మందు - వ్యాధి యౌనేగాని,
బలము కూర్చ దవయవాల కెపుడు;
అతిశయింప - ధనము నధికార మొకచోట
భ్రాంతి గొలుప వచ్చు - ప్రగతి యనుచు. 91

కూర లోని గరిటె - ద్వారపాలక వర్తి,
గుమ్మ మందు నున్న కుక్క కొదమ,
తిరుగు - అరయ లేడు - మొరుగు చుండును గదా !
గుర్తు పట్ట లేక -గొప్పతనము. 92

రంగు రాళ్ళు - జాతి రతనమ్ములను మించి
వెల్లి విరియ జేయు వెలుగు జిలుగు,
మెరుగు పెట్టవలెను - మేల్మి బంగరు కైన,
వెండి కైన - మట్టి కుండ కైన. 93

గాలి లోన తేలు - గడ్డి పోచలు కొన్ని,
బలము వాటి కేమి గలదు చూడ,
కాని తెలుప గలవు - గాలి వాటము దిక్కు,
తెలుపు - ముందు వచ్చు తీరు తెన్ను. 94

కలిసి రైళ్ళలోన - కలిసి పార్కుల లోన,
నరులు తిరుగ వచ్చు మరిచి పోయి,
కలుసు కున్న యెడల - గ్రంథాలయాలలో!
కలుగు మరువ లేని గాఢ మైత్రి. 95

అహము చూప నేల ? అధికారి దయ లేక,
ప్రజకు మేలు చేయ వలెను - పూని;
అంతరించ వచ్చు - అధికార మెప్పుడో!
దుఃఖ మొంద నేల తుట్ట తుదకు ? 96

కులము మతము లందు గోచరించున దేమి ?
గుంపు లోన చేరు గుణము కాక ??
చదువు కున్న వాడె - సంఘ మేళము చేరి,
మెదడు వాడకుండ బ్రదుక దలచు. 97

నరుని బ్రదుకు లోన - పరమార్థ మొక్కటే,
ఇపుడె ఇక్కడే లభించు సుఖము;
తాను సుఖము పొంది - ధరణిపై తృప్తిగా,
పరుల సుఖము కొరకు పాటు బడుటె. 98

వాదు లాడ నేల ? వానతో ఎవరైన ?
ఏల తగవు చల్ల గాలి తోడ ?
గొడుగు చేత పట్టు కొనుటె - మంచిది గదా !
ఉన్ని బట్ట తాల్చు టుత్తమమ్ము. 99

కత్తి పోటు నైన - సుత్తి దెబ్బల నైన;
మనిషి తరచు ఓర్చుకొనుట - కద్దు;
నరుడు సైప లేడు - దురద బాధను సుంత,
మ్రింగ జాల డుప్పు - మ్రింగు విసము. 100

పూచి నట్టి అన్ని పూలు - పిందెలు కావు,
కల్ల - పిందె లెల్ల - కాయ లగుట;
కాయ లెల్ల - పండ్లు కాలేవు చెట్లపై;
కోతి - చిలుక యైన - కొరక వచ్చు. 101

మేటి - లౌక్యమునకు - మిత భాషణము సూచి,
కార్యసాధకుండు కాదు - వక్త;
మనిషి జయము గాంచు - మనన సాధన చేత,
చేటు గూర్చు తరచు నోటి తీట. 102

మంచి మాట వల్ల - మర్యాద వల్లనే,
పరుల గుండె తలుపు - తెరువబడును;
తెరవ బడదు - మేటి తెలివి తేటల వల్ల,
చదువు వల్ల - పెద్ద పదవి వల్ల. 103

ధనము - ప్రోగు బడిన - ధరణిలో ఒక చోట,
సంఘమునకు కీడు సంభవించు;
అవని ప్రోగుబడిన - అధికార మొక చోట,
అంత కంటె సంఘ హాని లేదు. 104

పాడ వచ్చు గుడ్డి వా డద్భుతమ్ముగా,
కుంటి వాడు - కవిత - కూర్చ వచ్చు!
చెక్క వచ్చు - మూగి - శిల్పాలు సొగసుగా;
చెవిటి - గీయ వచ్చు - చిత్రములను. 105

వ్యాధు లెల్ల మాన్పు ఔషధమ్ములు లేవు;
పూర్ణ వేత్త - వెజ్జు - పుడమి లేదు;
దేహమునకు కలదు - దివ్య ప్రభావమ్ము
తనను బాగు చేసి కొనును - తానె. 106

నచ్చిన - నచ్చక పోయిన
మెచ్చ దగును శత్రువైన - మేధావిని-వే
మచ్చరమును విడి - హృదయము
పుచ్చని పండిత వరుండు - పుడమిని - సుమతీ ! 107

కనుల కాకు పచ్చ కన్పించుటే - చాలు !
ఎదిగి మొక్క లెప్పు డింటి ముందు;
అరయ పూలు పిందె లగుట ఆకులు మధ్య;
సృష్టి చిద్పరిణతి చిందులాడు. 108

తొలకరింప - ఆట వెలదియై నర్తించు,
ప్రకృతి - తాల్చి ఆకు పచ్చ చీర ,
తరువు లెల్ల కెరలి - స్థాయి నాట్యము సల్పు,
పోతు నెమలు లాడు పురులు విప్పి. 109

డెంద మలర జేయు- టెంకాయ నీరమ్ము
అది అమృత కలశమె అనగ జెల్లు,
ఇమడి యుండు నందు సృష్టి చైతన్యమ్ము;
కలదు స్వచ్ఛతమము ఖాద్య మందు. 118

కలి యుగమ్ములో జగత్ వంచనము లేని
వృత్తి యెచట గలదు పృథివి యందు ?
అసలు బ్రతుకు నెవ్వ డాత్మ వంచన లేక ?
అతడె కర్మ యోగి - అతడె జ్ఞాని. 111

జలములు తరచుగ పాలన్
కలియుచు నుండు గద ఆశు కవితల యందున్;
పలికిన వచనము మీగడ
వలె ఆకర్షించు సతము బహుళ ప్రజలన్. 112

అణు కణముల వోలె - అలరు బంగారమ్ము,
మట్టి రాతి పొరల మధ్య చేరి;
ప్రకృతి - ఇవ్వ దెపుడు - పళ్ళెరమ్మున పెట్టి,
గొప్ప వస్తువులను గూర్చు - శ్రమయె. 113

బ్రదుకు నందు తెలియబడని ఘోర విపత్తు;
మనిషి మరచు దుర్ఘటన మదేది ??
పడసి - యౌవనమ్ము- బాల్యమ్ము వీడుటే !
మంచితనము - హృదిని మాయ మగుటె. 114

జయము తీర్చ గలదు - సర్వ వక్రత్వముల్,
గొప్ప లోపములను - కప్పి పుచ్చు;
బలిమి కలిమి - మేటి తెలివి తేటల నెల్ల.
అపజయమ్ము తరచు అపహరించు. 115

కార్యదర్శి యైన - కార్యకర్తయె యైన,
తిరుగ వలెను నిదుర తిండి విడిచి;
తిట్ల నెన్ని యైన - దీవనల్గా ఎంచి,
స్వీకరించ వలయు - సిగ్గు విడిచి. 116

ప్రగతి గూర్చ గలదు - శ్రమదాన యజ్ఞమ్ము
పట్టణమ్ము లందు - పల్లె లందు;
సార్థకమ్మగును గదా ప్రజాస్వామ్యమ్ము;
సమత సోదరత్వ మమలు జరిపి. 117

కలుగ జేయు శబ్ద కాలుష్య మద దంతి;
మానసనమునకు కాన రాని హాని,
కనులు చెవులు మెదడు - కాంక్షించు విశ్రాంతి,
విద్య కంటె - ధ్యాన నిష్ఠ మేలు. 118

ఆభరణము లేల ? ఆహార్య మేలరా ?
చిన్మయమ్ము సుమ్ము చిత్త తృప్తి;
చాలు చాలు - నిత్య సంతృప్తి బ్రతుకులో;
అంత కంటె తెలివి అవని గలదె. ? 119

* మనుజ సంఘమన్న - మార్పు మాత్రమెగాదు
బ్రదకు తెరువు సామరస్య - సంధి;
క్రొత్త పాతలకును - కూర్మి కూడలియైన
ప్రగతి - కూర్పదగును బ్రదకు నందు

# మానవత్వం

మంచి తనము కొరకె - మానవత్వమునకే!
సేవ దేని కొరకు ? సేవ కొరకె !
సంఘ మందు సతము స్వచ్ఛంద పరిధిలో,
ఉండు గాత త్యాగయోగ నిరతి. 1

మేటి మెదడు కంటె - మేడ మిద్దెల కంటె;
వాహనాల కంటె - పదవి కంటె;
చతుర మధుర వాక్య చాకచక్యము కంటె,
మంచి మనసు మేలు మనిషి యందు. 2

కవి వరుండు - వక్త - కావచ్చు బ్రదుకులో !
చదువు వాహనాలు పదవి గలిగి,
మనిషి కెన్ని యున్న - మానవత్వము లేక
లాభ మేమి ? సుభగ శోభ యేమి ? 3

మనిషి చెప్పు నెడ - క్షమాపణ వేగ
తప్పిదమ్ము బరువు తగ్గి పోవు;
బాధితుండు మరియు ప్రక్కవారలు గూడ,
సేద దేరి సంతసించ వచ్చు. 4

కలరు - కొంత మంది - కలి యుగమ్మున కూడ,
ఎంచ ఇచట నచట మంచి వారు ;
త్యాగ బుద్ధి తోడ - స్వార్థ మేమియు లేక,
సేవ కొరకె సేవ చేయు వారు. 5

చచ్చిపోవువారి - సదనమ్ములో నుండి,
బయట పెట్టు నట్టి వారు - కలరు !
కలదె - అంత కంటె - క్రౌర్యమ్ము బ్రదుకులో ?
మానవత్వ మెల్ల - మంట గలియు. 6

మంచితనము చాలు - మానవత్వము చాలు ;
చదువు వద్దు - గొప్ప పదవి వద్దు;
యుక్తి వద్దు - చాలు - ఉపకార హృదయమ్ము!
పౌర వరుడ వగుచు - బ్రదుకు - చాలు. 7

మంచి గుండె చాలు - మనుజ మాత్రుల లోన,
మేటి మెదడు కంటె మిగుల మేలు;
ఉన్న చాలు కొంత - ఉపకార శీలమ్ము ;
పొంద వచ్చు కొంత మంది - మేలు. 8

దిన దినమ్ము భారతీయ సీమల జనుల్,
శాంతి పాఠములను చదివినారు,
పుట్టి రిచట పూజ్య బుద్ధ దేవుడు గాంధి,
విరియ చేసినారు - ప్రేమ - - కరుణ. 9

ఆస్తికత్వము మరి నాస్తికత్వము వద్దు,
మానవత్వ మమర మనకు చాలు ;
సమత - స్వేచ్ఛ - విశ్వ సౌభ్రాత్రముల తోడ,
వాసయోగ్య మగుత - వసుధ ఇంక. 10

మానవత్వ మనిన - జ్ఞానమ్ము ప్రేమమ్ము,
జాలి గుండె - స్వేచ్ఛ - సమత - శాంతి,
సంప్రదింపు - సంధి - సహజీవనము సుమ్ము !
క్రౌర్య రక్త పాత - కాంక్ష గాదు. 11

మమత చూప దగును - మానవత్వము పైన ;
పదవి - ధనము - కులము పైన గాక,
ప్రతిభ - గౌరవింప బడు గాత - జగతిలో;
గుణము - కూర్చు గాత గొప్పదనము. 12

సమత - స్వేచ్ఛ - సర్వ సౌభ్రాత్ర భావాలు,
పరుల దుఃఖమునకు కరుగు గుండె,
మతము కులము మరిచి - మంచి నెంచెడు బుద్ధి,
మచ్చు తునక లౌను - మానవతకు. 13

ఎన్నో విద్యలు మెదడు
విన్నాణములు పెరిగె నవ విజ్ఞానముచే;
సున్నా యైపోవును యా
వన్నర సంఘము హృదయము వర్ధిలకున్నన్. 14

నేల దున్ని - ప్రజకు మేలి పంటలు గూర్చి
రైతు బిడ్డ అన్నదాత యగును;
గుండె దున్ని - సుకవి - పంపించు సహనమ్ము
విశ్వ మానవత్వ విలసనములు. 15

మంచిమాట వల్ల - మర్యాద వల్లనే
పరుల గుండె తలుపు తెరువ బడును;
తెరువబడదు - మేటి తెలివి తేటలవల్ల,
చదువు వల్ల - పెద్ద పదవి వల్ల. 16

# నవ నాగరికత

యంత్ర నాగరికత - అవనిలో - పెరుగుచో,
పిచ్చివారి సంఖ్య - హెచ్చి పోవు;
పాత నీతి తరుగు - హేతు వాదము హెచ్చి,
మానవ ప్రశాంతి మాయ మగును. 1

దొంగ మౌనముద్రతో ప్రజల్ చరియింత్రు,
వసుధలో యథార్థవాది లేడు;
పలుకు నిచ్చకాలు - తలిదండ్రులకు గూడ,
నవ్య నాగరకత - నరుల మార్చె. 2

ఈ ధరిత్రి నరుని కిపుడు తీరిక లేదు,
కోరికలను వేసు కొనగ నెమరు;
నవ్య నాగరకత - నరుని యంత్రము చేసె;
గుండె నెత్తురూపు గొట్ట మయ్యె. 3

చింద వచ్చు - తరచు - చిరునవ్వు కెరటాలు,
పలుకు తియ్యదనము లొలుక వచ్చు;
ఉండ వచ్చు విసము - గుండె నిండుగ దాగి,
నాగరికత చేయు నటన - వేరు. 4

యంత్ర నాగరికత - వ్యాపార తత్త్వమ్ము,
పెంచ వచ్చు - ప్రపంచ - మందు.
దైవభక్తి - పోయి - ధనభక్తి అధికమౌ,
హృది - నశించి పోయి మెదడు పెరుగు. 5

మనసు విప్పి - ఎవడు - - మాటాడు బ్రదుకులో ?
వికట నవ్య నాగరకత - పెరిగె;
తన మనస్సు - దాచు కొనుట కోసమె - నేడు
మనిషి పెదవి విప్పి మాట లాడు. 6

మనసు దాచు కొనుట - మర్యాద - జగతిపై,
నరుడు బట్ట కట్టి తిరుగు ధరణి,
నాగరికత -వేయు - నగ్న సత్యములపై
ముచ్చటయిన మేలి ముసుగు లెన్నొ! 7

నేడు - దండు విడిసి - ఏడు కొండలపైన;
నవ్య నాగరికత నాట్య మాడు;
ఏది ఎచట కలదు - ఏకాంత వాసమ్ము ?
ఋషికి నైన ఏ మనీషి కైన? 8

వేరు తలపు - పలుకు తీరు తెన్నులు వేరు;
చర్య వేరు - నేడు - జనుల యందు,
లౌక్య చాకచక్య లాలసత్వము హెచ్చె;
చిత్త శుద్ధి తొలగె - జీవ యాత్ర. 9

మనిషి మాటలాడు - మర్యాద కోసమై,
మాట తప్ప వచ్చు - మనసు వేరు !
మంచితనము వేరు - మానవత్వము వేరు,
నరుని పాడు చేసె నాగరికత. 10

నవ్య నాగరికత - ద్రవ్య పారమ్యమ్ము !
పాడు చేసె - నేడు ప్రజల నెల్ల;
మెదడు కంటె మేలు - హృదయమ్ము జగతిలో.
మంచితనము మించు మతము లేదు. 11

అవని మీద నున్న - ఆనంద దుఃఖముల్
పరిగణింపకుండ నరుడు నేడు;
గగన సీమలోన గ్రహయానమును చేయ!
సిద్ధపడెను చిత్ర చిత్తవృత్తి. 12

శుభము - పెంచె - సకల సుఖ వస్తు సంపదల్
జగతి యందు - నవ్య నాగరికత !
పేద లకట వికట వినియోగమున చిక్కి,
ధనిక వర్గమునకు దాసు లైరి. 13

మనిషి యంత్ర మందు - మర మేకుగా మారె,
వ్యక్తి కెట్టి స్వేచ్ఛ - శక్తి లేదు !
నవ్య నాగరికతకు - నరుడు బానిసయయ్యె
పెరిగె - దొరతనమ్ము పెత్తనమ్ము. 14

గుండె దున్ని విత్తి పంచు కొనకుండ
మెదడు - మిడిసి పడుట మేలు గాదు,
నవ్య నాగరికత - నర్తించు లయ తప్పి,
సత్య మార్గ మందు సాగుగాత! 15

# యోగి

ప్రగతి పథము నందు - పరిణామ గతి, సదా
సర్వ సృష్టి లోన - సాగు చుండు ;
సలుప దగును - నరుడు - స్వచ్ఛంద కృషి, కొంత,
అవతరించు కొరకు - అధినరుండు. 1

మానవుండు పుట్టె - వానరత్వము వీడి,
పరిణమించి - ప్రగతి - పథము నుండి
అవతరింపవచ్చు - అధిమానవుడు గూడ,
ప్రగతి - సాగి సాగి - జగతి యందు. 2

ఎరుగ తరము గాదు - సృష్టి యెల్లల నెల్ల;
మహిత శక్తి కలది - మనిషి మెదడు,
నరుని మెదడు పెరిగి - పరిణామ చరితలో,
అందు కొనుత - క్రొత్త ఆకసములు. 3

నరుని తోడ - సృష్టి పరిణామ గమనమ్ము,
ఆగిపోదు - జగతి - సాగ గలదు.
అవతరించు అవని - అధినరుం డెప్పుడో
నరుడు - కోతి వోలె - మరుగు పడును. 4

ఒక అయోనిజుండు - ఉద్భవింపగ వచ్చు,
జగతి లోన - కుంభ సంభవుండు;
కోరు కొనిన - గొప్ప గుణగణాదుల తోడ,
పాంచ భౌతిక మగు - పరిధి దాటి. 5

మదము - కామ మోహ మాత్సర్య లోభముల్
కోపమును మనుజుని - కూల ద్రోయు;
అణగ ద్రొక్కు - చెడ్డ గుణము లా రెవ్వాడు
అతడే గద - భువనైక యోగి. 6

సంస్కరణము మధ్య - సంప్రదాయము మధ్య,
సామరస్య మెవడు సంఘటించు;
క్రొత్త పాత కెవడు - కూర్మి సేతువు కట్టు ?
అతడే మహర్షి - వ్యాస సముడు. 7

మంచితనము పెరిగి మానవత్వములోన,
జంతు గుణము లెల్ల సమసి పోయి;
ధరణి మీద - సృష్టి పరిణామ గతి లోన,
మానవు డగుత - అధిమానవునిగ. 8

ఆచరణము మధ్య - ఆశయమ్ముల మధ్య;
బ్రదుకు నెవ్వ డంతరమ్ము లేక;
తీర్చి దిద్దు నెవడు - త్రికరణైక నిషద్య,
అతడే మహాత్ము డతడె యోగి. 9

నరుడు సృష్టి లోన - పరిణామ గతిలోన
కూర్చుకొనుత - కోరి క్రొత్త శక్తి;
శక్తి పెరుగు - స్వీయ సంకల్ప బలముచే;
నరు డధినరు డగుత - ధరణి మీద. 10

సాధనా తపస్సు - సత్కారములు పొందు,
ఐహికాభ్యుదయమమర వచ్చు,
అతడు జ్ఞానయోగి యౌను - జీవితములో,
పడయు గౌరవమ్ము పదవి మించి, 11

వినయ గుణము - కరుణ - అనసూయ ప్రేమమ్ము,
పెంచు మానవతకు పేర్మి గూర్చి;
నరుడు పెరుగు - సృష్టి పరిణామ పరిధిలో
పాంచ భౌతిక మగు ప్రకృతి దాటి. 12

పూను కొనిన యెడల - జ్ఞాను లందరు గూడి,
మనుజ ప్రకృతి గూడ మార్చ వచ్చు,
అవతరింప వచ్చు - అధిమానవుడు - రేపు,
విశ్వ పరిణతి గతి వికసనమున. 13

చూపు నెవడు - ప్రతిఫలాపేక్ష లేకుండ,
కరుణ - గుండె కరగి - పరుని పైన;
ఆతడే మహాత్ము - డతడె యోగీంద్రుండు
బోధి సత్త్వు డతడె - భూమి మీద. 14

## ఆటవెేట

నృత్యమునకు శోభ - నేత్ర యుగళి;
　　విజయము నకు శోభ - వినయ గరిమ ;
జవ్వనులకుశోభ - చన్ను దోయి.
　　జ్ఞానమునకు శోభ మౌన నిరతి;
శీలము నకు శోభ - జాలి గుండె
　　మంచమునకు శోభ - మంచి నిద్ర;
సౌధమునకు శోభ - చంద్రశాల,
　　శిల్పమునకు శోభ - జీవ కళలు;
సామ్యవాదమునకు - చదువు శోభ ;
　　మానవతకు శోభ - మంచితనము;
సహృదయుండు - కవన సభకు శోభ;
　　కవన కళకు శోభ - గాన శక్తి;
సంఘ సేవ - మనుజ జన్మ శోభ;
　　కవికి - ప్రౌఢ శిష్య గణము శోభ,
పెండ్లి దంపతులకు - ప్రేమ శోభ;
　　వృత్తి యందు గొప్ప తృప్తి శోభ. 1

---

* అర్క పంచకమ్ము ఆటవెేట

(క్రొత్తఛందస్సు)

# దేవుడు

తీర్థ యాత్ర లేల ? దేవు డెచ్చట లేడు ??
అచ్చ టచట ప్రకృతి అంద మలరు !
నరక సమము - బ్రదుక - నాల్గు గోడల మధ్య,
దిగ్ దిగంతరాలు తిరుగ - మేలు. 1

నరకమునకు పోడు - ఉరిదీయ బడు వాడు,
పాప పుణ్య సూక్ష్మ పరిధి వేరు,
స్వర్గమునకు పోడు - చావ మంచము మీద,
దేవుని " తుల " తీరు - తెలియ రాదు. 2

అనకట్ట నదుల కడ్డమ్ముగా వేసి,
నీరు పంట కొరకు - నిలుపు చోట్లు,
దేశ మందు నేడు దేవళమ్ములు - సుమ్ము!
ప్రాత గుడులు గోపురాలు కావు. 3

దేవుడు వ్రాసిన గ్రంథము
లేవీ లేవీ మనుజ మహీస్థలి లోనన్,
ఈ వైవస్వత మనువులు
ఈ వేదాంతులు మనుజులు ఇతిహాసంబుల్. 4

దైవ మందు - భక్తి తాత్పర్యములు లేక,
మనుజు లుండ వచ్చు - మంచి వారు;
ధర్మ మందు, భక్తి తాత్పర్యములు లేక,
మనుజు లున్న - వారు - దనుజ సములు. 5

ఉన్నాడో లేడో ఆ,
మిన్నున దేవు డెవడో అమృత రూపుండై;
ఉన్నాడు గద మనుజు డీ,
మన్నున - కృషి సల్పు తత్ - సమస్యలు తొలగన్. 6

సర్వ మీశ్వ రేచ్ఛ - జగతిలో అని చెప్ప
స్వస్తి చెప్ప వలయు చర్చ కింక;
పుణ్య పాప మేది ? పురుషకారము లేక
మనిషి మంచి చెడగు మాయ మగును. 7

తరచ వచ్చు - సర్వ ధారుణీ విషయముల్ !
దేవు చర్చ లోకి - దింప కున్న;
తారసిల్లు తరచు - తర్క విప్రతిపత్తి,
కదిపి కుదుప నమ్మకాల గుట్ట. 8

దైవ ఘటన మంచు - తలపోయ సర్వమ్ము
తర్క వాదములకు - తావు లేదు,
పురుషకారమునకె -పరిమితమ్మును చేసి,
చర్చ సలుప దగును జనము లెల్ల. 9

అంతయు దైవాధీనము
సుంతయు మనుజులకు స్వేచ్ఛ శూన్య మనెడి వే
దాంతము చెప్పినచో - ఓం
శాంతిః శాంతిః - మరేల ? చర్చలు - గిర్చల్. 10

# స్త్రీ

అనుభవైక వేద్య మానంద ఝురి పొంగు,
మొదటి రేయి పొందు - బ్రదుకు నందు
పయసు మళ్ళి పెండ్లి - వ్యాపార నిరతియే!
స్థాయి రస సమాధి - సరళి - వేరు. 1

కులము నుద్ధరించు కోడ లందురు గదా,
వెల్లి విరియ జేసె వెలుగు లామె;
క్రొత్త బ్రతుకు కూర్చుకొను నామె కూర్మితో,
తల్లి తండ్రి యున్న ఇల్లు వదిలి. 2

పెండ్లి అయిన కన్నె - పిదప జీవితములో,
సగము స్వేచ్ఛ తరచు సమసిపోవు!
పెండ్లి కాని కన్నె - పృథివీ గగన సీమ,
తెగిన గాలి పటము - పగిది తేలు. 3

ఆలు మగల పూర్తి అద్వైత యోగమ్ము
ఉర్వి మీద ఎచట ఉండ బోదు;
సానుభూతి యున్న చాలు - నిర్వురి మధ్య,
తలపు లందు - బ్రదుకు మలుపు లందు. 4

కాంత - కొంత సేపు - చింతామణిని బోలు,
మధురవాణి బోలు మరియు మరల
అరయ మేనక వలె - మరి వరూధిని బోలు
దేవ దేవివోలె - తిరుగ గలదు. 5

వనితయె ప్రేమామృతరూ
    పిణి త్యాగమ్మునకు మారుపేరే ! కానీ
ధనమునె హృది ప్రేమించిన
    వనిత పిశాచినిగ మారు వసుధన్ - సుమతీ! 11

అధిక మౌను భర్త ఆయుష్షు బ్రదుకులో ,
    తరుణి - తగిన భార్య - దొరకె నేని;
భర్త జీవితమ్ము - భర్త అభ్యుదయముల్
    దిద్దు - ధర్మ పత్ని దివ్య దీక్ష. 12

సంఘ మందు - పురుష సామ్రాజ్య వాదమ్ము
    ప్రబలె యుగ యుగాంతరాల మేర,
వనిత - ఓర్పు తోడ - భరియించె కష్టాలు,
    త్యాగ మౌన పాత్ర దాల్చి తరచు. 13

సహగమనము సలిపె - చనిపోవగా భర్త,
    చరిత దద్దరిల్ల - భరత నారీ,
శాసన సభ లందు - సముచిత స్థానాలు
    పడయు గాత ఇంక భరత నారి. 14

అతివ అన్న యెడల - ఆరాధ్య కేంద్రమే,
    అమ్మ గాని చెల్లి, అక్క గాని,
భామినీ చరిత్ర - ప్రేమాయణము సుమ్ము,
    మహిళ - త్యాగమునకు మారు పేరు. 15

జాలి గుండె కలిగి - సహజ సుందరముగా
    స్త్రీలు సంఘసేవ చేయ గలరు,
ఆడవారు సతము ఆదర్శ నర్సులై;
    చేయ గలరు - వైద్య సేవ ప్రజకు. 16

# మాతృభాష

మేలు చేయు తల్లి పాలు - దైహికముగా,
చిన్న తనము నందు శిశుల కెల్ల,
చదువు లందు - మెదడు పదను బెట్టుట యందు,
మేలు మాతృభాష - మిగుల సులువు. 1

మాత వీడి వెడలు - మాతృ దేశము వీడు;
మాతృ భాష నెవరు మరువ గలరు ?
మాత మీద కంటె - మాతృదేశము కంటె,
మాతృ భాష మీద - మమత హెచ్చు. 2

ఏమి చెప్ప గలము ? హెచ్చించు దూరమ్ము
మమత - ప్రేమల నభిమాన గరిమ,
భాష మీద - మాతృ దేశము మీద,
మిత్ర బంధు జనుల మీద తరచు. 3

ఏగ వచ్చు గాక - సాగరాంతర సీమ ,
బంధు మిత్ర జనుల వదలి పెట్టి,
కుదురు గాత - క్రొత్త బ్రదుకు - ఉద్యోగముల్
మాతృ భాష మీద మమత పోదు. 3

# నా భార్య

పగలు రాత్రి గూడ - పరిచర్యలను చేసె,
భార్య - కోర కుండ - ప్రతిఫలమ్ము;
భావి కాలమందు - ప్రజలు - నమ్మగ లేరు.
ఆమె నాకు చేసి నట్టి సేవ. 1

కలదు విశిష్టా ద్వైతము
కల దద్వైత సుషమైక కైవల్యమ్ముల్.
కలదు గద ద్వైతమును కలిసి
తలప మతత్రయమును మన దాంపత్యములో. 2

ఒలిచి పెట్టె నాకు - ఓర్పుతో నా భార్య
దోస విత్తనాల - తొక్కు తీసి,
బ్రదికె ఆమె - నాకు స్వచ్ఛంద దాసియై,
వెంట - ఛాయ వోలె - అంటి తిరిగె. 3

బానిస వలె - భార్య - ప్రాణమిత్రము వోలె,
వెంట నీడ వోలె అంటి తిరిగె,
సేవ చేసె నాకు - చీవాట్లు తిని గూడ,
చింత వంత సుంత చెంద కుండ. 4

శరణాగతి తత్త్వంబును
వర పాతివ్రత్య ధర్మ పారీణతయున్;
పరమ ప్రణయానుభవము
దరిశించితిని భవదీయ దాంపత్యములో. 5

ఏను తెలిసి - పాప మెవరి కైనను గాని
జీవితమ్ము నందు - చేయ లేదు !
తిట్టి నాడ తరచు - తెలిసి - లోకువ గట్టి,
భార్య నేను - బాధ పడెద నిపుడు !! 7

ఉన్న యెడల హృదుల - ఒక అభిప్రాయమే;
పగలు రేయి ఆలు మగల మధ్య;
అదియె - స్వర్గ మదియె - అద్వైత యోగమ్ము;
అదియె అమృత మయ లయానుభవము. 8

## హింస

సంహరించి - సాధు జంతు సంతతి నెల్ల,
క్రూర మృగములు మరి కొన్ని బ్రదుకు;
జీవ హింస - సకల సృష్టి సంస్థితి లోన,
అపరిహార్య మైన - అంశ మేమొ ! 1

విశ్వ మందు - విలయ వికటాట్టహాసమ్ము
సలుపు హింస - శాంతి శవము మీద,
అధిక మైరి - ఆత్మ హత్యావ్రతులు - భటుల్,
చవుక యయ్యె - మనుజ జన్మ మిపుడు. 2

అరయ - క్రూర హింస - హత్య యొక్కటె కాదు;
వేరు వేరు హింస లెన్నొ కలవు;
మంచివాని మృదుల మనసు నొప్పించుటే,
ఎంచి చూడ - ఘోర హింస కాదె ? 3

## శృంగారము

ప్రౌఢ యువతి కోరు - ప్రణయ కోణము వేరు;
పురుష వరుని కండ పుష్టి గాదు,
వయసు - పదవి - వస్తు వాల్లభ్యములు కావు,
మెరపు తీగ వంటి చురుకు దనము! 1

స్నేహ యోగ మున్న - శృంగార కేళిలో;
అమృత రసము కురియు ఆత్మ లందు;
మేటి మైత్రి యున్న - మిధునమ్ము కన్పింప,
కనుల పండు వితర మనుజులకును. 2

తొలి ప్రవరుని చూడ - మలి శశాంకుని గాంచ,
చరిత తారతమ్య మరయ వచ్చు ;
రెండు కథల కలదు శృంగార చిత్రణే !
ఉచ్చ యుగము క్షీణ యుగము తెలియు. 5

తరచు ఒకరి నొకరు దర్శింప గోరుచో,
కామ మగును గాని - ప్రేమ కాదు;
లోకమున ఇరువురు నేక కార్య మందె
ప్రీతి యున్న యెడల - ప్రేమ యగును. 7

☆☆★

## కరుణ

అరుదెంచి నపుడు ఆపన్నులౌ వారు,
    వినుము వారి గోడు వీను లొగ్గి,
చేయ దగును వేగ చేతనౌ సాయమ్ము
    గొప్ప దేది? జాలి గుండె కంటె? 1

మెదడు - కోతి - క్రూర మృగము - పాముల పుట్ట!
    ఆర్ద్ర హృదయ మైన - అమృత సరసి
అరయ - కరుణ యున్న - అజ్ఞానియే - మేలు
    జాలి లేని గొప్ప జ్ఞాని కన్న. 2

కానుపించు నేది - కనుల పండువు? గాగ
    ఎడద పులకరింప పుడమి మీద ;
జులుము చూప కుండ - బలవంతులౌ వారు,
    బడుగు వారి పైన బరపు - కరుణ 3

నీతి యేది ? ఏది నిగమార్థ సారమ్ము?
    పరమ ధర్మ మేది ధరణి మీద?
చదువు మెదడు మేటి పదవి - ఏదియు కాదు
    గొప్ప దేది ? జాలి గుండె తప్ప. 4

❖❖❖

# జిడ్డు కృష్ణమూర్తి

జిడ్డు కృష్ణమూర్తి - జీవితాంతము గూడ ,
త్యాగ యోగి - నూత్న దార్శనికుడు;
బ్రదుకు లోన - ఏ అపశ్రుతుల్ లేనట్టి
సచ్చరిత్రు డైన - సాధుమూర్తి. 1

జిడ్డు కృష్ణమూర్తి - గడ్డ మీగడ తెట్టు;
నవ నవీన యోజనా మహర్షి
విప్లవమ్ము తెచ్చె - వేదాంత జగతిలో,
కూల్చె గుడులు బడులు గురు కులాలు. 2

మేటి మేడ కట్టె - మెట్లు కట్టుట మాని,
జిడ్డు కృష్ణమూర్తి శిల్పి వరుడు,
గురువు వద్దటంచు - గురువు భూమిక దాల్చె
ధరణి చరిత - గొప్ప గురు వతండు. 3

☆ నోటి పలకు చాలు - పాటుగా వినిపించు
ఆంధ్ర జాతి మాట లాడు నపుడు;
తెలుగు సహజ గాన మిళితమై నినదించు,
సామ వేద నాద సంభృతముగ.

## సత్యం

ఉండు నిజము దాగి - ఒంటి స్తంభము మేడ !
చేర ఏది కాని దారి లేదు;
ఎగిరి వ్రాల - మెదడు హృదిని - రెక్కలు చేసి;
గాలి - అడుగు జాడ - కాన రాదు. 1

జీవితమున - శుష్క సిద్ధాంతములు వద్దు;'
చేటు శబ్ద వాద శృంఖలములు;
అనుభవైక వేద్య మైనదే - సత్యమ్ము
అవసరము సతత సమన్వయమ్ము. 2

సత్య మేది కలదు - సాపేక్ష జగతిలో ?
మాట లెల్ల మేటి బూటకములు!
పుడమి ప్రాణి చరిత - బుద్బుద ప్రాయమే,
అవని - సృష్టి నరయ అణువు సుమ్ము! 3

హేతు వాదమున కతీతమై కన్పించు ;
అనుభవైక వేద్యమైన - " నిజము "
సత్యము పరికింప - చాల దింద్రియ శక్తి;
స్వస్తి చెప్పవలయు వాదములకు. 4

మెరపు తీగె - కనుల మిరు మిట్లు కల్పించు
బెదర గొట్టు గుండె లదర - ఉరుము;
కాన రాని - పిడుగు - కడ తేర్చు ప్రాణాలు !
తెలు " నిజము " సూక్ష్మదృష్టి వల్ల. 5

నిజము చాట నేల ? - నిష్ఠురోక్తుల తోడ,
    మౌననిరతి తరచు మంచిది గద;
కల్ల విడిచి - అల్లి బిల్లి మాటల తోడ
    గడపి వేయవచ్చు - కాల మెపుడు 6

భాసుర చిత్ర విరోధా
భాసము సుమ - మనుజు బ్రదుకు వసుధాస్థలి - ఏ
దో సత్యమ్ము తెలియదు గ
దా - సాపేక్షికము - పరమ ధర్మము - సుమతీ ! 7

నిజము ప్రతిఫలించు నీడ బొమ్మలు గూడ
    నిజము - జీవనాడి - నీతి కథకు !
భారతమ్ము మనిషి బ్రతుకు కద్దము పట్టు;
    చరిత కన్న మిన్న భారతమ్ము. 8

జగతి తుట్టతుదకు - సత్యమే జయ మొందు
    అపజయమ్ము గాంచి అప్పు డప్పుడు,
బాల్య దశను దాటి బ్రదుక నేరదు - బొంకు !
    శాశ్వతముగ బ్రదుకు సత్య మొకటె. 9

# ప్రకృతి సౌందర్యం

మఱ్ఱి చెట్టు పైకి - మాధవీ లత - ప్రాక,
 విరియ - తమ్మి పూలు చెరువు నిండ,
జలజల ప్రవహింప - సెలయేరు గిరి నుండి,
 సీతకోక చిలుక చేర విరిని. 1

గాలి అలల - వేణు గాన నాదము తేలి,
 కన్ను దోయి దూరి విందు చేయ.,
వెల్లి విరిసి - తరిపి వెన్నెలల్ జాబిల్లి;
 పులకరింప జేయ పూల దోట. 2

గున్న మావి మీద - కుహుంకుహూ రాగాలు
 కొసరి కొసరి కూయ - కోకిలమ్మ.
నేల మీద ఆడ - నెమలి - పింఛము విప్పి,
 గగన మందు - మబ్బు గములు గ్రమ్మ. 3

విరియ ఇంద్ర ధనువు - వినువీథి వికసించి
 గాలి అలల తేల పూల తావి ;
అడవి లోన - నిడివి కడిమి చెట్టులు పూయ ,
 పనస ఊగు లాడ - పండ్ల తోడ. 4

పొంగి పారలిన నది - రంగత్తరంగాలతో,
 సాగరమ్ము తోడ - సంగమింప,
మల్లె పూలు విచ్చి - మలిసంజ కెంజాయ
 కమ్మ తెమ్మెరలను కౌగిలింప. 5

జగతి లోన వివిధ సౌందర్య దృశ్యముల్,
అనుభవించు నట్టి - మనుజ వరుడు,
కనులు చెవులు ముక్కు కలిగి నట్టి ఫలంబు
పొంద గలడు - గుండె పులకరింప. 6

చెట్టు నీడ క్రింద - సెలయేటి ప్రక్కనే
తొలకరి సమయాన నిలిచి పోవ
తడిసి పోయినపుడు - వడగళ్ల వానలో!
సంతసింప వచ్చు కొంత సేపు. 7

పాడు చేసి వేసె - ప్రకృతి సౌందర్యమ్ము
కృతక నాగరికత - బ్రతుకు నందు,
మనిషి అప్పుడపుడు - మంచి గాలిని పీల్చి
సేద తీరు కొంత సేపు చాలు. 8

## మితభాషి

బ్రదుకు లోన అరయ నధికుండు మితభాషి;
మానస సరసి యగు - జ్ఞాన మందు;
కొలువ రాదు లోతు - గెలువ నేరాదు ప్రజ్ఞ
గురుని వోలె - అతని కొలువ దగును. 1

ప్రతిభ యున్నవాడు - మితభాషియే సదా!
వట్టి వ్యర్థ జీవి; వదరుబోతు
మెదప డెపుడు పెదవి - మేధావి వీధిలో;
ఇంట గూడ స్వరము హెచ్చు నీడు. 2

# మౌనం

గాలి బుడగ సుమ్ము - గర్విష్ఠి జగతిలో
ఎగిరి కొంత సేపు - పగిలి పోవు !
విద్య కంతరాత్మ - వినయ గౌరవ దీప్తి;
జ్ఞాని మాతృ భాష - మౌన మెపుడు. 1

కలదు - మౌన మందు - గాంభీర్య గరిమమ్ము;
మాధురీ ధురీణ మహిమ - కలదు;
మించు - ప్రవచనమును - మేటి సంగీతమ్ము;
గాన కళల మించు - మౌన లయలు. 2

ఆచి తూచి వేచి - అవసైన మాటాడు;
బ్రదుక దగును పెదవి కదుప కుండ,
మాట కంటె మధుర మందహాసము - మిన్న;
మౌన మందు - గొప్ప మహిమ గలదు. 3

మనుజ దేహ మందు - మనసు గొప్పది గదా !
మనసు కిలుము పట్టు - దినదినమ్ము ;
మౌన దీక్ష - కూర్చు - మానస స్నానమ్ము;
మనసు లోని మురికి - మాప గలదు. 4

మాట లాడ కుండ - మౌనమ్ము గా నుండు;
తెగడ వద్దు నెవరి పొగడ వద్దు;
శ్రోత - ఏవగించు - స్వోత్కర్ష - వక్తలో
పరుని గర్హణమ్ము - పనికి రాదు. 5

వాగ వచ్చు మనిషి - వాక్ శౌర్యమును చూపి,
పనులు చేయ లేడు - పదరు బోతు,
పెదవి కదల - ఆగు మెదడు - చైతన్యమ్ము !
మనిషి - మౌని యైన - పనులు జరుగు. 7

వక్త మాటలాడ - వచ్చు వ్యాఖ్యలు పెక్కు;
పరులు దుయ్య బట్ట వచ్చు నతని,
వెల్లి విరియ వెపుడు - విపరీత భాష్యముల్ ,
మనుజ సంఘ మందు - మౌనమునకు. 8

చింద వచ్చు తరచు - మందహాసము గాని,
పెదవి విప్ప రాదు పెద్ద మనిషి;
సభల లోన నే ప్రసంగ మైనను గాని
ఎంచ పావు గంట మించ రాదు. 9

పాలు పొంగ - నీరు - పైన జల్లుట మేలు;
పాలు - ఆగ్రహమును పోలు చుండు;
గుండె లోన - కినుక గుబులు వచ్చిన వేళ
మేలు - మౌన నిష్ఠ - చాలు చాలు 10

మనిషి - కంఠ మెత్తి - మాటాడ కున్నచో !
అమృత సరసి యౌను - ఆత్మ శక్తి;
శిరము చుట్టు - గొప్ప పరివేష మొన గూడు ;
పెంచి - స్వరము - గొంతు చించు కొనకు . 11

మంచి సమయ మెంచి మాట లాడుట మేలు,
కాని మేలు చేయు మౌన మెపుడు;
జ్ఞానయోగి - సతము - మౌనమ్ము పాటించు;
వక్త - ఆత్మ శక్తి - వ్యయము చేయు. 11

వక్త యయ్యు - మూగ వానిగా సభలలో ,
కూరు చుండు వాడు గొప్పవాడు,
మనసు బలము పెరుగు - మౌన సాధన వల్ల;
వినిన యెడల తెలివి వృద్ధి బొందు. 12

శ్రోత యైన వాడు - నేతయై వెలుగొందు
వ్యర్థ జీవి యగును వదరు బోతు
కదుప వచ్చు కాళ్ళు - కదుప వచ్చును చేయి
కర్మయోగి - పెదవి కదుప డెపుడు. 13

సభల వలన పెరుగు - శబ్ద కాలుష్యమ్ము !
విరియు రేపు జ్ఞాన విప్లవమ్ము
ప్రజలు చేర దగును - గ్రంథాలయాలకే,
మౌన నిరతి పూని మసల దగును. 14

పెద్ద గద్దె నెక్కి - పెదవి విప్పెడు వాడు;
గండి పడిన ఆనకట్ట యగును;
కత్తి కంటె వాడి కలము వాడుట మేలు.
మూగ యగును కర్మయోగి - కోరి. 15

మనసు మడత లందు - మూరు మూలల లోన,
పాచి - బూజు - త్రుప్పు పట్టు చుందు !
జ్ఞాన జాగృత మగు - ధ్యాన మౌనము వల్ల,
మనసు లోని కిలుము మాప వచ్చు. 16

మౌన నిరతి మేలు మాట కంటెను గూడ
విలువ గలది జీవ విగ్రహమ్ము,
మనిషి మరువ రాని పనులు చేసిన చాలు ;
కానుపింప మ్రొక్క గలరు - ప్రజలు. 17

చెంద బోదు విరతి - చిలిపి గంతుల వేయు;
నిదుర యందు గూడ కుదురు లేక,
మనసు తేరు కొనదు - మౌన వ్రతము లేక
సాధనా సమాధి శాంతి లేక. 18

భూమి మీద - అపర భూతాలు దయ్యాలు
వేదములను వల్లె వేయ వచ్చు;
మంచి పనులు చేయు - మౌనమ్ముతో నుండి!
సగటు మనిషి ఒకడు జగతి లోన. 19

మాట లాడ నేర్చి - మనుజ రూపము తాల్చు
చిలుక గుంపు చేరు చెట్ల తోడ;
వెలయు నేటి విశ్వ విద్యాలయమ్ములే,
పూత పసిడి జిలుగు పూల తోడ. 20

# అన్యాపదేశము

వాన చినుకు తోడ - వచియించె సెలయేరు
"రమ్ము - స్వాగతమ్ము - నమ్ము నన్ను,
అడుగ బోకు దారి - కడలి చేర్చెద నిన్ను
ఎడద కనుల విప్పి వెడల వచ్చు." 1

" సమము నీవు నేను - శాస్త్ర ప్రకారమ్ము "
పలికె నీటి లోని - జల కణమ్ము;
" నేల మీద నిజము - నీవు నేనును వేరు"
పలికె బదులు - జలధి జల కణమ్ము. 2

" గాలి వీచె - ఎండు గడ్డి పోచా నీవు
ఎగుర గలిగి నావు గగనమునకు !
గర్వపడకు మనతి కాలమ్ము లోపలే
పడక తప్పదీవు ధమి పైన." 3

" కాళ్ళ క్రింద నున్న - చిళ్ళ పెంకును నన్ను;
పరమ శివుడ వగుచు కరుణ చూపి;
నీవు తాల్చి నావు - నెల వంకగా చేసి,
శిరము నందు - గగన సీమ వెలుగ." 6

" విస్తరించినాను - వెలుగునే నలు దెసల్ "
క్రొవ్వి పలికె నొక్క క్రొవ్వు వత్తి:
వీచె తలుపు లదర వెనువెంట పెను గాలి,
అంత క్రొవ్వు వత్తి - ఆరి పోయె.

# యోగ విద్య

యోగ విద్య - పర్వతోన్నతాకారమే !
అడుగు భాగ మెల్ల - ఐహికమ్ము,
అరయ - పైన భాగ మధ్యాత్మ తత్త్వమే;
చిత్త మందు వెలయు - స్థిరసమాధి. 1

విశ్వ మెల్ల నేర్చు విజ్ఞాన శాస్త్రమ్ము
పశ్చిమ పథ మందు బడుల లోన,
భరత దేశ ఫణితి - గరచవచ్చును గాత!
ఉత్తమోత్తమమ్ము - యోగ విద్య. 2

అరిగి జీర్ణ మౌను - ప్రాణాంతక విషమ్ము
అప వచ్చు గుండె అటు పోటు;
యోగ సాధన - ఇడు యోజస్సు తేజస్సు;
యౌవనమ్ము పెంచి జీవితమున. 3

సగటు మానవుండు - స్వచ్ఛంధ దాసుండు,
అవయవాల కింద్రియాల కెల్ల,
అతని - యోగవిద్య యజమానిగా జేయు,
సర్వతోముఖీన జయము కూర్చి. 4

మంచి మెదడు తీర్చు - మంచి దేహము కూర్చి,
ఉభయ తారకమ్ము - యోగ విద్య,
దేహమానస ములగు - దోహద క్రియ తీర్చు,
అవయవాల నెల్ల - అదుపు చేయు.

అవి అతీంద్రియములు - నప్రాకృతము గావు;
సరళ శక్తి వచ్చు యోగ సాధనమున,
సహజ సిద్ధ యోగ శాస్త్రీయ పద్ధతుల్ !
భరత దేశ మిపుడు మరచిపోయె. 5

గొప్ప యోగ సాధకులు సిద్ధులను కొన్ని,
పూర్వ కాల మందు పొందినారు !
బోధ చెరిగె - తెగెను సాధనా సూత్రమ్ము;
వచ్చు మరల- పూర్వ వైభవమ్ము. 6

పెట్ట వచ్చు గాక - పెద్ద పేరును తెచ్చి
యోగ మనగ ఏమి ఉర్వి మీద ?
నిజము నరయ - కార్య నిపుణుండు బ్రదుకులో
అచ్చ మైన యోగి అనగ జెల్లు. 7

## అతిథి పూజ

అతిథి సేవ వేరు - అన్న దానము వేరు
అభిజాత్య చిహ్న మతిథి పూజ
అతిథి సేవ కంటె అభ్యాగతుని పూజ
ఆర్ద్ర హృదయ చిహ్నమగును చూవె. 1

అల్లనాడు విదురు డాతిథ్య మొనగూర్చె
తిండి పెట్టి కృష్ణ దేవునకును;
అరటి పండ్ల తొక్క లందింప - కృష్ణుండు
మారు పలుక కుండ - ఆరగించె. 2

# రైతుబిడ్డ

నీతి నియతి - కరుణ - రైతాంగమున యందు,
ఇంట ఇంట పాడి పంట గలిసి;
తర తరాల నుండి - భరత దేశము నందు,
వెల్లి విరిసి కానుపించు చుండు.
అన్న దాత అతడు - వ్యవసాయదారుండు
రాజు కంటెఘనుడు రైతు బిడ్డ;
సహృదయుండు - సంఘ సంక్షేమ సంధాత,
కర్మయోగి - న్యాయ ధర్మ మూర్తి.
కలము హలము - విశ్వ కల్యాణ యోగమ్ము;
కలిపి సంఘటింప గలవు - సతము;
సమత - స్వేచ్ఛ - విశ్వ సౌభ్రాత్ర భావముల్;
పండ గలవు - నరుల గుండె లందు. 1

జనుల కెల్ల కోరు సంక్షేమ భ...
బ్రతుకు గడుప గలడు శ్ర...
గుండె దున్ని - కరుణ - పండించు కొనుచుండు;
రక్త దాహి కాడు రైతు బిడ్డ. 2

# సేవ

చిత్త శుద్ధి తోడ - సేవ చేయును గదా!
ఖ్యాతి - కోరు కొనడు - కర్మ యోగి,
నిక్క మైన సేవ - నేపథ్య గానమే,
వ్యష్టి - గౌణ మగు - సమష్టి కృషిని. 1

స్వార్థ రహిత మైన - సత్కార్యమును పూని ,
సేవ - సంఘమునకు చేయ నేల ?
మరణ శయ్య మీద - మహిత సంతృప్తికే !
వేరు లాభ మేమి కోర రాదు. 2

జ్ఞాన యోగ మెపుడు - సందేహ వికటమే;
భక్తి " నిష్ఠ " గోరు - పరము బలము,
కర్మయోగ మనిన - కష్ట యాతన గదా !
మధుర ధర్మ మేది ? మనుజ సేవ. 3

తన సహవ్రతులకు - మనసార ప్రేమతో;
సాయ మంద జేయు - సంతసమున;
తాను తెర మరుగుననే నిల్చి - నిష్ఠతో,
సంఘ సేవ చేయు - సజ్జనుండు. 4

సేవ కంటె భువిని శ్రేష్ఠ మైనది లేదు ;
జీవితమ్ము పెరుగు - సేవ వలన;
ఇవ్వ గలదు సేవ - ఏకాంత సంతృప్తి;
తిరుగవచ్చు మనిషి - శిరము నెత్తి. 5

ధనము ఉండి చేయు పని కాదయా మాది,
సుంత మాకు స్వార్థ చింత లేదు;
సంఘ సేవ కొరకు - సలుపు కార్యము గాన,
సహకరింప కున్న జనుల తప్పె. 7

పొగడు వారి కంటె - తెగడు వారలె హెచ్చు
చిత్త శుద్ధి - సంఘ - సేవ చేయ;
దొరల వచ్చు కొన్ని పొరపాట్లు - పనులలో;
బాధ పడడు - కార్య సాధకుండు. 8

సంఘ సేవ - అధిక సంఖ్యాకులకు ప్రీతి;
మంచితనము గలదు - మనుజు లందు
యువత చేరు గొప్ప ఉత్సాహమును చూపి,
ఉద్యమమ్ము మంచి దొకటి యున్న. 9

క్రుళ్ళు పాత పసరు కోనేరు కారాదు,
సంఘ జీవితమ్ము - సంఘ చరిత ;
మార్పు - అవసరమ్ము - మానవ ప్రగతికై !
క్రొత్త నీరు నదికి - కూర్చు శోభ. 10

# సంప్రదాయం

మొలిచి నపుడు - చిన్న మొక్కయే కావచ్చు;
పెరిగి నప్పు డెవరు పీక గలరు ?
సంఘ మందు - చిరుత సంప్రదాయము పుట్టు;
మార్చ నెవరి తరము? మరల మరల? 1

సహగమనము" - సాగె చాల కాలము మేర,
మనుజ సంఘమందు - మతము పేర;
అసలు ధర్మ మనిన - అచారములు కావు!
గ్రుడ్డి నమ్మకాల కొలువు కాదు. 2

సంస్కరణము లనిన - సంక్షోభమే కొంత,
సంప్రదాయ మన- శ్మశాన శాంతి,
అధిక సంఖ్య - జనుల ఆమోద ముద్రతో,
సంస్కరణము వేగ జరుప దగును. 3

నరుడు - సంఘ జీవి - నరుడురతుండు,
చాల మంది కలియ మేలు కలగు;
వ్యక్తి లోన ఉన్న వంకరల్ టింకరల్
సంఘ జీవితమ్ము - చక్క బరచు. 4

శాంతి మరిగి - స్తబ్ధ సంప్రదాయము పుట్టు,
చెరువు నీట - నాచు చేరి - నట్లు;
నింపదగును క్రొత్త నీరు - నాచును పీకి,
బురద లోన పురుగు పుట్ట కుండ. 5

మారి పోవు చున్న - మనుజ సంఘము నందు:
శ్రోత్రియత్వమునకు - చోటు లేదు;
మాయదారి సంప్రదాయ శృంఖలములే !
నరుని జీవితమును చెరను జేయు. 6

సంఘ మందు మొదట సంప్రదాయము లెల్ల,
ప్రజల మేలు కొరకె ప్రభవ మందు;
కాని - కీడు చేయు - కాల దోషము పట్టి
వదల వలయు అట్టి వాని వేగ. 7

చర్య లందు - సంఘ సంస్కార హృదయమ్ము;
నరుడు చూపు గాక కరుణ గలిగి;
చేత లందు లేని - నీతి పాఠము లేల ?
కోత లేల ? కారు కూత లేల ? 8

పేర్చి అక్షరాల పిరమిడ్లు - కవి వరుల్,
గగన హర్మ్యములను కట్ట వచ్చు;
జ్ఞాని ఎగుర వచ్చు - చంద్ర గోళము పైకి,
మంచి పనులు చేయు మనిషి - మిన్న. 9

మేటి మెదడు కూర్చు మిరుమిట్ల మిలమిలల్,
లౌక్య నీతి చాకచక్య గరిమ,
అడ్డ దొడ్డి దారి అత్యున్నతోన్నతుల్;
మంచితనము నెపుడు మించ లేవు. 10

# చెట్లు

అభ్యుదయము - చెందు - అభివృద్ధి చూపించు,
చల్లదనము సంతసమ్ము నిచ్చు;
చెట్ల కంటె - మంచి స్నేహితుం డెవరురా?
మధుర మంజుల మగు - మమత నెరుగ ? 1

చెట్టు కంటె - శ్రేష్ఠ శీల మెచ్చట లేదు;
గోవు కంటె గూడ - గొప్ప జీవి;
జనుల కిచ్చు చుండు - సర్వస్వ దానమ్ము !
కోర దెట్టి మేత - నీరు చాలు. 2

నేల చేమ పీల్చి - నింగి వేడిమి పొంది,
పచ్చదనము నిచ్చి - పండు నిచ్చి,
చెట్టు పెరుగు - సృష్టి చిద్విలాసము చూపి,
మాట లాడ కుండ - మంచి చేసి. 3

చెట్లు - మానవులకు - చిన్నారి నెచ్చెలుల్;
కనుల పండు వౌచు కానుపించు;
క్రొత్త చిగురు తోడ - కొమ్మ రెమ్మల తోడ
ఎదురు చెప్ప కుండ - ఎదుగు చుండు. 4

పరగు - ఇంటి ముందు - పచ్చతోరణముగా;
చెట్ల వరుస కంటె చెలువ మేది ?
భువికి దింపు చుండు - పూలు పిందెలతోడ
నందన వని అంద చందములను. 5

చెట్టు పలికె - వేడి నిట్టూర్పు - వెదచల్లి,
మ్రోకు అయిన పిదప మోము వాల్చి;
ఆకసమ్ము గూడ - అవతరించి తొల్లి
గేలి చేయు నన్ను ధూళి నేడు. 6

పూలు రాల వచ్చు - పోవచ్చు నెత్తావి,
మొక్క చావ వచ్చు - మ్రోడు వారి;
మేలి రకపు విత్తనాలు కాపాడుచో,
చెట్టు మరల వృద్ధి చెందవచ్చు. 7

ప్రగతి యోగమునకు - ప్రత్యక్ష సాక్ష్యమ్ము
చెప్ప గలవు - పెరుగు చెట్టు లెల్ల!
సృష్టి నిత్య నూత్న చిద్విలాసము తోచు;
విచ్చు విరుల యందు - విత్తు లందు. 8

పెంచ వలయు చెట్లు - వృక్ష సంపద నెంచి,
కలుష రహిత మైన - గాలి కొరకు
చెట్టు పెరుగ - సృష్టి చిద్విలాసము తోచు;
కరడు గట్టి నట్టి కవిత - చెట్టు 9

కుండి లోన ఉండి - రెండేడ్లు చిరు మొక్క
పెద్ద వృక్ష మగును పెరిగి బయట,
నాటి యుంచి చెట్లు - నర్సరీలనుంచి
పిదప తోట లోన పెంచదగును. 10

పచ్చ తోరణాలు - పరిసమ్ముల నిల్పి
జీవ శక్తి తోడ - చెట్లు పెరుగు;
వీచు చుండు - వేయి వింజామరల తోడ,
శుద్ధి చేసి గాలి వృద్ధి చేసి. 11

నింగి సౌర శక్తి - నేల చెమ్మను వాడి,
వృక్షములు ఫలముల నివ్వ గలవు;
జనులు పడవలసిన శ్రమ - తక్కువే గదా!
చెట్లు - ప్రజకు మేలు చేయ గలవు. 12

తల్ల డిల్లె గ్రీష్మ తాపమ్ముచే చెట్టు,
వర్ష మరుగు దెంచ - హర్ష మొందె;
పడుట చేత పిడుగు - వానతో పాటుగా,
మహిని కూలె చెట్టు మాడి పోయి. 13

గణిత శాస్త్రమున కగమ్యమే - రవి రశ్మి;
మనిషి దాని వాడుకొనుట యెట్లు ?
సులువు - చెట్లు పెంచ - సూర్య రశ్మిని తెచ్చి,
అంద జేయు చుండు అవని ప్రజకు. 14

హాయి గూర్చు చుండు - ఆకు మొక్కలు గూడ,
చింది హొయలు నంద చందములును,
పచ్చతోరణముగ - భాసిల్లి శోభతో;
తేలు ఇంటి ముందు గాలి లోన. 15

## ఆట

మనిషి కాట విడుపు - మంచిదే - మంచిదే !
దేహ మానసముల - దీప్తి గూర్చు;
బ్రదుకు లోన - ఆట - కదనమ్ము - కారాదు,
ఆట దేని కొరకు? ఆట కొరకె. 1

నేర్చు కొనును వేగ - నీతి పాఠము - క్రీడి
జయము అపజయములు సమము లంచు;
నెగ్గి నట్టి వాని - అగ్గించు - మనసార,
క్రీడి - మత్సరమ్ము - వీడ గలడు. 2

యౌవనమ్ము నిలుచు - ఆటపాటల వల్ల
ఆడవచ్చు - నరుడు - పాడ వచ్చు;
ఆనుషంగికముగ- వ్యాయామ మొనగూడు
ఆట దేని కొరకు ? ఆట కొరకె. 3

బ్రదుకు లోన ఎట్లు రాకుండు రోగముల్?
మహిమ గలిగి నట్టి మంత్ర మేది ?
ఆట పాట లందు - వ్యాయామమున యందు;
పేర్మి కూర్మి - పూని పెంచు కొనుము. 4

ఆడు నప్పు డాడు - పాడు నప్పుడు పాడు;
విశ్రమింపు మాట విడుపు వేళ.
ప్రక్క చూపు వద్దు - పనిచేయు కాలాన
సమయ పాలనమ్మె స్వర్గ సుఖము. 5

# మంచితనము

మంచి జనుల కీర్తి - మలయ మారుత మట్లె
వెల్లి విరియ గలదు - విశ్వ మెల్ల;
నింగి నేల కలిసి - నెత్తావి కెరటాలు,
గుండె లెల్ల కదిపి కుదుప గలవు. 1

ఏ మతస్థుడైన నేమి ? పూజ్యు డతండు,
సానుభూతి యున్న - సహన మున్న;
వేత్త అతడె - గొప్ప - వేదాంతి ఆతడే;
· పండి నట్టి జాలి గుండె యున్న. 2

మేటి తెలివి తేట మిసిమి మీగడ యేది ?
మేటి రాజనీతి మేధ యేది?
లలిత చాకచక్య లౌక్య మేళన మేది ?
మనిషి మనసు లోని - మంచితనము. 3

పాశవికత - కొంత - ప్రతి మానవుని లోన,
కొంత మంచి తనము - కూడి యుండు
పాశవికత నణచి బ్రతుకులో - మనుజుండు,
మంచితనము పూని పెంచు కొనుత! 3

మమత చూపదగును - మానవత్వము పైన,
పదవి - ధనము - కులము పైన, గాక;
ప్రతిభ - గౌరవింపబడు గాత! జగతిలో;
గుణము కూర్చు గాత! గొప్పదనము. 6

# బ్రహ్మచర్యము

వయసు నందు కొంత బ్రహ్మచర్యము మేలు,
రక్తి నాప - శక్తి యుక్తి పెరుగు;
నిగ్రహమ్ము మేలు - ఆగ్రహమ్మున కంటె!
పొదుపు మేలు చేయు బ్రదుకు నందు 1

బ్రహ్మచర్య దీక్ష - బౌద్ధ మందున గాని
క్రైస్తవమ్ము నందు గాని పిదప;
బాహ్య చిహ్నములుగ బలవంతముగ వచ్చి,
బ్రదుకు నందు ఏటి కెదురు నీదె . 2

చాల మేలు బ్రహ్మ చర్యమ్ము - నరులలో;
వ్రతము కాని యపుడు - బ్రతుకు లోన;
అభ్యుదయము కూర్చు - ఆరోగ్యమును ఇచ్చు,
దేహమునకు దివ్య దీప్తి - గొలుపు. 3

కట్ట - ఏటి కానకట్ట - పంటలు పండు;
నీరు కడలి లోన చేరకుండ;
ప్రాణ శక్తి - పండు - బ్రహ్మచర్యము వల్ల,
నిగ్రహమ్ము మేలు - నీతి మేలు. 4

బ్రహ్మచర్య దీక్ష బలవంతముగ రుద్ద;
మతము చెడును మరియు మతము చెడును,
సంఘ సేవ అనిన - సన్న్యాసమా ? కాదు,
జాలి గుండె కరుణ చాలు చాలు. 5

# చరిత్ర

వ్రాయువాని పైత్య రసము చేరని యట్టి
"చరిత" రచన లేదు - తరచి చూడ
గత చరిత్ర లేదు - కల్పనా కథ తప్ప !
మేటి బూటకమ్ము - మిథ్య - చరిత. 1

చరిత కన్ను దోయి - సమయ సీమలు రెండు,
చరిత కంతరాత్మ - సత్య నిష్ఠ;
చరిత గ్రుడ్డితనము - పరిశోధనలు బాపు;
చిమ్మ చీకటులను చెదర గొట్టి. 2

చరిత రచన - ఖండ సత్యాల సంక్రాంతి
వ్రాయువాని పైత్యరసము చేరు;
నవల లందు - కల్పనాకథానికలందు
మారు రూప మందు మణగు చరిత. 3

సత్య మెంత యుండు - చరిత సంపుటులలో
వ్రాయు వాని మనసు రంగు కలియు,
నీతి కట్టు కథలు - నిత్య సత్యము చాటు;
సకల నిగమ సార సంగ్రహములు.

• • • •

# తిండి

"పొట్ట తోడ ప్రాకి - పోరు సల్పును సేన,"
అనుచు అల నెపోలియను వచించె,
పశువు - పక్షి - నరుడు ప్రాణి సంతతు లెల్ల;
తిరుగు - తిండి కొరకు ధరణి యందు. 1

తిండి తప్ప మనిషి -దేని నైనను వీడు,
కోటి విద్యలెల్ల - కూటి కొరకె,
ఋషులు విడిచినారు - శృంగార రస కేళి,
కాని తిండి నెపుడు మాన లేదు. 2

శాంతి శాంతి యనుచు - చాట నేరదు - నోరు,
కడుపు తిండి లేక - కనలు చుండ;
తిండి కొరత ముందు తీర్చుటే ముఖ్యమ్ము;
తెచ్చె - విప్లవాలు తిండి కొరత. 3

అంద చందము లను నవి లేవు - బ్రదుకులో!
లేవు లలిత కళలు - లేదు చదువు,
మానవునకు ఎట్టి ఆనందమును లేదు,
తిండి - లేని యెడల - గుండె లేదు. 4

అరయ - పొట్ట - నోరు - నర దేహమున యందు,
గొప్ప వనుచు చాటి చెప్ప వచ్చు;
విశ్వ చరిత లోని - విప్లవమ్ముల నెల్ల ?
పొట్ట నోరు కలిసి పొదిగి పెంచె. 5

# కులము

బ్రదుకు - సమత గోరు - ఇది ప్రజా స్వామ్యమ్ము;
కులము కింక స్వస్తి పలుక వలయు;
కిలుము పట్టె - ఇపుడు 'కులము' పాత్రకు నేడు;
ఏక జాతి యగుత - ఎల్ల జనము. 1

కూల ద్రోయ వలయు - కులము - సంఘము నుండి,
అంతరింప వలయు - ఆస్తి హక్కు;
సమత కొరకు - సర్వ సంక్షేమ సిద్ధికై;
మానవత్వ మనెడు మాట కొరకు. 2

కొన్ని భ్రమలు చేరి - కొన్ని మిథ్యలు కూడి
జనుల ప్రోగు చేయ "జాతి" యగును !
చదువు - సమత - స్వేచ్ఛ - సంస్కార భావముల్
ప్రబల - జాతి బుడగ - బ్రద్ద లగును. 3

బాగు బడుట కల్ల - భరత దేశ చరిత్ర,
కూల గొట్టకుండ - కులము గిలము;
కంపు గొట్టు - నేడు - కాల దోషము పట్టి
క్రుళ్ళి పోయి నట్టి - కుల విభజన 3

కులము అంతరించకుండ - అభ్యుదయమ్ము,
హైందవుల సమాజ మందు రాదు,
సమత లేదు - ప్రకృతి సహజత్వమును లేదు,
కులము - కృతక కుటిల కూట సృష్టి. 4

# సభలు

సభల ముఖ్య మేది, సంఖ్యా బలము కాదు :
ఒక్క గొప్ప వక్త యున్న - చాలు;
దీప మొకటి పెక్కు దీపాల వెలిగించు;
విశ్వ మెల్ల వెలుగు వెల్లి విరియు. 1

తప్పు పట్టువారు - తండోప తండాలు !
మంచి నెంచు నట్టి మనుజు లరుదు;
తిట్టి తెగడి వెడలు - తెలివి తేటల తోడ,
సాయపడని వాడు సభకు వచ్చి. 2

సభకు వచ్చి నపుడు చప్పట్లు చరచుటే!
సరస హృదిని వ్యక్త పరచు గుర్తు;
మూల గుడ్లగూబ వోలె - కూర్చొన నేల ?
మంచి నెంచి - ప్రోత్సహించ దగును. 3

వేదిక పయి తప్ప - విజ్ఞాని మేధావి,
నోరు విప్పకుండ కూరు చుండు;
అతడు చేయ జాల డధిక ప్రసంగముల్;
వదరుబోతు వేరు - వక్త వేరు. 4

అధి ముఖస్తుతియగు - అగు గాక - సత్యమే,
నూటి కరసి చూడ నూరు పాళ్ళు
సాహితీ చరిత్ర - సాపేక్ష మైనచో
సభల చాట వచ్చు జంక కుండ. 5

సభల ముఖ్య మేది ? జనసంఖ్య కాదయా!
ఒక్క అగ్ని కణము ఉన్న చాలు;
ధూమ మైన నేడు తోచకుండిన ఏమి ?
దగ్ధ మౌను రేపు ధరణి యెల్ల. 6

గాయ కోత్తములును - కవి వరేణ్యులు వద్దు!
గౌరవించు టెట్లు ఘనుల పిలిచి ?
సంఘసేవ చేయు సామాన్య పౌరులే,
చాలు - మంచి సభలు జరుప వచ్చు. 7

వేత్త లైన సరస విజ్ఞాన రసికులే,
శ్రోత లైన- సభకు -శోభ గలుగు !
గగన మంటు గాత - కరతాళ నినదాలు,
ప్రతిభ గౌరవించు ప్రజ్ఞ గలిసి. 8

ఉర్వి మీద మనిషి - ఉత్సవ ప్రియ శీలి,
మంచి సభలు ప్రోత్సహించవలెను.
ఆట పాట లందు - పోటీలు బహుమతుల్,
ప్రతిభ వింగడించు పట్టికములు. 9

వేది నెక్క గలరు - విద్వాంసు లెందరో!
ముందు పాటమరింప - ముక్కు - పొట్ట;
చూప గలరు డాబు - స్వోత్కర్ష దర్పమ్ము
వీడి సభను వేగ వెడల గలరు. 10

సహృదయు లరుదెంచు సాహితీ సభ కాదు !
జాగరణము సలుపు జాతర యిది;
చంపివేయ వచ్చు - ఝుంఝా సమీరముల్,
కలకల ధ్వనులను - గళము పిసికి. 11

సాహితీ సభ యిది - సహృదయుల్ కాబట్టి
వచ్చినారు - మీకు - స్వాగతమ్ము
మొలక లెత్తు గాత - మ్రోడువారిన గుండె,
నెమరు వేయవచ్చు - అమృత రసము. 12

సభల లోన ఎట్టి స్పందనే లేకున్న;
గాలి లోన వక్త - కలిసి పోవు;
వక్త చెప్ప లేని - ప్రశ్నలే యెదురైన,
గొప్ప గోష్ఠి అనుచు చెప్పదగును. 13

## జయం

జయ మహోత్సవాలు - సన్మాన సంస్తుతుల్
పతన హేతువులగు బ్రతుకు నందు !
అపజయమ్ము గొప్ప వ్యాయామ శాలయై
అవతరింప జేయు ఆత్మ శక్తి. 1

కలిసి వచ్చు నెడల - కాలమ్ము బ్రదుకులో,
కనులు మానవులకు కాన బడవు!
మత్తు గొలుపు జయము మనుజ మాత్రుల కెల్ల
ఆత్మ సాన బట్లు అపజయమ్ము. 2

# కవితా పంచామృతము

బాణము వలె వెడలు - భావి సీమల లోకి !
గుండె ధనువు నుండి - గొప్ప కవిత !!
కవిత వెడల గలదు - గగనాంతరాలలో
దూరములకు పోవు దూసుకొనుచు. 1

కంటి కంటె గూడ కవిత దగ్గర నుండు
దూర మగును మింటి మేర దాటి;
నేల నింగి కలిపి - నృత్య మాడుచు నుండు,
పోతు నెమలి వోలె పురిని విప్పి. 2

అమ్మ మొదట నుండు అక్షయామృత ధార
కవిత మాన్ప గలదు గాయములను;
బ్రతుక జేయు - వేగ - క్షత గాత్రులును గూడ,
సంతసింప దిగ్ దిగంతరములు. 4

విరిగి పోయి - ధనువు - ధరణీస్థలముపైన
మట్టిలోన కలిసి మాయ మగును,
భావికాలమందు - బాణ ప్రయాణమ్ము;
ఆగ కుండ సతము సాగిపోవు. 3

కవితకు చావు లేదు - చిర కాలము చిన్మయ జీవనాడితో,
అవని చరించుచుండును దిగంతరముల్ పులకింప జేసి- ఆ
రవి శశి తారకాంతము విరాజిలు నూతన మానవాధిక
ప్రవరుల సంభవమ్మునకు - ప్రాభవ దోహదముల్ వెలార్చుచున్

## జ్ఞానం

స్వానుభవము వలన జ్ఞానమ్ము రావచ్చు;
రాదు గురువు గారి ప్రజ్ఞ వలన;
తలచు నేని ఒకడు జ్ఞాని యైనట్లుగా
శుద్ధ పిచ్చి వెధవ సుమ్ము -వాడు. 1

కలిగి యుండ వచ్చు - గడ్డమ్ము మీసమ్ము!
జ్ఞాన మందు శిశువు -మానవుండు,
వినయ హీను డెవడు - విజ్ఞాని కాలేడు !
విద్య లేశ మున్న - వినయ మిచ్చు. 2

అన్ని దానములకు అన్న దానము - మిన్న
తత్ క్షణము - తృప్తి - దాపురించు;
జ్ఞాన దాన మిచ్చు సంతృప్తి సర్వదా;
ఛాత్రు జన్మ నెల్ల - చక్క బరచు. 3

చదల - పక్షి అడుగు జాడ కన్పించునా ?
అరయ లేము - చేప అరుగు తెరువు;
ధరణి - మీద - ఎన్ని ధర్మశాస్త్రము లున్న;
జ్ఞాని వెడలు దారి కానబడదు. 4

తెలిసి నట్టి దెంత ? తెలియ నట్టిది హెచ్చు!
జ్ఞాన శిశువు సుమ్ము మానవుండు;
అహము కంటె వేరు - అజ్ఞానమే లేదు!
వినయ శీలి - అగుత మనిషి - సతము. 5

# ప్రవర్తన

వర్తనమ్ము లోని - వంకరల్ టింకరల్;
    బడుల లోన - నునుపు బడును - తరచు;
ఆట పాట లందు - వ్యాయామ సమయాల;
    కాదు - చదువు చెప్పు గదుల యందు. 1

జీవితమ్ము లోన - చిన్ని అంశాలలో
    నరుని శీల - గుణము లరయ వచ్చు ;
బయట పడదు - పెద్ద బహిరంగ విషయాల;
    నటన చేయ వచ్చు - నరుడు తరచు. 2

ఉండు గాక - మనిషి ఉద్దీపన విభావ,
    మగుచు మేలి క్రియల నాదరించి,
కారయితగ - అతడు కర్తతో పాటుగా,
    మంచి పనుల పాలు పంచుకొనుత ! 3

మనిషి - మంచివాడ ననిపించు కొనుటకై
    వినయవంతు డగుట వింత గాదు !
చెడ్డదనము చీల్చి చెండాడు వీరుడై;
    నరుడు - బ్రదుకు గాక - ధరణి మీద. 4

# కాలి బంతి

కాలి బంతి ఆట - కనుల పండువు సదా;
నేల విడిచి చేయు నింగి సాము;
స్పర్శ రహిత నృత్య చైతన్య సంక్రాంతి;
వాడ వచ్చు - వలసి - క్రీడి సతము. 1

పొరు సలుప రాదు - పొరుగు వానిని తాకి,
పంత మెల్ల - చిరుత బంతి పైన
పోలు - కాలి బంతి - భూగోళ రూపమ్మ !
తేలి ఆడు తరచు గాలి లోన. 2

నేల మీద లొచ్చు - నింగిపై హెచ్చుగా
కాలి బంతి - లేడి వోలె వెడలు,
మేటి ఆట లందు మేల్బంతి - కాల్బంతి!
కాలు నెత్తి కలిపి - గాంచు జయము. 3

శిరముతోడ నెట్టి - చేర్చును వేగ,
గొప్ప ఆట కాదు గోలు లోకి,
అట్టి లక్ష్యశుద్ధి - ఆ విశిష్ట ప్రజ్ఞ
జలదరింపజేయు జనుల నెల్ల 4

గాలిలోకి గాని - గగనమ్మునకు గాని
కాలిబంతి తన్న - కాదు క్రీడ
చరచరచర చాకచక్యమ్ముతో బంతి
వేగ గోలులోన వేయ వలను.

# బ్రదుకు

అరయ - మనిషి బ్రదుకు - ఆభాస వైరుధ్య
వైపరీత్య మిళిత వాస్తవమ్ము;
బ్రదుకు - బృంద వాద్య రాగమాలిక వోలె,
నాద బిందు లయల నాట్యశాల
అచట నిప్పు - నీరు వ్యత్యాస మైత్రితో
కాపురమ్ము చేయ గలవు కలిసి;
అచట వెలుగు నీడ - లన్యోన్య కేళితో;
కౌగిలించి కొనుట - కాన నగును.
అచట - పగలు రేయి - అనురాగ హేలతో,
సాంధ్య రాగ రక్తి - చదల నింపు:
అచట - తాండవించు అర్ధనారీశుండు;
బాల శవము మీద - పదము మోపి;
అట - తటిల్లతలు - ఆలింగనము సల్పు;
నీల నీరదముల నృత్య లీల!
అచట - తాండవించు - అవని ఆకాశములు కల్పి,
వెల్లి విరిసినట్టి వెన్నెల సిరి,
బ్రదుకు నిర్వచింపరాదు - వాఙ్మయములో !
అనుభ వైక వేద్య మనుట యొప్పు!
మనిషి బ్రదుకు సతత మాయా సమేతమ్ము;
దైవ సముడు మాయ దాటు నరుడు
తథ్య మిథ్యలకును సంగమ క్షేత్రమ్ము
బ్రదుకు - సరస సామరస్య సంధి. 1

# విప్లవం

పెంచు తెలివి చదువు - బీదవానికి గూడ,
బానిస వలె అతడు బ్రదుక లేడు,
ధనికుల కిక అతడు దాసోహ మనలేడు,
తెచ్చు విప్లవమ్ము రెచ్చి పోయి. 1

సంస్కరణకు మధ్య - సంప్రదాయము మధ్య
పోరు జరుగు పిదప పొత్తు కుదురు,
విప్లవమ్ము తెచ్చు వికట సంక్షోభమ్ము;
మంచి కూడ తుడిచి మాపు చేయు. 2

వ్రాత లేల? విప్లవమ్ము వర్ధిలుటకై
కోల లేలకారు కూతలేల?
నీవు - సమ సమాజ నిర్మాణ కృషి యందు,
వేయు మొక పునాది రాయి - చాలు. 3

సంఘమున అవశ్య శస్త్ర వైద్యమె గాని,
హింస కొరకు ఘోర హింస కాదు;
వేగ ఆగవలెను - విప్లవ ధ్వంసమ్ము
శాంతి వరలు గాత - సంఘమందు. 4

వసుధ - విప్లవమ్ము వర్ధిల్ల వలె నంచు:
అరవ నేల ? పెదవు లారు నట్లు ?
వేగ అంత మొందు - విప్లవ జ్వలనమ్ము
శాంతి వరలు గాక సంఘ మందు. 5

# జ్యోత్స్నాభిసారిక

స్వాగతమ్ము నీకు - అభిసారికా ! రమ్మ!
కమ్మ తెమ్మెర జత - కదలి రమ్మ !
సమయమునకు - వెంట - స్వర్గమ్ము కొనితెమ్మ,
నీవు లేని చోటు - నిరయ నిభము.

తార లెల్ల వేచి - నీరాక కోసమై
నింగి మీద నుండి తొంగి చూచు;
చందమామ - చిందు - స్వాగతానందముల్
చిలుకు మల్లె మొగ్గ - చిలిపి సిగ్గు;

గడపినాను - క్షణము - క్షణ మొక్క యుగముగా;
ఈ నిముసము కొరకె - నా నిరీక్ష;
గగన మంటు - పాల కడలియై - హృదయమ్ము;
నిన్ను చూచి నపుడు నీరజాక్షి

వాణి వీణ వీవు - గాన వాహిని వీవు
ప్రణయ నందన వని - ప్రసవ మీవు;
నాట్య నయన మీవు - నా మనోహరి వీవు
కవిత పొంగు - అమృత కలశ మీవు;

నేడు పూనినాను - నిరశన వ్రత మేను;
ఏను - క్రోల నిపుడ మృతము తప్ప;
పొంగ - అమృత ఝురులు - శృంగారవతి , చేరి,
ప్రేమ మీర - ముద్దు పెట్టు కొనుము.

# మందహాసం

హృదయ మందుచేరి ఎన్ని వేదన లున్న,
ౘబ్రదుకు నందు ఎన్ని బాధ లున్న!
చింది ముఖము నందు - మందహాసము సదా ;
ధరణి తిరుగు నరుడు ధన్య జీవి. 1

నిండు మనమ్ము - నవ్య నవనీత సమానము - పల్కు - దారుణా
ఖండల శస్త్ర తుల్యము ! జగద్ధిత కాంక్షులకున్ - విషాద్రమౌ
గుండియ తోడ గూడి - సుమ కోమల సుందర మందహాస, వా
క్మండను దుండ వచ్చు ! సుషమా సుకుమార నటాభి రాముడై.2

నందన వని వెన్నెలలౌ,
సుందరతర మందహాస శోభల్ - వదనం
బందున నరునకు - చూడన్
బృందారక చారణ గణ బృందము - వేడ్కన్ 3

పూను - మందహాస మౌన ముద్ర మహర్షి
ప్రవచనమ్ము చేయు - పండితుండు
వదరు బోతు - సలుపు - వాదోపవాదముల్ !
సభల - తేల బోదు - సత్యమెపుడు. 4

చేయ వచ్చు - పనులు చేయకుండగ వచ్చు,
మందహాస మెపుడు చింద వలెను;
సాయపడుట మేలు - శక్తి వంచన లేక
జరుగు పనులు కొన్ని సహజముగనె. 5

# పరిపాలకుడు

అరయ లలిత కళయె పరిపాలన మటన్న,
నేర్పుతోడ న్యాయ నిరతి కలియ;
లౌక్యమెరిగి చాకచక్యమ్ము చూపించు
కార్యశూరుడైన కర్మ యోగి. 1

ప్రతిభ దాచిపెట్టి మిత భాషియై యుండు.
మనసు తెలుప కుండ మసలగలడు,
తా నిమిత్త మాత్రుడై నిల్చి పనిచేయు
బ్రతుకు పాలకుండు త్రాసువోలె, 2

కత్తెరవలె - మెలగు ఖడ్గము కాకుండ
ప్రజల మధ్య నున్న పాలకుండు;
వాడి చూపు - అడ్డు పడెడి వారల పైన;
కనులు తరచు మూసుకొనుట మేలు. 3

ఈ ప్రపంచమందు - ఏ అధీశ్వరుడైన,
క్రక్కరాదు మింగరాదు - విషము,
అణచి పెట్ట వలెను అధికారి తెలివిగా,
గళము నందె కదగి గరళమెల్ల. 4

అరయ సూత్రధారి - అధికారి - ప్రజలందు
అతడు చేయదగు సమన్వయమ్ము
చేతనైన పనిని - చేసి - చేయించుటే
పాలనా విశిష్ట పాటవమ్ము. 5

గడుసుదనము గలిగి - పడుచు దేహము పైన,
పెరుగ వచ్చు ముసలి శిరము తరచు
యువక జనులు తగిన అవకాశములు గల్గి
గొప్ప పాలనమ్ము కూర్చ గలరు. 6

రక్తి కట్ట గలదు - ప్రక్క వాద్యాలతో,
గాన సభల లోన గాత్ర విద్య;
తగిన వారి నేరి - తన చుట్టు అధికారి,
పెట్టు కొనిన నయెడల పేరు వచ్చు. 7

జనుల మధ్యచేరి - చర్మ విగ్రహముతో
తరచు పాలకుండు తిరుగ రాదు
నీడ చాలు - శిరము ఆడించినను చాలు
పనులు జరుగగలవు భయము రేగి. 8

అన్ని పనులు - గొప్ప అధికారి కావచ్చు
చేయ లేడు - ఒక్క చేతి మీద;
చేయు శక్తి కంటె - చేయించు యుక్తి యే
పాలకులకు ఉన్న మేలు కలుగు. 9

పలువు రుండ వచ్చు - పరిపాలకులోన
న్యాయ నిష్ఠయున్న ప్రాజ్ఞ వరులు
సత్వరమ్ము పూని చర్య గైకొనువారు
ఉండవచ్చు నూటి కొక్కరుండు. 10

# పదవి

చెవులు మూత పడును - శిరము లెక్కును కనుల్ !
మరిచి పోవు - ప్రాత చరిత నరుడు !
గుండె యెండి పోవు - రెండు నాల్కలు తోచు,
పదవి - మీద వచ్చి పడిన యెడల. 1

పెదవి విప్ప రాదు - పదవిలో ఉన్నచో !
విజయ మందుటకు వివేకి యైన;
కొంత చెవుడు - మరియు కొంత గ్రుడ్డిదనమ్ము,
అభినయింప వలయు అదను బట్టి. 2

పాడు చేయ గలదు పదవి యెవ్వరినైన,
త్యాగి నైన - కర్మ యోగి నైన!
అంతరాత్మ నణచు - అధికార రోగమ్ము;
చాలు - ఉప్పు రాయి - పాల విరుచు. 3

గృహిణి - వీడ వచ్చు - గృహము వీడగ వచ్చు !
విడువ వచ్చు - కూర్మి కొడుకు నైన;
విడవ వచ్చు ధనము - వీడ వచ్చును మైత్రి,
పదవి - చేతులార వదలు బెట్లు ? 4

వ్యాధు లందు గొప్ప దధికార దర్పమ్ము
మందు లేవి దాని మాన్ప లేవు !
నరుని మనసు దొలిచి నాశనమ్మును జేయు,
జటిల కుష్ట రోగ సమము సుమ్ము. 5

## ఆటవెలది

లాస్య మాడు గాత - లయ - తప్పకుండగా,
తెలుగు నోటి - ఆటవెలది - ఇంక;
మెరయు గాత - భావ సరళి విద్యుల్లతల్
పలుకు బడుల అలలు పులకరింప. 5

ఆట వెలది - వదలి ఆహార్యముల నెల్ల,
పలుక బడుల వల్లె వాటు దాల్చి,
చిందు లాడు - పుట్టు టంద చందాలతో,
అమృత భావ రాగ మాలపించి, 6

అలతి అలతి తేట తెలుగు మాటల తోడ,
సులువు గాదు - ఆట వెలది వ్రాయ!
బరువు తక్కువ - మరి - బలము హెచ్చుగనుండు
మణుల మలచ వలయు మందిరములు. 7

బలము హెచ్చు గలిగి -బరువు తక్కువ గల్గి
కవిత - యెగురు - దిగ్ దిగంతములకు!
గాలి - తేలియాడ గలవు - వేమన కృతుల్!
తేట తెలుగు నుడుల తీపితోడ. 8

వేమన కవనమున - విశ్రాంతి కన్పించు,
మొదటి పాదమందు - తుదిని గూడ;
గణ గణమునకు యతి కన్పించు తరచుగా
సంస్కృతమును మించి ఛందమందు. 9

# దీపావళి

దేశ జనము లెల్ల - దీపావళీ రాత్రి;
వెల్లి విరియ వెలుగు విశ్వ మెల్ల;
వ్యయము మరచి పోయి - ఆనంద సందీప్తి,
ఓలలాడు చుందు -రుత్సహించి. 1

వ్యాఖ్య సలుప నేల ? ఆనందమే బ్రహ్మ
అనెడి వేద వాక్య మర్థ మగును;
తెలుపు - గొప్ప నిజము - దీపావళీ దీప్తి,
ఉత్సవ రతులు నరు లుర్వి లోన. 2

ఊపి వేయు ప్రజల - దీపావళీ దీప్తి,
ఉర్వి కలదె ఇట్టి ఉత్సవమ్ము?
యువక హృదుల లోన - ఉత్సవోత్సాహమ్ము
ఉబికి - ప్రజ్వరిల్లు ఒక్క రాత్రి. 3

మందు గుండు పేలి మరణించు జను లుంద్రు
అర్థు లుండ వచ్చు అచ్చ టచట;
కలరు కాలు చేయి కాలి స్రుక్కెడు వారు,
ప్రజలు మరువ గలరు వారి బాధ 4

అమృత దివ్య దీప్తి - ఆనంద నాట్యమ్ము
తీర్చి దిద్దు - భారతీయ హృదుల;
తిమిరము నెడబాపి - దీపావళీ దీప్తి ;
నింగి నేల కలిపి నింపి వేయు. 5

శీత నగము నుండి - సేతు పర్యంతమ్ము;
ఒక్క రాత్రి - ఉబుకు ఉత్సవమ్ము;
తిమిర భేది - తరళ దీపావళీ కాంతి;
తాండవించు ధరణి దద్దరిల్ల. 6

పండుగ దీపావళి - ఢాం
ఢాం ఢాం చంచత్ చటుల పటాటోపముతో,
మండిత గగన స్ఫుట ది
ఙ్మండల కాంతిచ్ఛట మరి మరి మార్ మ్రోగున్. 6

డెంద మందు మనిషి- పొందు ఆనందమ్ము
తులను ధనము తోడ - తూచ రాదు.
దిద్దు కొనుత మనిషి - దీపావళులు కొన్ని
పేర్మి కూర్మి కొత్త పేర్లు పెట్టి. 7

☆ విద్య - ఆటవిడుపు విశ్రాంతి కాంక్షించు
నీతికోరు వినయ నిష్ఠ కోరు,
విద్య అనిన విపుల విజ్ఞానమా ? కాదు;
వీపు వెనుక బరువు -విద్య కాదు.

☆ చరిత త్రుళ్ళె - ఘోర నరమేధముల తోడ,
పడగ విప్పె - స్వార్థపరత -తరచు,
సకల జనుల హితము - సామరస్యము నేడు
మనిషికోరదగును - మరచి చరిత.

# ఆదర్శము

అశయాల కంటె - ఆదర్శముల కంటె
నరుడు చేయు పనుల నరయ వలెను.
మనిషి మాట కంటె మనసు ముఖ్యము గదా!
త్రికరణ పరిశుద్ధి - శ్రేష్ఠతమము. 1

ఆదర్శము నేదో ఒక
నేదో ఒక పని సమష్టి హితమునకై తా
నౌదల దాల్చిన త్యాగికి,
నైదు పదిని చేసి లోక మారాధించున్. 2

గ్రంథకర్త కాడు - ప్రతిభ లేకున్నచో
ధనము లేని యెడల దాత కాడు
మనసు వాక్కు - క్రియలు మధ్య పొత్తును గూర్చి
మహితు డగును నగము మనిషి గూడ, 3

ఉండి - మండు చుండు - ఒక పరంజ్యోతియై
గొప్పవాని యొక్క గుండెలోన!
ఆరకుండ వెలుగు ఆదర్శముల కాంతి
యుగయుగాల వరకు ఉజ్జ్వలముగ. 4

తెగిన గాలి పటము పగిది ఆకసములో,
తెలివి యున్న వాడు తేల నేల ?
అభ్యుదయము కలుగు ఆదర్శ మొకటున్న
గుండె శాంతి నిండు - పండు బ్రతుకు. 5

స్వార్థము విడనాడి ఆదర్శనిరతితో
తప్పు చేయ నెడల ఒప్పె యగును,
క్షమ వహించి పెద్ద కార్యక్రమములోన
సర్దు కొనుట మేలు సహృదయుండు. 6

బ్రతుకు ధర్మమునకు శ్రుతి గొల్పుకున్నచో
సాగు యజ్ఞమువలె సంఘమందు
సంతసమ్ము గూర్చు శ్రమ కూడ తరచుగా
ఓర్వవచ్చు కష్ట ముద్యమమున. 7

అంగబలము లేక - ఆదర్శముల తోడ,
ధరణి మీద - పనులు జరుప లేము;
వెరవు గలిగి ధ్యేయ విజయమ్ము కోసమే,
వంగవచ్చు కొంత లొంగ వచ్చు. 8

## విద్య

మనిషి - విద్య వలన -మానస క్షితిజముల్
క్రొత్త ఆకసముల కూర్చు కొనుత;
నిండి - పెక్కు పూల నెత్తావి తెమ్మెరల్
గుండె చలువ వెలుగు పండుగాత! 1

## ఓటు

సగటు మనిషి సంఘ సంస్కర్త కాలేడు,
చాట లేదు నిజము సాహసించి,
ఓటు చేయ వచ్చు - ఉన్నవారలలోన
మంచివానినెంచి - మౌనముగనె. 1

ధన బలమ్ము - కడగి తగ్గింపకున్నచో,
జరుగు నట్టి దేమి ? ఓటు వలన ?
సమత బండి సున్న - స్వాతంత్ర్యము హుళక్కి
అంతరింపకున్న ఆస్తి హక్కు. 2

బ్రదుకు నందు - పరమ పావనం బేదయా ?
అమ్మ వంటి దోటు హక్కు సుమ్ము!
నేటి విలువ లందు సాటి లేనిది - ఓటు;
అంతరాత్మ నెప్పు డమ్మరాదు.. 3

అర్థవంత మెట్టు లగు ? ప్రజాస్వామ్యమ్ము
ఈ జగత్తు నెల్ల ఏలు ధనము,
ఆస్తి హక్కు పెక్కు అన్యాయముల కక్క
గెలువ లేదు ఎన్నికలను పేద. 4

అవని పెక్కుమంది - అసమర్థ సజ్జనుల్
కార్చగలరు మూగ కంటి నీరు!
వేయగలరు - ఓట్లు - న్యాయమ్ము నిలబెట్టి
పాపగలరు కుటిల పాలనమ్ము. 5

# చిత్త శుద్ధి

మనిషి చేయ లేని పని యేది జగతిలో ?
శ్రద్ధ యున్న - చిత్త శుద్ధి యున్న ?
ప్రభుత తీర్చిదిద్దు - పంచభూతములపైన
సృష్టికి ప్రతిసృష్టి చేయ గలడు. 1

కొండ పిండి చేసి కొట్టవచ్చును పూని
మొండితనము తోడ మూర్ఖుడౌకడు
మెండు శ్రమకు ఓర్చి - కొండ నంతటి త్రవ్వి
చిట్టి యెలుక నొకటి పట్టవచ్చు. 2

మావటీడు కడగి మత్తేభమును గూడ,
తెలివి తేట లుండి త్రిప్ప వచ్చు
చిత్త శుద్ధియున్న చేయ లేనిది లేదు
దక్షత సమకూరు దీక్ష వలన. 3

మనిషికున్న చాలు - మనసులో సంశుద్ధి
జంకు గొంకు లేక సాగవచ్చు
దిగ్ దిగంతరములు - దివ్య తేజము నిండు;
మోకరిల్ల గలదు- లోకమెల్ల. 4

స్వానుభవము వల్ల - జ్ఞాన రూఢ్యత కల్గు
చదువు వల్ల - కలుగు - జ్ఞాన పటిమ ;
ఈవి వల్ల కలుగు జీవ సాఫల్యమ్ము
శీలమునకు - ఆత్మ - చిత్తశుద్ధి. 5

# వర్తకుడు

మంచి మాట తప్ప మాయ మర్మము లేదు;
అతడు సరుకు లెల్ల అమ్మ గలడు.
ఆ దుకాణమందు - అడుగు మోపిన వాడు
అతని చూపు చేతి ఊపు చాలు 1

బేర మాడకుండ ప్రియమైన ధరపెట్టి
మంచి సరుకటంచు ఎంచి కొనును.
పుటలు విప్పి అతడు - పుస్తకమ్ములు పెక్కు
బ్రదుకు నందు ఎపుడు చదువ లేడు. 2

చదువు - ఎదుటి వారి హృదయాలు వెంటనే,
చాలు మొగము చూచి క్షణములోన.
మంచి వర్తకుండు మర్యాద నెంచగా
వాని మించు - నట్టి వాడు లేడు ! 3

అతని మధుర మందహాస విన్యాసముల్
మత్తు గొలుప గలవు - మద్య మట్లు.
వాని వందనమ్ము - స్వాగతాహ్వానమ్ము
పలుకు లయలు హొయలు తళుకు బెళుకు 4

నయన యుగళి తోచు - నవనవోన్మేషమ్ము
ఎదుటి వారి హృదుల నేల గలవు.
మనుజు డెవ్వడైన - కొనకుండ పోలేడు,
ఆ దుకాణమునకునరుగుదెంచి. 5

క్రమ్మ వచ్చు గాక - చిమ్మ చీకటి కొంత
వేగ - ప్రొద్దు పొడుపు - వెల్లివిరియు;
చాలు ఓర్చుకొనుము జయము కల్గును నీకు
నిదుర చెందుట కిది అదను కాదు.

వేయవద్దు - వద్దు - వెనుకంజ తమ్ముడా!
విశ్రమించుట కిది - వేళ కాదు;
నేడు - న్యాయ మమరు - నీ పక్షమున యందె;
సాయ పడును విశ్వ చరిత మనకు. 7

వేయ వద్దు -వద్దు - వెనుకంజ తమ్ముడా
పట్టినావు మంచి పనిని చేత ;
కలుగ వచ్చు విఘ్నములు శ్రేయముల యందు
నీదె తుది విజయము నిశ్చయముగ. 8

## వినయం

కడలి కెట్లు గలిగె ? గాంభీర్య గరిమమ్ము ?
నదుల కంటె క్రింది కొదిగి నిలువ !!
కలిగె నదుల కెట్లు గౌరవాధిక్యమ్ము??
పార పల్ల మందు ,ఏరు కంటె !! 1

అరయ -వినయ మిచ్చు చిరకాల విజయమ్ము
గర్వ మణగు అల్ప కాల మందె !
మింట వెలుగ వచ్చు మిరుమిట్లు కల్పించి,
అహము - ఉల్క వోలె - అంతరించు. 2

## సహనము

ఏది పరమ నీతి ? ఏకైక మత మేది ??
సర్వ మానవ సుఖ సంగ్రహమ్ము;
సహన గుణమె సుమ్ము - జ్ఞాన పారమ్యమ్ము;
శాంతి పాఠమునకు స్వస్తి - గీతి. 1

వెల్లి విరియు గాక - వేయి పువ్వుల తావి
ఎల్ల లెల్ల దాట ఎల్ల హృదుల
వృద్ధి చెందు గాక - ఇక ప్రజాస్వామ్యమ్ము
జయము పొందు గాక - సహన గుణము. 2

సహన గుణము కంటె సౌఖ్యమేమియు లేదు,
బ్రదుకు కిటుకు - సర్దుబాటె సుమ్ము!
చతుర సామరస్య సంధి సంధానమే
సర్వ శాస్త్ర సార సంగ్రహమ్ము. 3

## మురికివాడ

ప్రజకు గ్రాస వసన వాసదైన్యము బాప
దీక్ష పూను గాక - దేశమిపుడు
దేవుని కయి - నవ్య దివ్య మందిరము లేల ?
మురికి వాడ ప్రజలు మూల్గుచుండ. 1

మురికి వాడ పుట్టి మూల్గు విప్లవ ఘోష
తుడిచి వేయగలదు పుడమి నెల్ల;
ధనికులకును - హాని - దారిద్ర్య మెట నున్న
మురికి వాడ దేశమునకు - ముప్పు. 2

# స్వేచ్ఛ

బ్రదుకు నందు - పెక్కు ప్రతిభా విశేషముల్
సంక్రమించుచుందు - జన్మ చేత:
అట్లె దాపురించు - అవగుణమ్ములు గూడ,
పొగడ నేల ? జనుల తెగడ నేల ? 1

కనులు ముక్కు చెవులు కలిగి ఆడెడి - నీడ!
మాట లాడు పేడ చేటపెయ్య;
మనిషి - తిరుగులాడు - మునిమాపు సీమలో,
అవని చర్మ విగ్రహమ్ము పగిది. 2

బ్రతుకు నందు - జన్యు రక్త దాసుడు గదా,
ప్రకృతి పరిసరాల బంది నరుడు:
ఎంత వరకు మనిషి స్వేచ్ఛా స్వతంత్రుండు ?
కలదు - కిటుకు రక్త కణము లందు. 3

స్వేచ్ఛ యందు - అమరి విధి నిషేధములుండు;
విచ్చలవిడి- నడక - వీలు కాదు:
బ్రతుకు నందు - నరుడు - ప్రక్కవారికి హాని
చేయ రాదటంచు చెప్పనేల ? 4

నరుడు - పెరుగు - ప్రకృత చెరసాలలో పుట్టి;
శోణితమ్ము లోని - శుక్ల కణము !
కృతక సంప్రదాయ శృంఖలా బద్ధుండు,
స్వేచ్ఛ ఏది ? నరుని చిత్త మునకు 5

మనుజుడు బ్రదుకున చేసెడి
పనులకు కారణము - రక్త వాహినిలో - ప్రాక్
కణముల సంచలనమ్మే
అనిపించు - కళలకు నదియె అవతారికయౌ. 6

తన దేశము భాష కలవు,
తన తల్లిదండ్రులును కలరు ధారుణిలో - తా
జననము నందక ముందే!
మనుజున కే స్వేచ్ఛ గలదు ? మహిలో సుమతీ ! 7

## కష్టాలు

అరగ దీసి తీసి - అగసాలి - వజ్రమ్ము
ప్రభలు పెంచు సాన బట్టి బట్టి;
సజ్జనునకు కొన్ని కష్టాలు సమకూర్చి
దేవు డెప్పు డతని దీప్తి పెంచు. 1

కడకు - బ్రదుకు లోన -'కష్టాను భూతులే !
బలము వెన్నెముకకు - కలుగ జేయు,
శీల నిరతి గూర్చి - చిత్త శుద్ధిని గూర్చి;
గుండె నిబ్బరమును - కూర్చ గలవు. 2

రాయి శిల్ప మందు రమణీయ మగుచుండు!
తరిగి తరిగి ఉలుల తాకిడులకు;
బ్రదుకు నందు - మనిషి - భరియించి కష్టాలు;
దివ్య సుందరముగ తేజరిల్లు. 3

# అప్పు

తివిరి అప్పు చేయు తెలివి తేటలులేవు
కలరు నాకు స్నేహితులు ధనికులు
ధనము నప్పుడపుడు దానమిచ్చితిగాని
ఎవరి కప్పు లెప్పు డివ్వ లేదు. 3

ధనము నెవడు వూని తన చేతిలో చేర్చు ?
ఎదుటి జేబు నుండి - కదిపి కుదిపి
అప్పు చేయువాడె - యావత్ జగత్తులో
గొప్ప ఐంద్ర జాలికుండు సుమ్ము! 4

అప్పు చేయువాడు - అసమాన మేధావి
అప్పుచేయువాడు - గొప్ప నటుడు;
లలిత చాకచక్య లౌక్యాభిరాముండు
ప్రతిభ యందు అతని కతడె సాటి. 5
అప్పు చేయువాడు - అవివేకియా ? కాదు!
ధీవిశారదుండు - తీర్చకున్న;
భోగి అప్పు చేసి త్రాగవచ్చును నెయ్యి;
బ్రదుక నేర్చు పూల రంగ డతడె. 6

అప్పు నిచ్చు నెవడొ ! అనుభవింపగ లేక
అప్పు తీర్చకున్న - తప్పు గాదు;
అప్పు లిచ్చు చుండు - అధమాధముడు - లోభి
పుచ్చు కొనెడి అప్పు - భోగి వరుడు. 7

# ప్రకృతి సౌందర్యం

చూచినాడ నేడు - సూర్య గ్రహణ మందు
ఉజ్జ్వలమగు జిలుగు టుంగరమ్ము;
కనుల పండు వౌచు కన్పించె తెరమీద;
నవ్యదూర దర్శనమ్ము నందు . 1

మనుజు లందు మనల - అనుభవం బొనగూడు;
వెడల వలయు గృహము వీడి - నరుడు;
పుడమి యెల్ల - గొప్ప గుడి యౌను; బడి యౌను.
చెప్పు - చెట్టు పుట్ట - గొప్ప చదువు. 2

సాగరముల మీద - చంద్ర గోళము మీద,
నేల మీద మరియు నింగి మీద,
చెరపి వేసె శాంతి - సృష్టి యంతటి లోన
వేగ పెరిగి - నవ్య నాగరికత. 3

అక్షరాలు- తరళ నక్షత్ర గోళాలు,
నిర్వికల్ప శిల్ప నిభృత రచన;
నాకు నచ్చి నట్టి దాకాశ కావ్యమే !!
అమృత భరిత మద్భుతావహమ్ము. 4

లోక మందు మనిషి కేకాంత వాసమ్ము
దివ్య దీధితులను తీర్చి దిద్దు;
కొండ మీద నుండు గుడి మంచిదే గాని
చిర నివాస మచట చేయ రాదు. 5

చిలిపి జిలిబిలి పలుకుల చిట్టి పసి పాప
మూగ బాస - ఎంత ముద్దు గొలుపు !
సహజ మైన - నాట్య సంకేతముల తోడ;
పాడ గలరు బిడ్డ లాడ గలరు. 6

చిన్న మొగ్గ చాలు - చిగురు టాకులు చాలు!
విచ్చి - విచ్చు చున్న !విరులు చాలు !
చెట్ల మీద వ్రాలు - చిలుక గుంపులు చాలు!
నరుల గుండె లలరి నాట్య మాడ. 7

కొదమ మబ్బు గున్న - చదలపై రేయెల్ల
ఒక్క మారు మూల నొదిగి యుండె,
వెదకి వెదకి పట్టి - ఉదయ భానుడు పెట్టె
మణి కిరీట మొకటి మబ్బు తలను. 8

విశ్వ మందు - శాస్త్ర విజ్ఞాన సాధకుల్
సృష్టి చేయ గలరె ? చిన్ని పువ్వు ??
సృష్టి లోన విత్తు చెట్టు లున్నవి గాని,
ఏవి ముందో ఎవ్వ డెరుగ గలడు? 9

నిలిచి నాడ - నేడు - సెలయేరు నదిలోన
కలియు నట్టి చోట సెలవు పెట్టి,
తొలకరి చినుకు జడి - మలి సంజ కెంజాయ;
మరువ దలచి - బ్రదుకు బరువు కొంత 10

అస్తమించు సూర్యుడపరంజి కెంజాయ
కొండ సందు లందు కూర్చు నపుడు;
చల్ల తెమ్మెర సిరి జాబిల్లి పండింప
నరుడు తన్ను దానె మరచి పోవు. 11

సెలవు లనుభవింపవలెను - విశ్రాంతిలో
విందు లందు ఆట విడుపు లందు
సౌరభములు - పూల సౌందర్యములు గ్రోలి,
సేద దేరి ఇల్లు చేర దగును. 12

వెల్లి విరియు - పండు వెన్నెలల్ దెసలెల్ల,
కడలి అలలు పొంగి కాళ్ళు కడుగ
కాయ మెల్ల తాక - కమ్మ తెమ్మెర తావి,
కలలు గాంచ వచ్చు - కనులు విప్ప. 13

ప్రకృతి సిద్ధ మైన - ప్రత్యక్ష జగతినే,
కాంచు - మనిషి - తోలు కనుల తోడ;
అఖిల సృష్టి నరయ నగు మనో నేత్రమ్ము;
గ్రుడ్డి కుండ వచ్చు - గొప్ప ప్రజ్ఞ. 14

వెల్లడించు - నీతి - వేదాంత బోధనల్!
చెట్టు - పిట్ట కూత - చీమ పుట్ట;
రాతి కప్ప - నిప్పు - ప్రవహించు సెలయేరు;
పెద్ద పాఠశాల విశ్వ మెల్ల. 15

సృష్టి లోని సహజ శిల్ప విన్యాసముల్
మోసు లెత్తు మోడు - బోసి నవ్వు;
కన్నె మొగ్గ కలికి వన్నె చిన్నెల సిగ్గు;
కలిసి తోట లందు - కానుపించు. 16

పాడు చేసె - సహజ ప్రకృతి సౌందర్యమ్ము
వేగ పెరిగి నవ్య నాగరికత,
సరుగు లెత్తు బస్సు - పర్వతాగ్రము పైకి!
వీను లదర గొట్టు ఫోను రవళి. 17

ఎదుగ లేదు మొక్క - ఏపుగా నీడలో ;
వెడల వలెను - గృహము వీడి - బిడ్డ;
బాహ్య జగతి గొప్ప - వ్యాయామ రంగమ్ము;
ప్రకృతి ఒక్క గొప్ప పాఠశాల. 18

కారు మబ్బు గములు క్రమ్ము ఆకస మందు
పట్ట పగలు ప్రొద్దు బయట పడదు.
వెలుగు జిలుగు తోడ - వెండి అంచులు కొన్ని,
కానుపించు - మబ్బు గముల మధ్య, 19

కడలి యందు కలదు - గాంభీర్య గరిమమ్ము
చిన్న యేరు చిమ్ము చిలిపి సొగసు;
చిందు - ప్రకృతి - పెక్కు అందాలు చందాలు
వేటి తీరు తెన్ను - వేరు వేరు. 20

సకల సృష్టి యెల్ల - ఒక బృహద్ గ్రంథమ్ము!
హృదయ మున్న వారు - చదువ వచ్చు!
ఎట్టి నవల గాని - ఎట్టి నాటక మైన ,
మించ లేదు - ఈ ప్రపంచకమును. 21

## ప్రార్థన

లాభదాయకమ్ము - ప్రార్థనా ధ్యానమ్ము
భక్తు బ్రదుకు కొంత బాగు పడును,
ప్రార్థన యన - కాదు భగవంతు కే మేలు;
నిర్వికారు డతడు నిర్గుణుండు. 1

వెల్లి విరిసి యుండు - విశ్వ చైతన్యమ్ము;
సాగరమ్ము వోలె - సంతతమ్ము;
ప్రార్థన యన గుండె - భాండమ్ముగా జేసి
నీరు మానవుండు నింపుకొనుటె. 2

అవ్యయము - అనంత మది - స్వయంభువ శక్తి,
అందు అంద రోల లాడ వచ్చు;
విశ్వ మెల్ల దివ్య విద్యుత్తుతో నిండు;
ప్రార్థన అన దాని నందు కొనుటె. 3

ప్రాణ నిధులు పెంచు - ప్రార్థనా ధ్యానమ్ము
సంగమించు విశ్వ శక్తి తోడ,
దేహ మానసముల - దోహద క్రియ యౌచు
దివ్య శాంతి దాంతి తీర్చిదిద్దు. 4

విశ్వ శక్తి కూడ - విద్యుత్తు వంటిదే !
మనిషి - దాని వాడు కొనుట మేలు;
వ్యర్థ మెపుడు గాదు - ప్రార్థనా యజనమ్ము;
ఆ అనంత శక్తి - నధిగమించు. 5

సుంత తరిగి పోవదెంత తీసిన గాని,
అది అనంత మవ్యయ నిధి - శక్తి;
గుంజు కొనును - ప్రార్థనాంజలి ప్రతిపత్తి;
పీన మాత్ర మైన - విశ్వశక్తి. 6

ప్రార్థనమున - మనసు - ప్రక్షాళనం బౌను;
గుండెకు దిగి వచ్చు - గొప్ప శక్తి;
అది పవిత్ర యోగ మది యజ్ఞ సదృశమ్మో;
సర్వ తాప హరము - శాంతి శుద్ధి. 7

సౌర శక్తి - సరళ సహజ సుందరముగా
స్వీకరింప గలదు చెట్టు సతము;
ప్రార్థనా తపస్సు - భగవత్ విభూతి శక్తి ;
అందుకొనును - సహజ సుందరముగ. 8

గాఢ నిద్ర కంటె - కడుపు నింపుట కంటె
స్నాన పానయాన చర్య కంటె,
ఆట విడుపు కంటె - వ్యాయామమున కంటె,
ప్రార్థనా ప్రపత్తి - బలము నిచ్చు. 9

ప్రార్థన యన వేరు లాభమే లేకున్న
కొంత సేపు - చిత్త శాంతి గలుగు;
స్నాయువులకు నిచ్చు జాగ్రత్ సమాధియై
కోలు కొనెడి గొప్ప క్రొత్త శక్తి. 10

# వ్యయం

సవ్యమైన ఖర్చు - సలుప వచ్చును గాని
అర్థ రహిత మైన - వ్యయ మదేల ?
పోస్టు కార్డు నొకటి పూని వ్రాయుట మాని,
ఫోను చేయు నేటి మానవుండు. 1

వాడవలెను హెచ్చు పాలు పెట్రోల్ మాని
మధ్య తరగతి యగు - మనుజు లెల్ల;
వ్యయము చేయరాదు - వస్త్ర ధారణ పైన
పెద్ద ఖర్చు వద్దు పెండ్లి కొరకు. 2

పేర్మి కూర్మి తోడ పేదవాని కొరకై
వ్యయము చేయవలసి వచ్చు చుండు;
సేవ - నెంత వలయు జీవిత క్రీడలో
పరిహరింప రాని భాగ మంచు. 3

ఉత్తమ కృషి యేది ? ఉత్పత్తి పెంచుటే!
పెండ్లి కొరకు ఖర్చు- పెద్ద వెఱ్ఱి;
ఉత్సవాల వ్యయము - ఉత్త దండుగ సుమ్ము
బ్రదుకు నెల్ల - పొదుపు బాగు చేయు. 4

ప్రాజ్ఞు డైన వాడు - వస్త్రవిస్తృతి బట్టి,
కత్తిరించు కొనను - కంచుకమ్ము;
వ్యయము చేయవలెను - ఆదాయమును బట్టి
పప్పు కూడు వద్దు - అప్పు చేసి. 5

వంద రూక లొకడు వ్యయము చేయగ వచ్చు
ఒక్క రూక ఫలము దక్క కుండ,
వ్యయము చేసి మనిషి పది రూకలేయైన
వంద రూప్య ఫలము పొంద వచ్చు. 6

# ఆదర్శ పౌరుడు

సామరస్య సంధి సంధాతయే - యోగి,
శ్రుతిలయలను - కలుపు సూత్రధారి,
జీవితమ్ము- నందు - సేతు నిర్మాతయై;
బ్రదుక నేర్చు - పరుల బ్రదుక నిచ్చు. 1

క్రొత్త పాత మేలి కూర్పే ప్రగతి సుమ్ము!
పాతబడు పునాదిలోతు చాలు
పాదుగు కొనుట మేలు - మెదడులో హృదిలోన
ఎదుగు నట్టి క్రొత్త యెల్లలెల్ల. 2

సంతత మందహాస విలసన్ముఖ మండల మందునన్ సదా
సంతసమున్ వెలార్చెడు ప్రశాంత మనస్కుడు - నిత్య తృప్తుడ
శ్రాంత జగద్ధితక్రియలు సల్పెడు వాడు - పరోపకార వే
దాంతి అజాత శాత్రవుడు - ధన్యుడు మానవ సంఘమందునన్. 3

☆ కలిసి యుండు బ్రదుకు వెలుగు నీడల తోడు
నీడ విడిచి - "వెలుగు' - చూడవలెను;
గుడ్లగూబ గూడ - గుండె - చేయగ నేల ?
పొద్దు తిరుగుడు పువుఁ బోలుగాత.

☆ బండబారి నట్టి - గుండె గల్గినవాడు
సముడు శవము తోడ సంఘమందు,
ప్రగతిశీలి - కరుగ - స్పందించు డెందమ్ము
సతము బ్రతుకు సంఘ - హితము కొరకు

## బావ

ఎంత స్వేచ్ఛ ! మరియు ఎంత స్వాతంత్ర్యమ్ము
కలదు బావ అనెడి పలుకు నందు
ఆట విడుపు మాట పాటీలో చనువుతో
చెడని పేర్మి చెలిమి చేయవచ్చు.
శంకలేని చెలిమి పొంకమ్ము బింకమ్ము
ఇచ్చి పుచ్చుకొనెడి ఇంగితమ్ము
పట్టు విడుపు ఓర్పు పరిహాసరసికతల్
కలసి బావయౌను తెలుగు నందు.
ఆంధ్ర భాష - బ్రదుకు అంద చందము లెల్ల
బావ పదము నందు పరిఢవిల్లు!
పడుచు పిల్ల చేరి - బావా యనుచు పిల్వ
పులకరించనట్టి పురుషుడెవడు ?
తెలుగు బ్రదుకు తీరు తీయాల నెత్తావి
పరిమళించు బావ పదమునందు;
ప్రక్కవాని జేరి - బావా యనుచు పిల్చి
మేల మాడవచ్చు మేర మీరి.
పిలిచి బావ వరుస పెట్టి యెవ్వరినైన
తెగడవచ్చు మరియు పొగడవచ్చు
తప్పులొప్పు తలచి సర్దాలుగా లెల్ల
సర్దుకొనుట కద్దు సర్వజనులు.

# నీతి

ధరణి మీద - నేడు - ధర్మధేనువు నిల్చు;
కలి యుగాన - ఒంటి కాలి మీద!
చెడుగు నెదురు కొనుట - చెడుగు తోడనే మేలు!
నీతి ఓడ నేల నిలువ లేక ? 1

గ్రుడ్డి మాట ఒకటి - కుంటి మాటలు రెండు,
విసరవచ్చు గళము విప్పి - మనిషి
మేలు - బ్రతుకు నందు - మితభాషణము సదా
కలము గూడ తరచు కదుప రాదు. 2

చచ్చి పోయినట్టి - శార్దూలమున కంటె
బ్రదికియున్న కుక్క కొదమ మేలు!
జాతి - బ్రదుకు గాత చైతన్య వంతమై
పాత గొప్పదనము చెప్పుకొనక. 3

చెప్పు వయ్య - అతని స్థితిలోన నీవున్న
ఉండగలవె చేయకుండ - తప్పు
తప్పని సరియైన - తప్పు చేయగ వచ్చు
మనుజ మాత్రుడైన - మంచివాడు. 4

కష్ట యాతన గద - కర్తవ్య నిర్ణీత
బహుజన హితము సుమ - పరమ నీతి
తలప రాదు హృదిని తన మేలు సుంతైన
ధర్మమునకు ఆత్మ త్యాగ నిరతి. 5

మనిషి చెప్పు నెడ - క్షమాపణమ్ముగను వేగ
తప్పిదమ్ము బరువు తగ్గి పోవు
బాధితుండు మరియు ప్రక్కవారలు గూడ
సేదదేరి సంతసింపవచ్చు. 6

జగతి లోన - ఇంక జన సంఖ్య తగ్గింప
శీఘ్ర కృషిని వేగ చేయ వలయు.
సమసిపోయె - ప్రకృతి సమతులాభారమ్ము
ధరణి - ఎల్ల నిధుల తరిగి పోయె. 7

బ్రదుకు నందు అన్ని వ్యాపారముల లోన
చెప్ప దగిన దేది గొప్ప దంచు ?
పరుల మనసు వేగ పసిగట్ట గల్గుటే
విజయ సాధనమ్ము విశ్వమందు. 8

నాశ మయ్యె - వివిధ దేశాలు చరితలో
వ్యక్తి జీవితాలు పాడు పడెను,
మేలు కాదు భోగ లాలసత్వము రేగ
నియమ నిగ్రహమ్ము నీతి మేలు. 9

అవనిన్ సాధారణ మా
నవ హృదిలో నీతిపైన న్యాయముపై
గౌరవ ముండును సహజముగా
అవినీతి పతనము చెందు అల్పాయువుగా. 10

వేయ వచ్చు - మనిషి వెనుకంజ బ్రతుకులో
ఎడద నిబ్బరమ్ము వదల రాదు,
అంతరింప కున్న - ఆత్మ విశ్వాసమ్ము
అంతిమ విజయమ్ము - అమరగలదు. 11

ఉండు కట్టుబాట్లు - పండుగల్ పబ్బాలు,
సంప్రదాయములును జగతి యందు;
వసుధ - తిరుగలేదు వస్త్ర ధారణ లేక,
సంఘజీవి - నరుడు - జగతి యందు 12

ఇష్ట మైన పనుల ఎవ్వ రైనను గాని
చిత్త శుద్ధి తోడ - చేయ వచ్చు.
ఘనుడు చేయ గలడు - కర్తవ్యమును పూని
ఇష్టమేమిలేక హృదయ మందు. 13

ధనికులకును గూడ - దారిద్ర్యమెటనున్న
చెప్ప లేని హాని చేయవచ్చు
ధరణి మీద తిరుగు నరబాంబు నిరుపేద
చచ్చిపోవు - ప్రేలి - జనుల చంపు. 14

చదువుకున్నవాడు - సంపన్న మేధావి
చేయ తప్పు - శిక్ష వేయ వచ్చు
పేదవాని తప్పు - ఔదార్య హృది తోడ
సైప వలయు మనుజ సంఘ మెల్ల. 15

కాళ్ళ మీద పడును - గత్యంతరము లేక
జుట్టు అంది నపుడు పట్టు కొనును
కార్య సాధకునకు - గాలి వాటము తప్ప,
నియమ మేది లేదు - నీతి లేదు. 16

బ్రతుకు - నీతి మతికి - శ్రుతి గల్గు కున్నచో
సాగు - యజ్ఞము వలె జగతి యందు
సంతసమ్ము నిచ్చు - శ్రమగూడ - సౌఖ్యమై
పుడమి కవలి వెలుగు - ఎడద చేరు. 17

విజయము పయి ఆశ - వీరు డెవ్వడు గాని
సలుప వచ్చు పోరు - సాహసించి -
ఓడు నట్లు తెలిసి - యుద్ధమ్ము సలుపుటే!
స్వచ్ఛమైన పౌరుషమ్ము సుమ్ము! 18

చర్య లందు - సంఘ సంస్కార హృదయమ్ము
నరుడు చూపు గాక కరుణ గలిగి
చేత లందు లేని నీతి పాఠము లేల?
కోత లేల ? కారు కూత లేల ? 19

బ్రదుకు నందు వెగ్గ- పది శాత మవినీతి,
చెప్ప రాని క్షోభచిత్తమునకు !
చుట్టు దారియైన - సుఖము కల్గును గదా!
నియతి నిరతి వలన - నీతి వలన. 20

అంతరింపదెప్పు డవినీతి జగతిలో
    స్వార్థ పరతగలదు జనుల యందు,
న్యాయ మంతరించు అవినీతి పెరుగుచో !
    పెరుగ కుండ అదుపు పెట్ట వలెను. 21

కార్య గతుల యందు - కలదు లక్ష్మణ రేఖ
    సీత కైన - సవ్య నేత కైన !
నీతి గలిగి - కలిగి చైతన్య జాగృతుల్
    నేత - మెలగు చుండు గాత - నేడు. 22

రాజ వీధి యైన - రాజకీయము లైన
    "ఎడమ వైపు సాగి వెడల వలెను,
అభ్యుదయ పరంపరాభివృద్ధులు గల్గ
    నేటి భరతదేశ నీతి ఇదియె. 23

ఎట్టి పాత్ర నౌన - ఇమ నాటకము నందు,
    వేయ వచ్చు మమత విడిచి పెట్టి,
బ్రదుకు ఒక వినోద రంగ స్థలము గదా !
    వెడల వచ్చు తీసివేసి రంగు. 24

అధిక కష్ట సాధ్య మవినీత జగతిలో,
    గుండె గొప్ప ధైర్య ముండ వలెను,
సులువు - నీతి తోడ - శుద్ధి శుంఠయె గాని,
    భయము సుంత లేక బ్రదుక వచ్చు. 25

అరయ - పరెము మూర్ఖ లసమర్థులును గూడ,
నీతి తోడ బ్రతుకు నెరప వచ్చు,
సాటి లేని శక్తి సామర్థ్యములు లేక,
నీతి లేని బ్రతుకు- నెరప రాదు. 26

రక్తి కట్టు - పేద రాసి పెద్దమ్మలో
పాత తెలుగు కథల పరిమళము
నిర్వి కల్ప నీతి - నిత్య నూతనముగా
పులకరింప జేయు - పుడమి నెల్ల. 27

"అంతిమ విజయమ్ము - న్యాయమ్ముదే - సదా "
సూక్తి - నిజము కాదు చూడ తరచి;
అపజయమ్ము గూడ ఆత్మ తృప్తి నొసంగు
ధరణి - న్యాయవర్తి - ధన్యజీవి. 28

అణచు కొనుట తప్ప దాత్మాభిమానమ్ము
ఉద్యమమ్ములోని కురికి నపుడు
వెక్కిరింప వచ్చు - ధిక్కరింపగ వచ్చు
బ్రతుక నేర్చి నట్టి స్వార్థపరులు. 29

వ్యర్థ మగును - ఎల్ల ప్రగతి ప్రణాళికల్ !
గణిత మెల్ల నీరు గారి పోవు;
జగతి యెల్ల యెడల - జనసంఖ్య అదుపులో
పెట్ట వలెను పూని మొట్ట మొదట. 30

## స్త్రీ

ఉత్తముండు భర్త - ఉద్యోగమునకంటె
సతికి దొరుకు నెడల చాలు మేలు;
జగతి యందు - బ్రతుకు స్వచ్ఛంద రాసియై
కుదురుకున్న యెడల కొలువులోన. 1

ఆడదాని వెంట అంబోతు రీతిగా
వెంటబడదు పిచ్చి వెధవ తప్ప
నీడవోలె నిలచి - నిజమైన మగవాని
వెంట బడుచు - పడతి - వెంబడించు. 2

హృదయ మార్దవమ్ము ప్రేమించ గల ప్రజ్ఞ
కానుపించు ఆడదానిలోన
జగతి నేలు ప్రతిభ - మగవాని గుండెలో
గొప్ప గూడు కట్టుకొనుచు నుండు. 3

అభినయమ్ము సుమ్ము - ఆడవారల సిగ్గు
చీర మందమునకు సిగ్గుచేటు
చిలిపి సిగ్గుతోడ - కలికి చూపులతోడ
పెదవి విప్పకుండ పిలువవచ్చు. 4

“ సహగమనము ” - సాగె చాల కాలము మేర
మనుజ సంఘ మందు మతము పేర
అసలు ధర్మమనిన ఆచారములు కావు
గ్రుడ్డి నమ్మకాల కొలువు కాదు. 5

కండరాలు పెంచి - దండలు బస్కీలు
తీసి తీసి అతడు దిన దినమ్ము !
పక్కమీద చేరు - భార్య మేల్కొని యుండు
అతడు నిదుర పోవు అలసి సొలసి. 6

బ్రతుకు తెరువు కొరకు - ప్రతిరోజు ఉద్యోగి
వెళ్లవలసి యుండు ఇల్లు వదలి,
అవి అమృత ఘడియలు ఆనంద సరణిలో
అతని నెపుడు సాగనంపవలయు. 7

ఆడదాని కెంత అందమున్ననుగాని
కోరి కోకడాబు కూర్చు కొనును.
మోజు పెంచుకొనును ముస్తాబు మీదనే
ప్రక్క మీద తుదకు పనికి రావు. 8

పైట జార్చి చూపు పటుపటాటోపమ్ము
గుచ్చి గుచ్చి దోయి - కదలకుండ;
సన్న నడుముతోచు జఘన విస్తృతి పైన
పూవుటమ్ము - మించు బోడి చూడు. 9

సంతత విభేదములతో
పంతమ్ములతో మిథునము పవలును గడపన్
అంతే మరి మంచముపై
సంతాపము తోడ రాత్రి సంధిని సలుపున్. 10

కార్చవచ్చు కాంత కన్నీరు జోరుగా
నదర వద్దు సుంత బెదర వద్దు
ఆమె చిందవచ్చు ఆనంద బాష్పాలు
వగపు అనెడి కుంటి వంక బెట్టి. 11

మమత - ప్రేమ - ఓర్పు మహిమీద మహిళయే
బిడ్డ ముడ్డి గడిగి పెంచ గలదు
తల్లి యైన గాని - ఇల్లాలెయే గాని
కప్పురము కరణి - కరగి పోవు. 12

వద్దు - వద్దు - వ్యర్థ వాదోపవాదముల్
ఇల్లు వదిలి బయట కేగు నపుడు.
చేరు ఇల్లు మరల - పోరు పెట్టగ వచ్చు
విడువ వచ్చు రాత్రి - పడక సుఖము. 13

మంచి భార్య - భర్త మాట పాటగ నెంచి
మద్దెల వలె తాను మారు మ్రోగు
నీడ వోలె కూడి నిలుచుండు తోడుగా
చూడ - బ్రతుకు కష్ట సుఖము లందు. 14

ఎట్టి వాని నైన - బుట్టలో పడవేసి
లొంగదీయు నామె కొంగు జార్చి;
వగలమారి - నమ్ము - మగవవాని మౌర్ఖ్యము
సులువు - ఓరచూపు లొలుక - చాలు. 15

# జ్ఞాన విప్లవం

ప్రగతి పథములో ప్రపంచమ్ములో సదా
జ్ఞాన విప్లవమ్ము సాగగలదు;
విశ్వ చరిత గతిని - విస్మరింపగరాదు
మానవుండు వర్తమాన మందు. 1

మారుచున్న జగతి - మనిషి జీవించుగా
వరలు - జ్ఞాన విప్లవమ్ము మధ్య;
స్వస్తి పలికి - పాత సంప్రదాయము మధ్య
క్రొత్త ప్రొద్దు పొడుపు - కోరవలయు. 2

విడువ వలయు - మూఢ విశ్వాసములు ప్రజల్,
వెల్లి విరిసె - జ్ఞాన విప్లవమ్ము;
నెరపవలయు కడగి నేటి కర్తవ్యముల్
మరచి గత చరిత్ర - మనసు లోన. 3

వెల్లి విరిసె నేడు - విజ్ఞాన వైచిత్రి,
గుండె మార్పు జరుగు చుండు నేడు,
అందుకొనిడి క్రొత్త ఆకసమ్ముల నరుల్
తెలివి వృద్ధి పొంది దినదినమ్ము. 4

మనిషి కాడు - రక్త మాంసాలు మాత్రమే
మంచి చెడగులరయ మనసు కలదు
కలవు - లలిత కళలు - కలదు విజ్ఞానము
సృష్టికపర సృష్టి చేయగలదు. 5

# ప్రజాస్వామ్యం

హితవు చెప్పనేల ? ఏకాంత మేధావి ?
వినెడి వార లెవరు - విశ్వ మందు ?
సంఖ్య ముఖ్య మిపుడు - సామర్థ్య ములు కావు
నిజము కాదు - శీల నిరతి కాదు! 1

నేతలెందరున్న - నిత్య జాగృతి లేక
పారబాధ్యతా ప్రపత్తి లేక,
అభ్యుదయ వికాసమై ప్రజాస్వామ్యమ్ము
విజయ మందలేదు విశ్వమందు. 2

దేని వలన దెబ్బతిను - ప్రజాస్వామ్యమ్ము ?
స్వార్థనేత పనుల వలన గాదు;
కనుల ముందు జరుగు క్రౌర్యమ్ము తిలకించి
ఊరుకొనెడి మంచి వారి వలన. 3

ఎట్లు ఎన్నికగుట - ఇది - ప్రజాస్వామ్యమ్ము
నెగ్గ లేని వాడు - నేత కాడు;
నీరు లేని చోట వారధుల్ నిర్మింప
ప్రతిన బూనుటిపుడు రాజనీతి. 4

ఇది - నవీనయుగము - ఇది ప్రజాస్వామ్యమ్ము
జనులు భిన్నరుచులు జగతి యందు;
ప్రజల పైన రుద్ద వద్దు నీభావాలు
బ్రదుకు మీవు - ఒరుల బ్రదుక నిమ్ము. 5

# ధర్మసూక్ష్మం

జాతి జాతి బట్టి - సమయ సీమల బట్టి
విలువ లెల్ల మారు విశ్వ మందు;
విలువ లెల్ల తరచి - విజ్ఞాని వర్తించు,
ఆశయాల మార్చి అనుగుణముగ. 1

ఉభయ వాదగతుల ఉయ్యాల ఊపుగా
సంచరించు చుండి సంధి చేయు
వారధి యయి వరలు వైరుధ్యముల మధ్య
ధర్మ సూక్ష్మ మెపుడు ధరణి యందు. 2

అరయ ధరణి లోని న్యాయ శాస్త్రము వేరు,
దేవుని తుల తీరు తెన్ను వేరు.
ధర్మ సూక్ష్మ తత్త్వ తర్కవాదము వేరు.
అంతరాత్మ నిర్ణయమ్ము - మేలు. 3

భక్తి చూపదగును - భగవంతుడు కన్నుపై
వదరు నరుని నాల్కపైన గాక!
కడగి - చేయదగును - కర్తవ్యముల నెల్ల
అనుమతింప చాలు నంతరాత్మ . 4

ధర్మ సూక్ష్మ మానదండ మెచ్చట నుండు ?
క్షణము క్షణము మారు జగతి యందు !
బ్రతుకు - దేశకాల పాత్రాను గుణముగా
మనిషి తెలిసి దిద్దుకొనుట మేలు. 6

# అభినయము

ఆంతరంగిక మగు అభినయమ్ములు నాల్గు
మాట లాడు నట్టి మనిషి కమరు;
అమరి యుండు నీడ - అన్ని వస్తువు లందు
అగ్నిలోన ధూమ మమరి యుండు. 1

అభినయ మవసరము - వ్యవహార జగతిలో
నటులకేమి గాని - నరుల కెల్ల;
ప్రాణ నాడు లగును - అభినయములు నాల్గు
మనిషి పెదవి వదలు మాటలకును. 2

భూమి మీద కలదు - గోముఖ వ్యాఘ్రముల్
కుక్క మూతి గుంటనక్క లుండు;
కొంత మంది కుండు - కోకిలాలాపముల్
గుండెలోన విసపుకుండ యుండి. 3

పొగలు దెసలు చిమ్మ - అగరు వత్తుల తావి
గదులు మనుజ హృదులు - గ్రమ్మ నేల ?
బ్రదుకు నెరపనేల ! పరవంచనము చేసి ?
పతన శీలి చూపు -కృతక భక్తి ? 4

# ముద్దు

ధనము పెట్టి - వెలకు కొనవచ్చు - వృద్ధుండు
కుళ్ళిపోయి కంపు గొట్టు ముద్దు !
ప్రేమ లేని యట్టి వెలయాలి బంధించి,
పెదవి మీద వాత పెట్ట వచ్చు. 1

ముసి ముసి చిరునవ్వు ముత్యాలజగి ముద్దు
చంటి బిడ్డ యొక్క జన్మ హక్కు;
వయసు మళ్ళి నట్టి వనితామణికి - ముద్దు
దయ వహించు మగని ధర్మ భిక్ష. 2

పెట్ట వచ్చు ముద్దు - ప్రేమ ఏమియు లేక
వగలమారి పడుచు సొగసు కత్తె!
కలలు గనుచు - ఆమె వలలోన పడకుమా
ముసలి తనము చేటు ! ముప్పు వచ్చు. 3

మొట్ట మొదటి రేయి - ముదురు పాకపు ముద్దు;
మనిషి నెమరు చేసుకొనుట కద్దు;
బ్రదుకు కక్షయమగు పాథేయమును గూర్చు;
మరణ శయ్యనైన మరువ రాదు. 4

గగన సుమము - వృద్ధ కన్యామణికి ముద్దు !
శశ విషాణ సమము - జన్మ లోన,
చలువ చిచ్చు - ముద్దు - చలన చిత్రము లందు,
ప్రజల మనసు లెల్ల - పాడు చేయు. 5

ముద్దు - బుగ్గ - మీద ముద్ర - ముద్దే కాదు !
శిరము మీది ముద్దు - చిలిపి - చేష్ట;
గుండె లదుమ కుండ - రెండు నాల్కలు చేరి
కలియ కుండ - ముద్దు కాదు కాదు. 6

బాల్య మందు తోచు - ముద్దు పచ్చిగా వగరుగా;
తేనె లొలుకు యౌవనాన - " ముద్దు "
వృద్ధ రసికులకును - సిద్ధౌషధ చికిత్స!
అందుకొనును శిశువు అడుగ కుండ. 7

శాత్రవమ్ము గూడ - జాగ్రత్త ! జాగ్రత్త!
ప్రేమ లొలుక ముద్దు పెట్టుకొనును !
దాగు విషము - మాయదారి ముద్దుల లోన
పంచదార పూత పైన గలిగి. 8

దొడ్డి దారి దొరకు దొంగ ముద్దుల తీపి
చిలువ ఱేడుగూడ చెప్ప లేడు!
పెండ్లి కాని కన్నె పెదవి పెట్టెడు ముద్దు
అసలు సిసలు ముద్దు - అమృత సమము. 9

పేద కవిని కోరి ప్రేమించి తమితోడ
మ్రొక్కి అతని పాదములకు భక్తి
సరసురాలు జాణ జవరా లొసగు ముద్దు
మోసు వెత్త జేయు మ్రోడు నైన. 10

ముద్దు - ఏక వచనము - గద వ్యాకరణాన !
లోకమున సమాసలోకనమ్ము
సత్య మరసి నపుడు - నిత్య ద్వి వచనమ్ము
అనుభ వైక వేద్య మమృతమయము. 11

తక్షణమ్ము మనిషి తన్మయత్వము చెందు ;
అటు పోటు రక్త మందు హెచ్చు;
సంభవించు చుండు- సద్యః పర సమాధి
ముద్దు - అడ్డ దారి - మోక్షమునకు. 12

## వరం

కలవు జగతి లోన - తెలియ రానివి కొన్ని;
వదలి పెట్ట దగును వాని నెల్ల,
పరము గూర్చి మెదడు పాడు చేయుట ఏల ?
ఇహము ప్రగతి గూర్చి - ఎంచ మేలు. 1

ప్రజ్ఞ - వ్యయము - చేసె - పరలోకమును గూర్చి,
మతము నాడు వెడలె మహిని విడిచి;
విశ్వయానమునకు - విజ్ఞాన శాస్త్రమ్ము
పుడమి విడిచి బయలు వెడలె నేడు. 2

ఇహము విడిచి పెట్టి గ్రహ యానములు వద్దు;
వద్దు - వ్యర్థ చర్చ-పరము గూర్చి!
వసుధ నెల్ల - నరుడు - బాగు చేయుట మేలు,
నేల విడిచి సలుప నేల ? సాము. 3

# కన్ను దోయి

నింగి నేల తోడ - సంగమించెడు చోటు,
చందమామ ఉదయ మందు చోటు,
గంగ పొంగి కడలి కౌగిలించెడు చోటు
కాంచు - కన్ను దోయి - కన్ను దోయి. 1

ఎండ వేడి తొలగ - చండ మార్తాండుండు;
అవని యెల్ల - ధూమ మావరింప;
ఆకసమ్ము నిండ - అగ్ని పర్వత కీల
కాంచు - కన్ను దోయి - కన్ను దోయి. 2

నింగి మబ్బు లొరసి - నిండార ప్రవహించి
కొండ నుండి దూకుచుండగ - నది ,
జలదరింప గుండె - జలపాత దృశ్యమ్ము
కాంచు - కన్ను దోయి - కన్ను దోయి. 3

నిలిచి సంపెగపువు నెత్తావి అలలలో
చక్కిలి గిలి పెట్ట చల్ల గాలి,
నేల గిరులలోని నిర్ఝరారణ్యమ్ము
కాంచు - కన్ను దోయి - కన్ను దో.. 4

మంచు పంచదార మైదానముల మధ్య,
ఇలకు దిగి నటింప - ఇంద్ర ధనువు,
నింగి ప్రతిఫలించు - గంగోత్రి నగపంక్తి
కాంచు - కన్ను దోయి - కన్ను దోయి 5

# ఉపకారము

అరయ - ధర్మమునకు స్వార్థ రాహిత్యమే!
ప్రాణనాడి యౌను బ్రదుకు నందు,
ఉభయ తారకమ్ము - ఉపకార శీలమ్ము
హింస కంటె పాప మేమి కలదు ? 1

పదవి కంటె గూడ - బ్రదుకు ముఖ్యము గదా!
చదువు కాదు - మేటి మెదడు కాదు,
ఒరుల కెవడు కడగి ఉపకార మొనరించు?
ధరణి మీద అతడె ధన్యజీవి. 2

ప్రార్థన సభ వద్దు - భజన మేళము వద్దు;
తపము వద్దు - నిత్య జపము వద్దు;
ఒరుల కొరకు చేయు ఉపకార చర్యయే;
కోటి యజ్ఞ ఫలము - కూర్చ గలదు. 3

మంచి గుండె చాలు, మనుజ మాత్రుల లోన;
మేటి మెదడు కంటె-మిగుల మేలు,
ఉన్న చాలు - కొంత - ఉపకార శీలమ్ము;
పొంద వచ్చు - కొంత మంది మేలు. 4

— — —

## అవగాహనము

భిన్న జనులు గలరు భిన్న భావాలతో!
పూర్ణ సత్య మేది పుడమి లేదు
సహన శీలి కోరు సహ జీవనము సదా !
జ్ఞానమునకు ఆత్మ సహన గుణము. 1

ఊహ చేయ జాల ముపకార హేతువుల్ !
మంచి మనసు మొదట నెంచ దగును;
అసలు కారణమ్ము లాశ్చర్య మొనగూర్చు!
రాదు పైకి - నమ్మ రాని నిజము. 2

ఎవరి మీద నైన - అవగాహనమె యున్న,
కరుణ క్షమను చూప గలడు - నరుడు,
సానుభూతి గలిగి - సహనమ్ముతో గూడి,
జ్ఞాన యోగి యగుత - మానవుండు. 3

## వల

విసరి నాడ చేప వేటకై వల నేను;
కడలి మీద కరిగి - పడవ మీద;
పడెను పెద్ద చేప - పడవ మున్గెను నీట
ఇల్లు చేరి నాడ - ఈది ఈది. 1

వలను పన్నినాను పావురాలను పట్ట
పరచినాను పెసర పప్పు- క్రింద,
వచ్చి కోతి ఒకటి వల నెత్తుకొని పోయె;
పప్పు దినుసు తినె పావురాలు. 2

# గురుకులం

ఎదుట వాని కష్ట మిసుమంతయును గూడ,
ఎరుగ నట్టి వాడు గురుడె గాదు;
విమల యోగి గాని విజ్ఞాన ఖని గాని;
అంజలింప లేను - అతని కెపుడు. 1

తాల్చ లేదెవండు - ధర - జగద్ గురు పాత్ర,
బ్రదుకు లోన అహము ముదుర కుండ,
చేరి గురువు దరికి - శ్రీ పాద తీర్థమ్ము
స్వీకరింప రాదు - శిష్యు డెవడు. 2

వెల్లి విరియు - విశ్వ విద్యా లయాలలో;
కాగి తాల పూలు - గాజు మణులు;
పలుక నేర్చి నట్టి చిలుకలున్ శారికల్
రత్న కాంతులీను రంగు రాళ్ళు. 3

అవని లోన ఎన్ని అనుబంధముల లోన
స్వార్థ లేశ ముండ వచ్చు - కొంత !
పరమ పావనమ్ము - గురుభక్తి బ్రతుకులో;
అవని కవలి వెలుగు అందు కలదు. 4

అవసరమ్ము చదువు - హఠయోగ సాధనల్
బాల బాలికలకు పాఠశాల,
మంచి మనసు విరియు - మంచి దేహము నందు;
మనుజ జన్మ - మాన్య మధుర మగును. 5

స్వేచ్ఛ కూర్చు చుండు శిష్య కోటికి నెల్ల;
అరయ సద్గురుడు నియంత - కాడు;
అతడు కలిసి కట్టు ఆలోచనము-కోరు
స్వేచ్ఛ - జ్ఞాన యోగ జీవ నాడి. 6

పరిమిత మగు నెడల పాఠ్య పుస్తకముకే
గొప్పవాడు కాడు గురువు గారు;
పాఠ్య పుస్తక మొక వ్యాజమ్ముగా ఒజ్జ,
కురియు గాత జ్ఞాన కుంభ వృష్టి 7

చెప్పు - దైవము తన జేబులో ఉన్నట్లు
గురుడు నమ్మ శిష్య వరుల తోడ,
ఎవరి జేబు నైన - ఎటు లుండు దేవుండు ?
గాలి కాడు - బూది ధూళి కాడు. 8

కొడుకు కన్న గూడ - కూర్మి శిష్యుడు మిన్న,
భూమి పరిధి దాటు ప్రేమ లోన ;
బ్రదుకు లోని - దివ్య భక్తి యోగము నందు
వెలుగు తళుకు బాట వేయు టందు. 9

గురువు మీద ప్రేమ - గురి తప్ప కుండగా,
గురువు పరిధి శిష్య వరుడు - దాటు;
చేయ దగును గురువు - స్వేచ్ఛా ప్రబోధమే;
గురువు నీడ - శిష్య వరుడు - కాడు. 10

బ్రదుకు నేర్పు - క్లిష్ట పాఠాలు క్షోభతో,
గురువునుండి నేర్చు కొనుట - సులువు;
ముసలితనము రాక ముందె - పెద్దరికమ్ము
పడయ వచ్చు - శిష్య వరుడు వేగ 11

హార్దిక మగు గొప్ప అనుబంధ మమరుగా;
గురువు మీద శిష్య వరున కెపుడు;
ఉభయులకును తేజ ముజ్వలోజ్జ్వల మౌను;
అది జగద్ధిత మగు యజ్ఞ చర్య. 12

అవని కవలి వెలుగు - నవ నవోన్మేషమై
శిష్య గుండె లోన - చేరుచుండు;
శిష్య - డెవడు ? జ్ఞాన జిజ్ఞాస కలవాడె !
సహృదయ ప్రవరుడు - సజ్జనుండు. 13

కొంత మిగిలె - నేడు - గురుభక్తి ప్రజలలో;
కలి యుగాన గూడ - కానిపించు
పరమ పావనమ్ము - గురుభక్తి బ్రదుకులో;
దివిని- భువికి కొంత - దింప గలదు. 14

గోచరింప వచ్చు - గొప్ప సిద్ధాంతముల్;
పుస్తకాలలోని పుటల నిండ;
అల్ప విషయములను అపవాదములతో గూడ
శిష్య మేలు గోరి చెప్పు - గురువు 15

స్వచ్ఛ మైన ప్రేమ - ఛాత్ర వర్యున కుండు;
గురు వరేణ్యు మీద - ధరణి లోన,
మెదడు విప్ప జేయు బ్రదుకులో - గురు భక్తి
కలుగ జేయు కర్మ - కౌశలమ్ము. 16

స్వానుభవము గూర్చు జ్ఞాన లేశము గూడ
దీర్ఘ సాధకమగు - తెలివిడి గద;
వెన్న పూస చేసి - విజ్ఞాన మందించు,
తర తరాల వెలుగు తరచి - గురువు. 17

ఔరసుండు కంటె - అధ్యాత్మ పుత్రుడే;
శిష్యవరుడు - అరయ - శ్రేష్ఠ తముడు,
అంతరాత్మ గొప్ప దరయ దేహము కంటె;
వెలుగు - శిష్య హృదిని -వెల్లి విరియు. 18

ప్రాణి హింస - జంతు బలి గొప్ప తప్పైన
గురుని పాద పూజ గొప్ప దౌనె?
పుట్ట లేదు గురువు బోధ - పాదాలలో!
పాద పూజ - గురుని పతితు చేయు. 19

స్వీకరింప వచ్చు శ్రీ పాద తీర్థమ్ము
చేరి గురువు గారి శిష్య వరులు,
ఒక్క శిష్యుడు తిను ఉచ్ఛిష్టమును పూని;
వేయ వచ్చు భక్తి వెఱ్ఱి తలలు. 20

శిష్యు డెవడు ? భక్తి జిజ్ఞాస కలవాడు;
అహము విడిచి పెట్టు ఆర్ద్ర హృదుడు,
వెలుగు వెదకు కొరకు - నిలుచు తోడుగ సదా ;
పరమ గురుడు - శిష్య వరుడె - సుమ్ము! 21

బండ రాయి నగుచు - పడి యున్న నను దీసి,
శిల్పి దేవ - నీవు చెక్కినావు;
శిలను నాడు - నీదు ఉలి పోటుచే , నేడు,
రమ్య మైన - గొప్ప ప్రతిమ నైతి. 22

ధరణి మీద దొంగ గురువు లున్నారహో !
చేర దీయ గలరు శిష్య వరుల !
పెట్ట వద్దు - మనసు - పృథివిలో తాకట్టు
ఎవరి వద్ద నైన ఎప్పు డైన. 23

అవని లోన - అన్ని అనుబంధముల లోన,
స్వార్థ లేశ ముండ వచ్చు కొంత,
పరమ పావనమ్ము - గురువుపై గల భక్తి
అవని కవలి వెలుగు అందు కలదు. 24

జ్ఞాన సిద్ధ మైన - సచ్చిదానందమ్ము ,
గురువు గారి కనుల గోచరించు;
క్రాలు చుండు- తెల్ల గడ్డమ్ము గుబురులో
అర నట్టి అవని కవలి వెలుగు. 25

సర్వ సంగ రహిత సన్న్యాసి యెవ్వడో
జగతి మిథ్య యంచు చాటుగాత!
నీతి నియము నిరతి నేపథ్యములు లేక
సాగు బెట్టు జగతి క్షణమె యైన. 26

ఎవతొ జనని కనును - నవ మాసములు మోసి,
పెంచి తండ్రి యెవడొ పెద్ద చేయు,
బ్రతుకు లోన - కష్టపడి గొప్ప వ్యక్తియై;
కొడుకు వోలె - ఒకడు గురుని కొలుచు. 27

తాల్చ లేడెవండు -ధర - జగద్ గురు పాత్ర;
బ్రదుకు లోన అహము ముదుర కుండ;
చేరి గురువు దరికి శ్రీపాద తీర్థమ్ము
స్వీకరింప రాదు - శిష్యు డెవడు. 28

శిష్యు డెపుడొ - జ్ఞాన శృంగాటకము నందు,
చేరి -నిలిచి - తేరి పార జూచు;
గురువు చూప గలడు -సరియైన మార్గమ్ము
శిష్యు డపుడు గమ్య సీమ చేరు. 29

కూర్మి పేర్మి యందు - కొడుకు కంటెను గూడ,
శిష్య వరుడె మిన్న - జీవితమున;
ధరణి పైన - గురుని ధర్మ సందేశమ్ము
త్యాగ నిష్ఠతోడ - వ్యాప్తి చేయు. 30

గురు వటంచు ఒకని గొప్ప చేసెడు వాడు,
స్వేచ్ఛ కోలుపోవు - జీవితమున;
మేలు చేయదగును - మేధావి కనుపింప
బానిస యయి ఏల బ్రదుక వలెను ? 31

విద్య అనిన మేలి వినయమ్ము బ్రదుకులో,
అహము లేని గురువు లవనిగలరె ?
సహజ వినయ ముండు - ఛాత్ర సంతతు లందు;
గురువు కంటె - శిష్య వరుడె మిన్న. 32

చేర దీసి నట్టి - శిష్య సంతతి కెల్ల,
గురుడు కూర్చవలయు కొంత ఆస్తి;
ఆస్తి కంటె గూడ - ఆలోచనలు మేలు,
అమృత మయము లైన - అక్షత లవి. 33

గొప్పతనము తోడ - కొన్ని లోపము లుండు,
గురువు లందు తరచు ధరణి మీద,
శిష్యు లనెడి వారు - చిత్త శుద్ధిని గల్గి,
వెలుగు వెదకు నట్టి వెఱ్ఱివారు. 34

గురువు మీద భక్తి - పరమ సత్యము సుమ్ము
పరమ సుందరమ్ము - పరమ శివము;
సృష్టి శిల్పమునకు - శిఖరాయమానమ్ము
గురువు - శిష్యు మీద బరపు ప్రేమ. 35

సహృదయ హృదయమ్మె - జ్ఞానార్జనము నందు
కవిత యందు సకల కళల యందు;
అరసి చూడ - కేంద్ర గరిమ నాభిగ తోచు
గురువరుడు నిమిత్త గోచరుండు. 36

ఉచిత సతత సత్ర యోజనా యాగమ్ము
శిష్య వరుల గూడి చేయు - గురువు
ప్రగతి జగతి - నిత్య పాథేయమును చేర్చి
క్రొత్త ప్రొద్దు పొడుపు గూర్చు - గురువు. 37

కేవలమ్ము - గురుని క్రీనీడ కారాదు,
శిష్యు డనిన బానిసీడు గాదు,
అవని లోన - గురువు - ఆలోచనలు పెంచి
వెల్లి విరియ జేయు వెలుగు జిలుగు. 38

☆ మెదడులోన పెట్టె -మేటి చక్కిలి గింత
గొప్ప కవితయంచు చెప్పరాదు;
గుండె లోపల సుడి గుండముల్ చేకూర్చి
పాడ వలెను - కవిత - ఏరువోలె.

☆ ఉండవచ్చు - పొదుగు నిండ - గోవుకు పాలు,
పిండువాడొకండు - ఉండవలయు;
చాటి చెప్పగలుగు - సహృదయుండె లేక,
కవిత యెట్లు ప్రజల కడకు చేరు ??

# మెదడు

గొప్ప దనము తెలుపు కొలబద్ద యేదయా ?
పదవి కాదు మేటి చదువు కాదు
విద్య నలుపు విశ్వజిద్యాగమా ? కాదు.
పొంచి మంచి స్వీకరించు - మనసు. 1

అన్ని సౌఖ్యములకు ఆలవాలము భ్రమల్ !
మిథ్య యేది జగతి తథ్య మేది ?
వ్యసనములకు సాటి ఆనందమే లేదు
మనసు మూల హేతు వనుభవమున. 2

చేర వచ్చు దూర దూర తీరాలనే,
పడవ కెట్లు తెలియు కడలి లోతు!
బ్రదికి యుండ వచ్చు - వసుధపై నూరేండ్లు!
నరుడు - మెదడు లోతు నరయకుండ. 3

వేల కొలది పేర్చి - విజ్ఞాన పుస్తకాల్
నరుడు చదువు - సార మెరుగ కుండ!
మెదడు - సరుకు దాచు - గది చేయగ నేల ?
చిన్న పూల తోట చేయ దగును. 4

ఆత్మ హత్య కూడ! ఆనంద మొనగూర్చు
సంతసమ్ముగొలుపు శత్రు హింస!
తెలియ రాదు మనసు తీరు తెన్నుల నెల్ల !
బంధ మోక్షములకు సంధి - మనసు. 5

వింత వస్తు వేది - విశ్వ శిల్పము నందు ?
మనిషి మనసు సృష్టి మణి మకుటము;
లోతు గలది - ఎంచ - పాతాళమున కంటె,
మించు ఎత్తు నందు -మింటి కొనను. 6

మనిషి మెదడు గూర్చి మన పరిజ్ఞానమ్ము
పరిమితమ్ము - నేటి ధరణి లోన !
అరయ - భావ వృత్తి - కెరటమా ? కిరణమా ?
వెడలు మనిషి మెదడు విడిచి పెట్టి. 7

ఏది హెచ్చు ఎత్తు - ఎవరెస్టు శిఖరమా ?
అంత కంటె ఎత్తు ఆకసమ్ము;
ఏది హెచ్చు లోతు - ఏ సముద్రము కాదు!
ఎత్తు లోతు లందు హెచ్చు - మెదడు. 8

సరుకు లెల్ల పేర్చు - ఇరుకు కొట్టము గాక
మెదడు - మేడ మీద మేడ యగుత !
వరుస సొంపు గలిగి - వస్తు జాగృతి గల్గి,
గాలి వెలుగు తిరుగు గదులు గలిగి. 9

విలువ గట్ట రాదు - తెలివి తేటల బట్టి;
చదువు బట్టి - పెద్ద పదవి బట్టి,
మంచి మనసు ఉన్న మనిషి యైనను చాలు;
సృష్టి శిల్ప దివ్య శిఖర మతడు. 10

ఏది తెలియ రాని దీ సర్వ జగతిలో
నరుని లోని మెదడు పరిధి గాక ??
సృష్టి వేరు చోట - చేతనా సంక్లుప్తి
ఇంత వరకు కానుపింప లేదు. 11

తెలియగవచ్చు ఖగోళము
తెలియును శాస్త్రముల తీరు తీయము లెల్లన్,
తెలియును కళలను - మనుజుడు
తెలియడు గద తన మనస్సు తేటగ సుమతీ ! 12

కొండ లెక్క గలరు - గుడి గోపురము చూడ,
గ్రుంకు లాడ గలరు కొలను చేరి
ఎవరు కొలువ గలరు ? ఎత్తు లోతుల నెల్ల
చాలు స్థూల దృష్టి జనుల కెపుడు. 13

వెదక గలదు - విశ్వ విశ్వాంతరాళమ్ము
వెల్లడించు కళలు విద్య లెల్ల?
మనిషి మెదడు - మహిత మహిమాన్వితము సుమ్ము!
సృష్టి కపర సృష్టి చేయ గలదు. 14

చిత్ర చిత్రమైన సృష్టి శిల్పము నందు;
మనిషి మెదడు గొప్ప మహిమ గలది;
ప్రగతి అభ్యుదయము - భగవత్ కృపలు గావు,
నరుడు మార్చ గలడు ధరణి నెల్ల. 15

దివ్య దృష్టి యుండి - ధీశక్తితో నిండి,
మేటి కనులు గలవు మెదడు లోన ;
అరలు కోట్ల కొద్ది - అలరారు మెదడులో !
నరుని మెదడు లోతు లరయ లేము. 15

మనిషి తోలు కనులు మాత్రమే చూచునా ?
దృశ్య తతులు గోచరించు కలల;
మేటి కనులు గలవు - మెదడు నందున గూడ!
గొప్ప చూపు - హృదికి గూడ కలదు. 16

☆పొంగి పారలి - ప్రాచ్య సంగీత రసఝరుల్
చిందు నవ్యనాద బిందు లయలు;
వాయు   న మసలు పాశ్చాత్య జంత్రమ్ము
లీనమయ్యె విశ్వగాన విద్య.

☆శారదా మణితము - సాహితీ సంగీతి
తెలియకుండగా ప్రతిధ్వనించు;
వ్యాఖ్య చేయ లేమా - వాచ్యార్థములు వేరు,
చదల పక్షి వోలె శబ్దమెరుగు.

☆ఆంగ్ల భాష - కలిపె - అమెరికా ఇంగ్లండు
కడలి వేరు చేసెగాని - అపుడు
ఇపుడు - కడలి - కలుపు ఇంగ్లండు నమెరికా
అరయ - వేరు చేయు - నాంగ్ల భాష.

# నిద్ర

తుష్టి మానసమున - పుష్టి - దేహమ్ములో,
నిదుర కూర్చ గలదు - నిత్య సుఖము ;
పారద్రోలి నిద్ర పైత్య ప్రకోపమ్ము
పరమ శాంతి నిచ్చు - బ్రదుకు నందు. 1

అంత రంగమునకు - శాంతి కూర్చును నిద్ర,
మేలు చేయు అవయవాల కెల్ల;
అభ్యుదయము ఆయురారోగ్యముల కూర్చు;
నిత్య సుఖము నిద్ర నిత్య శుభము. 2

వదలి పెట్ట వచ్చు - బంధు మిత్రుల నైన,
దార సుతుల నైన - ధనము నైన!
వదల వచ్చు పదవి - వదల వచ్చును తిండి !
వదల రాదు - నిదుర - బ్రదుకు నందు. 3

బ్రదుకు లోన చేయ రాదు నిద్దుర మాని
ఎట్టి పనిని గాని - యెవ్వ రైన
అమర జేయు - నిదుర ఆయురారోగ్యముల్
చదువు మేలు గాదు నిదుర కంటె. 4

••••••

# లంచావతారం

లాభ మొంద వచ్చు - లంచాల మూలాన
పుచ్చుకొనెడి వాడు - ఇచ్చు వాడు !
ఉభయ పక్షములకు - ఉత్సాహమును గూర్చు
అణగియుండు లంచ మందు సేవ! 1

బ్రహ్మ విష్ణు రుద్ర రథము లైనను గాని
కందె నూనె లేక - కదల లేవు ;
ఎంచి సమయమునకు లంచమ్ము నిచ్చుచో!
కాళ్ళు లేని ఫైళ్ళు - కదల వచ్చు. 2

లంచ మెత్తు చుందు - లక్షావతారముల్!
మనుజ మాత్రులకును ధనము చాలు,
చాలు పండితునకు శాలువా కప్పుటే ;
చాలు - వినయ వందనాలు - కవికి. 3

కాంచనాలు వెండి కంచాలు కట్నముల్
పెండ్లి రోజున చదివించవచ్చు,
బారసాల నాడు బహుమానముల నివ్వ
లంచ మనరు ఎవ్వ రెంచి చూడ !! 4

చీర పెట్ట వచ్చు - చెల్లె లంచును పిల్చి
ఆడ దైన యెడల - ఆదరించి;
భర్త పిరికి యైన - భార్య కిచ్చుట మేలు:
చేర వచ్చు దొడ్డి దారి సులువు. 5

బ్రతుకు - నీతి గలిగి - పరమ మూర్ఖుడు గూడ,
గాను గెద్దు వోలె గడుప వచ్చు
ప్రతిభ చూపి నపుడు బ్రతుకు వెన్నెల లీను;
లంచ మనిన గొప్ప లలిత కళయె . 6

ఆడ వచ్చు పేక - అధికారి క్లబ్బులో,
ఆడు - కార్యశూరు డతని చేరి.
ఇచ్ఛికముగ - ఓడి - అందించు విత్తమ్ము!
పరిచయమ్ము వలన పనులు జరుగు. 7

రచయిత కధికారి కుచిత సన్మానమ్ము
గుప్త సహృదయుండు కోరి కూర్చు;
సాహితీ కళార్ద్ర సంస్కార వేదిపై!
తెర మరుగున పనులు జరిగి పోవు. 8

☆ చరిత రచన - ఖండ సత్యాల సంక్రాంతి
వ్రాయు వాని పైత్య రసము చేరు!
నవల లందు - కల్పనా కథానికలందు
మారు రూప మందు మణగు - నిజము.

☆ కలవు వివిధ ధర్మములు జీవితమ్ములో!
స్వీయ హితము మరియు విశ్వ హితము !!
విడువ - చిన్న పరిధి - పెద్ద వృత్తమునకై
పరమ ధర్మమగును - బ్రదుకునందు.

# నగ్న దృశ్యాలు

ఏల పుట్టినాను ఈ ధరిత్రిపై నేను ?
స్వార్థ పరుడ నగుచు బ్రతుకు చుంటి;
తక్కువ పని చేసి -ఎక్కువే జీతమ్ము
సేకరించు క్షుద్ర చింతతోడ. 1

అంట్లు తోము చుండు అమ్మాయి మా యింట,
అల్ప జీతమునకు అలుక లేక;
సంతకాలు పెట్టి ఎంతొ ఆస్తిని గూర్చె;
ఇంజనీరు ప్రక్క యింటివాడు. 2

రాళ్ళు మోయు నొకడు - ఇళ్లు కట్టుటకునై
కూలివాని చెమట గాలి ఆర్చు;
అతని క్షేమ మెట్టు లరయు నా గృహమేధి?
అప్పు చేసి ఇల్లు నతడు కట్టు. 3

☆ నేలవిడిచి సాము ! - నిర్మింపగానేల ??
చదలపై 'త్రిశంకుని నగరి' ?
ధరణిపై పెక్కు జనుల - దారిద్ర్యమున మ్రగ్గ
కరుణలేని వెఱ్ఱి ఖర్చులేల ?

# సెలవలు

విరుల తావి - సెలవు విశ్రాంతి యానముల్;
ప్రజల కవసరమ్ము -బ్రదుకు లందు;
నరులు మసల నేల? - నాల్గు గోడల మధ్య?
ఇంటి లోన - మనసు - కుంటు వడచు. 1

సెలవు లనుభవించు తెలివి - ఎందరి కబ్బు ?
అది ఒక లలిత కళ - బ్రదుకు నందు;
కోరిక విడనాడు - తీరికే - విశ్రాంతి;
ఇల్లు వదిలి పెట్టి వెళ్ళ వలయు. 2

పెట్టు పాఠశాల -విద్యా విహీనుండు !
తెలివి గలిగి లాభ దృష్టి గలిగి,
చీర ఖర్చు రాని జీతమ్ము గైకొంచు,
పనిని చేయు నచట పంతులమ్మ. 3

బ్యాంకు నిధుల పెంచు - వ్యాపారి యున్నాడు,
కలదు మేటి మేడ - కలదు కారు
అతని నీడ నిలిచి - అతని సేవకు వెళ్ళి,
బ్రతుకు చుందు రతని బానిసలుగ. 4

శిశువు చెట్టు క్రింది చిన్న ఉయ్యాలలో
నిదుర చెందు చుండు కదలకుండ
ప్రక్క చేనిలోని పైరు నాటును తల్లి
భాగ్యవంతుబిడ్డ బ్రతుకు వేరు. 5

ఏల జన్మ లోన ఇన్ని వ్యత్యాసముల్
జగతి మనుజులందు - సమత యేది ?
ఏమి చెప్ప గలము ? ఇది ధనస్వామ్యమ్ము.
అంతరించు గాక - ఆస్తి హక్కు. 6

# పసిపాప

వయసు మళ్ళి గూడ - పసిపాప హృదయమ్ము
గొప్ప వాని లోన - కొంత మిగులు;
కోమల హృది కంటె - గొప్ప దేదియు లేదు!
విశ్వ శిల్ప మెల్ల వెదకి చూడ. 1

వదల కున్న - మనిషి - పసిపాప హృదయమ్ము;
వయసు మళ్ళి గూడ - బ్రదుకు నందు;
పతిత పావనుండు - ప్రతిభా పరంజ్యోతి,
ధరణి నిలిచి వెలుగు స్థిర తటిత్తు. 2

సరళ సరస సతత సచ్చిదానందమ్ము
బాల చిత్త సీమ ఓలలాడు;
ఆ అమాయక హృదయము పెద్ద వారిలో
ఒక్క శాత మైన ఉన్న - చాలు. 3

వయసు మళ్ళ వచ్చు - పసిపాప డెందమ్ము
కొంత మంది కుండు - కొంత మేర;
తెల్ల జుట్టు తోడ - తెల్ల మీసములతో,
ఆడగలరు వారు పాడగలరు. 4

బ్రదుక గలుగు నెడల - పసిపాప రీతిగా
మాన సాంతరముల మానవుండు,
బొందె తోడ అతడు పొందు - జీవన్ముక్తి!
ధన్య జీవి అతడె ధరణి లోన. 5

## భావాలు

నీరు తడుప లేదు - నిప్పు కాల్చగ లేదు
అణచ నేర వెట్టి ఆయుధాలు;
సంహరింపబడవు - జగతిలో భావాలు ;
పైకి లేవ గలవు - బంతి వోలె. 1

నిలిచి యుండు - భావముల్ చిరంజీవముల్,
బుద్ధ దేసు గాంధి పుడమి లేరు,
బోధ - బ్రదికి యుండు - మేధావి మరణించు,
భావములకు ఎపుడు చావు లేదు. 2

వదలి పెట్టు - గొప్ప భావమ్ము జగతిలో,
గరుడ పక్షి వోలె గగన మందు;
గ్రుడ్లు పెట్టు చుండు - గుండె గూడులు కట్టి,
మనుజ జీవితములు - మార్చి వేయు. 3

బ్రతికి యుండ గలవు - భావాలు జగతిలో
మరణ మొందు గాని - మానవుండు;
సామ్య వాద సంఘ సంక్షేమ భావాలు,
మరణ మొంద లేదు మార్క్సు తోడ. 4

## ఏబదేండ్లు

ఏబ దేండ్ల పైన - ఏకానురాగమ్ము
ఇరువు రందు మైత్రి పరగె నేని ,
అమరి యుండు - వారియందు దివ్యత్వమ్ము!
వారి దర్శనమ్ము పావనమ్ము. 1

# నాటకాలు

వీను దోయి కంటె - విశ్వాసమును గూర్చ,
మనుజ జగతి లోన - కనులు రెండు,
శ్రవ్య కావ్య శక్తి చాల తక్కువ సుమ్ము
నరులు మెచ్చ గలరు నాటకమ్ము.

పద్యమునకు మరల ప్రాణాలు పోశారు
నాటకాటల నాడి నటులు నాడు,
మారు మూల పల్లెటూరిలో ప్రజ కూడ,
మధుర పద్య కవిత మరగినారు.

కలము కదిపి వ్రాయ గలడు పద్యము లెన్నొ,
కంఠ మెత్త లేడు - కవి వరుండు,
నటుడు - ఆలపించు నక్షత్రములు రాల!
భావ రాగ భరిత పద్యములను.

వ్రాయు - మూగ అక్షరాల్ పేర్చి పద్యమ్ము
కవి వరుండు - భావ గర్భితముగ;
పాత్రధారి పాడు - స్వరము జంత్రము గల్పి,
మేటి కళల కూర్పు - నాటకమ్ము.

పద్యమునకు దివ్య పరివేషమును గూర్చె
రాగ రంజితముగ రంగభూమి;
తెలుగు పద్య కవిత - దిగ్ దిగంతము లందు,
మారు మ్రోగ చేసినారు - నటులు.

రక్తి కట్టు చుందు రంగస్థలము పైన,
వీను దోయి కెపుడు విందు కూర్చి
మనసు తెరల నెత్తి - కనుల పండువు చేయు
కాళనమ్ము చేయగలదు - గుండె.

అంద చంద మొలుకు ఆహార్యములు చేర్చు,
రంగు రంగు తెరల హంగు కూర్చు
జంత్ర వాద్య బృంద సహకారములు నిల్పి
చాక్షుష మగు యజ్ఞశాల గూర్చు.

వెలువరించు - పెద్ద నిలువుటద్దము పట్టి,
ప్రస్తరించి చూపు - బ్రదుకు నెల్ల !
వెల్లి విరియ జేయు - వేదాంత విశ్రాంతి,
ఆట విడుపు తోడ - నాటకమ్ము

ఆంధ్ర పద్య కవిత - అమృత మాధుర్యముల్,
చెప్పి - ఎవరు ఋజువు చేయగలరు ?
కంఠ మెత్తి - నటుడు - గాంధర్వ గగనముల్,
అందచేయు శ్రోత లందరకును.

# తిమ్మరుసు స్వగతం

ఎవరను నేను?? - నన్నిపుడు ఎవ్వరు గుర్తును పట్టలేరుగా!
చివరకు చూడ నేనొక సజీవ సమాధిని - వింత గాథలన్,
వివర మెరుంగగా ప్రజకు వేడుక యుండు - వినుండు శ్రద్ధగా,
అవనికి భారమం చెరిగి, ప్రాణము వీడగ లేని - అంధుడన్.

హృదయము రాయి చేసుకొని - ఈ ధరణిన్ గతియించి నట్టి నా
బ్రదుకును విస్మరించగల ప్రజ్ఞ గణించుటకై శ్రమించెదన్;
బ్రదికెద - గ్రుడ్డి పెద్దపులి వాటముగా అటవీ తటమ్ములన్;
బ్రదికెద - నిత్య నూతన పురాణ చరిత్ర సజీవ పాఠమై.

ప్రాజ్య విజయనగర రాజ్య మంత్రిని నేను;
తిమ్మరుసు పేరు తెలియు ప్రజకు;
మేలు కొలిపి ప్రజల - ఏలు కొంటిని నాడు;
నేడు - గ్రుడ్డి పీన్గు - నిల్చె నిచట.

నాకు ఆజ్ఞ యొసగె - నరసింహ రాయండు ;
తీసి వేయ కృష్ణదేవు కనులు !
పీకి చూపి నాను - మేక కన్నులు రెండు,
నాకు - బెడిసి కొట్టె - మేక ఉసురు.

తిమ్మరుసువె, నిజము తెలివి తేట లటంచు;
వినుతి చేసినారు - విజ్ఞు లెల్ల;
కలిసి రాని యపుడు - కాలమ్ము - బ్రదుకులో,
మనిషి తెలివి సుంత పనికి రాదు.

మన్ను మిన్ను - నేను - మంత్రినై యుండగా
కన్ను లుండి గూడ - కాంచ లేదు.
పోయె రెండు కనులు - భూకాంతు నాజ్ఞచే,
నాడు - నేడు - గ్రుడ్డివాడ నేను.

చిన్న నాడు - నన్ను చేరి నాశిరముపై
పడగ విప్పి, త్రాచు పాము - ఆడె,
కానబడని యట్టి - కాల సర్పము - నేడు,
నన్ను కాటు వేసె - కనుల మీద

మంద మంద దీర్ఘ మరణ యాతన గదా !
నయనములను విడిచి - నరుడు బ్రదుక,
జీవితమ్ము చిరము - చిమ్మ చీకటి పాలు;
అరయ - మేలు - శీఘ్ర మరణ శిక్ష.

నీ కందోయికి రక్ష గూర్చితిని , నిన్ సింహాసనంబందు ప్రే
మైకైకాగ్రత నిల్పినాను - జన కళ్యాణోత్సవాపేక్షతో;
నా కందోయిని పీకినావు - వికట న్యాయాను సంధాతవై;
లోకుల్ నాటక సన్నివేశ గతి ఆలోచింప వచ్చున్ సదా.

మెప్పుల్ గొప్పగ నీకు కూర్చితిని - నీ మేల్ గోరి ధీయుక్తి నీ
తప్పుల్ దిద్దితి - కృష్ణరాయ వసుధాధ్యక్షా ! సభా వేదిపై;
అప్పాజీ యని సత్కరించితివి ఆహ్వానించి - ఏర్ దాటి ఆ
తెప్పన్ కాల్చెడి రాజనీతి చతురా ! ధీశాలి వీవే గదా!

" గుత్తిన్ పుల్లెలు కుట్టి - చంద్రగిరిలో కూడెత్తి - పెన్ కొండలో
హత్తిన్ సత్రము నందు వేడి- పలు దుర్గాధీశు తాంబూలపుం
దిత్తుల్ మోసిన " కాలమున్ మరచిపోతిన్ మంత్రినై - నేడు నా
చిత్త క్షోభము ఉప్పెనైనదిట - దిక్ సీమాంతముల్ ముంచుచున్.

ఉద్రేకమ్మున ముందు కేగు టనినన్ యుద్ధమ్ములో - మంచిదే;
భద్రాసక్తి ప్రశాంత బుద్ధులు సదా పాలించు రాజ్యమ్ము - ని
ర్నిద్రాలోచన నిత్య జాగృత మతిన్ సేవించితిన్ నిన్ను - యా
వద్రాజ్యమ్మును - శాంతి భద్రతలతో వర్ధిల్ల నెల్లప్పుడున్.

ఉండు - దేహమునకు రెండు కన్నులు గాని;
మెదడు కుండు - వేయి మేటి కనులు !
ఉన్న - రెండు కన్ను లుద్రేకమున పోవ,
మెదడు కనులు రాజ్య మేల గలవు.

ఖడ్గ శక్తి వేరు - కార్య సాధన వేరు;
ఉభయ శక్తు లుండ వొకరి యందె;
కత్తి విరుగ వచ్చు - కదన రంగము నందు,
బ్రదుకు నందు మెదడు పదను పోదు.

అధికారమ్ము సమస్తముల్ నిలువ - కేంద్రాధార బిందూద్ధతిన్,
విధి సూత్రమ్ములు లేక యున్నను వృథా వేదల్ ప్రవర్తిల్లవా ?
అధిగమ్యంబులు లేక యున్న - సరళ న్యాయమ్ము చేకూరి - ఇం
క ధరా పాలన సాగునా ? ప్రజలకున్ కళ్యాణ పేయమ్ముగా.

చేటు - రాజ శిశువు సింహాసనము నెక్క;
అయిన నేను రాజహంత గాను;
శిక్ష వేసె నాకు - శ్రీ కృష్ణ రాయండు;
పుత్ర మోహవర్తి - బుద్ధి లేక.

తనకు పైన చేరి పని చేయు దొర తోడ,
ఇచ్చకములు వదిలి - హితవు పలుక;
అవని మీద - క్రింది అధికారి ఒకడైన,
కలి యుగాన పుట్టు గాక మరల.

వాచ్యము చేయ తప్పదిక - స్వార్థముతో తన బాల పుత్రకున్;
నైచ్యము మీర పూని నరనాథుని చేసెను తాను మంత్రియై!
శోచ్యము - కృష్ణరాయ దరిసూదను డట్టుల సేయ - నేడు - శ్రీ
అచ్యుత దేవ రాయల జనాధిపు చేయుట రాజ నీతియే.

హితము - ప్రధాని నొటను వచించితి - రాయల వారు నాకు స్నే
హితు డని నమ్మినాడను - మనీషి వివేకిగ దేశభక్తితో,
బ్రతుకును తీర్చి దిద్దుకొను వాడని యెంచితి - శీఘ్ర కోపియై
మతి చెడిపోయి నా కనులు మాప విధించెను నాకు శిక్షగన్

ప్రభువు - పట్ట పగలె - రాత్రి యంచును పల్క;
కొలువు వారు - కాదు కూడ దనరు;
"అవిగొ- అంబరమ్ము నందు నక్షత్రముల్ !!"
అనుచు కొంత మంది అరవ వచ్చు.

ప్రియము పలుకు వారు - పృథివి కోకొల్లలే !
బొంకె యైన జంకు గొంకు లేక;
పథ్య మప్రియమ్ము పలుకు వారలు లేరు;
వినెడి వారు లేరు ! జనుల యందు.

కత్తి త్రిప్ప గలడు ఘంటమ్ముతో పాటు ,
కాంచ గలడు పగటి కలలు పెక్కు;
చదువ లేదు మనుజ హృదయాలు బ్రదుకులో!
గ్రంథ కీటకమ్ము - రాయ విభుడు.

గజపతి పైన - నెగ్గ నవి - కత్తి కటారుల ? వాజినాథుపై
భుజబల శౌర్య మెట్లు సరిపోవు? యథోచిత రాజనీతిలో
విజయము శక్తి యుక్తులకు వియ్యము గూర్చెడి గొప్ప లౌక్యమే !
ప్రజ లిక కోరుకొందురిట రాజుగ అచ్యుత దేవరాయలన్.

శీఘ్రకోపి గాని శ్రీ కృష్ణరాయండు,
కాడు - తెలివి లేనివాడు గాడు;
పచ్చి శిశువునకును - పట్టాభిషేకమ్ము
కట్టు టనిన - ముదిరి నట్టి పిచ్చి.

రాజు కంటె గూడ - రాజ్యమే ముఖ్యమ్ము;
రాజ్య మనిన నేమి ? ప్రజలె గాక ?
నాడు - నేడు - మీరినాడ - రాజాజ్ఞ నే;
ప్రజల కొరకు - రాజ్య రక్ష కొరకు.

ఏను బ్రోచినాడ - కృష్ణరాయల -నాడు;
కీడు చేసె నతడు - నేడు - నాకు;
బ్రదుకు లోని - వింత వైరుధ్య విక్రాంతి,
అనుభవైక వేద్య మయ్యె నిపుడు .

కనులు పోయె నాకు - కర్మానుబంధమ్ము;
మేక కనులు - నేను - పీకినాను,
మేక అరపు లిపుడు నాకు విన్పించుగా !
మారు మ్రోగి - నాదు మనసు నందు.

అరటి పండు మెక్కి - అలవోక మనుజుండు,
పార వేయు తొక్క - దూరమునకు,
స్వార్థపరుడు ప్రభువు - అధికారి - తెలివిగా
ప్రక్క వారి నటులె వాడు కొనును.

ఆవహమ్ము నందు - అంతఃపురము నందు;
భువన విజయమందు - కవుల గోష్ఠి;
కృష్ణరాయ విభుడు - క్రీడించగా గల్గె;
ఏను - రాచ కార్య మెపుడు తీర్చ.

ధరణి రక్తి కట్టు - పరిపాలనము నందు;
పనులు - తగిన వారు పంచుకొనిన,
ప్రతిభ యుండ దన్ని పనులలో - ఒకరికే,
చూడ అవసరమ్ము - సూత్రధారి.

విజయనగర మందు - వివిధాంశముల - నేను,
సూత్రధారి నగుచు చూచినాను;
నిష్క్రమించినాడ - నేడింక రాజ్యమ్ము,
దారము తెగి నట్టి హార మగును.

మింటి నంటు మేటి మేడ మిద్దెల లోన,
చుట్టు గుడిసె లోన - సుఖము లేదు !
సతత శాంతి సస్య సంపన్నుడె రైతు,
బ్రదుకు నందు మిన్న - రాజు కంటె.

న్యాయము చూడ లే దెపుడు వ్యక్తికి - తీర్పును చెప్పితిన్ ప్రజా
శ్రేయము కోరి - భోగ కుల వృత్తికి క్రొత్తగ పన్ను వేసి, ఆ
దాయము పెంచిబొక్కసము దండిగ నింపితి - నీతి వీడి - నా
ధ్యేయము రాజు లాభమె మదిన్ - మరి పాపము కాటు వేయదే ?

నాటకీయ గాథ - నన్ను చూచిన చాలు,
ఎల్లరకును తేట తెల్ల మగును;
విశ్వ చరిత లోని - విధి వైపరీత్యమ్ము,
కాంచ వచ్చు రెండు కనుల ముందు.

కనుల తోడ పోయె - ధనము సర్వము గూడ,
వస్తు లుండ వలసి వచ్చె, కాన,
అమ్మితి - తిరుమలను - అన్న ప్రసాదమ్ము
శంకర మఠమునకు శరము విడిచి.

బ్రదికెద కొంత కాల మిక ప్రాణము తోడ - సజీవ పారమై !
చదువుడు నన్ను జేరి జన సంతత లెల్లరు - కంటి నీరు కా
ర్చదగదు - ఎవ్వ రైనను , పరాత్పరు శక్తిని మార్చలేరుగా !!
పదవి గతించి నంత - ప్రతిభా ప్రభ - తత్క్షణ మంతరించెదున్.

శ్రీనివాసు దరిక్ - శేముషీ ప్రభ పోవ,
చిట్ట చివరి కేసు చేరినాను;
శాంతి నిడదు కర్మ; జ్ఞాన యోగము - భ్రాంతి!
జీవితమున - భక్తి శిఖర సమము.

# అంపశయ్య

## కర్ణుడు

జగదేక వీరుడు - భీష్మాచార్యులవారికి - రాధేయుడు కర్ణుని అభివాదములు.

మాననీయ ! నా నమస్కృతుల్ · గొను మయ్య;
చేరినాను పాదచారి నగుచు;
ధరణి వ్రాలె - పసిడి తాళ వృక్షము నేడు;
విస్మయాన మునిగె విశ్వ మెల్ల.

అంప శయ్య - స్థిర శంపాలతిక వోలె !
నేడు చేరి యున్న వాడ వీవు :
భక్తి తోడ - పూజ్య పాద ! నిన్నర్చింతు,
అందు కొనుము - నాదు వందనములు.

వీక్షింపం గద వయ్య నన్ను .సదయాపేక్షార్ద్రతన్ - నేడు యో
గ క్షేమం బరయంగ వచ్చితి నిదే గాంగేయ ! - రాధేయుడన్;
సాక్షాత్ రుద్రుండవు నీవు నిల్చితివి బో - సంగ్రామ సీమన్ - క్షమా
భిక్షా దానము సేయ వేడెద నినున్ వీరాధి వీరాగ్రణీ !

## భీష్ముడు

వీర వరేణ్యా - కర్ణ - నీకు నా స్వాగతం . నీవీ 'వాడు పాదచారివై విషాద వస్త్ర ధారివై - నా యీ అంపశయ్యకు చేరుట నీ ఔదార్యానికి నిదర్శనం. నీవు - అస్మద్ గురుదేవులు పరశురాముల శిష్యుడవు. నీవు నాకు సతీర్థ్యుడవు. నాకు - ధార్మిక సహోదరుడవు.

స్వాగతమ్ము నీకు - శౌర్యార్ణవా, రమ్ము;
కౌగిలింప నెంతు కర్ణ నిన్ను;
అమృత హృదయ ముండు - ఆవేశ పరులలో;
నమ్మ గలను - నిన్ను - నర వరేణ్య.

హస్తి పురము నుండి - హస్తి కేతనముతో,
రథము సాగ - చూచి ప్రజలు చేరి.
"జయము వీర వర్య - జయము కర్ణా యంచు"
ఆకసమ్ము చినుగ అరిచినారు.

విశ్వ చరిత లోన - విధి వంచితు డటంచు,
ప్రజలు యుగ యుగాంతరాల లోన,
ఎంచ గలరు నిన్ను - ఎన లేని ప్రేమతో !
వీర మరణ మొందు పిదప - కర్ణ.

**కర్ణుడు**

భీష్మ పితామహా!

నీవు స్వచ్ఛంద మరణ వర విరాజితుడవు . ఈ నాడు యావత్ ప్రపంచములో దీర్ఘాయుష్మంతులలో నీవు అగ్రేసరుడవు.
బ్రతికి నావు భూమిపై - చాల కాలమ్ము గొప్ప అనుభవాల గుట్ట వీవు;
చూచినావు - జగతి వైచిత్రి విభ్రమల్ !కుక్షి లోన దాచు సాక్షి వగుచు.

## భీష్ముడు

మహారథీ - కర్ణా !
నీకు నేను క్షమాపణ చెప్పుకో వలసి ఉన్నది.

అర్ధ రథుడ వంచు - అన్నాను నిను గూర్చి;
బొంకు పలికి నాడ శంక వీడి;
రణము నాపి - ప్రజల రక్షించు కోర్కితో;
సర్వ నాశకమ్ము - సంగరమ్ము.

బ్రదుకుట చేత గాని - ఒక రాక్షస మూర్ఖుడు - యుద్ధ భూమికిన్
మెదడును మూసి వేసుకొని మెట్టును రక్త పిపాసు వౌచు - తా
హృదయము రాయి చేసుకొని హింసకు పూను, ద్విపాద జంతువై ;
సదయుడె మానవుం డనిని - చంపగ జాలడు చీమ నేనియన్.

## కర్ణుడు

గాంగేయా ! జ్ఞాన వయో వృద్ధులలో అగ్రేసరుడవు. నీవు వీరాధి వీరుడవు మాత్రమే గాక విజ్ఞాని ఖనివి.

నీ నయన ద్వయిన్ వెలుగు - నిర్మల కోమల మందహాస వి
జ్ఞాన ధునీ తరంగములు - శాస్త్రముతో కళ చేరినట్లు - గం
గా నది బ్రహ్మపుత్రయును కల్సిన యట్టులు -పూరుషాకృతిన్
వాణి ధరించి నట్టులు - భవాదృశ మూర్తి ఎవండు ధాత్రిలో ?

వీర వరుడ వీవు - విద్వాంసుడవు నీవు ,
        వీను లొగ్గి వినుము - విన్నపమ్ము;
సాటి ఎవరు నీకు - సర్వజ్ఞ శేఖరా !
        కరుణ తోడ నన్ను కాంచ వయ్య.

## భీష్ముడు

భార్గవ రామ శిష్య చూడామణీ ! కర్ణా!
        నీ యుదయము దైవిక గ
        ర్భాయత్తము నీకు మర్త్యు లసమానులు - కౌం
        తేయుడవు నీవు విను - రా
        ధేయుండవు గావు - కర్ణ - ధీర విచారా!

## కర్ణుడు

మహానుభావా ! మందాకినీ నందనా!

తెలిపె సూర్యు డెపుడొ - తెలిపె శ్రీ కృష్ణుండు;
        తెలియ చెప్పె కుంతి దేవి చేరి;
బ్రదుకు నందు - అరయ రాధేయుడను నేను;
        సూత సుతుడ నేను సూరి వర్య.

## భీష్ముడు

మార్తాండ నందనా - కర్ణా!

భండన భూమిలో - రథముపై మదహస్తి పతాక మెత్తి - మా
ర్తాండ సమాన తేజమున రాజిలు చుండగ నీవు - సర్వ ది
ఙ్మండన మూర్తి - నీ వదన మండలమున్ గని నంత - ఎప్పుడో
గాండివ ధారి గూడ వెనుకంజను వేయు - ధనుష్మ దగ్రణీ !

విల్లు పట్టి నంత - వీరుండు కాలేదు !
పంది నట్టి గొప్ప గుండె లేక,
అణగ శత్రు వైన - ప్రాణాలు కాపాడు
శీలయుతుడ వీవు - జీవితమున.

భీకర యుద్ధమందు - ఎటు వీచుచు నున్నదొ గాలి ఇంతకున్;
నీకొక కొంత తెల్పినటు నే తలపోసెద - వాజులున్ భటా
నీక గజమ్ములున్ గెలుపు నీయవు - ధర్మ బలంబు వల్లనే
చేకురు నయ్య దిగ్విజయ సిద్ధి రణంబున - సూర్య నందనా!

పాండవ వీరులన్ - గెలువ వచ్చునె ? కేవల మాయుధాలతో !
కొండొక కుర్ర కుంక ఇటు కూల్చెను నన్ను శిఖండి: అండ ఆ
ఖండలసూతి యుండె గద ! కవ్వడి కండగ నుండు కృష్ణుడే,
భండన మెల్ల దిద్దు - పరిపంథి బలమ్ములు వీగి పోవగన్.

చాలును శంఖ నిస్వనము - చాలక యున్నను చక్ర పాతమే
చాలును - సర్వదా - గెలువ శత్రుల - కృష్ణుని మందహాసముల్
చాలు జయింపగా జగతి సర్వము - అతని శక్తి యుక్తి సం
చాలన మాప నెవ్వరికి సాధ్యము గాదు - ధరిత్రి లోపలన్!

### కర్ణుడు

జగదేక ధనుర్ధరా - శాంతనవా!!

నీవు కౌరవ సర్వ సేనాపతిగ దుర్యోధన పక్షాన పోరాడి యున్నావు. నీ స్వామి భక్తి - నాకు ఒజ్జ బంతి - నీవు అనుష్ఠాన వేదాంతివి గదా !

—

కదనములో సదా గెలుపు కాదు ప్రధానము - ప్రాణ మొడ్డి, నా
హృదయము పెట్టి, యుద్ధమొనరింతు - కృతజ్ఞత చూప నాకు ఈ
అదను లభించె - సంగరము యజ్ఞము నా కిక - ఎల్ల వీరులున్
బ్రదుకులు వెల్లగా తమ పరాక్రమమముల్ వెలయింప వచ్చుగా.

దైవాధీనము సర్వమున్ - మన మతిం తప్పింపగా వచ్చునే !
నీవింకన్ నను నొందు పల్కక పరానీకంబుపై పంపు - నా
సేవా ధర్మము నిర్వహించెద - బలోత్సేకమ్ము లోకంబునన్
భావింపన్ విహరించెదన్, ముర రిపున్ పార్థున్ తలంకించెదన్.

వారు మహాబలుల్ - హరియు వారికి ప్రాపుగలండు - వారలన్
పోర జయింపరామియును బుద్ధి నెరుంగుదు- ఐన కౌరవ
క్ష్మారమణుండు చేయు దగు మన్నన లెల్ల, తలంచి చూచినన్
భూరి వివేక! ఏ విడిచి పుచ్చుట ధర్మమె వీర కర్మమే ??

రాజ సుతుడ వౌచు ప్రభవించియును గూడ
సలిపినావు రణము స్వామి కొరకు;
రాజ భక్తి వరలు - నీ జీవితమె నాకు,
బ్రతుకు నందు ఒజ్జ బంతి యగుత .

## భీష్ముడు

జగద్బాంధవ నందనా ! కర్ణా !
ఇపుడు ప్రజలకు కావలసినది శాంతి. నీవు మాత్రమే సంధి చేయ
గలవు . సంధి చేసినచో- జగద్బాంధవ నందనుడవు - అక్షరాః
కాగలవు.

అంధ నృపాలు పుత్రులు దురాశులు మూర్ఖులు - కన్నులున్న మో
హాంధులు - తప్పునా అపజయంబిక ఆలము సాగినన్ ? జగద్
బాంధవ నందనా ! సకల ధారుణి నాశము చెందు ముందరే;
సంధి యొనర్పుమీ - ప్రజల సైనికులన్ పరిరక్ష సేయుమీ.

గంధవహాత్మజుండు బహు కౌరవ పుత్రుల చంపె - ఆ జరా
సంధ రిపుండు చంపెడిని శత్రుల - శాంతి నిధానుడౌ - దయా
సింధువు ధర్మరాజు - ఇక చేయుము సంధి - వివేక శేముషీ
బంధుర మూర్తి - కృష్ణ భగవానుడు తోడగు - సూర్య నందనా!

చచ్చిన వారు చచ్చినను చావక యుండెను రాజ రాజు - వి
వ్వచ్చుని ఆజి చంపగల వారలు లేరు - ధరిత్రి లోపలన్;
పొచ్చెము లేని బుద్ధి ఇక పూనుము సంధికి - ధర్మరాజు - నిన్
మెచ్చును - కట్టు పట్టమును మేదిని యెల్ల సుఖించు గావుతన్.

సర్వ నాశకరము - జగతి ఎల్లెడ - హింస ;
అభ్యుదయములకు - అమ్మ - శాంతి;
జనులు కోరగలరు - శాంతి భద్రతలనే;
రక్త పాత మెపుడు - ప్రగతి కాదు.

యావద్ భారత భూమి కాదు బహుశః యావద్ ధరిత్రీ స్థలిన్
నీవే యేలగ వచ్చు సంతతము శాంతిన్ సార్వభౌముండవై;
కావీవప్పుడు సూత సూనుడవు - ఓ కర్ణా - సుహృద్భావులై
సేవింపం గలవారు పాండవులు నిన్ శ్రీ ధార్తరాష్ట్రుల్ తథా.

ధనమె ఉన్న నరుడు - ధన్యుండు కాలేడు!
ఉండ వలయు గొప్ప గుండె కాయ;
ఎవడు ధన్యజీవి ? ఈ ప్రపంచము నందు ?
త్యాగ యోగి యైన - దాత తప్ప.

## కర్ణుడు

గంగా నందనా!
నీవు సర్వజ్ఞుడవు. వేదాంతివి. శాంతి ప్రియుడవై సంధిని కాక్షించుచున్నావు. అంతియే -

నీవు చెప్పుమాట - నిజము శాంతనవా !
నాకు సుంత యైన - నచ్చలేదు.
ఏను రాజరాజు భృత్యుండనే సదా
ఆ దురాశ నాకు లేదు - నమ్ము.

పాండవులను చేరి - పట్టాభిషేకమ్ము
పడయు మాయ దారి బ్రతుకు కంటె;
సంగరమ్ము నందు - చనిపోవ గల్గుటే ;
నాకు సంతసమ్ము - నర వరేణ్య.

## భీష్ముడు

మహారధి కర్ణా! నీవు భారత చరిత్రలో చిరస్మరణీయ యశస్వివై వెలుగొంద గలవు. నీవు ఆదర్శ త్యాగ యోగివి.

స్వామి ద్రోహము చేయ నేరవు గదా - సౌహార్ద్ర సాహిత్య శో
భా మాధుర్యమ్ములు చల్లి నావు - విశ్వం బెల్ల అగ్గింపగన్;
నీ మీదన్ స్తుతి కావ్యముల్ వెలయుతన్ - నీ కీర్తి వర్ధిల్లి - సం
గ్రామోదాత్తుడ వీవు - వీరవర - కర్ణా శౌర్య పాథోర్ణవా!

నీవు మహానుభావుడవు - నీ బ్రతు కెల్లను దాన ధర్మ శో
భావహమయ్యె! దీనజన బాంధవ ! నీ కభివందనమ్ము - నీ
జీవిత మొజ్జ బంతి ప్రభు సేవకు - భవ్య కృతజ్ఞతా ప్రియం
భావుక మూర్తి- ఏగు మిక భండన భూమికి - సూర్యనందనా!

పావకుండ నుండె  పుట్టు టౌదార్యమ్ము.
సహజ కుండలాలు పోయె గాని ,
బ్రదికి యుందు వీవె గద  చిరంజీవివై,
భరత దేశ భవ్య చరిత లోన.

త్యాగము నీ చరిత్రకును ప్రాణము - భావి తరమ్ము లెల్ల - ఉ
ద్వేగముతో పఠించు భవదీయ కథా మధురేతి వృత్తముల్;
త్యాగము నందు  నీకు సరి  యయ్యెడు వారలు లేరు - ఓ మహా
భాగ - మహానుభావుడవు భారతమందున నీవొకండవే.

త్యాగ గుణము నందు - దాన శీలము నందు;
నీకు సాటి ఎవరు నీవె తప్ప?
అవధరింప వయ్య - ధ్రువతారవే ! నీవు
అమృత సాహితీ విహాయసమున

# నృత్య భారతి

కావ్యేషు నాటకం రమ్యం
తత్రాపి నృత్య నాటికా
జంత్ర వాద్య సమారోహా
రాగ తాళ లయాన్వితా. 1

వాణి వీణ - కృష్ణ వేణు నిక్వాణముల్,
ఉరిమి నాట్య మాడు మెరపు తీగె.
శివుని డమరుకమ్ము శింజినీ లయ జతుల్,
కలిసి - నృత్య నాటకమ్ము - పుట్టె. 2

కవిత - మృదు మనోజ్ఞ గాత్ర సంగీతమ్ము,
జంత్ర వాద్య బృంద సంగమమ్ము
నృత్య నాటకమ్ము - నేత్ర, నిర్వాణమ్ము !!
రస విలాస లాస్య రంగభూమి. 3

నృత్త నాటకమ్ము - ఇతి వృత్త సుభగమ్ము,
కోమల మృదు భావ గుంఫితమ్ము;
నింగి నేల కలుపు - సంగీత రసకళా
తరళ విశ్వరూప దర్శనమ్ము. 4

రాగ తాళ లయల - ప్రస్తార యజ్ఞమ్ము
అభినయములు నాల్గు కాట పట్టు
మధుర కవనమునకు - మాణిక్య మకుటమ్ము!
నృత్య నాటకమున కేది సాటి ? 5

# " SRAMA EVA JAYATE "

**Srama Eva Jayate = Labour Alone Triumphs** is a Dance - Drama written by **Dr. Nandury Ramakrishnamacharya ,** a senior citizen, Freedom fighter and a Veteran poet in Telugu . Dr. Krishnamacharya had written many books in Telugu. Poems Dramas, one ^ act plays , Novels, short stories, Early South Indian History, a treatise on poetics and prosody in addition to Biographies of Buddha and Jesus Christ .

The books written by him in English are

(i) The Maha Bharata
(ii) The Gandhian Era. and
(iii) Mahatma Gandhi.

The latest master piece from the pen of Dr. Acharya is the Dance - Drama entitled - " Srama Eva Jayate " - he has taken the theme from the Maha Bharata. Earlier he has composed three dance dramas , Godavary, jyotsnabhisarika and Chatrapati which have been staged several times.

The criticism often levelled against the Art of dancing is that it tends to be conservative in composition as well as performance and lacks progressive idealism. But this Dance - Drama Srama Eva jayate is a bold adventure in the realm of Dance. Srama Eva jayate is an up-to-date Classic a confluence of tradition and innovation, a chemical compound of mythological mysticism and mellifluous modernism, prestine philosophy and progressive idealism. The characters are (i) The rationalist recluse sage Udanka, his daughter, an embodiment of ancient sweetness and modern light, the so called untouchable Nishada, the out east barbarian and Sri Krishna, the practical philosopher and prophet par excellence - all mythological figures ? all known as typical symbols of the hoary heritage of Indian culture. The story is old but the sentiments are new.

The sage Veda Vyasa the codifier and co- ordinator of Vedic literature is the Author of the Mahabharata and as his name implies is the symbol of spiritual symphony and is very well known for his great genius for synthesis. Vyasa the au-

thor of Mahabharata always tried to transcend doctrine and dogma to discover a common denominator of the spirit. Dr. Rama Krishnamacharya, as the author of the Dance - Drama -

Srama Eva Jayate has justified the title Abhinava Vyasa bestowed on him by his admirers.

Contemporary Indian Literature - a book published by the Central Sahitya Akademi, New Delhi, while assessing the contribution of Dr. Krishnamacharya to modern Telugu literature describes him as the key figure of the Neo - classical movement. In that book it is stated.

" In the post war world, an equilibrium has to be achieved between matter and spirit, between idealism and realism. Krishnamacharya and his fellow poets claim that they are effecting this reconciliation. The Neo - classicists are anxious to regain for poetry its dignity as the symbol of all that is beautiful and true." The Dance Drama " Srama Eva Jayate" as the caption signifies is a scintillating synthesis of classical idealism and modern aspirations.

The theme centres round dignity of labour, equality and fraternity. It is maintained in the Maha Bharata that the illiterate out - cast Nishada labourer is superior to the learned sage who was not able to rid himself of pious prejudices. It is human labour that fills the cities with roads and buildings, fields with paddy, oceans with ships, deserts with irrigation canals, ushering in plenty and prosperity.

This short and sweet Danc Drama provides ample vindicatyion form the Maha Bharata for the modern sentiments -

" Work is Worship " " Sweat is Sacred " Englishtenment is Equality". " Freedom is Fraternity ". In short, the soul of this Dance Dama is " Humanism.

**Polapragada Satya Narayanamurthy**
President - **Taruna Sahiti Samiti**

## " శ్రమ ఏవ జయతే "

" శ్రమ ఏవ జయతే " - సంస్కృత మహాభారతం లోని ఉదంక గాథ. మహాభారత సంగ్రామం పిదప , ధర్మ రాజు పట్టాభిషేకం పిమ్మట - శ్రీ కృష్ణుడు హస్తినాపురి నుండి ద్వారకకు ప్రయాణం చేసేటప్పుడు మార్గ మధ్యంలో ఎడారి ప్రదేశంలో ఉన్న ఉదంకాశ్రమంలో అభ్యాగతుడుగ ఒక దినం విడిది చేస్తాడు.

ఉదంక మహర్షి, శ్రీ కృష్ణుడు - బాల్య దశలో సాందీపని మహర్షి గురుకులంలో అంతే వాసులు. సతీర్థ్యులైన ఉదంక శ్రీకృష్ణులకు గురుకుల వాసంలో విద్యాస్పర్థ ఉండేది. ఉదంకుడు హేతువాది. ప్రత్యక్ష ప్రమాణాన్ని ఆరాధించేవాడు. అతడు జ్ఞాన యోగి. శ్రీ కృష్ణుడు - అవాఙ్మానస గోచరము అనుభవైక వేద్యమూ అయిన ఆధ్యాత్మిక తత్త్వం ప్రబోధించేవాడు. నిజానికి హేతువాదానికి ఆధ్యాత్మిక తత్త్వానికి సహజ వైరుధ్యం ఏమీ లేదు. హేతు వాదానికి ఆధ్యాత్మికానుభూతి అతీతం కావచ్చును గాని వ్యతిరేకం కాదు. కర్మ యోగానికి పునాది జ్ఞాన యోగం - శిఖరం భక్తి యోగం . కాని మానవ మాత్రులు కోరేది ప్రత్యక్ష ప్రమాణం శ్రీ కృష్ణుడు గీతా ప్రోక్త - తన విశ్వరూప ప్రదర్శనం, యశోదకు , కౌరవ సభాసదులకు , అర్జునునకు - నాలుగోసారి ఉదంక మహర్షికి చూపించాడు.

ఉదంక గాథలో - అస్పృశ్యతా నిగర్హణ , సర్వ మానవ సౌభ్రాత్రం కర్మ యోగం ఆరాధించే స్వేద బిందు పవిత్రత ఉగ్గడింపబడ్డాయి. నేటి సామ్యవాద సారం ఈ పౌరాణిక గాథలో ప్రస్ఫుటంగా ప్రతిబింబించటం ఆధునికులకు ఆశ్చర్య కలిగింపవచ్చును గాని, సనాతన సంస్కృతిని అర్థం చేసుకొన్న వారు సంతోషంతో తల లూపగలరు. అలమతి విస్తరేణ.

" శ్రమ ఏవ జయతే " - నృత్య నాటిక " కొత్త పాతల మేలి కలయిక" సారస్వతంలో సంగీతంలో నృత్య కళలో " విశ్వశ్రేయయ కావ్యమ్ " - అనే నిర్వచనం కళ జగద్ధితంగా ఉండాలనీ సామాజిక స్పృహ కావ్యానికి

అనే నిర్వచనం కళ జగద్ధితంగా ఉండాలనీ సామాజిక స్పృహ కావ్యానికి అంతరాత్మ అనీ ప్రతిపాదిస్తుంది. " రసో వై సః " అనే ప్రతిపాదన కళ - కళ కొరకే అని ఉద్ఘాటిస్తుంది. ఈ నృత్య నాటిక " శ్రమ ఏవ జయతే " లో ఈ రెండు వాదాలు - గంగా యమునల వలె- సంగమించి సాక్షాత్కరిస్తాయి. అంతర్వాహినిగా సామ్యవాద సరస్వతి తాండవిస్తుంది. అవధరింపవేడికోలు.

" శ్రమ ఏవ జయతే , సంపూర్ణ దృశ్య కావ్యం. నృత్య నాటిక. సంప్రదాయ నృత్య కళ అధునికుల దృష్టిలో పాత చింతకాయ పచ్చడి. కర్కోటక కర్కాటక సదృశము. తిరోగమన శీలము అయితే సారస్వత సహృదయులు ' శ్రమ ఏవ జయతే '- ఛందో బద్ధము తాళ లయాన్వితము అయిన అభ్యుదయ కవితగా గుర్తించవచ్చు. నృత్య కళ - బహుళంగా శృంగార రస భూయిష్ఠం. కాని ఈ నాటిక నవ రస రచిరం. స్థూల దృష్టికి - " శ్రమ ఏవ జయతే " భగవద్గీతా వేదాంత ప్రవక్తయైన శ్రీ కృష్ణుని విశ్వరూప ప్రదర్శనం . సూక్ష్మదృష్టితో అనుశీలించే అభిజ్ఞుల అభిప్రాయంలో " శ్రమ ఏవ జయతే " నృత్య సరస్వతీ విశ్వరూప సందర్శనమే.

## " శ్రమ ఏవ జయతే "

### నృత్య నాటిక

అది ఉదంకాశ్రమము. ఉదంకుని కుమార్తె " జ్ఞానవల్లి " తన చెలికత్తెలతో తండ్రికి సపర్యలు చేస్తూంటుంది.

జయము జయము జయము పూజనీయా !
జయము దిగ్విజయమయ తేజోమయా !
తాత పాదులు గొనుడు - తౌర్యత్రిక ప్రణతి
ప్రీతి పెంపనలార - గీతా నమస్కృతులు. ॥జయము॥

అభినేత్రులము మేము -అభివాదములు మీకు,
హేతు వాద వినీత నీతి నేతలు మీరు!
శ్రుతి విశ్రుతాతీత సూత్ర ధారులు మీరు!
శుభ ముహూర్తము నేడు సుప్రభాతము నేడు ॥జయము॥

పీతాంబర ధరుండు - ప్రియ దర్శన విధాత
వేణుగాన వినోది - వేదాంత వేద్యుండు;
అరవింద నయనుండు - అవతార పురుషుండు
శిఖి పింఛ పరివేష శృంగార శేఖరుడు ॥జయము॥

బృందావన విహారి - సౌందర్య సమ్రాట్టు
నంద నందన మూర్తి - నవనీత తస్కరుడు
కందర్ప జనకుండు - కౌమోదకీ ధారి
అరుదెంచుచున్నాడు - ఆశ్రమంబున కిపుడు ॥ జయము॥

అభ్యాగతుండౌచు - ఆబాల్య మిత్రునకు
అర్ఘ్య పాద్యములతో - ఆనంద హృదులతో
స్వాగతము సమకూర్ప - సంసిద్ధులము మేము ॥జయము॥

## ఉదంక మహర్షి

శైశవమ్ము నందు - సాందీప ఋషి చెంత
ఏను చదివినాను కృష్ణు కలసి ;
ఆశ్రమమ్ము చేరు - అభ్యాగతుండౌచు,
అతని కెట్లు గూర్తు -స్వాగతమ్ము?

## చెలికత్తెల నృత్యం

స్వాగతము చెప్పెదము స్వాగతము చెప్పెదము
భాగవత నిగమాంత తేజో దిగంతునకు. ॥ స్వాగతము॥

కుంద రదనునకు గోవింద నందునకు
అరవింద నయనునకు మురళీ విలోలునకు. ॥స్వాగతము॥

కస్తూరి కలయంపి - కర్పూర ధూళితో
సాంబ్రాణి పొడి జల్లి - సౌరభమ్ములు గూర్చి
రంగవల్లులు తీర్చి - రంగారు ముత్యాల
పొంగారు హృదులతో శృంగార రంగునకు, ॥స్వాగతము॥

తొలి ఉషస్సులలోన - తోటలోనికి పోయి
తేటి ముట్టని పూలు - తెచ్చితిమి ఈనాడు;
అరవిచ్చు మొగ్గలను - కోసి కొనివచ్చితిమి
మాలలల్లితి మిదిగొ - మందార విరులతో
సచ్చిదానంద నిష్యంద మృదుహాసునకు ॥స్వాగతము॥

## ఉదంక మహర్షి

చదువు సంధ్యలందు సహపాటులము నాడు
కృష్ణు డిపుడు రాజకీయ నేత !
అతని - గురుడు నాడు - అవతార పురుషుగా
ఎంచి భక్తి నాదరించినాడు.

కోరలేదు మమ్ము గురుడు దక్షిణ నేది
గురువు గారి సతి కోర నన్ను
రాణి గారు తాల్చు రత్నకుండలములే
తెచ్చి నేను ఆమె కిచ్చినాను. ॥ కోర ॥

మొసలి వాత పడిన - పసి పుత్రు బ్రదికించి
తెచ్చి ఇవ్వ మనెను కృష్ణు నామె;
ఇచ్చె బాలు నొకని తెచ్చి - శ్రీ కృష్ణుండు;
ముసలి తల్లి తండ్రి మురిసి పోవ. ॥ కోర ॥

( వేణు గానం వినిపిస్తుంది ఇంతలో... ఒక రథం అటుగా వస్తుంది. అందులో నుండి కృష్ణుడు వస్తాడు)

జ్ఞానవల్లి తన చెలి కత్తెలతో స్వాతగం పల్కుతుంది.)

స్వాగతం సుస్వాగతం కృష్ణ స్వాగతము స్వాగతము
శృంగార రస సార సంగ్రహా మూర్తి
సంగీత రస సార సంగ్రహా మూర్తి
సంగీత సర్వస్వ సంక్రాంతి ధర్మ సూక్ష్మ విచక్ష
కర్మ యోగాధ్యక్ష ॥ స్వాగతము॥

అత్యంత శేముషీ హరిదంత భాస్వంత
నిత్య చైతన్య యుత నీతి నియతి నియంత
సిద్ధాంత రాద్ధాంత చింతాగత స్వాంత
సంశాయాకుల హృదయ సంక్రాంత హేమంత ॥స్వాగత॥

సద్యో వికసిత విజ్ఞాన విజితధ్వాంత
విద్యా మహోద్యాన వన సంతత వసంత
శాంత యోగాభ్యాస శబలిత శ్రీమంత
సంతోష సందీప్త మందస్మిత దృగంత ॥స్వాగత॥

అంతరంగిక దాంతి దంతావళోదంత
అంతరాంతర నిరంతర శాంతి శిఖరాంత
నిస్సంగ శృంగార నిర్మలిన శుద్ధాంత
మోహన ముహుర్ముహిత మురళీరవ దిశాంత ॥స్వాగత॥

**(ఉదంక కుమారి జ్ఞానవల్లి)**

తోమాల - నీ కంఠ సీమ వేయగ నేల ?
తారా తరళ రత్న హార మిదిగో !
ప్రమిద దీపాల - ఆరాధన విధ నేల ?
రవి చంద్ర గోళాల రశ్మి లవిగో !
కుంభాభిషేకమ్ము - కోరి చేయగ నేల ?
బ్రహ్మాండముల కాంతి వర్ష మదిగో !
కర్పూర హారతుల్ - కైంకర్య మిడ నేల ?
జ్యోతిర్విలాస విద్యుత్తు లవిగో !

సార్వభౌముడవౌ జగత్ స్రష్ట వీవు !
అవని - భవదీయ దివ్య సింహాసనమ్ము;
ఆకసమ్ము నీకు ఆణి ముత్యాల గొడుగు;
ఏము నీకేమి బహుమతు లీయగలము ?

**ఉదంకుడు**

మిత్రమా ! కుశలమా ?

నీరు లేని ఆ ఎడారి ఆశ్రమమున
బండబారు గుండె లెండి పోవు !

పట్టు ఏండ్లు పూండ్లు పాత వార్తలు చేర
పుడమి మాది - వెనుక బడిన బ్రతుకు.

చేరినావ విటకు శ్రీ కృష్ణ ఎట్టులో !
మరచి పోక బాల్య మైత్రి నీవు.

ఈ ఎడారి యెుడిలోన - మాయాశ్రమము చూడు!
చెరువు యొక్కటి లేదు - చెట్లు చేమలు లేవు !
దైవమునకే లేదు - దయ సుంత మా మీద,
నవ్య నాగరికతా నగ్న నాట్యము లేదు. ॥ఈ ఎడారి॥

రాళ్ళ రప్పల మధ్య - రతనాలు ప్రభవించి
అప్పుడప్పుడు దొరుకు ఆకస్మికమ్ముగా ॥ఈ ఎడారి॥

శ్రీరస్తు ! శుభమస్తు ! శ్రీరస్తు ! శుభమస్తు !
భద్రమా మాయన్న బలభద్ర రాముండు !
కుశలమా భీష్ముండు ? కుశలమా ద్రోణుండు ?
భద్రమా పాండవులు ; భద్రమా కౌరవులు ?

విన్నాను తెలిసికొన్నాను కొన్నాళ్ళ క్రిత మేను ;
శాంతి దూతగ నీవు సాగినావని నాడు ;
అవతార మూర్తిగా - అఖిల ప్రజల చేత
కీర్తింప బడుచుండు - కృష్ణుండు మాత్రమే ! ॥శ్రీరస్తు॥
సంధి చేయగ గల్గు - శాంతి గూర్పగ గల్గు !
అందుకో నీవిదే - అభినందనముల నేడు;
సంధి సంధాతవౌ - శాంతి నేతవు నీవు

సకల సౌఖ్యములకు - జనయిత్రి శాంతియే!
జగతి - శాంతి లేక - ప్రగతి లేదు ;
సంతసించినాడ సంధి చేసితి వీవు;
ప్రస్తుతించు భరత చరిత నిన్ను.

**శ్రీకృష్ణుడు**

ముని వరేణ్య నీవు వినలేదు కాబోలు !
సంధి విఫల మయ్యె ; జరిగె రణము
బ్రతికి నారు , పంచ పాండవుల్ మాత్రమే;
ఏమి చెప్ప వలయు నింక నీకు.

**ఉదంకుడు**

ఔరౌర జరిగినదా
భారత భీకర రణమ్ము - ప్రళయ నిభంబై ?
వీరాధివీరు లందరు
ఘోర కురుక్షేత్రమందు కూలిరి గదరా !!

ధరణి నిండ - ఏడ్చు తల్లి తండ్రుల తోడ,
విగత భర్తృకమ్ము విశ్వ ధాత్రి !
చేసితీవు రక్త సిక్తమ్ము ధర నెల్ల,
క్రూర ఘోర హంతృ కుండ వీవు.

శాపము నిచ్చెద నిదె నా
కోపమునకు అంతు లేదు - కుత్సిత మతితో
పాపము చేసినవాడవు ;
గోపీ వ్యభిచార ఘోర కుటిల చరిత్రా!

శాంతింపుము శాంతింపుము సంయమి వర శాంతింపుము
కోపముతో తాపముతో శాప మిచ్చి లాభ మేమి ?
॥శాంతింపుము॥
అవధరింపు నా పాత్రను
అస్త్ర శస్త్ర సన్న్యాసము ॥శాంతింపుము॥
చేసి సంధి చేయగోరి పోయినాను హస్తిపురికి
పోరుచేయకోరినారు కౌరవవీరులు మదమున
విసిగిపోయి వేసారితి - విశ్వరూపమును చూపితి
జరిగె ఘోర సంగ్రామము
మానవ మారణ హోమము జరిగె ॥ శాంతింపుము॥

**ఉదంకుడు**

ఆపవయ్య కృష్ణ ! అధిక ప్రసంగమ్ము
నమ్మ గలను కనుల - కాదు చెవుల ;
చూపు నీదు విశ్వరూపమ్ము నాకింక
విశ్వసింపగలను పిదప నిన్ను.

## శ్రీ కృష్ణుడు

ఇచ్చినాడ నిపుడు నీకు దివ్య దృష్టి తేరి చూడు
వీక్షింపుము విశ్వరూప సాక్షాత్ కారము నీవే
మనసు చేరలేని దిద్ది మాట చెప్పలేని దిద్ది
కన్నులార గనుము నీవు అనుభవైక వేద్య మిద్ది !
( శ్రీ కృష్ణుడు తన విశ్వ రూపం చూపుతాడు)

## ఉదంకుడు

నే తిలకించినాడ నిను - నిశ్చల నిర్గళ దివ్య మౌన సం
గీతము నా మనోగతము - కేవలతా సుషమా తపః పరం
జ్యోతివి నీవు - నిక్కలలు చూచితి నేడు - అతీత మాధురీ
స్నాతుడ నేను - లో వెలుగు నా యెద నింపితి వీవు కేశవా!

విభ్రమమ్ము గొలిపె - విశ్వరూపము నీది !
మాట మూగ వోయె - మనసు మరలె;
సంశయాలు తీరె - శాంతి కల్గెను నాకు;
చదువు - అనుభవమ్ము సాటి గాదు.

అనేక బాహూదర వక్త్ర నేత్రం
పశ్యామి త్వాం సర్వతోనంతరూపం
నాంతం న మధ్యం నపునస్తవాదిం
పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప

త్వమక్షరం పరమం వేదితవ్యం
త్వమస్య విశ్వస్య పరం నిధానం
త్వమవ్యయః శాశ్వత ధర్మగోప్తా
సనాతనస్త్వం పురుషోమతోమే !

## జ్ఞానవల్లి

కృష్ణ జయహే ! విష్ణు దైవత రూప జయహే!
విశ్వరూప ప్రభాస జయహే! శాశ్వతానంద రస జయహే !
వేద విద్యా వేద్య జయహే ! ధర్మ సూక్ష్మక సూత్రధారణ జయహే !
కర్మయోగి వరేణ్య జయహే !శిష్ట రక్షణ కృష్ణ జయహే !
నీల నీరద రూప జయహే ! నంద నందన కృష్ణ జయహే!
మందరాచల రూప జయహే! ఇందిరా హృదయారవింద !
మరంద మత్తేందిందిర శ్రీకృష్ణ జయహే

## ఉదంకుడు

కుతో న్యాయః గహనా కర్మణో గతిః
యతో కృష్ణ స్తతో ధర్మః యతో ధర్మ స్తతో జయః
చిన్మయుడవు నీవు - సిద్ధాంత రాద్ధాంత
నీతి సూత్రముల కతీతమతివి ;
శ్రేష్ఠ మిత్ర - ఓ అనుష్ఠాన వేదాంతి
నీకు నా నమస్సు నీరజాక్ష.

### శ్రీకృష్ణుడు

వరము నిత్తు నీకు బాల్య మిత్రుడ వీవు
కోరినపుడు నీకు నీరు దొరకు !
ఈ ఎడారిలోన! ఎంత వేసవియైన
నను స్మరింపవయ్య ముని వరేణ్య.

### జ్ఞానవల్లి

రారా కృష్ణ రారా రసికాగ్రణి రార
రస రాణ్మణి రారా రారా కృష్ణ రారా
సాహిత్య సంగీత రసికాగ్రణి రార!
శృంగార రస రాణ్మణి రారా!
నృత్య కేళీలోల రారా! ॥ రారా ॥

సత్య భామా స్వాంతన చతుర రార !
మంజు మంజుల మధుర మంజీర
మణి కంకణ కింకిణీ రవ
రాగ రంజిత రాధికా మృదు
చరణ చారణ చక్రవర్తీ ॥ రారా ॥

### 2 వ రంగము

అది మండు వేసవి. ఎటు చూసినా క్షామము విలయ తాండవం చేస్తోంది. ఎడారిలో తిరిగే ప్రాణులు అన్నీ ఆ తాపానికి తాళలేక విలవిల్లాడిపోతున్నాయి. ఉదంక మహాముని తన కూతురు, శిష్య బృందంతో వలస పోవ నిశ్చయించాడు.

చదల నింపెను చండమార్తాండుండు వేసవి మండు టెండలు
ఎండి పోయెను గుండె కాయలు కొండ దండల బండ చాటున

ఏటవాలుగ బీట వేసెను ఇసుగ ధూళులు వసుధఁగ్రమ్మెను
మారిపోయె ఎడారి దారులు  నీట ఊటలు మేట వేసెను
సమసి పోయెను జంతు జాలము పచ్చగడ్డి నశించిపోయెను
వెచ్చగాడ్పులు వీచ సాగెను వరుణ దేవుడు కరుణ మానెను

**ప్రవేశం**

తోలు తిత్తి నీరు - దూర భూములనుండీ
మోసి తెచ్చితిని  ప్రయాస మరచి,
స్వీకరింపవయ్య లోకైక వంద్యుడా !
నేను తెచ్చి నట్టి నీరు - నీవు.

( అంటూ నీరు పొయ సిద్ధ మౌతాడు. అపుడు ఉదంకుండు)

అంత మొందగలను సంతోషముగ నేడు
ఏను త్రాగలేను నీ జలమ్ము
ఓ నిషాద - వినుము - నీ నీరు  నీ రూపు
తోలుతిత్తి  - నాకు దుర్భరములు.

శ్రీకృష్ణుడు - (ప్రత్యక్షమై)
"విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే  గవి హస్తిని
శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః"
(అని చెప్పి ఉదంకుడి కళ్ళు తెరిపిస్తాడు)

శ్లో॥ పృథివీ సస్య శాలినీ
బహునౌకాస్తు సాగరాః
కష్టజీవీ శ్రమాత్ స్వేదాత్
పూజ్యపాదో కృషీవలః.

సమత - స్వేచ్ఛ - విశ్వ సౌభ్రాత్ర భావమ్ము
ఎల్ల లెల్ల మరచి ఏక మగుత !
ప్రగతి కారణమ్ము - శ్రమ జీవి కృషి కదా
కర్మయోగి ఎవడు ? కార్మికుండు.

**ఉదంకుడు**

అనుగ్రహీతోస్మి - శ్రీ కృష్ణా
అవని కెల్ల పూజ్యు డస్పృశ్యు డను కొన్న
ఈ నిషాద వరుడె యెంచి చూడ !
స్వేద బిందువుకు - జేజేలు ! శ్రీ కృష్ణ !
జయము - దిగ్విజయము -జయము - శ్రమకు.

సోదర నిషాదునకు పాదాభివాదాలు
భూభారమును తాల్చు పూజ్యునకు జేజేలు ॥ సోదర ॥
జగతిపై శ్రమ యొకటె సంపత్తి సృజియించి
విరియజేయు సదా విశ్వ కల్యాణమ్ము ॥ సోదర॥
స్వేద బిందువులకు జేజేలు సర్వదా
నవయుగోదయమునకు నాంది పల్కును శ్రమయె
శ్రమఏవ విజయతే సమతా విశిష్యతే
సత్యమేవ జయతే శ్రీరస్తు - శుభమస్తు,
సుఖినో భవంతు సర్వే జనాః ॥సోదర॥

నిషాదుని చేతినీరు ఉదంకుడు త్రాగుతాడు

**కృష్ణుడు**

ధరణి నేలు హక్కు ధనవంతులది కాదు;
సోమరులకు భువిని - చోటు లేదు ;
చెమట నోడ్చి - ఎవడు - సృష్టించు సంపదల్
వాని జన్మ హక్కు - వసుధ నేల.

పనిచేయుటయే యజ్ఞము - పని చేయుటయే ప్రార్థన
పని చేయుట పరమార్థము- పనిచేయుటయే పురుషార్థము
ఎక్కువ తక్కువ చూడక - మక్కువతో పని చేసితి
పశువుల కాపరినై నే - మసలితి వ్రేపల్లె వాడ;

రాజసూయ యజ్ఞశాల - భోజన సమయమ్ము నందు
ఎడద పులకరింప నేను - ఎంగిలాకు లెత్తినాను.

అస్త్ర శస్త్ర సన్న్యాసము ఆచరించ సారథినై
భారత రణ రంగమందు కోరి రథము తోలినాను
నిష్కల్మష కర్మ లేదు నీచమైన కర్మలేదు
పొగ సహజము అగ్నిలోన - వగ సహజము పనులలోన

అశ్వములకు స్నానపానము - ఆహారము ఆహార్యము
ప్రీతితోడ కోరి కోరి - చేతులార కూర్చినాడ;

పనిచేసెడి మనుజుడెపో పూజ్యుడగును భువిలోపల;
ఋణ పడినది పృథివీస్థలి కర్మయోగి కష్టమునకు;
పనిచేయుటయే యజ్ఞము - పని చేయుటయే ప్రార్థన
పని చేయుట పరమార్థము - పనిచేయుట పురుషార్థము.

కట్టవలెను శ్రమకు పట్టాభిషేకమ్ము
ప్రగతి కొరకు - నూత్న జగతి కొరకు
అవనిపైన నీరు - అమృతమ్ముతో సాటి!
నీరు - ఎట్లు ఈ ఎడారి చేరు?

## శ్రీ కృష్ణుడు

కరువు కాటకమ్ము - వరద బీభత్సమ్ము
ఏక కాలమందె ఎచట నుండు ?
బుద్ధిహీను లేలు పుడమి లోపల గాక
నీరు -ఎట్లు ఈ ఎడారి చేరు ?

గంగ నీరు తెచ్చి - కావేరిలో కల్పు;
వరద బాధ తగ్గు - కరువు తగ్గు;
కలియు గాత వచ్చి - కన్యాకుమారిలో!
పొంగి పారలి - బ్రహ్మ పుత్ర కాల్వ.

బంజరు భూములే మరల బంగరు భూముల వోలె మారెడిన్
గింజలు వాటి నీటి తడి గిల్కొన చేసిన వృక్ష వల్లరీ
కుంజ కుటీరవాటికలు క్రొవ్విరి పుప్పొడి తావి తెమ్మెరల్
పుంజుకొనున్ ధరాస్థలిని పున్నమి వెన్నెల సొన జల్లులై.

## (జ్ఞానవల్లి+ చెలికత్తెలు)

భజరే భజరే గోపాల బాలం
సుందర బృందావన సంచారం
నందకుమారం నవనీతచోరం
కేళీ తాండవ లోలం భజరే
నీలా కాశ సంకాశం భజరే.

## శ్రీ కృష్ణుడు

ప్రగతి - ప్రజలు చేయు - శ్రమ యొక్క ఫలితమే!
స్వర్గ లోక మిచ్చు -వరము కాదు ;
కరువు కాటకాలు - దరిరావు - కృషిచెంత ;
జయము - దిగ్విజయము - జయము - శ్రమకు.

॥భజరే ॥

మంగళం విష్ణు రూపాయ మంగళం జయ మంగళం
శ్రీ కృష్ణ వాసుదేవాయ మంగళం జయ మంగళం
జంగమ ధర్మ రూపాయ శృంగార రసమూర్తయే
నంద గోపకులేందవే బృందావనవిహారాయ
వేద వేద్యాయ మంగళం అరవింద దృగంతాయ
మంగళ జయ మంగళం ఉదంకస్య సతీర్థ్యాయ
విశ్వరూపాయ మంగళం నిత్య శుభ మంగళం......

***

# అర్ధనారీశ్వరం

## నందికేశ్వరుడు

తరచి చూడ - "శక్తి" కెరటమా ? రేణువా ??
బొమ్మ బొరుసు లుభయ భూమికలును !!
అరయ - పరమ శివుడు - అర్ధనారీశుడే !
విశ్వ సృష్టి శిల్ప విలసనమున.

విశ్వ శిల్పము లోని - వింత లందున నింత !
భిన్న ధ్రువాలకే ఉన్న అకర్షణము !!
'అద్వైత భాసురా ! అర్ధనారీశ్వరా !
భక్త జన మందార ! బాలేందు శేఖరా !
ఆనంద మందిరా ! నందీశ వందితా
కందర్ప విధ్వంస - వందనము లందుకో -
(అద్వైత భాసురా ! అర్ధనారీశ్వరా !)
మందహాస మనోజ్ఞ మధుర ముఖ మండలా !
తాండవ డమరుక లయ డిండీర మండనా !
మందాకినీ మసృణ మంగళ జటాజూటా !
వందారు ముని బృంద బృందారకచ్ఛటా !
సుందరా జ్యోత్స్నాభిశోభిత సుభగ నేత్ర !
సిందూర సీమంత - చందనాగురు గాత్ర - అద్వైత
భాసురా !

## శివుడు

పురుష ప్రకృతి నాది - మరి స్త్రీ ప్రకృతి నీది ;
కవనమ్ము నేనైన - గానమ్ము నీవౌదు;
నీవున్న పుడమిపై - నేనుందు గగనమై;
పండు వెన్నెల - మధ్య - తాండవించెదు గాక.

**పార్వతి**

నీవైన రాగమ్ము - నేనౌదు తాళమ్ము,
వృక్షమ్ము నీవైన - వేరునై నేనుందు;
పూవువై నీవున్న - తావినై నేనుందు,
చంద్రుడవు నీవైన - చంద్రికను నేనౌదు;

**శివుడు**

నీవు మాంసమ వైన - ఏను రక్తము నౌదు
ఉదజనివి నీవైన - ప్రాణ వాయువ నేను

**పార్వతి**

భావమ్ము నీవైన - భాషనే నేనౌదు
ఉరుము వైతే నీవు - మెరుపు తీగను నేను:

**నందికేశ్వరుడు**

విశ్వ శిల్పములోని వింత లందున వింత
భిన్న ధ్రువాలకే ఉన్న ఆకర్షణము;
అర్ధ నారీశ్వరా ! వందనము లందుకో !
ఎవని కౌంగికమ్ము - భువన సర్వస్వమ్ము?
వాచికమ్ము - సర్వ వాఙ్మయమ్ము ?
అభ్ర చంద్ర తార లాహార్య మెవనికౌ ?
అట్టి సాత్వికు - శివు - నభినుతింతు.

# పెండ్లి గొండ్లి

గోడపై - అర్ధనారీశ్వర చిత్ర పటం - పెద్దది - నేపథ్యంలో

నాయకుడు : ఒకసారి ముద్దియ్యి ॥ వయ్యారి భామా !
పగలాడి కౌగిలికి వకసారె రావే;
కోరచూపులతో(డ) కొంటె మాటలతో ( డ)
ఉబ్బించకే నన్ను - తబ్బిబ్బు చేయకే;
ఉత్త మాటలు చెప్పి - ఊరించి ఊరించి
ఉయ్యాల జంపాల లూగించకే -
॥ఒక సారి ముద్దియ్యి॥

నాయిక : ముద్దింత చవుకైంద ? మురిపాల బావా !
కౌగిలికి సమయమ్ము కాలేదు బావా !

నాయకుడు : ప్రేమించి నాడనే - ప్రేయసి భామా !
కలలలో కలవరిస్తున్నాను భామా !

నాయిక : సరసాలు వద్దురా ! సరదాలు మానరా !
పెండ్లి చేసికొని పిదప మాటాడరా

నాయకుడు : పెండ్లి ముందా భామ - ప్రేమ ముందా భామ ?
సిగ్గుపడ బోకుమా - చిన్నారి భామా
చెట్టు ముందా భామ ? విత్తు ముందా భామ ?
చెత్త ప్రశ్నలు వద్దు - ఉత్త మాటలు వద్దు.

నాయకుడు : కమ్మ తెమ్మెర వీవు

నాయిక : కమ్మ తెమ్మెర వీవు

నాయకుడు : పెంకి పిల్లా ఇంక - పెండ్లి మాటలు వద్దు
కట్నాలు కావాల ? కానుకలు కావాల?
బాజా భజంత్రీలు పల్లకిల్ కావాల ?

నాయికా నాయకులు:
సౌరభద్వయము సంగమించుట పెండ్లి
మనసు కలిసిన పెండ్లి - మమత పెరిగిన పెండ్లి
ఆడంబరమువద్దు ఆర్భాటముల వద్దు
అద్వైత తత్త్వమ్ము - అందుకొనుటే పెండ్లి
ఆనంద యోగమ్ము అనుభవించుట పెండ్లి
కల్యాణి నీవాడనే నేను నీదాననే నేను నీ నీడనే నేను

(నాయికా నాయకులు ఒకరికొకరు పూలదండలు వేస్తారు)
అర్ధనారీశ్వర చిత్ర పటానికి - హారతి ఇచ్చి
అభినందలు- నీకు అభివాదములు నీకు
అద్వైత భాసురా అర్థ నారీశ్వరా ॥ తెర ॥

## నాగస్వర నాట్యము

చిట్టి నడుముకు చుట్టు - చీర కొంగులు కట్టి,
" సిరి మువ్వ సింగాణి " - చెంగు చెంగున రావె;
పుట్టలోపలి పాము - బుసకొట్టి లేచింది,
నాగసరమాడవే - నర్తింప జేయవే ;
పట్టుకొని ఒడుపుగా - బుట్టలో పెట్టవే,
చంకలో పెట్టుకొని - చకచకా మెట్టవే - చిట్టి
నడుముకు

పీకి వేయుము కోర - పిండి వేయుము విసము,
పీకె పట్టుకుర్రమ్మ - తోక చుట్టుకు పాము;
నాగేమి సేయునే - నాట్యమాడుట గాక,
సాగిపోవే యింక - జంకు గొంకులు లేక - చిట్టి
నడుముకు

తోక కుదిపిన చాలు - తూగాడి తలయూచు ,
సొరకాయ బూరాకు - శ్రుతి గల్పి మెడసాచు,
నాగు ఆడును చూడ - నటరాజుగా తోచు,
కాళ్ళు గజ్జెలు లేని - గరళ కంఠుడు లేచు

పల్లె పల్లెల తిరుగు - పట్టణమ్ముల కరుగు,
పిల్లజెల్లలు కూడ - ఇల్లిల్లు తిరుగాడు,
ఇచ్చ వచ్చిన చోట - ఇక మీద ఆడించు,
చూడవిచ్చన జనుల - చూచి ఆనందించు ,

నాగ సొర మూదవే - రాగాలు తీయవే,
సొగకను నిగనిగలు - శోభిల్ల చేయవే,
వెలుగు జిలుగుల హొయలు - వెదజల్లవే
వేయి పడగల సామి - వెంటపడి రావచ్చు ॥

# నృత్య సరస్వతి

జ్ఞానానంద మయీ వాణి జితైశ్వర్యాధికారిణీ
కచ్ఛపీ నిక్వణత్ పాణీ స్వేచ్ఛాంబర విహారిణీ !
విశ్వ జనీన కల్యాణీ ! శశ్వత్ శాంతి ప్రదాయినీ !
శ్రేయోరాజ్యాంగ విశ్రాణీ విజ్ఞాన పరివేషిణీ.
సంగీత సాహితీ సారా ! సర్వ శాస్త్ర స్వరూపిణీ !
నృత్య శింజిత మంజీరా ! సచ్చిదానంద సుందరీ !
1నిశ్చల జ్ఞాన నిర్వాణీ - స్థిర తటిల్లతేక్షణా!
శిక్షా మానస సంశ్లిష్టా! శారదా వర్ధతే సదా .

లలిత బృంద వాద్య లాస్య లావణ్యముల్
సామరస్య సరణి - చాటు గాక
ప్రణవ సామ వేద మణిత ఋగ్ క్వణనముల్
వెడలు గాత - వాణి వీణనుండి.

పలుకుల చెలి అందెల కల గల గల
పలు గుండెల లోపల నినదించుత !

లాస్య సరస్వతి లావణ్యములో
తలపుల జిగి బిగి జిలుగులు వెలుగుత ! ॥పలుకుల చెలి॥

నర్తకి శారద నయనాంచలములు
స్థిర విద్యుద్రోచులు చిమ్ముచు
మానవ మనసుల మధురిమ లొలుకుచు
పోకార్చుత వే చీకటి నీడలు ॥పలుకుల చెలి॥

వాణీ వీణా క్వాణ నినాదము
విశ్వ వీణ నిక్వాణనినాదము
విశ్వ కల్యాణ వీచీ రుచులై
శాంతి సామ ఋక్ సంక్రాంతి శ్రుతి
ఉల్లము లందున ఊయెల లూపుత ! ॥పలుకుల చెలి॥

సుందరానంద కంద వాక్సతి
మధుర మనోహర మందహాసములు
తరళ శరజ్జ్యోత్స్నా తరంగములు
నింగి నేల ఉప్పొంగగ చేయుత ॥పలుకుల చెలి॥

మంజు భారతీ మంజుల శింజిత
మాధురు లలరుత మానవ హృదిలో !
సంగీత సరస్వతి రంగస్థలి
నవ రసభంగుల నాట్యము చేయుత. ॥పలుకుల చెలి॥

# మరణ మంగళా శాసనం

మరణ సమయ మందు - మధుర గానము చాలు
వద్దు మందు లేవి వాద వద్దు
ఏ గతించి నప్పు డేద్వరా దెవరేని,
ఏడ్పు అనిన నాకు ఏవగింపు.

మైల పట్ట వద్దు - మంత్ర తంత్రము వద్దు
స్నాన శౌచ నిరతి - చాలు చాలు!
జరుప వచ్చు - సుకవి సత్కార మొకనాడు
దుఃఖ లవము సుంత దొరలకుండ.

జరుప వద్దు - నాకు - శ్రాద్ధ కర్మల నేవి,
వద్దు - పెట్ట వద్దు - తద్దినాలు
బాలబాలికలకు -బహుమానములు తీర్చి,
ఏ దినమున నైన ఇవ్వ వచ్చు.

ఏది పూర్వజన్మ మెట పునర్జన్మ!!
వసుధ - మనిషి - నీరు వంటి వాడు!
మంచు గడ్డ నీరు - మరి ఆవిరియు వేరు!
ఒరుగు నట్టి దేమి ? ఒకటి యైన ??

భార్య మ్రుగ్గ రాదు - పసుపుకుంకుమ వీడి
పదవ నాటి తంతు వద్దు వద్దు
భర్త చావు బాధ - భార్య ఓర్చుట చాలు
వికట కర్మ కాండ వద్దు వద్దు.

నేను నాస్తికుడను గాను - జీవితములో
మంచితనము మీద - మమత గలదు
మతము మీద గాక - మానవత్వముపైన
కలదు గొప్పనమ్మకమ్ము నాకు.

క్రొత్త పాతలకును - గుండె లోపల కోరి
కూడలి గుడి కట్టు కొంటి నేను;
హేతువాద సహిత సేతువై జీవించి,
సాహితీ తపస్సు - సలుపగలను.

అంతము చెందు ఈ భువి సమస్తము - సృష్టియె దిగ్దిగంతవి
శ్రాంత మశాశ్వతమ్ము రవిచంద్రుల తోడ - మనుష్య చావు - ఓ
వింత ఉదంతమా ? వికట వేదన లెందుకు ? సర్వతాప ని
ష్క్రాంత మవశ్యమంగళము - చావొక స్వస్తి వరప్రసాదమే.



# నాటి బాపూజీ స్వరాజ్య రాట్నం

# నేటి జన్మభూమి ప్రగతి చిహ్నం

స్వాతంత్ర్యోద్యమానికి ప్రతీక బాపూజీ స్వరాజ్యరాట్నం
స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం ఏకమైంది ప్రజానీకం ఆనాడు.
నాటి స్ఫూర్తి నేటి జన్మభూమి మహోద్యమానికి ఆదర్శం.
ఊరూ నాడా ఏకమై సమగ్రాభివృద్ధికి కదం తొక్కుతూ
పదం పదం పాడుతూ సాగిపోదాం జన్మభూమి
మహోద్యమానికి పునరంకితం అవుదాం

**జై హింద్ ! జై జన్మభూమి !!**

జారీచేసినవారు : సమాచార, పౌరసంబంధాలశాఖ